వేదములు

# రుద్రాధ్యాయము - నమకము,చమకము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul | Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

శ్రీమతే మహారుద్రాయ నమః

[illegible]

# శ్రీరుద్రాధ్యాయము

నమకము చమకము అనబడు రెండు ప్రశ్నములు.

[illegible]

[illegible]

శ్రీరుద్రభాష్యాంధ్రవివరణసహితము.

[illegible] 9. 12. 49

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్ వారిచే

ప్రకటితము.

1937.

All Rights Reserved.

# ఉపోద్ఘాతము.

యస్య నిశ్శ్వసితం వేదా యో వేదేభ్యోఽఖిలం జగత్,
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థమహేశ్వరమ్.

రుద్రాధ్యాయప్రోక్తాన్ రుద్రానీశ్వరవిభూతిరూపధరాన్,
నమతాం దురితం హృత్వా భద్రం దిశతో భజే హ్యనయమ్.
రుద్రాధ్యాయప్రోక్తుల రుద్రుల నీశ్వరవిభూతిరూపులఁ బ్రణమ
ద్భద్రప్రదుల నఘోచ్చయవిద్రావణులన్ హృదబ్జవీథి భజింతున్.

"అథ హైనం బ్రహ్మచారిణ ఊచుః కిం జప్యేనామృతత్వ మశ్నుతే" బ్రహ్మచారులు యాజ్ఞవల్క్యునడిగిరి, ఏమంత్రముచే (మనుష్యుఁడు) మోక్షముపొందును. అని "సహోవాచ యాజ్ఞవల్క్యః శతరుద్రియేణేతి" ఆయాజ్ఞవల్క్యుఁడు పలికెను. శతరుద్రీయముచేతనని యిట్లు శ్రీజాబాలోపనిషత్తుద్ఘోషించుచున్నది. "శతం రుద్రా దేవతా యస్య" నూఱుగురు అనఁగా పెక్కండ్రు రుద్రులు దేనికి దేవతలో అట్టిది యనువ్యుత్పత్తిచే శతరుద్రీయ మని తైత్తిరీయసంహిత చతుర్థకాండ పంచమప్రశ్నాత్మకమగు రుద్రాధ్యాయము చెప్పఁబడును. "స్తేయం కృత్వా గురుదారాంశ్చ గత్వా మద్యంపీత్వా బ్రహ్మహత్యాంచ కృత్వా, భస్మచ్ఛన్నో భస్మశయ్యాశయానో రుద్రాధ్యాయీ ముచ్యతే సర్వపాపైః" బ్రాహ్మణసువర్ణము దొంగిలియు గురు

భార్యను బొందియు సురఁద్రావియు బ్రహ్మహత్య గావించియు, భస్మచ్ఛన్నుండై భస్మశయ్యం బరుండినవాఁడై రుద్రము నధ్యయనించుచుండునేని సర్వపాపములచే విముక్తుఁడగును. అని శాతాతపులు "సువర్ణస్తేనో రుద్రాధ్యాయీ ముచ్యతే" బ్రాహ్మణ సువర్ణము దొంగిలినవాఁడు రుద్రమునధ్యయనించినచో తత్పాప విముక్తుఁ డగును. మఱియు, "రహసికృతానాం మహాపాతకానా మపి శతరుద్రీయం ప్రాయశ్చిత్తమ్" రహస్యమునఁ గావించిన మహాపాతకములకు శతరుద్రీయము ప్రాయశ్చిత్తము అని శంఖులు. ఇచట సువర్ణస్తేయము ఇతరమహాపాతకోపలక్షణము. "ఏకాదశగుణానాన్వాపి రుద్రానావృత్య ధర్మవిత్, మహాపాపైరపి స్పృష్టో ముచ్యతే నాత్ర సంశయః" మహాపాపములు పొందిన వాఁడైనను, రుద్రమును పదునొకండు మాఱులు పఠించినచో ఆపాపములచే విముక్తుఁడగును. అని యత్ర్యంగిరసులు. "యశ్చ రుద్రాన్ జపేన్నిత్యం ధ్యాయమానో మహేశ్వరమ్, యశ్చ సాగరపర్యన్తాం సశైలవనకాననామ్, సర్వాన్నాదిగుణోపేతాం సువృక్షజలశోభితామ్, దద్యాత్కాఞ్చనసంయుక్తాం భూమిం చౌషధిసంయుతామ్, తస్మాదప్యధికం తస్య సకృద్రుద్రజపాద్భవేత్, మమభావం సముత్సృజ్య యస్తు రుద్రాన్ జపేత్సదా, సతేనైవచ దేహేన రుద్రస్సంజాయతే ధ్రువమ్" ఒకఁడు నిత్యము మహేశ్వరుని ధ్యానించుచు రుద్రముల జపించుచుండును. మఱి యొకఁడు పర్వతారణ్యములతోఁ గూడినదియు, సమస్తములయిన అన్నములు మొదలగు గుణములతోఁగూడినదియు, మంచి వృక్షములతోను జలములతోను ఒప్పుచున్నదియు, సమస్తౌషధులతోఁ గూడినదియునగు సకల భూమండలమును కాంచనయుక్తముగా

దానముచేయును. అరుద్రపాఠముచేయువాఁడు, ఒకమాఱు రుద్రపాఠముచే, సకల భూమండలము దానము చేయువాని కన్నను అధికపుణ్యముఁ బొందును. మమకారము వదలి యెవ్వాఁ డెల్లప్పుడు రుద్రములు పఠించుచుండునో అతండు ఆదేహముతోనే రుద్రత్వము నొందును. అని వాయుపురాణము.

ఈ శ్రుతిస్మృతివచనముల పర్యాలోచనముచే రుద్రపాఠము మోక్షసాధనమనియు, సకలపాపవినాశకరంబనియుఁ దెలియుచున్నది. పాపవినాశకరంబగుటవలననె చిత్తశుద్ధికిఁ గారణమయి జ్ఞానసాధనం బగుటం జేసి మోక్షమునకు సాధనమని చెప్పఁబడినది. కర్మకాండమునందు బఠితమగుటవలన కర్మాంగము నగుచున్నది. జ్ఞానసాధనమగుటచే నిది బ్రహ్మవిద్యారూపమగు నుపనిషన్మంత్రరాశి యని తలంపవలెను. మఱియును, ఇందలిమంత్రములను జెప్పఁబడిన పురశ్చరణప్రయోగాదులం జూడ నియ్యది సకలకామితప్రదంబనియుఁ దెలియఁగలదు. అట్టెయెడ ననుసంధానభేదమగును. ఎట్లనఁగా; శత్రునాశముఁగోరువాఁడు ఇందలి శత్రువాచకశబ్దముల స్వశత్రుపరముగా గ్రహించును. ముముక్షువగువాఁడు అరిషడ్వర్గాది పరముగా ననుసంధింపవలెను.

ఇట్లు సకలవిధపురుషులకు నావశ్యకమయిన యియ్యుత్తమవేదభాగము, అర్థము దెలియక పఠించుటచే యథోక్తఫలప్రదము కాఁజాలదను నభిప్రాయంబున, నాంధ్రబ్రాహ్మణలోకోపయోగార్థ మీయాంధ్రవ్యాఖ్యాన ముద్యమింపఁబడెను. ఇందు నమకమునకు శ్రీమత్సాయన మాధవాచార్యప్రణీతమగు వేదార్థప్రకాశాఖ్యభాష్యమును శ్రీభట్టభాస్కరవిరచితమగు

భాష్యమును రెంటిని అనుసరించి తత్తదభిప్రాయము వేఱువేఱం దెలియునట్లు వ్రాయఁబడియె. అందు ప్రతిమంత్రమునకును మొదట వ్రాయఁబడిన టీక శ్రీసాయనభాష్యానుసారిణియనియుఁ వెనుక "భ" అనుగుర్తుతో వ్రాయఁబడినది భాస్కరీయభాష్యానుసారిణియనియు నెఱుంగవలెను. చమకమునకు రుద్రముతో సహపాఠము విహితమగుటం జేసి, అదియును దెనుఁగున వ్యాఖ్యాతమయ్యెను. తద్వ్యాఖ్యానము సాయనమాధవీయభాష్యమాత్రానుసారియని గ్రహించునది. ఈప్రయత్నం బపేక్షులగు వారి కభ్యర్థితము నొనగూర్చి యానందము ఘటించుఁ గాక!

---

శ్రీ

శ్రీ గణేశ శారదా గురుభ్యో నమః.

# శ్రీరుద్రాధ్యాయము, నమకము

## ఆంధ్రవ్యాఖ్యానసహితము.

సృష్టిస్థితిలయా యస్య లీలా ఇవ మహేశితుః,
తం వన్దే సచ్చిదానన్దం సర్వాశుభనివృత్తయే.
సర్వాత్మత్వైకమతీన్ నిర్వాపితనిఖిలభక్తనికరాజ్ఞాన్
గుర్వోఘవంద్యమానాన్ సర్వాకారాన్ భజింతు శంకరభక్తిన్.

---

న మ స్తే రు ద్ర మ న్య వ ఉ తో త ఇ ష వే న మః,
న మ స్తే అ స్తు ధ న్వ నే బా హు భ్యా ము త తే
న మః.

నమః - తే - రుద్ర - మన్యవే - ఉతో - తే - ఇషవే -
నమః - నమః - తే - అస్తు - ధన్వనే - బాహుభ్యామ్ -
ఉత - తే - నమః. ౧

రుద్ర = ఓరుద్రుడా! తే = నీయొక్క, మన్యవే = క్రోధమునకొఱకు, నమః = నమస్కారము. అస్తు (ఇది యుత్తరవాక్యమునుండి తేఁబడినది) = అగుఁగాక. నీక్రోధము మాయందుఁ బ్రవర్తింపక మాశత్రువులయందే

ప్రవర్తింపవలెననుట. ఉతో = మఱియు, తే = నీయొక్క, ఇషవే = బాణము కొఱకు, నమః (అస్తు) = నమస్కారము అగుఁగాక, నీబాణము మమ్ము బాధింపకుండవలెననుట. తే = నీయొక్క, ధన్వనే = ధనుస్సుకొఱకు, నమః= నమస్కారము, అస్తు = అగుఁగాక, నీధనుస్సు మామీఁద బాణములు ప్రయోగింపకుండుఁగాక యని భావము. ఉత = మఱియు, తే = నీయొక్క, బాహుభ్యాం = రెండుచేతులకొఱకు, రుద్రుఁడు పెక్కు బాహువులు గలవాఁడగుటవలన ద్వివచనము ధనుర్బాణాపేక్షము, ఒక్కొక బాణ ప్రయోగమునందును రెండుచేతులే యుపయోగింపఁబడును కావున నట్లు చెప్పఁబడినది, నమః=నమస్కారము అగుఁగాక, వానిపరాక్రమము మామీఁదఁ బ్రవర్తింపకుండుఁగాక యనుట.

ఓరుద్రా! నీక్రోధమునకును, నీబాణమునకును, నీధనుస్సునకును, నీబాహువులకును నమస్కారము చేసెదను. వీనిని మాయందుఁ బ్రయోగింపవలదు; మాశత్రువులయందే ప్రయోగింపుము.

"రోదయతి సర్వమన్తకాలే ఇతి రుద్రః" ప్రలయకాలమునందు సమస్తమును ఏడ్పించువాఁడు, (సర్వమును నశింపఁజేయువాఁడు ననుట,) అను వ్యుత్పత్తిచే రుద్రశబ్దము జగత్సంహారకారకునియందు వర్తించుచున్నది. పౌరాణికాదు లిందుకుఁ బలువిధములుగా నర్థము వర్ణించెదరు. "రుతౌ ద్రవతి ద్రావయతీతివా," రుతి యనఁగా నాదము దానియంతమునందు ద్రవించుచున్నాఁడనిగాని ద్రవింపఁజేయుచున్నాఁడనిగాని రుద్రుఁ డనఁబడుచున్నాఁడు. "రుత్యా ధర్మానవలోకయతి ప్రాపయతీతివా," రుతిచేత అనఁగా వేదరూపమగు శబ్దముచే ధర్మములను జూపువాఁడు లేక పొందించువాఁడు, ఈవ్యుత్పత్తికే శబ్దముచే వాచ్యమగునర్థముఁ బొందించువాఁడని యర్థాంతరము. లేక, ప్రణవ రూపశబ్దముచేఁ దనస్వరూపమును బొందించువాఁడు. "రోరూయమాణో ద్రవతి

ప్రవిశతి మర్త్యాన్,' ధ్వనిచేయుచు మనుష్యులను జొచ్చువాఁడు, జీవరూపముచేఁ బ్రాణులం బ్రవేశించినవాఁడనుట 'రుక్' అనఁగా తేజస్సు, అదిగలవాఁడు రుద్రుఁడు, వర్ణవ్యత్యయము. మఱియును, 'రుత్' అనఁగా అడ్డగించునదిగాని బంధించునదిగాని మోహింపఁజేయునదిగాని యగుశక్తి, అదికలవాఁడు, లేక, 'తాం భక్తేభ్యో ద్రావయతి,' ఆశక్తిని భక్తులయొద్దనుండి పాఱఁదోలువాఁడు. 'రుత్' అనఁగా సంసారదుఃఖము, దాని పోఁగొట్టువాఁడు రుద్రుఁడు, "రుతిం రాతి," శబ్దమునిచ్చువాఁడు, కావున ప్రాణరూపుఁడు రుద్రుఁడని కొందఱు, "రుతిం వేదరూపశబ్దం బ్రహ్మణే కల్పాదౌ రాతి," వేదరూపమయిన శబ్దమును కల్పాదియందు బ్రహ్మకొసంగినవాఁడు. ఇట్లు ఆచార్యులు తమతమ సమయమున కనుగుణముగా రుద్రశబ్దమునకు వ్యుత్పత్తి వర్ణించుచున్నారు.

ఇందు, సర్వవ్యసనములకును మూలము క్రోధము కావున మొదలు దాని నమస్కారము చెప్పఁబడినది, అటుపిమ్మట సాక్షాద్బాధకమగుటచే బాణముయొక్క నమస్కార ముపదేశింపఁబడెను, బాణము బాధించుటకు ద్వారము కావున అటుపిమ్మట ధనుస్సుయొక్క నమస్కారము వచింపఁబడెను, అటుపిమ్మట ఆధనుర్బాణముల రెండింటి వ్యాపారములకును ఆధారములయిన రెండుచేతుల నమస్కారము వర్ణితమయ్యెను. ఇట్లు ఈమంత్రముచే జగదుపసంహారప్రవృత్తమయిన దేవుని ఘోరరూపము ప్రసాదింపఁజేయఁబడుచున్నది.

ఇదిమొదలు అయిదుమంత్రములు ప్రత్యక్షకృతములు, అనఁగా రుద్రసంబోధనము గలవి యనుట. దీనికి ఋషి కశ్యపుఁడు, ఛందస్సు అనుష్టుప్పు, దేవత రుద్రుఁడు. ఇఁకఁ బురశ్చరణాదులు. ఒకప్రాజాపత్య కృచ్ఛ్రము గావించి, యథోక్తదినములు ఈమంత్రము నిరంతరము పదునొకండువేలమార్లు జపింపవలెను. అటుపిమ్మట ఈమంత్రముచేతనే ప్రదక్షిణమునను నమస్కారమును గావింపవలెను. అంతఁ బురశ్చరణమగుచున్నది. పిమ్మట దక్షిణామూర్తిసన్నిధి

యందు పదునొకండువేలమార్లు జపించినయెడ సమస్తపాపమును నశించును. అటుపిమ్మట లక్షమార్లు జపించుటవలన ఏడుజన్మములయందుఁ జేసిన పాపము నశించును. ఆదక్షిణామూర్తిసన్నిధానమునందే అగ్నిని ప్రతిష్ఠించి నేతితోఁ బాయసము వండి స్మార్తాగ్నియందు హోమముచేసినయెడ దేవుని సాక్షాత్కారమవును. అచ్చటనే నాలుగుప్రక్కలను మూరెడు వైశాల్యము గల యగ్నికుండముగావించి తనయగ్నియందు కపిలగోఘృతముచే లక్షహోమము గావింపవలెను. గాణపత్యము లభించును.

క్షత్రియుఁడు పురశ్చరణసిద్ధుఁడైన బ్రాహ్మణునిచే లింగమునందుఁ బూజ చేయింపవలెను. దానివిధము చెప్పఁబడుచున్నది. లింగమునకు దక్షిణపార్శ్వమున అగ్నికుండము నేర్పఱచి మథనాగ్నిం బ్రతిష్ఠించి, ఆజ్యముచే దూర్వలచే కడిగినతండులముచే జమ్మిసమిధలచే ఒక్కొకటిచేతను ఎనిమిదివేల మార్లు వేల్వవలయును. పిమ్మట దేవునియెదుట ఎనిమిదివేలజపము చేయవలయును. దేవాలయముచుట్టును ఎనిమిదివేలావృత్తులు ప్రదక్షిణము చేయవలయును. ఇట్లుగావించినయెడ భగవంతుఁడు మిక్కిలి ప్రసన్నుఁడగును.

## ధ్యానము.

ఆకర్ణకృష్టే ధనుషి జ్వలన్తీం దేవీమిషుం భాస్వతి సందధానమ్,
ధ్యాయేన్మహేశం మహనీయవేషం దేవ్యాయుతం యౌవనశౌర్యయుక్తమ్.

ప్రకాశించుచున్నదియు చెవివఱకు లాగఁబడినదియు నగు ధనుస్సునందు మహాప్రభావముగల జ్వలించుచున్నబాణమును సంధించుచున్నవాఁడును యౌవనముగలవాఁడును వీరునిరూపముగలవాఁడును ఉత్తమమయిన అలంకారముగలవాఁడును దేవితోఁ గూడినవాఁడును నగు మహేశ్వరుని ధ్యానింపవలెను. అని దీనియర్థము. ౧

యా త ఇషు శ్శివతమా శివం బభూవ తే ధనుః,
శివా శరవ్యా యా తవ తయా నో రుద్ర మృడయ.

యా - తే - ఇషుః - శివతమా - శివమ్ - బభూవ - తే - ధనుః
శివా - శరవ్యా - యా - తవ - తయా-నః - రుద్ర -మృడయ. ౨

పూర్వమంత్రమునందు భయంకరములయిన క్రోధబాణధనుర్బాహువుల వలని భయము నివారితమగుటకై తన్నమస్కారము చెప్పఁబడినది. ఇప్పుడు, సుఖముగలిగించుటకై శాంతములయిన బాణాదుల ప్రార్థనము చెప్పంబడు చున్నది.

రుద్ర = రుద్రుఁడా! తే = నీయొక్క, ఇషుః = బాణము, యా = ఏది, శివతమా = మిక్కిలి శాంతమయినదో; భక్తులకు సుఖముగలిగించునది యగుటచే శాంతమని చెప్పఁబడుచున్నదోయనుట. తే = నీయొక్క, ధనుః = విల్లు, యత్ (అధ్యాహృతము) = ఏది, శివం = శాంతము, బభూవ = అగు చున్నదో, తే = నీయొక్క, శరవ్యా = అమ్ములపొది, యా = ఏది, శివా = శాంతమగుచున్నదో, తయా = ఆశాంతమయిన బాణముచేతను, తేన (అధ్యాహృతము) = ఆశాంతమైన ధనుస్సుచేతను, తయా (అధ్యాహృతము) = ఆశాంతమయిన అమ్ములపొదిచేతను, నః=మమ్ము, మృడయ=సుఖింపఁజేయుము.

రుద్రా! భక్తులకు సుఖముగలిగించునట్టి శాంతమయిన నీ బాణమేది గలదో, అట్టిబాణములఁ బ్రయోగించుటకు సాధన మగు శాంతమయిన నీధనుస్సు ఏదిగలదో, అట్టిబాణము లుంచు టకు స్థానమగు శాంతమయిన నీయమ్ములపొది యేది గలదో, ఆశాంతములయిన బాణధనుస్తూణీరముల మూఁడింటిచే మాకు సుఖము గలిగింపుము.

ఈమంత్రమునకు ఋషి యాత్రేయుఁడు, దేవత శంభువు, ఛందస్సు అనుష్టుప్పు. ఈమంత్రమును పండ్రెండుదినములు చరువు భుజించుచు నిరంతరము జపించినయెడఁ ఋరశ్చరణసిద్ధుఁ డగును. అటుపిమ్మట, అన్నము

గోరినవాఁడు, తిలతండుల యావకామలకముల కల్కముచే పదునొకండు వేలాహుతులు వేల్వవలయును, అన్నవంతుఁడగును. దుర్భిక్షము గలుగు నపుడు, దానిఁ దొలఁగించుటకై రాజు పురశ్చరణసిద్ధుఁ డగు బ్రాహ్మణునిచే తిలగుడమిశ్రితమయిన చరువుచే తనయగ్నియందు లక్షహోమము చేయింప వలెను. అంత రాజ్యమునందు సుఖ మగును.

## ధ్యానము.

ధ్యాయేద్దేవం సుస్మితం స్యన్దనస్థం దేవ్యాసార్థం తేజసాదీప్యమానం, ఇష్విష్వాసాలంకృతాభ్యాం కరాభ్యాం శూరాకారం స్తూయమానం సురాద్యైః.

చిఱునగవుగలవాఁడును దేవితోఁగూడ రథముమీఁద నున్నవాఁడును తేజస్సుచేఁ బ్రకాశించుచున్నవాఁడును బాణముచేతను ధనుస్సుచేతను అలంకృతములయిన హస్తములచే నొప్పినవాఁడును శూరునిరూపముగలవాఁడును దేవతలు మొదలగువారిచే స్తుతింపఁబడుచున్నవాఁడు నగు దేవుని ధ్యానింప వలయును. అని యర్థము. ౨

---

యా తే రుద్ర శివా తనూరఘోరాఽపాపకాశినీ,
తయా నస్తనువా శన్తమయా గిరిశన్తాభి
చాకశీహి.

యా - తే - రుద్ర - శివా - తనూః - అఘోరా - అపాప
కాశినీ - తయా - నః - తనువా - శన్తమయా - గిరిశన్త -
అభి - చాకశీహి. 3

రుద్ర = రుద్రుఁడా! తే = నీయొక్క, యా = ఏ, తనూః = రూపము, శివా = అనుగ్రహముసేయునదియు, అఘోరా = హింసించునది

కానిదియు, అపాపకాశినీ = హింసారూపమయిన అనిష్టమును బ్రకాశింపఁ జేయనిదియు, హింససేయు నాయుధములు ధరింపకుండుటవలనఁ జూపరులకు హింసాభయము తోఁపఁజేయనిదియనుట, లేక, మిక్కిలి శాంతమగుటచేఁ జూపరులకు అభయముతోఁపించునది కావున హింసాభయము బోఁగొట్టునది యనుట, భవతి (అధ్యాహృతము) = అగుచున్నదో, గిరిశన్త = పర్వతము నందుండి సుఖముసేయువాఁడా! కైలాసపర్వతమునందుండి నిత్యము ప్రాణులకు సుఖముసేయువాఁడా యనుట, రుద్రసంబోధనము, శన్తమయా = మిక్కిలి సుఖమునుగలిగించునట్టి, లేక, పరమానంద రూపమయినట్టి, తయా=ఆ, తనువా = రూపముచేత, నః = మమ్ముఁగూర్చి, అభిచాకశీహి = మిక్కిలి ప్రకాశింపుము, అట్టి నీరూపమును గనఁబఱచి మమ్ము సుఖులంజేయు మనుట, లేక, చూడుమని యర్థము. మమ్ము అనుగ్రహదృష్టిఁ జూడుమని భావము.

గిరిశన్త—గిరి యనఁగా మేఘము, అందుండి పర్జన్యరూపముచేఁ బ్రాణులకు సుఖము గలిగించువాఁడా! లేక, గిరి = వాక్కునందు, అనఁగా వేదమునందు, అర్థరూపముననుండి సుఖముసేయువాఁడా! లేక ప్రణవమునందు ధ్యేయరూపమున నున్నవాఁడవై నిరతిశయబ్రహ్మానందరూపమయిన సుఖమును గలిగించువాఁడా! లేక, తప్రత్యయము మత్వర్థీయము, కైలాసపర్వతమునందు సుఖముగలవాఁడా, కైలాసపర్వతమునందు సుఖముతో నుండువాఁడా యనుట. ఇట్లు నానావిధవ్యుత్పత్తులు వర్ణించెదరు.

కైలాసపర్వతమునం దావిర్భూతుఁడవై నిత్యము ప్రాణులకు సుఖముగలిగించుచుండు రుద్రుఁడా! భక్తులకు అనుగ్రహముచేయునదియు, హింసింపనిదియు, ఆయుధములు ధరింపక మిక్కిలి శాంతమగుటచే భక్తులకు భయము పోఁగొట్టి యభయ మొసంగునదియు నగు నీరూపము ఏదిగలదో, అట్టి నిరతిశయ

సుఖస్వరూపమయిన నీరూపమును మాకు సాక్షాత్కరింపఁజేసి యనుగ్రహము సేయుము.

రుద్రునకు ఘోరము శివము అని రెండు రూపములు. హింసించునది ఘోరము, అనుగ్రహించునది శివము, అందు ప్రసాదనార్థమై ప్రథమ మంత్రమునందు ఘోరరూపమునకు నమస్కారము చెప్పఁబడినది. శివము ఆయుధములతోఁ గూడినది యాయుధములు ధరింపనిది యని రెండువిధములు ద్వితీయమంత్రమున సాయుధము ప్రతిపాదింపఁబడినది, రెండవది యీమంత్రముచేఁ బ్రతిపాదింపఁబడుచున్నది.

ఈమంత్రమునకు ఋషి కాశ్యపుఁడు, దేవత శంభువు, ఛందస్సు బృహతి. ఇఁక దీని పురశ్చరణాదులు. హవిస్సు భుజించుచు మూఁడురాత్రులు నిరంతరము జపించినచోఁ బురశ్చరణమగును. పిమ్మట ఈమంత్రముచే గోశాంతి చేయునది. ఎట్లనఁగా, ఆవులకొట్టమునడుమ నాలుగు ప్రక్కలను హస్త ప్రమాణముగల యగ్నికుండము గావించి మథితాగ్నిం బ్రతిష్ఠించి, యందు దధిమధుఘృతములచేఁ దడుపఁబడిన వైకంకతాపామార్గముల (ములువెలమ యుత్తరేనుల) సమిధలు పదివేలు వేల్చునది. మఱియొక గోశాంతిప్రకార మును గలదు. పవిత్రమగుఘటము సుగంధాధివాసితము గావించి యందభి మంత్రిత మగుజలము నింపి, బ్రాహ్మణులచే లక్షమాఱు లేతన్మంత్రజపము చేయించి యాజలముచే గోవులం బ్రోక్షించునది గోశాంతి యగును.

## ధ్యానము.

స్మేరాననం చన్ద్రకలావతంసం గఙ్గాధరం శైలసుతాసహాయమ్,
త్రిలోచనం భస్మభుజఙ్గభూషణం ధ్యాయేత్పశూనాంపతిమీశితారమ్.

చిఱునగవుతోఁగూడిన మోముగలవాఁడును చంద్రకల శిరోభూషణముగాఁ గలవాఁడును గంగను ధరించినవాఁడును పార్వతితోఁగూడిన

వాఁడును మూఁడుకన్నులు గలవాఁడును విభూతియు సర్పములును ఆభరణము గాఁగలవాఁడును పశువులకుఁ బతియు నగు నీశ్వరుని ధ్యానింపవలెను. అనియర్థము. 3

యా మి షుం గి రి శ న్త హ స్తే బి భ ర్ష్య స్త వే,
శి వాం గి రి త్ర తాం కు రు మా హిం సీః పురు
షం జ గ త్.

యామ్ - ఇషుమ్ - గిరిశ న్త - హ స్తే - బిభర్షి - అ స్తవే -
శివామ్ - గిరిత్ర - తామ్ - కురు - మా - హింసీః - పురు
షమ్ - జగత్. ౪

గిరిశ న్త = కైలాసగిరియందుండి లోకమునకు సుఖముసేయునట్టి రుద్రుఁడా! యామ్ = ఏ, ఇషుమ్ = బాణమును, అ స్తవే = ప్రయోగించుటకొఱకు, హ స్తే = చేతియందు, బిభర్షి = ధరించుచున్నావో, గిరిత్ర = పర్వతమునుపాలించువాఁడా! కైలాసనాథుఁడా యనుట, తామ్ = ఆబాణమును, శివామ్ = శాంతమునుగా, మమ్ము హింసింపక కల్యాణము సేయుం దానిఁగా ననుట, కురు = చేయుము. పురుషమ్ = మాసంబంధియగు, లేక, నీభక్తుఁడైన, మనుష్యుని, జగత్ = ఇతరమయిన గోవులు మొదలగు జంగమమును, మాహింసీః = హింసింపకుము.

త్రిపురదహనప్రవృత్తమయిన భగవంతునిఘోరరూపము, శత్రువులకుఁ దక్కఁ దక్కినలోకమునకు బాధలేకుండుటకై, ఈమంత్రముచేతను పైమంత్రముచేతను బ్రసన్నము సేయఁబడుచున్నది.

కైలాసగిరియందు నిత్యావిర్భూతుఁడవై లోకమునకెల్ల సుఖముగలిగించుచుండు రుద్రుఁడా! శత్రువులమీఁదఁ బ్రయో

గించుటకొఱకు, నీవిప్పుడు ఏబాణమును చేతఁ బట్టియున్నావో, కైలాసనాథుఁడా! ఆబాణము మాయెడ మంగళకరమగునట్లు గావింపుము. ఆబాణము సర్వలోక సంహారము సేయ సమర్థము కావున, నీవు ఆబాణముచే శత్రువులు మాత్రమే హింసింపఁ బడునట్లును తక్కిన జంగమస్థావరాత్మకమగు ప్రపంచమునకు ఏబాధయు లేకుండునట్లును గావింపుము. అని, తాత్పర్యము. గిరిశంత గిరిత్ర అనుసంబోధనములు, నీవు లోకకంటకుల హింసించుటకై మాత్రమే యీఘోరరూపము వహించితివి. నీవు కైలాసమునుండి యెల్లలోకములకు సుఖము సేయువాఁడ వని జ్ఞప్తి పఱచుచున్నవి.

లేక త్రిపురదహనార్థము ప్రవృత్తమయి తద్దహనమైన పిమ్మటను నట్లే యుండు భగవంతునిఘోరరూపము, ఈమంత్రముచేతను పైమంత్రము చేతను బ్రసన్నము చేయఁబడుచున్నది.

ఈపక్షమునందు—కైలాసమునసుండి యెల్లలోకములకు సుఖము చేయువాఁడా! శత్రువులు దగ్ధులయిరి. నీవు మరల ప్రయోగించుటకై యేబాణము నిప్పుడు చేతఁబట్టితివో, దానిని శాంతముఁ గావింపుము, అట్లుగావింపనియెడ సర్వలోకములును దగ్ధములగును. కాఁబట్టి మనుష్యులను ఇతరజగత్తును హింస పొందనియట్లు చేయుము. అని తాత్పర్యము. గిరిశన్తగిరిత్రశబ్దములు ఘోరరూపోపసంహారార్థము శివరూపస్మారకములు.

గిరిత్ర = వర్షముగురిపించుటవలన మేఘమురక్షించువాఁడా! లేక పర్వతమువంటిరథము రక్షించువాఁడా! రథావయవములగు దేవతలరక్షించు వాఁడగుటచే నట్లు చెప్పఁబడుచున్నాఁడు. లేక, గిరామ్ - యాచనపుమాటల యొక్క, త్ర-రక్షకుఁడా యాచకుల కోర్కులనిచ్చువాఁడా యనుట. ఇట్లు వ్యుత్పత్తిభేదము చెప్పఁబడినది.

శి వే న వ చ సా త్వా గి రి శా చ్ఛా వ దా మ సి,
య థా న స్స ర్వ మి జ్జ గ ద య క్ష్మగ్ం సు మ నా
అ స త్.

శివేన - వచసా - త్వా - గిరిశ - అచ్ఛ - వదామసి -
యథా - నః - సర్వమ్ - ఇత్ - జగత్ - అయక్ష్మమ్ -
సుమనాః - అసత్. ౬

గిరిశ = కైలాసగిరియందుండువాఁడా! త్వామ్ = నిన్ను, అచ్ఛ = పొందుటకు, శివేన = మంగళకరమయిన, స్తోత్రరూపమయిన యనుట, వచసా = వచనముచేత, వదామసి = ప్రార్థించుచున్నాము, లేక, స్తుతించుచున్నాము. యథా = ఎట్లు, నః = మాయొక్క, జగత్ = జంగమపదార్థము, పుత్త్రులు మొదలగునదియు పశువులు మొదలగునదియు ననుట, సర్వమిత్ = అంతయునే, ఏప్రకారముచే, వృక్షాదిస్థావరము గ్రహింపఁబడుచున్నది, అయక్ష్మమ్ = రోగములేనిదియు, సుమనాః = మంచిమనస్సుగలదియు, సుఖముగలదియుననుట, అసత్ = అగునో, తథాకురు (అధ్యాహృతము) = అట్లుచేయుము.

లేక, గిరిశ = కైలాసమందుండువాఁడా! యథా = ఎట్లు, ఎట్లు స్తోత్రముచేసినయెడ ననుట; నః = మాయొక్క, జగత్ = జంగమపదార్థము, అయక్ష్మమ్ = రోగములేనిదియు, సుమనాః = సుఖముగలదియు, అసత్ = అగునో, తథా = అట్లు, త్వా = నిన్ను, అచ్ఛ = పొందుటకు, శివేన=స్తోత్రరూపమయిన, వచసా = వాక్యముచేత, వదామసి = స్తుతించుచున్నాము.

కైలాసవాసియగు రుద్రుఁడా! మంగళకరమగు స్తోత్రముచే నిన్ను స్తుతించుచున్నాము. మాయొక్క పుత్త్రులు పశు

వులు మొదలగు జంగమవస్తువులును వృక్షాదిస్థావరవస్తువులును రోగములేక సుఖముగానుండునట్లు గావింపుము

ఈరెండుమంత్రములకును ఋషి గౌతముఁడు, గోధూముఁడని కొందఱు, దేవత రుద్రుఁడు, ఛందస్సు మొదటిదానికి నిచృదనుష్టుప్పు, రెండవ మంత్రమునకు అనుష్టుప్పు, ఇరువదియొక్క దినము నిరంతరము జపించుట వీని పురశ్చరణము. వీనిచే అకాలమరణమునకుఁ బ్రతీకారము చేయునది. రాజ్యమునందు విషూచికాదులచే నకాలమరణము గలుగునపుడు రాజు పురశ్చరణసిద్ధుఁడగు బ్రాహ్మణునిచేఁ జేయింపవలెను. రాజ్యమునందు అకాలమరణము గలుగదు. తత్ప్రకారము. దధిమధుఘృతములచేఁ దడుపఁబడిన తిలవ్రీహిగోధూమయవలచే ఏకవింశతిదినములలో లక్షహోమము చేయవలెను. ఆరాజ్యమునందు అకాలమరణభయము గలుగదు. తొమ్మిదిదినములలో ఉపద్రవములు నశించును. పదునెనిమిదిదినములలో లోకమునవంతట అకాలమరణము తొలఁగును.

ధ్యానము.

సాంగ్రామికేణ వపుషా ప్రవిరాజమానం
దృప్యత్పురత్రయతృణాశని మన్దహాసమ్,
దైత్యాన్ దిధక్షు మచలేశ్వరచాపపాణిం
ధ్యాయేత్పురారి మమరౌఘరథాధిరూఢమ్.

యుద్ధమునకు యోగ్యమయినరూపముచేఁ బ్రకాశించుచున్నవాఁడును గర్వించిన త్రిపురాసురులు అను తృణములకు పిడుగయిన చిఱునగవుగలవాఁడును దైత్యులను దహింపఁగోరినవాఁడును మేరుపర్వతమయిన ధనస్సు చేతంగలవాఁడును దేవసమూహము అను రథము నారోహించినవాఁడు నగు పురహరుఁడైన రుద్రుని ధ్యానింపవలెను అని యర్థము. ౫

అ ధ్య వో చ ద ధి వ క్తా ప్ర థ మో దై వ్యో భి ష క్,
అ హీం గ్ ం శ్చ స ర్వా న్ జ మ్భ య న్త్స ర్వా శ్చ
యా తు ధా న్యః.
అధి - అవోచత్ - అధివక్తా - ప్రథమః - దైవ్యః-భిషక్ -
అహీన్ - చ - సర్వాన్ - జమ్భయన్ - సర్వాః - చ -
యాతుధాన్యః. ౬

ప్రథమః = దేవతలలో ప్రధానుఁడును, దైవ్యః = ఎల్లదేవతలకును దగినవాఁడును, దేవతలను బాలించుటకుఁ దగినవాఁడుననుట; భిషక్ = చికిత్స చేయువాఁడును, ధ్యానమాత్రముచే సమస్తరోగములను బోఁగొట్టునట్టి వాఁడుననుట అగు; అధివక్తా = అధికముగాఁ జెప్పువాఁడు, నన్నుసభయందు మెచ్చి యధికుండని చెప్పువాఁడనుట, అట్టిరుద్రుఁడు, అహీఙ్ = సర్పము లను, సర్వాఙ్ చ = అన్నిటినిగూడ, వ్యాఘ్రాదులనుగూడ ననుట; యాతు ధాన్యః = రాక్షసజాతులను, సర్వాశ్చ = అందఱను, జమ్భయఙ్ = నశింపఁ జేయుచు, అధ్యవోచత్ = నన్ను అధికునిఁగా చెప్పుఁగాక.

దేవతలలో ముఖ్యుఁడును దేవతలనెల్లఁ బాలించుటకు సమర్థుఁడును స్మరణమాత్రమున సమస్తరోగములఁ బోఁగొట్టు నట్టి వైద్యుఁడునగు దేవుఁడు, నన్ను సభయందు మెచ్చి యధికుఁ డని చెప్పురుద్రుఁడు, సర్పవ్యాఘ్రాదిక్రూరజంతువులను రాక్ష సాదులను నశింపఁజేసి, నీవందఱికన్న నధికుఁడవని నన్ను మెచ్చి కొని చెప్పుఁగాక యని తా. ఇది సాయనభాష్యాభిప్రాయము.

ప్రథమః = ప్రధానభూతుఁడును; దైవ్యః = దేవతలయందుఁగలిగిన వాఁడు, లేక, దేవ మనఁగా దేవనము దివ్ ధాత్వర్థములయిన క్రీడాదులలో

నొకటి, అందుఁ గలిగినవాఁడు, క్రీడయందు సుఖరూపుఁడు. జయేచ్ఛయందు జయరూపుఁడు. వ్యవహారమునందు ఏకాంతరూపుఁడు. ద్యోతనమునందుఁ బ్రకాశరూపుఁడు, స్తుతియందు స్తుత్యరూపుఁడు, గమనమునందు గంతవ్యరూపుఁడు, లేక, వాయురూపుఁడు అనుట; లేక, దివ్యజ్ఞానోపపన్నులు దేవశబ్దవాచ్యులు, వారలయందుఁ గలిగినవాఁడు, ప్రథమః = ప్రధానుఁడు, అనఁగా, దివ్యజ్ఞానము గలవారిలోఁ బ్రధానుఁడనుట, భిషక్ = వైద్యుఁడును, వ్యాధి తాపము సంసారము మొదలగువ్యసనములకుఁ జికిత్స చేయువాఁడనుట, లేక, (భియం సాదయితా నాశయితా) భిషక్ = భయమునశింపఁజేయువాఁడు, లేక, భీతే సజ్యతే మనసా ప్రాప్యతే = భయముగలిగినపుడు మనస్సుచేఁబొందఁబడువాఁడు; దేహచ్ఛేదనైః సీదతి అనుగృహ్ణాతి = దేహమును ఛేదించుకొనుటలచేత అనుగ్రహించువాఁడు; అధివక్తా = అధివచనము స్వభావము గాఁగలవాఁడు, అధివచనమనఁగా, పక్షపాతముచేతచెప్పుట. భక్తునియందుఁ బక్షపాతముచే నతనినధికునిఁగాఁ జెప్పువాఁడనుట, లేక, అధివచనమనఁగా ఐశ్వర్యముచే గొప్పతనముగాఁ జెప్పుట, నీకుభయములేదు నేనున్నానని. అది స్వభావముగాఁగలవాఁడు; లేక, అధివచనమునకర్హుఁడు, ఈశ్వరులుకానివారు అధివచనముచేయుటకు అర్హులుకారు, రుద్రుఁడు ఈశ్వరుఁడుకావున అధివచనమునకుఁదగినవాఁడనుట, అట్టిరుద్రుఁడు, అహీన్ = అగత్యజన్తూన్ హింసన్తి, తామేవచ్చి జంతువులను హింసించునవికావున, అహులనఁబడును, హింసించు స్వభావముగల వ్యాఘ్రసర్పవృశ్చికాదులను, సర్వాంశ్చ = అన్నిటినిగూడ, యాతుధాన్యః = యాతువులనఁగా "యాతయన్తి" దుఃఖింపఁజేయునట్టి మాయలు, అవి వీరియందుండును కావున, రాక్షసజాతులను, జాతివచనముగుటచే స్త్రీలింగము, సర్వాశ్చ = అన్నిటిని, జమ్భయన్ = నశింపఁజేయువాఁడై, అధ్యవోచత్ = అధివచనముచేయుఁగాక, మీకు భయములేదని చెప్పుఁగాక. యనుట.

దేవతలలో ప్రధానభూతుఁడును దివ్యజ్ఞానముగలవారిలో నుత్తముఁడును, వ్యాధితాపసంసారాదులకు చికిత్సచేయువాఁడును "నేనున్నాను నిన్నురక్షించెదను భయపడకుము"అని చెప్పఁదగినవాఁడునగు రుద్రుఁడు, మాకు హింసచేయునట్టి సర్పవృశ్చికవ్యాఘ్రములు మొదలగు జంతువులను రాక్షసులు మొదలగు దుష్టులను నశింపఁజేసి, నేనున్నాను రక్షించెదను భయపడకుఁడని మాకు అభయముఁజెప్పుఁగాకయని తాత్పర్యము. ఇది భట్టభాస్కరభాష్యాభిప్రాయము.

ఇది మొదలు నాలుగుమంత్రములు రుద్రసంబోధనము లేనివగుటవలన పరోక్షకృతము లనఁబడును. ఈమంత్రమునకు ఋషి కణ్వుఁడు, దేవత శంభువు, ఛందస్సు అనుష్టుప్పు, నివృత్తిని కొందఱు. గిని పురశ్చరణాములు. అర్ధకృచ్ఛ్ర మనుష్ఠించి యటుపిమ్మట నైమదినములు శాకములను మూలములను యవలను చరువును భుజించుచు పగలు ఆవశ్యకకర్మలయందుఁ దక్కఁ దక్కినప్పు డంతయు నిలుచుండి నిరంతరము జపింపవలెను. పురశ్చరణ మగును. అట్టిపురశ్చరణసిద్ధుఁడగు బ్రాహ్మణునిచే రాజు రక్షచేయింపవలయును. తెల్లయావాలు తండులములు దూర్వలు యవలు నేతిలోఁ దడిపి సమముగా తనయగ్నియందుఁ గాని మథితాగ్నియందుఁగాని ప్రతిదినము ఎనిమిదివేలు హోమముచేయునది. విశేషించి యార్ద్రానక్షత్రదినమునందు పదివేలు హోమము గావింపవలెను. మఱియు నాదినమునందే తిలలతోను బెల్లముతోను యవలతోను క్షీరముతోను గలిపిన చరువుచేత ఎనిమిదివేలు హోమముచేయవలెను. రాజు దీర్ఘాయుం వగును.

అన్ని యవసరములయందును ముఖ్యకాలమునందును దక్షిణయీవలెను. ఉత్తమమధ్యమాధమభేదములచే దక్షిణ మూఁడువిధములు. పదివేలసువర్ణనిష్కము లుత్తమదక్షిణ, ఐదువేలు మధ్యమము, మూఁడువేలు అధమము. లేక, మూఁడునూఱు లుత్తమము, రెండునూఱులు మధ్యమము, నూఱు అధ

మము. లేక, అఱువదినాలుగు సువర్ణనిష్కములుత్తమదక్షిణ, ముప్పదిరెండు మధ్యమము, ఇరువదినాలుగు అధమము. ఏకర్మయందు కర్మాంగముగ దక్షిణ విధింపఁబడుచున్నదో, ఆకర్మయందు మొదట సాధారణ దక్షిణ యిచ్చి పిమ్మట కర్మాంగదక్షిణ యీవలెను. పెక్కండ్రు కర్తలగుపక్షమున ప్రతిపురుషుఁడును వేఱువేఱుగా దక్షిణయీవలెను. ఒక్కఁడే కర్తయగుపక్షమున ఒక్కఁడే యిచ్చునది. దక్షిణ మిక్కిలి స్వల్పమయినయెడ యజమానుని నశింపఁజేయునని చెప్పఁబడుచున్నది. రాజులుగాని తత్సమానులుగాని యుత్తమదక్షిణయు వారొక్కనవారలు అధికారముచొప్పున మధ్యమాధమములును ఇయ్యవలెను. జేయుఁమమధ్యమాధమంబులయందలి విశేషంబులు శక్తినిబట్టి యథాయోగ్యముగ మనస్సుచేయుకొనునది. స్వశక్తిని జక్కఁగాఁ బర్యాలోచించి దక్షిణ నిర్ణయింప ఖేదించుకొనశక్తివంచనచేసినచో ఫలము గలుగదు. అట్లు "విభవే సతి యో వము గాఁగ్న కుర్యాద్విధివిస్తరమ్, నైవ తత్ఫలమాప్నోతి ప్రలోభాక్రాన్తమానసః." బహుపాయుండఁగా ఎవ్వఁడు మోహమున దక్షిణ యధికముగా నియ్యఁడో, ఐశ్వర్యముచే నాక్రాంతమయినమనస్సుగల యతండు, ఆకర్మఫలమును బొందనే స్వభావుఁడు అని చెప్పఁబడియున్నది. పదుగురుకర్తలగునపుడు సహస్రమును ఆఱుదుగురుగాని నలుగురుగాని కర్తలయినచో పంచశతంబును ఒకఁడు కర్తయయినచో త్రిశతంబునని దక్షిణాప్రకారాంతరము చెప్పఁబడినది. యథాధికారము వ్యవస్థ. ఆచార్యునకు ద్విగుణదక్షిణ యిచ్చుటయేగాక యాచార్యుఁడే భగవంతుఁడని భావింపవలెను. ఇట్లు సర్వకర్మలయందును అగ్నికిముందర సౌవర్ణము రాజతముగాని మంత్రకలశము స్థాపించి, యందు దేవుని యావాహనము గావించి యగ్నియందు హోమము చేయవలెను. పిమ్మట కలశోదకముచే రాజును ప్రోక్షించునది. దానంజేసి గురుభక్తిగల రాజు రక్షగలవాఁడగును.

ఈమంత్రముచేతనె మఱియొకప్రయోగము. అరణ్యమార్గమునఁ బోవలసినపుడు, ప్రత్తివిత్తులును ఉప్పును తెల్లావాలును ఈమంత్రముచే పదు

నొకండుమాఱు లభిమన్త్రించి, తానుబోఁదలఁచిన దిక్కును మాత్రము వదలి తక్కినదిక్కులయందు వానిని వేయునది. అంత శుద్ధుండై జపించుచుఁ బోవలెను. చోరవ్యాఘ్ర బ్రహ్మరాక్షస యక్షభూతాదిభయము గలుగదు.

మఱియును ఈమంత్రముచేతనే మఱియొక రోగనాశనప్రయోగము చెప్పఁబడుచున్నది. వ్యాధిగ్రస్తుఁడు ఏడాఱిగింజలను దీనిచే నభిమంత్రితములు గావించి శిఖయందు బంధించియుంచవలెను. ఆరోగ్యమగును. ఇట్లే తెల్లావాలను గావించినచో కుమారగ్రహాదులు తొలఁగును. కుంత యొకపలము మంత్రించి జలముచే కషాయము కాఁచి, ఆకషాయమునఁ దనయగ్నియందు ఎనిమిదివేలుగాని యెనిమిదివందలుగాని హోమముచేసి, శేషము త్రాగునది. గర్భరోగములు నశించును.

ధ్యానము.

చన్ద్రార్ధమౌళిం కాలారిం వ్యాళయజ్ఞోపవీతినమ్,
జ్వలత్పావకసంకాశం ధ్యాయేద్దేవం త్రిలోచనమ్.

చంద్రకల శిరస్సునందుఁ గలవాఁడును యముని జయించినవాఁడును సర్పము యజ్ఞోపవీతముగాఁగలవాఁడును జ్వలించుచున్న యగ్నివంటివాఁడును మూఁడుకన్నులుగలవాఁడును నగుదేవుని రుద్రుని ధ్యానింపవలెనుఅని యర్థము

---

అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రుస్సుమఙ్గ
లః, యే చేమాగ్ం రుద్రా అభితో దిక్షు శ్రితా
స్సహస్రశో వైషాగ్ం హేడ ఈమహే.

అసౌ - యః - తామ్రః - అరుణః - ఉత - బభ్రుః -
సుమఙ్గలః - యే - చ - ఇమామ్ - రుద్రాః - అభితః -

దిక్షు - శ్రితాః - సహస్రశః - అవ - ఏషామ్ - హేడః -
ఈమహే. ౭

తామ్రః=మిక్కిలియు నెఱ్ఱనివన్నెగలవాఁడును, ఉదయకాలమున మిక్కిలి రక్తవర్ణుండనుట, చీఁకటితో సంబంధమువలన నట్లుకనఁబడును, భూమి కాంతిసంబంధమువలన నని కొందఱు; అరుణః=కొంచెము ఎఱ్ఱనివన్నెగల వాఁడును, ఉదయమునకుఁ బిమ్మటననుట; ఉత = మఱియు; బభ్రుః=పింగల వర్ణముగలవాఁడును, అంతకన్నను బిమ్మటననుట; సుమఙ్గలః = మిక్కిలి మంగళముగలవాఁడును. సర్వమంగళములను భక్తుల కిచ్చువాఁడుననుట, అగు; అసౌ = ఈ, ప్రత్యక్షముగా ఆదిత్యరూపుఁడైన; యః = ఏరుద్రుఁడు; అస్తి (అధ్యాహృతము) = ఉన్నాఁడో, యేచ = మఱియునువి; రుద్రాః = ఈయాదిత్యరూపుఁడగు రుద్రుని కిరణరూపులయిన రుద్రులు, లేక, దేవుని చేత సృజింపఁబడి యతనితో సమానమయిన వేషమును మహిమయునుగల తదనుచరులయినరుద్రులుఁ; సహస్రశః = వేనవేలుగా, లెక్కకుమీఱిన వారలయియనుట; ఇమామ్ = ఈభూమికి, అభితః = చుట్టును ; దిక్షు = దిక్కులయందు, శ్రితాః = ఉన్నారో; సర్వలోకములకుఁ బుణ్యపాపకర్మాను రూపముగా ఫలమునిచ్చుటకు రుద్రునిచే నియుక్తులయి భూమియందంతటను ఎల్లదిక్కులయందును వ్యాపించియున్నారో అనుట; ఏషామ్=అట్టివీరల యొక్క, ఆదిత్యరూపుఁడైన రుద్రునియొక్కయు, తదనుచరులును రుద్ర తుల్యవేషులగుటచే రుద్రులనుపేరు గలవారలునగు దేవతలయొక్కయు ననుట; హేడః = క్రోధమును, అవఈమహే = (నమస్కారముచే) నివారించుకొనుచున్నాము, లేక, (మమ్ము బాధింపకుండుటకై) మిక్కిలి విన యముతో యాచించుచున్నాము.

ఏమహారుద్రుఁడు సర్వలోకములకుఁ బ్రత్యక్షముగా మండలమునందు ఆదిత్యరూపుఁడై, ఉపాధినిబట్టి ఉదయకాలము

రందు మిక్కిలి రక్తవర్ణుఁడును ఉదయమునకుఁ బిమ్మట కొంచె మెఱుపువన్నెగలవాఁడును అంతకన్నను పిమ్మట స్వర్ణవర్ణుఁడునై ల్లప్రాణులకును సర్వమంగళములను ఇచ్చుచున్నాఁడో, మఱియు ఆమహాదేవుని యాజ్ఞచే లోకములకుఁ బుణ్యపాపకర్మానురూపముగా ఫలములనిచ్చుటకై యేరుద్రులు లెక్కకుమిాఱి భూమి మంతయు సర్వదిక్కులయందును వ్యాపించియున్నారో, ఆమహారుద్రునకును ఆరుద్రులకును, విహితములయిన కర్మలను చేయక పోవుటవలనను నిషిద్ధములయినవానిని చేయుటవలనను మాకుఁ గలుగు క్రోధము మమ్ము బాధింపకుండుటకై మిక్కిలి భక్తివినయములతో నమస్కారము చేయుచున్నాము. 8

---

అ సౌ యో ఽ వ స ర్ప తి నీ ల గ్రీ వో వి లో హి తః,
ఉ తై నం గో పా అ దృ శ న్న దృ శ న్ను ద హా ర్యః,
ఉ తై నం వి శ్వా భూ తా ని స ద్ర ష్టో మృ డ
యాతి నః.

అసౌ - యః - అవసర్పతి - నీలగ్రీవః - విలోహితః - ఉత - ఏనమ్ - గోపాః - అదృశన్ - అదృశన్ - ఉదహార్యః - ఉత - ఏనమ్ - విశ్వా - భూతాని - సః - దృష్టః - మృడయాంతి - నః. ౯

నీలగ్రీవః = నల్లనికంఠముగలవాఁడును, కాలకూటవిషము ధరించుటచే నల్లనికంఠముగలవాఁడనుట; తెలుగు విశ్వవిద్యాలయము ...వాఁడును, యః = ఏరుద్రుఁడు; అసౌ = గ్రంథాలయము ...యగు ఆదిత్యరూపుఁడై ;

నమోదు సంఖ్య. 35792

అవసర్పతి = తిరుగుచున్నాఁడో. ఉదయాస్తమయములు గల్గించుటకనుట. ఆరుద్రుఁడు మండలవర్తియగురూపము ధరించుటకుఁ బ్రయోజనము చెప్పఁబడుచున్నది.—ఉత = మఱియు; యమ్ (అధ్యాహృతము)=ఏ; ఏనమ్ = ఈమండలవర్తియగురుద్రుని; గోపాః = గొల్లవాండ్రు, మిక్కిలియజ్ఞానులనుట; అదృశన్=చూచుచున్నారో, ఉదహార్యః=జలముఁదెచ్చునట్టి స్త్రీలు, గొల్లవాండ్రకన్నను అజ్ఞానిజనములు గూడ అనుట; అదృశన్=చూచుచున్నారో, ఉత=మఱియు; యమ్ ఏనమ్= ఏయీ మండలగతుఁడగు రుద్రుని; విశ్వా = సమస్తములయిన; భూతాని=ప్రాణులును; అదృశన్ (అధ్యాహృతము) = చూచుచున్నారో; ఆదిత్యరూపుఁడగురుద్రుఁడు పండితులచేతను పామరులచేతను గోమహిష్యాదిమృగములచేతను ఎల్లప్రాణులచేతను జూడఁబడును; కైలాసాదివర్తియగు రుద్రరూపమును వేదశాస్త్రాభిజ్ఞులు మొదలగువారలు మాత్రమె చూడఁగలరు గాని యితరులు చూడఁజాలరు. అట్లు సర్వసాధారణముగా దర్శనమిచ్చుటకై యే రుద్రుఁడు ఆదిత్యమూర్తిధరించుట, యని భావము. సః=అట్టియాదిత్యరూపుఁడగురుద్రుఁడు; దృష్టః=చూడఁబడినవాఁడై, నః=మమ్ము; మృడయాతి=సుఖింపఁజేయుఁగాక.

లోకరక్షణార్థము కాలకూటవిషము ధరించుటచే నల్లనైనకంఠము గలవాఁడును మిక్కిలి రక్తవర్ణుఁడునగు ఏరుద్రుఁడు, సర్వప్రాణులకును ఒక్కవిధముగా సాక్షాత్కారమిచ్చుటకై యాదిత్యరూపము ధరించి యుదయాస్తమయములు సేయుచున్నాఁడో, అట్టి యేయాదిత్యమూర్తిని, గొల్లవాండ్రును నీళ్లుమోయునట్టిస్త్రీలును మొదలగుపామరజనులును జూచుచున్నారో, మఱియు గోమహిష్యాదిమృగములు సయితము అట్లు సర్వప్రాణులును జూచుచున్నవో, అట్లు పండితులకు

మాత్రమే తెలియశక్యమయిన కైలాసాదివర్తిరూపములవలెఁగాక సర్వలోకములకుఁ బ్రత్యక్షభూతుఁడయిన యాదిత్యమూర్తి రుద్రుఁడు, మాచేఁ జూడఁబడినవాఁడై మాకు సుఖమిచ్చుఁగాక.

లేక; నీలగ్రీవవిలోహితపదములు ఆదిత్యమూర్తికే విశేషణములు.— యః=ఏరుద్రుఁడు; నీలగ్రీవః = "గ్రసంతి ఉదకమ్" జలమును గ్రహించుచున్నవి యనువ్యుత్పత్తిచే గ్రీవ లనఁగా కిరణములు, నల్లనికిరణములుగలవాఁడని యర్థము, అస్తమయము పొందునపుడు తమస్సంబంధమువలన కిరణములు. తమస్సువంటివే యగుచున్నవని భావము; లేక, అడఁగినకిరణములు గలవాఁడు. ఉదయమునకుముందును అస్తమయమయినపిమ్మట ననుట; విలోహితః = మిక్కిలియెఱ్ఱనివాఁడును, ఉదయాస్తమయకాలమునందు తమస్సంపర్కమువలన సూర్యమండలము రక్తవర్ణముగాఁ గనఁబడునని భావము. అగు, అసౌ = ఈయాదిత్యమూర్తియై; అవసర్పతి = తిరుగుచున్నాఁడో. ఇతరము సమానము.

ఏరుద్రుఁడు, ఉదయమునకుముందును అస్తమయమునకుఁ బిమ్మటను లోకమునకుఁ గనఁబడని కిరణములుగలవాఁడై ఉదయాస్తమయసమయములందు మిక్కిలి రక్తవర్ణుఁడై, యుదయాస్తమయములుచేయుచు ఎల్లప్రాణులకును ప్రత్యక్షమగుచున్నాఁడో, అట్టి సూర్యరూపుఁడగు రుద్రుఁడు మాచేఁ జూడఁబడినవాఁడై మాకు సుఖమొసంగుఁగాక.

అర్థాంతరము.—కొందఱిది యస్తమయము పొందు సూర్యమూర్తి భగవంతుని గుఱించినదని చెప్పెదరు.—ప్రథమ వాక్యార్థము సమానము. ఉత=మఱియును; యమ్ ఏనమ్ = ఏయీరుద్రుని, గోపాః = గొల్లవాండ్రు, అదృశన్=చూచుచున్నారో, ఆవులను గ్రామములోనికిఁ దోలుకొనిపోవుటకై

యస్తమయకాలముఁ దెలియఁగోరి చూతురని భావము. ఉదహార్యః=జలముఁ దెచ్చుస్త్రీలు, అదృశన్=చూచుచున్నారో. గృహములకుఁబోవం బ్రొద్దు దెలియుటకై చూతురనిభావము, లేక, అస్తమయమునకుమున్నె జలము తటాకాదులనుండి యెత్తవలెను, అటుపిమ్మట జలగ్రహణము నిషిద్ధమని జలము గ్రహించుటకై చూతురని భావము, ఇంతియకాదు, ఉత=మఱియును, యమ్ ఏనమ్=ఏయీరుద్రుని, విశ్వా = సమస్తములయిన, భూతాని = ప్రాణులును, అదృశన్=చూచుచున్నవో, మృగాదులుగూడఁ దమతమ నెలవులు చేరుటకై యస్తమయము పొందుచున్నభగవంతుంజూచుననుట, బ్రాహ్మణులు మొదలగు వారును అగ్నిహోత్రసంధ్యావందనాదికాలము దెలియుటకే యస్తమయము పొందు నాదిత్యమూర్తి రుద్రునిం జూతురు, ఇట్లు అందఱును అస్తమయము పొందునపుడు భగవంతుం జూచుచున్నారు, అట్లుచూచుట నిషిద్ధము. "నేక్షేతోద్యన్తమాదిత్యం నాస్తం యన్తం కదాచన" ఆదిత్యుని ఉదయించు చున్నవానిఁగాని యస్తమించుచున్నవానిఁగాని యెుకప్పుడును చూడఁగూడదు అని శాస్త్రము. అందువలననే, సాధారణముగాఁ జూచువారలు గోపాలాదు లని చెప్పఁబడినది. సః=అట్టిసూర్యమూర్తి రుద్రుఁడు, దృష్టః = చూడఁబడిన వాఁడై, అట్లు నిషిద్ధమయ్యును బ్రమాదంబున ఉపస్థానాది సమయమునందుఁ జూడఁబడినవాఁడై యనుట, నః=మమ్ము, మృడయాతి=సుఖింపఁ జేయుఁ గాక, అట్లు చూచుటచేఁ గలుగుపాపమునుబోఁగొట్టి, యుపస్థానఫలము నిచ్చి మమ్ము సుఖింపఁజేయుఁగాక యనుట.

ఇందు, మొదటిమంత్రమునకు ఛందస్సు ఆస్తారపఙ్క్తి, పఞ్చపదపఙ్క్తి యనికొందఱు, రెండవదానికి షట్పదజగతి ఛందస్సు, రెంటికి ఋషి కాలుఁడు, మరుత్వంతుఁడని కొందఱు. దేవత ఆదిత్యమూర్తియగు రుద్రుఁడు. రుద్రుని జగదుపసంహారకములయిన మూర్తులయందును అనుగ్రాహకములయిన అష్ట మూర్తులయందును ఆదిత్యమూర్తియు నొకటి యగుటవలన, భక్తవిషయంబున

సయ్యాదిత్యమూర్తి ప్రసన్నమగుటకై యీమంత్రములచేఁ బ్రార్థింపఁబడు మన్నవి.

ఇఁక వీనిపురశ్చరణాదులు. ఒక ప్రాజాపత్యకృచ్ఛ్రము గావించి, పదునాఱుదినములు నిరంతరము జపముసేయవలెను. పురశ్చరణ సిద్ధియగును, అనావృష్టికలుగునపుడు వర్షముకొఱకు ఈమంత్రములచేఁ బ్రయోగముచేయఁదగును. ఏదుగురు బ్రాహ్మణులను మంత్రసిద్ధులఁగావించి వారలచేఁ జేయింపవలెను. వారలకు శిరోవేష్టనము కర్ణవేష్టనము కంఠాభరణము హస్తాలంకారములు మొదలగునవి యీవలెను. తత్ప్రకారము. ఆర్ద్రానక్షత్రము మొదలుగఁగాని ఆర్ద్రాంతముగఁగాని పదునొకండుదినములు దీక్షవహింపవలెను. దధిమధుఘృతములచేఁ దడుపఁబడిన తిలతండులయవలచే లక్షఆహుతులు వేల్వవలయును. క్షీరముచేఁ దడుపఁబడిన ప్రబ్బలిసమిధలును లక్షవేల్వవలయును. ఆయైదుగురు బ్రాహ్మణులలో నొకఁడు జపమును నలుగురు హోమమును జేయునది. కడపటిదినమునఁ బ్రత్యేకముగ నెఱ్ఱదామరపువ్వు లెనిమిదివేలచే నారాధింపవలెను. సమాప్తివఱకు అగ్నిహోత్రము రక్షింపవలెను. కర్మకాలమునఁ దిగిచూచిన పక్షమందు, ఆచమించి ఒకమాఱు జపించి అగ్నిం జూచి కూర్చుండవలయును. లేనిచోఁ బ్రాయశ్చిత్తియగును. కడదినమునందు భగవంతుఁడగు నాదిత్యుఁడు మహావర్షముఁగురియించును. మఱియును, ప్రబ్బలిపువ్వులు పదివేలువేల్చినయెడ సూర్యుఁడు వరమొసంగును. సూర్యుఁ డుదయించునప్పుడును అస్తమించునప్పుడును ఈమంత్రములచే నుపస్థానము సేయునది. మఱియు గొంతుబంటి నీట సూర్యునికెదుట నిలుచుండి యీమంత్రములు జపించుచు, రెండుచేతులునిండ జలమెత్తి యర్ఘ్యమువిడుచునది. ఇట్లు ప్రతిదినము ఎనిమిదివే లర్ఘ్యముల చొప్పునఁ దొమ్మిదిదినములు గావింపవలెను. అంత నాదిత్యుఁడు ప్రసన్నుఁడై ఒక సంవత్సరమంతయును నితని కామితం బొసంగుచుండును. తేనియచేఁ దడుపఁబడిన దాసనపూవు లిరువదియొక్కవేలు వేల్చినయెడ నాదిత్యుని ప్రసాదమునఁ జతుర్వేదవేదికులంబున జన్మంబును జాతిస్మృతియుఁ బొందును.

ధ్యానము.

మణ్డలాన్తరగతం హిరణ్మయం, భ్రాజమానవపుషం శుచిస్మితమ్,
చణ్డదీధితి మఖణ్డవిగ్రహం చిన్తయేన్మునిసహస్రసేవితమ్.

మండలము లోపలనున్నవాఁడును స్వర్ణమయంబగు రూపముగలవాఁడును ప్రకాశించుచున్న దేహముగలవాఁడును స్వచ్ఛమయిన చిఱునగవు గలవాఁడును సర్వవ్యాపకమయిన యాకారముగలవాఁడును ఋషిసహస్రములచే సేవింపఁబడినవాఁడునగు సూర్యుని ధ్యానింపవలయును. అని దీనియర్థము. ౮

---

న మో అ స్తు నీ ల గ్రీ వా య స హ స్రా క్షా య
మీ ఢు షే, అ థో యే అ స్య స త్త్వా నో ౽ హం
తే భ్యో ౽ క ర ం న మః.

నమః - అస్తు - నీలగ్రీవాయ - సహస్రాక్షాయ - మీఢు
షే - అథో - యే - అస్య - సత్త్వానః - అహమ్ - తేభ్యః -
అకరమ్ - నమః.

నీలగ్రీవాయ = నల్లనికంఠముగలవాఁడును, సహస్రాక్షాయ = వేయి కన్నులుగలవాఁడును, ఇంద్రరూపుఁడు నసుట, మీఢుషే = తడుపువాఁడును, వర్షము గురియించువాఁడును పర్జన్యరూపుఁడుననుట, లేక, జగత్తులకు యోనియయినవాఁడును, లేక, పురుషరూపముచే వీర్యసేకము సేయువాఁడును, అగునట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కారము, అస్తు = అగుఁగాక. అథో = మఱియును, యే = ఎవ్వరు, అస్య = ఈరుద్రునియొక్క, సత్త్వానః = భృత్యులయిన ప్రాణులు, ప్రమథగణములు, సన్తి (అధ్యాహృతము) = కలరో, లేక, యే = ఎవ్వరు, అస్య = ఈరుద్రునిసంబంధులయిన, సత్త్వానః = ఆతని

నాశ్రయించినట్టి గొప్పవారలు, ప్రమథగణములనుట, సన్తి = కలరో, తేభ్యః = వారలకొఱకు, అహమ్ = నేను, నమః = నమస్కారమును, అకరమ్ = చేయుచున్నాను.

కాలకూటవిషము ధరించుటచే నీలవర్ణమయిన కంఠము గలవాఁడును వేయికన్నులు గలిగి యింద్రరూపుఁడయిన వాఁడును బర్జన్యరూపమున వర్షము గురియించువాఁడును (జగత్తులకు యోనియయినవాఁడును బురుషరూపమున వీర్యసేకము చేయువాఁడు) నగు రుద్రునకు నమస్కారము. మఱియును నీరుద్రు నాశ్రయించిన మహనీయులగు ప్రమథు లెవ్వరు గలరో వారలకును నేను నమస్కారము చేయుచున్నాను.

ఈమంత్రమునకు చందస్సు అనుష్టుప్పు, ఋషియు దేవతయు భగవంతుఁడగుశంభువు. ఇఁకఁ బురశ్చరణప్రకారము. పదునైదుదినములు హవిస్సు భుజించుచు నిరంతరము జపింపవలెను. పురశ్చరణసిద్ధిఁ డగును. పడమర వాకిలి గల శివాలయమునందు శివునిసమీపమున నంతటను అరత్ని ప్రమాణముగల యగ్నికుండము నిర్మించి యందు మథితాగ్నిం బ్రతిష్ఠించి, యమావాస్య మొదలుకొని పదిదినములు ప్రతిదినమును అర్కపుష్పములువేయి వేల్చి, దేవునకు ఘృతపాయసము నివేదనము సేయవలెను. సర్వార్థములు సిద్ధించును. ఈమంత్రము చేతఁ బుత్త్రునిఁ గోరువారలకుఁ బ్రయోగము చెప్పఁబడును, అయిదుగాని మూఁడుగాని దినములు దీక్షవహింపవలెను. శివాలయముగాని నదీతీరము గాని యావులకొట్టముగాని దేశము గ్రహించునది. దేవాలయమందేని దేవునియందును ఇతరస్థలమునసైనచో కుంభమునందును దేవునావాహనముచేసి, తత్పశ్చిమపార్శ్వమునందు అగ్నిని బ్రతిష్ఠించి దధిమధుఘృతములచేఁ దడుపఁబడిన జమ్మిసమిధలును జమ్మిపత్త్రములును బ్రతిదినము పదునొకండువేలుగాని రొునిమిది

వేలుగాని నాలుగువేలుగాని యెనిమిదివందలుగాని వేల్చునది. హోమమయిన పిదపఁదామరపుష్పములను అవిలేనిచోఁ దామరాకులను దేవునిమీఁద నుంచవలెను. ఇట్లు గావించి కడపటిదినమునందు ఎనిమిదివేలమందికిఁగాని నాలుగువేలమందికిఁగాని యెనిమిదినూర్లమందికిఁగాని బ్రాహ్మణులను భోజనమొసంగవలెను. అధికముగా ధనము నీవలెను. పదునొకండు బ్రాహ్మణుల రుద్రరూపులను భుజింపఁజేసి వారల కేదేని భూషణ మిచ్చి, దేవునిసన్నిధిని దక్షిణపార్శ్వమున ఆచార్యునిఁ జక్కఁగా భుజింపఁజేసి యధికమగుదక్షిణ యీవలెను. విత్తనములు చల్లినభూమిని దక్షిణగా నిచ్చునది. తొమ్మిదిమూరలకొయ్యచే నెనిమిదినూఱుల ప్రమాణ మనఁగా నేడువేలయిన్నూఱుమూరల కొలఁతగలభూమి దానము సేయవలెను. కుండలములకొఱకుఁ బ్రతిదినమును బాదనిష్కము సువర్ణమిచ్చి, దానిచే కుండలములుచేయించియియ్యవలెను. ఆనాహితాగ్ని యయినచో నిట్లే కాంస్యపాత్రము నిచ్చునది. ఇట్లు పుత్రునిఁ గోరువాఁడు చేయునేని శంభుప్రసాదమువలనఁ బుత్త్రవంతుఁడగును. సంవత్సరములోపల సిద్ధి గలుగును. దక్షిణాభూమి యుండువఱకు సంతతి యవిచ్ఛిన్నమగును. దీనిఫలము, సప్తజన్మములవఱకు సంబంధించి యుండును. కావున నెంతమాత్రము లోపము లేనియట్లు చేయవలెను.

ధ్యానము.

శరచ్చన్ద్రప్రకాశేన వపుషా శీతలద్యుతిమ్,
ధ్యాయేత్సింహాసనాసీనముమయా సహితం శివమ్.

శరత్కాలమునందలి చంద్రునివంటి కాంతిగల దేహముతోఁ గూడినవాఁడును చల్లనికాంతిగలవాఁడును సింహాసనమునఁ గూర్చుండినవాఁడును పార్వతీదేవితోఁగూడినవాఁడు నగుశివుని ధ్యానింపవలెను. అని దీనియర్థము.

ప్ర ము ఞ్చ ధ న్వ న స్త్వ ము భ యో రా ర్త్ని యో
ర్జ్యా మ్, యా శ్చ తే హ స్త ఇ ష వః ప రా తా భ గ
వో వ ప.

ప్ర - ముఞ్చ - ధన్వనః - త్వమ్ - ఉభయోః - ఆర్త్ని
యోః - జ్యామ్ - యాః - చ - తే - హస్తే - ఇషవః -
పరా - తాః - భగవః - వప. ౧౦

భగవః = భగవంతుఁడా! సమగ్రమయిన యైశ్వర్యము వీర్యము యశస్సు శ్రీ జ్ఞానము వైరాగ్యము ఈయాఱును భగశబ్దముచేతఁ జెప్పఁబడును. ఈయాఱునుగలవాఁడా! "ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసశ్శ్రియః, జ్ఞాన వైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా" అని స్మృతి. లేక, భూతముల యుత్పత్తివినాశములను రాకపోకలను విద్యను అవిద్యను తెలిసినవాఁడా! "ఉత్పత్తించ వినాశంచ భూతానామా గతింగతిమ్, వేత్తి విద్యా మవిద్యాంచ స వాచ్యో భగవానితి" అని స్మృతి. రుద్రుని సంబోధనము. ధన్వనః = ధనుస్సుయొక్క, ఉభయోః = రెండైన, ఆర్త్నియోః = మొనలయందు, జ్యామ్ = అల్లెత్రాటిని, ప్రముఞ్చ = విడువుము, దించుము, శిథిలము సేయుము అనుట. తే = నీయొక్క, హస్తే = చేతియందు, యాః = ఏ, ఇషవశ్చ = బాణములును, సన్తి (అధ్యాహృతము) = కలవో, తాః = వానినిగూడ, పరావప = విడిచివేయుము. లోకముమీఁదికి రానట్లు అమ్ములపొదియందో మఱియొచ్చటనో యుంచివేయు మనుట.

భగవంతుఁడవగు ఓరుద్రుఁడా! నీధనుస్సుయొక్క రెండు మొనలయందు ఎక్కుపెట్టఁబడియుండు నల్లెత్రాటిని సడలిం

పుము. నీచేతియందు ఏబాణములు ప్రయోగించుటకై పట్టఁబడియున్నవో వానినిగూడ అమ్ములపొదియం దుంచివేయుము.

ఇచివఱకుఁ దొమ్మిదిమంత్రములచేఁ గ్రుద్ధుండగుదేవుని ప్రసాదనము చెప్పఁబడినది. ఇఁక నతని యుపసంహారమునకుఁ గారణములయిన వింటినారి సడలించుట మొదలగునవి ప్రార్థింపఁబడుచున్నవి. అందు మొదటిరెండు రుద్రసంబోధనము గలవగుటచేఁ బ్రత్యేకకృతములు. ౧౦

---

అ వ త త్య ధ ను స్త్వగ్ం స హ స్రా క్ష శ తే షు
ధే, ని శీ ర్య శ ల్యా నా ం ము ఖా శి వో న స్సు
మ నా భ వ.

అవతత్య - ధనుః - త్వమ్ - సహస్రాక్ష - శతేషుధే - నిశీర్య - శల్యానామ్ - ముఖా - శివః - నః - సుమనాః - భవ. ౧౧

సహస్రాక్ష = వేయికన్నులుగలవాఁడా! పెక్కుకన్నులు గలవాఁడా! ఇంద్రరూపుఁడా అనుట; శతేషుధే = నూఱు అమ్ములపొదులు గలవాఁడా! పెక్కుఅమ్ములపొదులుగలవాఁడా యనుట; రుద్రసంబోధనములు. త్వమ్ = నీవు, ధనుః = ధనుస్సును, అవతత్య = దించి, వదులయిననారి గలదిగాఁజేసి యనుట; శల్యానామ్=బాణములయొక్క, ముఖా = మొగములను, బాణముల చివరనుండు వాఁడియయిన ఉక్కుముక్కలను; నిశీర్య = అమ్ములపొదులయందు తలక్రిందుగా నుంచి, లేక, మిక్కిలి మొక్కలనుగాఁజేసి, వాఁడి లేనివిగాఁజేసి యనుట; నః = మమ్ముఁగూర్చి, లేక, మాకు; సుమనాః = మంచిమనస్సుగలవాఁడవై, అనుగ్రహముగలవాఁడవై యనుట; శివః = శాంతుఁడవు, భయకారణములగు ధనుస్సు మొదలగువాని నుపసంహరించుటవలన, అభయమిచ్చు

వాఁడవనుట. లేక; శివః = శాంతుఁడవు, అపచారములు చేసినను క్షమించు వాఁడవై యనుట; సుమనాః=సాధ్యుఁడికఁడని నావిషయమం దనుగ్రహము గలవాఁడవు, భవ = అగుము.

లెక్కలేని కన్నులును లెక్కలేని యమ్ములపొదులునుగల యోరుద్రుఁడా! నీవు ధనుస్సు మోపెడలించి బాణములు ప్రయోగించుట కుపయోగింపనిదిగాఁ గావించి, బాణముల ముఖములందుండు వాఁడిలోహపు తునుకలను పొదులందు తల క్రిందుగానుంచి, (ఎవ్వరిని హింసించుటకు సమర్థములు గాని యట్లు మిక్కిలి మొక్కలుగాఁజేసి) మాయందు అనుగ్రహము గలవాఁడవై మేముచేయు నపచారముల క్షమించుచు శాంతుండవై మమ్ము రక్షించుచుండుము. ౧౧

---

వి జ్యం ధ నుః క ప ర్ది నో వి శ ల్యో బా ణ వా గ్ం
ఉ త, అ నే శ న్న స్యే ష వ ఆ భు ర స్య ని ష ఙ్గ ధిః.
విజ్యమ్ - ధనుః - కపర్దినః - విశల్యః - బాణవాన్ - ఉత-
అనేశన్ - అస్య - ఇషవః - ఆభుః - అస్య - నిషఙ్గధిః. ౧౨

కపర్దినః = జటాజూటము గల రుద్రునియొక్క, ధనుః = విల్లు, విజ్యమ్ = అల్లెత్రాడులేనిది, అస్తు (అధ్యాహృతము) = అగుఁగాక. ఉత = మఱియును, బాణవాన్ = బాణములు గలదియగు అమ్ములపొది; విశల్యః = బాణము ముఖముననుండు ఉక్కు మేకులులేనిది, అందు బాణములు తలక్రిందుగా నుంచుటచే ఆమేకుల భాగము అడుగునఁగలదియనుట, ఆమేకులు వెలుపలికి కనఁబడకుండునట్లనుట, అస్తు (అధ్యాహృతము) = అగుఁగాక. అస్య =

ఈరుద్రునియొక్క, ఇషవః = బాణములు, అనేశన్ = సమర్థములు గానివి యగుఁగాక, గ్రుచ్చుట కసమర్థము లగుఁగాక యనుట. అస్య = ఈరుద్రుని యొక్క, నిషఙ్గథిః = బాణముల కాధార మయినది, ఆభుః = కొంచెము సమర్థము, అస్తు (అధ్యాహృతము) = అగుఁగాక, గోడకొలికికిఁ దగిలింపఁబడి యుండుటచే, బాణములను ధరించుటకు మాత్రమే సమర్థమగుఁగాక, బాణముల నాకర్షించుటకు యోగ్యము గానిది యగుఁగాక యనుట. లేక, నిషఙ్గథిః = కత్తియొఱ, ఆభుః = కొంచెము సమర్థము, అస్తు = అగుఁగాక. ఒకానొకచోఁ దగిలింపఁబడిన దగుటవలన ఖడ్గము ధరించుటకు మాత్రమె యది సమర్థ మగుఁగాక, ఖడ్గము నాకర్షించుటకు అయోగ్య మగుఁగాక యనుట.

జటాజూటము ధరించినట్టి రుద్రుని ధనుస్సు శాంతమయి యల్లెత్రాడు లేనిది యగుఁగాక, ఇతని యమ్ములపొదియు లోపల నడఁగినవగుటచే వెలికిఁ గనఁబడని బాణముల ముఖములందలి మేకులు గలది యగుఁగాక. (ఈతనిబాణములు తూణీరములందు వేయఁబడినవై బాధింప నసమర్థము లగుఁగాక,) ఈరుద్రుని బాణాధారమయిన వస్తువు గోడకుఁ దగిలింపఁబడి యుండుటవలన బాణములు తీయుట కుపయోగింపక బాణములు ధరించునది మాత్రమే యగుఁగాక, (ఈతని కత్తియొఱయు ఎచ్చటనో తగిలింపఁబడి యుండుటచే కత్తిని లాగుట కుపయోగింపక కత్తిని ధరించినవి మాత్రమే యగుఁగాక) అని తాత్పర్యము. ఇది సాయనభాష్యాభిప్రాయము.

కపర్దినః = జటాజూటముగల శివునియొక్క, ధనుః = విల్లు, విజ్యమ్= అల్లెత్రాడు లేనిది, అస్తు = అగుఁగాక. బాణవాన్ ఉత = బాణములు గలది యగు అమ్ముల పొదియును, అమ్ముల పొదిముందు బాణములు గలదియైనను

అనుట, విశల్యః = బాణములు లేనిది, అస్తు = అగుఁగాక. రుద్రునితూణీరము మున్ను బాణములు గలది యయినను ఇఁక బాణములు లేనిది యగుఁగాక, మమ్ము లోకములను బాధింప కుండుఁగాక యనుట. అస్య = ఈరుద్రునియొక్క, ఇషవః = బాణములు, అనేశన్ = నశించినవి యగుఁగాక. ఈరుద్రుని బాణములు మమ్ము బాధింపనివి యగుఁగాక యనుట లేక, అస్య = ఈ తూణీరము యొక్క, ఇషవః = బాణములు, అనేశన్ = నశించుఁ గాక. ఆబాణములు తూణీరము విడిచి మఱి యెచ్చటనైనను అదృశ్యములయి యుండుఁగాక యనుట. అస్య = ఈదేవునియొక్క, నిషఙ్గథిః = కత్తియొఱ, ఆభుః = తక్కువగానుండుట గలది, ఎల్లప్పుడును కత్తిని ధరించు స్వభావము గలది కావున దానికి కత్తితోఁ గూడి యుండుట పుష్కలముగా నుండుట యగును, ఇఁక దానికిఁ దక్కువగా నుండుటయనఁగా కత్తిలేక యుండుట యని చెప్పవలెను, కత్తి లేనిది యనుట, అస్తు=అగుఁగాక, కత్తియొఱ కత్తిలేక నట్టిదియై యుండుఁగాక యని భావము. లేక, నిషఙ్గథిః = ఖడ్గము, ఆభుః = కొంచెముగా నుండునది, తక్కువ శక్తి గలది యనుట, అస్తు = అగుఁగాక, మొక్క వోయినదై మమ్ము లోకములను బాధింప సమర్థముగానిదై యుండుఁగాక యని భావము. ఇది భాస్కరభాష్యాభిప్రాయము.

ఈమంత్రము రుద్రసంబోధనము గాని తద్విషయ మయిన యుష్మచ్ఛబ్ద ప్రయోగముగాని లేని దగుటవలనఁ బరోక్షకృత మనఁబడును.

ఈమూఁడు ఋక్కులకును ఛందస్సు అనుష్టుప్పు, ఋషి నారదుఁడు, దేవత రుద్రుఁడు. ఇఁక వీనికిఁ బురశ్చరణము. ఒక ప్రాజాపత్య కృచ్ఛ్రము గావించి పరిశుద్ధుఁడై తొమ్మిది దినములు నిరంతరము జపించునది. సిద్ధుఁడగును. ఈ మంత్రములచే యుద్ధకాలమున రాజు నాయుధముల నభిమంత్రించి దర్భ మొక్కలు వేయి వేల్వవలయును. యుద్ధమునకు వచ్చినశత్రువులు పరాజితులగుదురు.

## ధ్యానము.

ఉద్యద్భాస్కరకోటిప్రకాశమాదీప్తదహనమూర్ధానమ్,
భీషణభుజఙ్గభూషం ధ్యాయేద్వివిధాయుధం రుద్రమ్.

ఉదయించుచున్న కోటిసూర్యులవలెఁ బ్రకాశముగలవాఁడును మండుచున్న యగ్నివంటి శిరస్సుగలవాఁడును భయంకరములైన సర్పములు ఆభరణములుగాఁ గలవాఁడును నానావిధములగు నాయుధములు గలవాఁడు నగు రుద్రుని ధ్యానింపవలెను. అని దీనియర్థము.

## ధ్యానాంతరము.

రుద్రం సురనియన్తారం శూలఖట్వాఙ్గధారిణమ్,
జ్వాలామాలావృతం ధ్యాయేద్భక్తానామభయప్రదమ్.

దేవతలకు నియామకుండును శూలమును ఖట్వాంగమును ధరించినవాఁడును జ్వాలాజాలముచేఁ జుట్టఁబడినవాఁడును భక్తుల కభయ మొసంగువాఁడునగు రుద్రుని ధ్యానింపవలెనని దీని యర్థము. ౧౨

---

యా తే హేతిర్మీఢుష్టమ హస్తే బభూవ తే ధనుః,
తయాఽస్మాన్విశ్వతస్త్వమయక్ష్మయా పరి
బ్భుజ.

యా - తే - హేతిః - మీఢుష్టమ - హస్తే - బభూ
వ - తే - ధనుః - తయా - అస్మాన్ - విశ్వతః - త్వమ్ -
అయక్ష్మయా - పరిబ్భుజ. ౧౩

మీఢుష్టమ=విశేషించి వర్షించు వాఁడా! విశేషించి కోర్కుల వర్షించు వాఁడా యనుట, రుద్రసంబోధనము. యా=ఏది, తే=నీయొక్క, హేతిః= ఆయుధము, ఖడ్గాది రూపము, అస్తి (అధ్యాహృతము) = కలదో, యత్ (అధ్యాహృతము) = ఏది, తే=నీయొక్క, హస్తే=చేతియందు, ధనుః=విల్లు, బభూవ=ఉన్నదో, అయక్ష్మయా = ఉపద్రవములేనట్టి, ఉపద్రవము సేయనట్టి యనుట, తయా = ఆఖడ్గాది రూపమయిన హేతిచేతను, అయక్ష్మేణ తేన (అధ్యాహృతము) = ఉపద్రవము చేయనట్టి ఆధనుస్సుచేతను, త్వమ్ = నీవు, అస్మాన్=మమ్ము, విశ్వతః = అన్నిట నుండియు, పరిభ్భుజ = పరిపాలింపుము.

అతిశయముగాఁ గోర్కుల వర్షించునట్టి యోరుద్రుఁడా! నీ ఖడ్గాదిరూపమగు ఆయుధమేది గలవో; మఱియును నీచేతి యందు ధనుస్సు ఏది గలదో, బాధ చేయనట్టి యాఖడ్గాది రూపమగు నాయుధముచేతను, ఆధనుస్సుచేతను సమస్త భయములను బోఁగొట్టి మమ్ముఁ బరిపాలింపుము. అని తాత్పర్యము. ఇది సాయనీయము.

మీఢుష్టమ = అతిశయముచేతఁ దడుపువాఁడా! రుద్ర సంబోధనము. తే = నీయొక్క, హస్తే = చేతియందు, ధనుః = ధనుస్సనెడు, యా = ఏ, హేతిః = ఆయుధము, బభూవ = ఉన్నదో, అయక్ష్మయా = భక్తుల కారోగ్యము గలిగించునట్టి, తయా = ఆ యాయుధముచేత, త్వమ్ = నీవు, అస్మాన్ = మమ్ము, విశ్వతః = అన్నిటివలను, పరిభ్భుజ = పరిపాలింపుము.

నీచేతనుండు ధనుస్సనెడు నాయుధ మేదిగలదో, భక్తులకు ఆరోగ్యమొసంగు నట్టి యయ్యాయుధముచే మమ్ము సమస్త పాపములనుండియు నెల్లప్పుడును రక్షింపుమని తాత్పర్యము.

లేక, అస్మాన్ = మమ్ము, విశ్వతః = అందఱను, పరిబ్భుజ = పాలింపుము. పుత్రపౌత్త్రాది సహితులమయిన మమ్ము రక్షింపుమనుట. మఱికొందఱు చెప్పెదరు. తే = నీయొక్క, హేతిః = హింస, యా = ఏది గలదో, దాని కొఱకు, హస్తే = చేతియందు, ధనుః = విల్లు, యత్ = ఏది, బభూవ = కలదో. అయక్ష్మయా = భక్తులకు బాధ సేయనియట్టి, తయా = ఆహింసచేతను, తేన = ఆధనుస్సుచేతను, త్వమ్, అస్మాన్, విశ్వతః, పరిబ్భుజ.

నీవు చేయునట్టి హింసయేదిగలదో, తదర్థము నీవు చేతియందు ధరించిన ధనుస్సు ఏది గలదో, భక్తుల బాధింపనట్టి ఆహింసచేతను ఆధనుస్సుచేతను మాశత్రువుల హింసించి మమ్ము సర్వభయములనుండి రక్షింపుము అని తాత్పర్యము. ఇది భట్టభాస్కరీయము. ౧౩

---

న మ స్తే అ స్త్వా యు ధా యా ౽ నా త తా య
ధృ ష్ణ వే, ఉ భా భ్యా ము త తే న మో బా హు
భ్యాం త వ ధ న్వ నే.
నమః - తే - అస్తు - ఆయుధాయ - అనాతతాయ - ధృష్ణవే - ఉభాభ్యామ్ - ఉత - తే - నమః - బాహుభ్యామ్ - తవ - ధన్వనే. ౧౪

తే = నీయొక్క, అనాతతాయ = చాపఁబడనిదియు, ధనుస్సునందు సంధింపఁబడనిదియు ననుట, ధృష్ణవే = స్వభావముచేత బాధించుటకు సమర్థమయినదియు నగు, ఆయుధాయ = బాణముకొఱకు, నమః = నమస్కారము,

అస్తు = అగుఁగాక. ఉత = మఱియు, తే = నీయొక్క, ఉభాభ్యామ్ = రెండైన, బాహుభ్యామ్ = చేతుల కొఱకు, నమః = నమస్కారము, అస్తు (అధ్యాహృతము) = అగుఁగాక. తవ = నీయొక్క, ధన్వనే = ధనుస్సుకొఱకు, నమః అస్తు (అధ్యాహృతము) = నమస్కారము అగుఁగాక.

రుద్రుఁడా! స్వభావముచే హింసించుటకు సమర్థమయ్యు ధనుస్సునందు సంధింపఁబడనిది కావున శాంతమయిన నీబాణము నకు నమస్కారము. మఱియు ధనుస్సునుబట్టి బాణమును ప్రయోగించునట్టి నీరెండుచేతులకును నమస్కారము, బాణ ప్రయోగమునకు సాధనమయిన నీధనుస్సునకును నమస్కారము గావించెదను. అని తాత్పర్యము. ఇది సాయనీయము.

తే = నీయొక్క, అనాతతాయ = ఎక్కుపెట్టఁ బడనిదియు, ధృష్ణవే = మిక్కిలి దృఢమయినదియు, లేక, భక్తులుగానివారలకు భయము గలిగించు స్వభావము గలదియు నగు, ఆయుధాయ = ధనుస్సుకొఱకు, నమః = నమస్కారము, అస్తు = అగుఁగాక. ఉత = మఱియు, తే = నీయొక్క, ఉభాభ్యామ్ = రెండయిన, బాహుభ్యామ్ = చేతులకొఱకు, కుడి యెడమచేతుల కొఱకనుట, నమః = నమస్కారమగుఁగాక, మాకు భయమును గలిగించునట్టి రెండుచేతులకును నమస్కారమనుట. తవ = నీయొక్క, ధన్వనే = వింటికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. మఱల ధనువు నమస్కరించుట ఆదరార్థము.

రుద్రుఁడా! స్వభావముచే దృఢమయి భక్తులు గాని వారలకు భయంకర మయినను మోపెట్టఁబడక యుండుటచే శాంతమయిన నీధనువునకు నమస్కారము, నీరెండుచేతులకును నమస్కారము, మరల నీధనుస్సునకు నమస్కారము చేయు చున్నాను. అని తాత్పర్యము.

లేక, తే, అనాతతాయ = ఉద్యుక్తము గానిదియు, ధృష్ణవే = భయంకరమునగు, ఆయుధాయ = బాణము కొఱకు, నమః = నమస్కారము అగుఁగాక. శేషము సమానము.

లేక, తే, అనాతతాయ = ఎత్తఁబడని యట్టిదియు, ప్రయోగించుటకు ఎత్తఁబడక పెట్టినచోటనే యున్నట్టిదియు ననుట, ధృష్ణవే = భయంకరము నగు, ఆయుధాయ = గదమొదలగు నాయుధము కొఱకు, నమః = నమస్కారమగుఁగాక. ఇతరము తుల్యము. భట్టభాస్కరీయము. ౧౪

పరి తే ధన్వనో హేతిరస్మాన్వృణక్తు విశ్వతః, అథో య ఇషుధిస్తవాఽఽరే అస్మన్ని ధేహి తమ్.

పరి - తే - ధన్వనః - హేతిః - అస్మాన్ - వృణక్తు - విశ్వతః - అథో - యః - ఇషుధిః - తవ - ఆరే - అస్మత్ - ని ధేహి - తమ్. ౧౫

ఇతి శ్రీమద్యజుస్సంహితాయాం చతుర్థకాణ్డే పఞ్చమ ప్రపాఠకే, ప్రథమోఽనువాకః.

---

తే = నీయొక్క, ధన్వనః = ధనుస్సుయొక్క, హేతిః = బాణము, అస్మాన్ = మమ్ము, విశ్వతః = అంతటను, పరివృణక్తు = విడుచుఁగాక, మమ్ము బాధింప కుండుఁగాక యనుట. అథో = మఱియు, తవ = నీయొక్క, ఇషుధిః = అమ్ములపొది, యః = ఏదిగలదో, తమ్ = దానిని, అస్మత్ = మాకంటె, ఆరే = దూరమునందు, నిధేహి = ఉంచుము.

రుద్రా! నీధనుస్సుచేఁ బ్రయోగింపఁబడు బాణ మేది గలదో, అది మమ్ము నెచ్చటను బాధింప కుండుఁగాక. మఱియు భయంకరములగు బాణములకు స్థానమయిన నీయమ్ములపొది యేది గలదో, నీవు దానిని గూడ, అందలి బాణములు మమ్ము బాధింప కుండునట్లు, మాకు దూరమున నుంచుము. అని తాత్పర్యము. సాయనీయము.

తే = నీయొక్క, ధన్వనః = ధనుస్సుయొక్క, హేతిః = హింస, అస్మాన్ = మమ్ము, విశ్వతః = అన్నివిధములను, లేక, అందఱను, పుత్రపౌత్రాదులతోఁ గూడినవారల ననుట, పరివృణక్తు = విడుచుఁగాక, బాధింప కుండుఁగాక. అథో = మఱియు, తవ = నీయొక్క, ఇషుధిః = అమ్ములపొది, యః = ఏదిగలదో, తమ్ = దానిని, అస్మత్ = మాకంటె, ఆరే = దూరమునందు, లేక, ఆరే = శత్రువుల సమూహమునందు, నిధేహి = ఉంచుము.

రుద్రా, నీధనుస్సు గావించు హింస మమ్ము మావారలను అందఱను అన్నివిధముల బాధింప కుండుఁగాక. మఱియు భయంకరములగు బాణములుండు నీయమ్ములపొదిని, మాయొద్ద నుండి తొలఁగించి మా శత్రువులయం దుంచుము. అని తాత్పర్యము. ఇది భట్టభాస్కరీయము.

ఈమూఁడు మంత్రములు, రుద్రవిషయమగు యష్మచ్ఛబ్ద ప్రయోగము కలవియగుటచేఁ బ్రత్యక్షకృతములు. వీని ఛందస్సు అనుష్టుప్పు, ఋషియు దేవతయు భగవంతుఁడు. ఇఁక వీనిపురశ్చరణము. ఒక ప్రాజాపత్యకృచ్ఛ్రము చేసి తన్ను శుద్ధుని గావించికొని తొమ్మిది దినములు నిరంతరము జపింపవలెను. మంత్రసిద్ధియగును, యుద్ధకాలమునఁ, బదునొకండువేల దీపములకుఁ జాలిన తైలమును ఒక గొప్పపాత్రలో నుంచి యందు దేవు నావాహనముచేసి, చుట్టు

దిక్పాలుర నావాహనము చేసి యారాధించి, యేడుదినము లా తైలము స్పృశించుచుఁ బ్రతిదినమును ఎనిమిదివేలావృత్తులు జపింపవలెను. శత్రురాజ్యము సమీపించినపుడు ఆసిద్ధ తైలముచేఁ బదునొకండువేల దీపములు వెలిఁగించి యెత్తించుకొని, రాజునువదలి, సేనాపతి సేనాసహితుండై ముందు నడువవలెను. ఆదీపములజ్వాలను జూచి శత్రుసేన నిలువఁజాలదు. తత్ప్రభావముచే శత్రువులు నశింతురు.

మఱియొక ప్రకారము. మంత్రసిద్ధులగు బ్రాహ్మణులు సిద్ధవేషము ధరించి, శత్రునగరముఁ బ్రవేశించి, శత్రురాజుమీఁద నభిచారముఁ బ్రయోగించునది. శత్రురాజు ఉపయోగించు వస్తువులను ఈమంత్రములుచ్చరించుచు స్పృశించియుఁ జూచియు, స్పర్శన దర్శనముల కశక్యమగుచోనిని,తన్ముఖంబున విని, "అభిచారోఽస్తు" అభిచార మగుఁగాకయని యంతమునఁ జేర్చి యీ మంత్రముల జపింపవలెను.

ప్రకారాంతరము. ఒకశంకువును ఈమంత్రములచే వేయిమాఱు లభిమంత్రించి, శత్రుపట్టణమునందుఁ జేరిన జతుష్పథంబునఁగాని దేవాలయమునందుఁగాని దేవోద్యానమునందుఁగాని, ప్రహరియందుఁగాని, అగడ్తయందుఁగాని పాఁతునది. ఆనగరము శివునికోపమునం జేసి మూఁడు సంవత్సరములలో వ్యాధిచే నశించును. చేయించునట్టి యాచార్యునకు రాజ్యముతో సరియయిన దక్షిణ యియ్యవలెను.

ధ్యానము.

ప్రణమదమరలోకమౌళిమాలాకుసుమరజోఽరుణపాదపద్మయుగ్మమ్,
అనవరతమనుస్మరేద్భవాన్యా సహ జగతాం పితరం పినాకపాణిమ్.

నమస్కరించుచున్న దేవతలసమూహముయొక్క శిరస్సులయందలి పూదండలపూవుల పరాగముచేఁ గెంచె మెఱ్ఱనైన కమలములవంటి పాదముల జంటగలవాఁడును (మిక్కిలి యెఱ్ఱనైన పాదములు పుప్పొడి సోఁకుటచే

నెత్తుదనము దగ్గుటవలనఁ గొంచె మెఱ్ఱని వైనవి) లోకములకుఁ దండ్రియును పినాకమను ధనుస్సు చేతం గలవాఁడును బార్వతితోఁ గూడినవాఁడునగు రుద్రు నెల్లప్పుడును ధ్యానింపవలెను. అని యర్థము. ౧౫

ఇది శ్రీమత్కవాటోపనామ సుందరరామ ప్రణీతంబగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందుఁ
బ్రథమానువాకము.

ఓం నమో భగవతే రుద్రాయ.

అథ ద్వితీయానువాకః.

సాయణీయము. భగవంతుఁడగు ప్రసిద్ధరుద్రాణధరంబగు ప్రధాన రూప మేదిగలదో, అది ప్రథమానువాకమునఁ బ్రసన్నము గావింపఁబడినది. ఇఁక లోకముల నిర్వాహమునకు హేతువులయిన యారుద్రుని లీలావిగ్రహము లేవిగలవో, వాని ప్రసాదనము, ఎనిమిదనువాకములచేఁ జేయఁబడుచున్నది. మొదటియనువాకంబున నన్నియు ఋక్కులు. ఇయ్యెనిమిదియనువాకముల కన్నియు యజుస్సులు. రెండు వాక్యములు గలది ఋక్కు ఏకవాక్యరూపము యజుస్సు నని భేదము. ఆయజుస్సులును రెండువిధములు, ఉభయతో నమస్కారములు (రెండువైపుల నమశ్శబ్దముగలవి) అన్యతరతో నమస్కారములు (ఒక వైపుననె నమశ్శబ్దములు గలవి) అని. అందు మొదటి మూఁడనువాకముల యందు ఉభయతో నమస్కారములు. అనఁగా ఆదియందును అంతమందును నమశ్శబ్దముగల వాక్య మొక్కొక యజుస్సుగాను తక్కిన యయిదింటి యందు ఆదియందు మాత్రమె నమశ్శబ్దము కలది యొక్కొక యజుస్సుగాను గ్రహింపవలెను. అందు రెండవయనువాకంబున పదుమూఁడు యజుస్సులు.

భట్టభాస్కరీయము. ప్రథమానువాకముచే భగవంతుండగు రుద్రునిఁ బ్రసన్నుంగావించి, అతం డుపసంహరించుటకు సాధనములయిన ధనురాదులను బ్రసన్నములఁ జేసి, వానిని ఉపసంహరింపం జేసి, యిఁక నెనిమిదియను వాకముల నతని విశ్వరూపమును స్తుతించుటయు నమస్కరించుటయుఁ జేయఁబడుచున్నది. అందు మొదటిమూఁడనువాకములందు నమస్కారము మొదటను అంతమునను గల వాక్యమొక యజుస్సని శాకపూణి. నమస్కారము మొదటఁగల వాక్య మొకయజుస్సు, నమస్కార మంత మందుఁగలదియు నొక యజుస్సని యాస్కుఁడు. ఎనిమిదియనువాకములును ఎనిమిది యజుస్సులని కాశకృత్స్నుఁడు. అయినను, బ్రథమ పక్షమె యవలంబింపఁబడును. అందుఁ బ్రతి యజుస్సునందును ఇద్దఱేసి రుద్రులకు స్తుతియు నమస్కారము నని యెఱుంగునది. రుద్రుఁ డొకఁడె యయినను నమస్కార ప్రవృత్తి నిమిత్తభేదముచే భేదము కల్పించి ద్విత్వ మారోపింపఁబడుచున్నది. ఒకమంత్రమునందె మూఁడునామములు చెప్పఁబడినచో నొకటి యితరమునకు విశేషణమగును. అందుఁ గొన్ని యజుస్సులు ఉభయతో నమస్కారములు, కొన్ని అన్యతరతో నమస్కారములు, వానియందు, ఉభయతో నమస్కారములు ఘోరతరములనియు, అన్యతరతో నమస్కారములు శాంతతరములనియుఁ జెప్పఁబడియున్నది. బహువచనాంత శబ్దములకు, రుద్రునిచే సృష్టులయి రుద్రసదృశులయిన రుద్రు లర్థము. రుద్రపర్యాయములు కాని వానికి తత్తదధిష్ఠానబుద్ధిచే రుద్రుఁడర్థమని తెలియునది. ఈయజుస్సుల ఛందస్సులు తత్తదక్షర సంఖ్యాక్రమముచే యథాశాస్త్రము గ్రహించునది.

---

న మో హి ర ణ్య బా హ వే సే నా న్యే ది శాం చ
ప త యే న మః.

నమః - హిరణ్యబాహవే - సేనాన్యే - దిశామ్ - చ - ప
తయే - నమః. ౧

హిరణ్యబాహవే = బంగారముచే నిర్మితములయిన భూషణములు చేతులందుఁ గలవాఁడగు, సేనాన్యే = యుద్ధములందు సేనలను నడపువాని కొఱకు, సేనాపతి రూపుఁడైన రుద్రునికొఱ కనుట, నమః = నమస్కారము అగుఁగాక. దిశామ్ = దిక్కులయొక్క, పతయేచ = పాలకుఁడైన రుద్రుని కొఱకు, నమః = నమస్కార మగుఁగాక.

బాహువులందు బంగారు భూషణములు దాల్చిన వాఁడును యుద్ధములందు సేనలను నడపువాఁడునగు రుద్రునకు నమస్కారము. దిక్కులఁ బాలించునట్టి రుద్రునకు నమస్కారము.

భ. అందు మొదట, ఎవ్వఁడును తన వస్తువునుహింసింపడని, రుద్రుఁడు విశ్వమున కంతయుఁ బతియగుటఁ బ్రతిపాదించుచు నమస్కారము సేయఁబడు చున్నది. హిరణ్యబాహవే = బంగారుసొమ్ములు చేతులందుఁ గలవాఁడగు, బాహుగ్రహణము సర్వాంగోపలక్షణము, బంగారు భూషణములు సర్వాంగములందును గలవాఁడనుట, లేక, హిరణ్యమువంటిచేతులు గలవాఁడు, బంగారు వంటి దేహము గలవాఁడనుట, లేక, హితమును రమణీయమును అగునది హిరణ్మయ మనఁబడును. అట్టిచేతులు గలవాఁడు అట్టిదేహము గలవాఁడు, భక్తుల మనస్సునకు ఆనందకరమయి వారలకు అభ్యుదయాది నిశ్శ్రేయసాంతము హితము నిచ్చునట్టి మంగళవిగ్రహము గలవాఁడనుట. సేనాన్యే = సేనల నడుపు వానికొఱకు, సేన లనఁగా సంఘాతములు (సమూహములు), దేవతలు మనుష్యులు పితరులు అసురులు రాక్షసులు పిశాచులు యక్షులు కిన్నరులు విద్యాధరులు మొదలగు భోక్తలగు చేతనులును, ప్రకృతి మొదలుకొని పృథివి

వఱకుఁ గల భోగ్యము లగు అచేతనములును, ఈరెండుసంఘాతములను నడపు వాఁడు, స్వామి యగుటచే వానికి నియామకుఁడనుట, అట్టిరుద్రునకు, నమః= నమస్కార మగుఁగాక. దిశామ్ = దిక్కులయొక్క, పతయే = పాలకుని కొఱకు, దిక్పాలాత్మకుఁడగు రుద్రుని కొఱకనుట, లేక దిక్కులకు వ్యవస్థాపకుఁ డగుటచే దిక్పతి యాదిత్యుఁడు, దేవుని కీర్తించిన పిదపఁ దదుపాసనమునకు స్థానమయిన యాదిత్యుఁడు, కీర్తింపఁబడుచున్నాఁడు. అట్టి యాదిత్యుని కొఱకు, లేక, ద్రవ్యగుణ కర్మాదులయొక్కయు ధర్మాధర్మాదులయొక్కయు వ్యవస్థలు దిక్కులనఁబడును. వానికి పతి, యనఁగా వానిని తత్తదనుగుణముగాఁ బ్రవర్తింపఁజేయువాఁడనుట, అట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కారము అగుఁగాక. ౧

---

న మో వృ క్షే భ్యో హ రి కే శే భ్యః ప శూ నాం

ప త యే న మః.

నమః - వృక్షేభ్యః - హరికేశేభ్యః - పశూనామ్ - పత

యే - నమః ౨

హరి కేశేభ్యః=పచ్చ వన్నెగల వెండ్రుకలుగల, ఆకులు అను వెండ్రుకలు గల యనుట, వృక్షేభ్యః = వృక్షములకొఱకుఁ వృక్షరూపులగు రుద్రుల కొఱకు ! నమః నమస్కారము అగుఁగాక. పశూనామ్ = పశువులయొక్క, పతయే = పాలకునికొఱకు, నమః = నమస్కారమగుఁగాక.

హారితవర్ణములగు పత్త్రము లనువెండ్రుకలుగలిగి వృక్షరూపులగురుద్రులకు నమస్కారము, పశుపతి యగు రుద్రునకు నమస్కారము.

భ. హరికేశేభ్యః=హరితవర్ణములయిన పత్త్రరూపములగు వెండ్రుకలుగల, వృక్షేభ్యః=వృక్షరూపులగు రుద్రులకొఱకు, లేక, వృక్షములందుండు రుద్రుల కొఱకు, మంచము లఱచుచున్నవి యనునట్లు, తద్గతులకుఁ దద్భావ వ్యపదేశము, లేక, వృక్షములవంటివి కావున బ్రహ్మాది పిపీలికాంతములగు చేతనవర్గములు వృక్షము లనఁబడుచున్నవి. ఎట్లనఁగా, బ్రహ్మాండమును భూమియందుఁ బుట్టినవి, మఱియు, వృశ్చ్యన్తే, ఇతివృక్షాః, ఛేదింపఁబడునవి వృక్షము లనఁబడును, నాశవంతము లనుట, నశించునట్టి యుపాధిగల బ్రహ్మాది పిపీలికాంతచేతన వర్గరూపులగు రుద్రులకొఱకు, నమః = నమస్కార మగుఁగాక. పశూనామ్= ద్విపదములు, చతుష్పదములును అగు బ్రహ్మాది స్థావరాంత పశువులయొక్క, పతయే = ప్రభువుకొఱకు, "బ్రహ్మాద్యాస్థావరాన్తాశ్చ పశవః పరికీర్తితాః" అనిస్మృతి. నమస్కార మగుఁగాక.

హరితవర్ణములగు కేశములు గలవారలును, వృక్షము లందుండు వారలునగు రుద్రులకు, లేక, వృక్షములవలె జన్మ నాశములుగల బ్రహ్మాది పిపీలికాదులకు ఆత్మయయిన రుద్రులకును, పశుపతియగు రుద్రునకును నమస్కారము. ౨

---

నమ స్సస్పిఞ్జరాయ త్విషీమతే పథీనాం పతయే నమః.

నమః - సస్పిఞ్జరాయ - త్విషీమతే - పథీనామ్ - పతయే- నమః. 3

సస్పిఞ్జరాయ = లేఁతకసవువలె నెఱుపుగలసిన పసపువన్నె గలవాఁడగు, త్విషీమతే=అధికమయిన కాంతిగల రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁ

గాక. పథీనామ్=మార్గములకు, శాస్త్రోక్తములయిన దక్షిణోత్తర తృతీయమార్గములకు, కర్మఠులకుఁ జెప్పఁబడిన పునరావృత్తి సహితమయిన ధూమాదిమార్గము ఉపాసకులకుఁ జెప్పఁబడిన పునరావృత్తి రహితమయిన అర్చిరాది మార్గము జ్ఞానికిఁ జెప్పఁబడిన బ్రహ్మైక్యభావరూప విదేహముక్తి లక్షణమయిన మార్గమును అనుమూఁడుమార్గములకును అనుట, పతయే=పాలకుఁడగు రుద్రునికొఱకు, నమః=నమస్కారము.

లేఁతకసవువలె నెఱుపుగలసిన పసపువన్నె గలవాఁడును, మహాతేజుఁడు నగు రుద్రునకు నమస్కారము, శాస్త్రమునందుఁ జెప్పఁబడినపితృయానమార్గమును దేవయానమార్గమును విదేహముక్తిని నియమించినవాఁ డగురుద్రునకు నమస్కారము.

౯. సస్పింజరాయ=లేఁతగడ్డివలె రక్తపీతవర్ణముగల, లేక, స్పాభక్షణే అను ధాతువువలన వర్ణవ్యత్యయముచే సస్పియని నిష్పన్నమగుచున్నది. సస్పులనఁగా భక్షణస్వభావు లగురాక్షసులు మొదలయినసన్మార్గద్వేషులు చెప్పఁబడుచున్నారు. వారలను జీర్ణింపఁజేయువాఁడు, అట్టి, త్విషీమతే = అధికమయిన కాంతి గలవాఁడు, లేక, స్వయంప్రకాశరూపుఁడు, అట్టి రుద్రునికొఱకు, నమః=నమస్కారమగుఁగాక. పథీనామ్=లౌకికములు వైదికములు నగుసన్మార్గములకు, లేక, అర్చిరాదిమార్గము మొదలగుమార్గములకు, పతయే=ప్రవర్తింపఁజేయునట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక.

లేఁతగడ్డివలెఁ రక్తపీతవర్ణము గలిగి మహాతేజుఁ డగు రుద్రునకు నమస్కారము (రాక్షసులు మొదలగు సన్మార్గద్వేషుల నశింపఁజేయునట్టి స్వయంప్రకాశస్వరూపుఁ డగు రుద్రునకు నమస్కారము). లౌకిక వైదికములగు సన్మార్గముల లోకము నందుఁ బ్రవర్తింపఁ జేయునట్టి రుద్రునకు నమస్కారము (ఉపాస

కులు మొదలగువారిని వారియోగ్యతకుఁ దగునట్లు దేవయానము మొదలగు మార్గములం దీసికొని పోవునట్టి రుద్రునకు నమస్కారము.) 3

---

న మో బ భ్లు శా య వి వ్యా ధి నే ఽ న్నా నాం
ప త యే న మః.

నమః - బభ్లుశాయ - వివ్యాధినే - అన్నానామ్ - పతయే - నమః ४

బభ్లుశాయ = వృషభమునందు శయనించువాఁడు, వృషభముమీఁదఁ గూర్చుండినవాఁ డనుట, అగు, వివ్యాధినే=శత్రువులను విశేషించి గొట్టునట్టి రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. అన్నానామ్ = అన్నములకు, పతయే=పాలకుఁ డగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

వృషభముమీఁదఁ గూర్చుండినవాఁడై శత్రువులను విశేషించి బాణములచేఁ బ్రహరించునట్టి రుద్రునకు నమస్కారము, ప్రాణులకు జీవనాధారమయిన సర్వవిధము లగు నన్నములకు నాథుఁ డగు రుద్రునకు నమస్కారము.

భ. బభ్లుశాయ = కపిలవర్ణము గలసిన గోరోజనపువన్నె గలవాఁడగు, లేక, బభ్రు వనఁగా భరించునది కావున వృషభము, శవర్ణము మత్వర్థీయము, రేఫమునకు లకారము, వృషభము గలవాఁడు, లేక, బభ్లౌశేతే=వృషభమునందు శయనించువాఁడు, అగు, వివ్యాధినే = ఆఁకలి మొదలగురూపమున మిక్కిలి పీడించునట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. అన్నానామ్ = అన్నములకు, భుజింపఁదగిన యోషధులకనుట, పతయే=స్వామియగు రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక.

కపిల పింగలవర్ణము గలవాఁడై [వృషభారూఢుఁడై], జనులకు ఆఁకలి మొదలగుబాధను గలిగించునట్టి రుద్రునకు నమస్కారము. మఱియు భుజింపఁదగినట్టి యోషధుల కంతయు నాథుఁ డగురుద్రునకు నమస్కారము. ౪

---

న మో హ రి కే శా యో ప వీ తి నే పు ష్టా నా ం
ప త యే న మః.

నమః - హరికేశాయ - ఉపవీతినే - పుష్టానామ్ - పతయే-
నమః. ౫

హరికేశాయ = నల్లని వెంద్రుకలుగలవాఁ డగు, నరపులేనివాఁడనుట, ఉపవీతినే=మంగళము కొఱకు యజ్ఞోపవీతముగల రుద్రునికొఱకు, నమః=నమస్కారము. పుష్టానామ్=పరిపూర్ణులకు పరిపూర్ణము లయినగుణములు గలపురుషులకనుట, పతయే=నాథుఁ డగురుద్రునికొఱకు, నమః = నమస్కారమగుఁ గాక.

ఎంతమాత్రము నరపులేక నల్లనివెంద్రుకలు గలవాఁడై మంగళార్థము యజ్ఞోపవీతము ధరించినవాఁ డగురుద్రునకు నమస్కారము. పరిపూర్ణములగు సద్గుణములుగల పురుషులకు నాథుఁ డగురుద్రునకు నమస్కారము.

భ. హరికేశాయ=నల్లనివెంద్రుకలు గలవాఁడగు, నిత్యమయిన యౌవనము గలవాఁడనుట, ఉపవీతినే=మంగళాచారముకొఱకు యజ్ఞోపవీతముగల రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. పుష్టానామ్=పరిపూర్ణగుణులకు,

లేక, పుష్టము లనఁగా పుష్టులు, అవి, వాక్పుష్టి జ్ఞానపుష్టి శరీరేంద్రియపుష్టి గృహక్షేత్రపుష్టి ధనధాన్యపుష్టి ప్రజాపుష్టి పశుపుష్టి గోపుష్టి ధర్మపుష్టి అణిమాదిపుష్టి యని పది, వానికి, పతయే=పాలకుఁడగు రుద్రునికొఱకు, నమః= నమస్కార మగుఁగాక.

నిత్యయౌవనము గలవాఁ డగుటచే నల్లని వెండ్రుకలతో నొప్పువాఁడును మంగళాచారము ననుసరించి యజ్ఞోపవీతము దాల్చినవాఁడు నగురుద్రునకు నమస్కారము. వాక్పుష్టి మొదలగు దశవిధ పుష్టులకు పాలకుఁ డగురుద్రునకు నమస్కారము. ౫

న॒మో॒ భ॒వస్య॑ హే॒త్యై జ॑గ॒తాం॒ పత॑యే॒ న॒మః.

నమః - భవస్య - హేత్యై - జగతామ్ - పతయే - నమః. ౬

భవస్య=సంసారమునకు, హేత్యై=ఆయుధ మయినరుద్రునికొఱకు, సంసారము ఛేదించునట్టి రుద్రునికొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక. జగతామ్ = లోకములకు, పతయే = పాలకుఁడగురుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక.

సంసారము ఛేదించునట్టి రుద్రునకు నమస్కారము, సర్వలోకములకుఁ బాలకుఁ డయినరుద్రునకు నమస్కారము.

భ. భవస్య=సంసారముయొక్క, హేత్యై=హింసకొఱకు, సంసారము చేయునట్టి హింస యేదిగలదో తద్రూపుఁడయినరుద్రుని కొఱకనుట, నమః=నమ

స్కార మగుఁగాక. జగతామ్=పృథివి మొదలగులోకములకు, పతయే=పాలించు వాఁడగురుద్రునకు, నమః=నమస్కార మగుఁగాక.

సంసారమునందుఁ బ్రాణులను దుఃఖపఱచు రుద్రునకును దుఃఖితులగువారి రక్షించువాఁడగురుద్రునకును నమస్కారము.

నమో హిరణ్య బాహవే యనునది మొదలగు నైదుమంత్రములచే పంచబ్రహ్మలయొక్క అయిదువర్ణములను వేఱువేఱుగాఁ బ్రతిపాదించి, యాఱవది యగు నీమంత్రముచే సంసార నాశకుం డగు పంచవక్త్రుఁడు ప్రతిపాదింపఁబడుచున్నాఁడని కొందఱు వచింతురు. ౬

---

న మో రు ద్రా యా ౨౨ త తా వి నే క్షే త్రా ణా ం
ప త యే న మః.

నమః - రుద్రాయ - ఆతతావినే - క్షేత్రాణామ్ - పత
యే - నమః. ౭

ఆతతావినే-ఆతత=విరివిచేయఁబడిన ధనుస్సుచేత, అవినే=రక్షించువాఁడగు, మోపెట్టఁబడిన ధనుస్సుచేత శత్రువులసంహరించి భక్తులరక్షించువాఁడనుట, రుద్రాయ=రుద్రునికొఱకు, నమః=నమస్కారము అగుఁగాక. క్షేత్రాణామ్=పరిమడులకు, పతయే=పాలకుఁ డగురుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

మోపెట్టిన ధనుస్సుచే భక్తులకు శత్రువు లయినవారిని సంహరించి భక్తులఁ గాపాడునట్టి రుద్రునికొఱకు నమస్కారము. పరిమడులఁ బాలించునట్టి రుద్రునికి నమస్కారము.

భ. ఆతతఅవినే = మోపెట్టఁబడిన యల్లెత్రాడుగల ధనుస్సుచే లోకములనురక్షించునట్టి, లేక, ఆట్టిధనుస్సును ధరించువాఁడు, లేక, ఆట్టిధనుస్సుగలవాఁడు, అగు, రుద్రాయ, నమః. క్షేత్రాణామ్ = శరీరములకు, పతయే = రక్షించువాఁడు, లేక ప్రభువు, అయినరుద్రునికొఱకు, అట్లు, "ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి, భ్రామయం సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" అర్జునా! సంసారయంత్రము నెక్కిన సమస్తభూతములను మాయచేఁ ద్రిప్పుచు ఈశ్వరుఁడు సమస్తభూతముల హృదయ ప్రదేశమునం దున్నాఁడు. అని భగవద్వాక్యము, లేక, క్షేత్రాణామ్ = అవిముక్తము మొదలగు పుణ్యస్థలములకు, పతయే = ప్రభువయిన రుద్రుని కొఱకు, నమః.

ఎక్కుపెట్టఁబడిన ధనుస్సుచే దుష్టులసంహరించి లోకముల రక్షించునట్టి రుద్రునకు (అట్టి ధనుస్సును ధరించువాఁడు, లేక, అట్టి ధనుస్సు గలవాఁడగురుద్రునికి) నమస్కారము. సమస్త శరీరములందు హృదయప్రదేశమునందుండి తత్తత్కర్మంబుల నియమించువాఁడు (పుణ్యక్షేత్రముల నేల్లఁ బాలించువాఁడు) అగు రుద్రునకు నమస్కారము. ౭

---

న మ స్సూ తా యా ఽ హ న్త్యా య వ నా నాం
ప త యే న మః.

నమః - సూతాయ - అహన్త్యాయ - వనానామ్ - పతయే- నమః. ౮

సూతాయ = సారథియును, అహన్త్యాయ = వధించుటకు నలవిగానివాఁడు నగురుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. వనానామ్ =

**అడవులయొక్క, పతయే = పాలించువాఁ డగురుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక.**

సారథిరూపుఁడును శత్రువులను వధింప నలవిగానివాఁడు నగురుద్రునకు నమస్కారము, వనముల కధిపతియయిన రుద్రునకు నమస్కారము.

**భ. సూతాయ = సారథియు, జగత్తనురథమును నడపువాఁ డనుట, లేక, పురాణము చెప్పువాఁడు, యుగాదియందుఁ బురాణములు సృజించువాఁ డనుట, లేక, సుత మనఁగా యజ్ఞాగము ఖండింపఁబడినసోమలత, దీర్ఘము ఛాందసము, సోమలతాస్వరూపుఁ డనుట, అగు, అహన్త్యాయ=వధింప నశక్యుఁడు, జ్యోతిస్వరూపుఁ డనుట, లేక అహమేవసర్వమ్ అనుదాని భావము అహంతా దాని యందుఁ గలుగువాఁడు, సర్వాత్మైక్య జ్ఞాన స్వరూపుఁడనుట, అట్టి, రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. వనానామ్ = అడవులకు, శ్మశానము మొదలగు వివిక్తప్రదేశముల కనుట, పతయే = స్వామియగురుద్రునికొఱకు, నమః.**

జగత్తు అనురథమునకు సారథి యయినవాఁడును, (యుగాదియందుఁ బురాణంబులు సృజించువాఁడును, లేక, సోమలతాస్వరూపుఁడును) వధించుటకు నలవిగాని ఆత్మజ్యోతిస్వరూపుఁడును (సర్వాత్మైక్యజ్ఞానస్వరూపుఁడు) నగు రుద్రునకు నమస్కారము, శ్మశానము మొదలగు వివిక్తప్రదేశములకు నాథుఁ డగురుద్రునకు నమస్కారము. ౮

న మో రో హి తా య స్థ ప త యే వృ క్షా ణా ం
ప త యే న మః.

నమః - రోహితాయ - స్థపతయే - వృక్షాణామ్ - పతయే - నమః. ౯

రోహితాయ=ఎఱ్ఱనివన్నె గలవాఁడును, స్థపతయే=ప్రభువునైన రుద్రునికొఱకు, నమః = నమస్కారము అగుఁగాక. వృక్షాణామ్ = వృక్షముల యొక్క, పతయే=పాలకుఁ డగురుద్రునికొఱకు, నమః=నమస్కారమగుఁగాక.

ఎఱ్ఱనివన్నము గలవాఁడును బ్రభువు నగురుద్రునికి నమస్కారము, వృక్షములఁ బాలించునట్టి రుద్రునికి నమస్కారము.

భ. రోహితాయ = ఎఱ్ఱనివన్నె గలవాఁ డగు, లేక, రో = వాచక మగుశబ్దమునకు, హితాయ = అనుకూలుఁడు, లేక, వాచకశబ్దమునందు, హితాయ = ఉంచఁబడినవాఁడు, వాచ్యరూపమున నుండువాఁ డనుట, అగు, స్థపతయే = గృహములు మొదలగునవి చేయువాని కొఱకు, లేక, సర్వత్ర స్థాతాచ సర్వస్య పాతాచ స్థపతిః, అంతట నుండువాఁడును అన్నిటినిరక్షించువాఁడు నగురుద్రునికొఱకు, నమః. వృక్షాణామ్=వృక్షములయొక్క, పతయే=పాలకుఁ డగురుద్రునికొఱకు, నమః.

రక్తవర్ణుఁడును, (వాచకరూప మగుశబ్దమునందు వాచ్యరూపమున నున్నవాఁడును) శిల్పియు (అంతటనుండి యన్నిటిని రక్షించువాఁడు) నగురుద్రునకు నమస్కారము, వృక్షములఁ బాలించునట్టి రుద్రునకు నమస్కారము. ౯

న మో మ న్త్రి ణే వా ణి జా య క క్షా ణాం ప త యే న మః.

నమః - మన్త్రిణే - వాణిజాయ - కక్షాణామ్ - పతయే -
నమః. ౧౦

**మన్త్రిణే** = ఆలోచనము గలవాఁడును, రాజసభలయందు మంతనము చేయుటయందు సమర్థుఁ డనుట, మంత్రిరూపమున నుండువాఁ డని భావము. **వాణిజాయ** = వర్తకులకు దొర యగురుద్రునికొఱకు, **నమః** = నమస్కార మగుఁగాక. **కక్షాణామ్** = వనమునందలి గుల్మములు (బోదెలేనిచెట్లు) మొదలగు వానికి, **పతయే**=పాలించు రుద్రునికొఱకు, **నమః** = నమస్కార మగుఁగాక.

రాజసభలయందు మంత్రిరూపమున నున్నవాఁడును, వర్తకులకు దొరయు నగురుద్రునికి నమస్కారము, వనమునందలి గుల్మములు మొదలగు వానికి నాథుఁ డగు రుద్రునికి నమస్కారము.

భ. **మన్త్రిణే** = పంచబ్రహ్మాది మంత్రములు గలవాఁడును, వానిచేఁ బ్రతిపాద్యుఁ డనుట, లేక, మంత్రము లనఁగా గుప్తముగాఁ జెప్పఁ దగినవి- ఉపనిషత్తులు, అవి గలవాఁడు, వానిచేఁ బ్రతిపాదింపఁబడువాఁ డనుట, లేక సప్తకోటి మహామంత్రములు గలవాఁడు, వానికి వాచ్యుఁ డనుట, అగు, **వాణిజాయ** = వర్తకుని కొఱకు, లేక వర్తకునివంటివాఁడు, ఎట్లు వర్తకుఁడు దేశము నందలి సర్వ వ్యవహారవిషయములను విచారించునో, అట్లు సమస్తకర్మలను విచారించువాఁడు, సర్వకర్మసాక్షి యనుట, లేక, వణిక్కునందు నుండువాఁడు. వర్తకునియందు వ్యవహారరూపమున నుండువాఁడనుట, లేక, **వాణి** = వాక్కునందు, **జాయ** = పుట్టినవాఁడు, వాచకరూపమయినవాక్కునందు వాచ్యరూపమున నుండువాఁ డనుట, హ్రస్వము ఛాందసము, అట్టి రుద్రునికొఱకు, **నమః** = నమస్కారము అగుఁగాక. **కక్షాణామ్** = పర్వతములు నదులు నదములు గుహలు గుల్మములు మొదలగునవి కక్షములు, వానికి, లేక, అందుందుజంతువులకు-

పతయే = పాలకునికొఱకు, లేక, కక్షము లనఁగా, గహనదేశములు, ధర్మా
ధర్మాదు లగు గహనవిషయములనుట, వానికిఁ బ్రభు వయినరుద్రునికొఱకు,
నమః. ౧౦.

---

న మో భు వ న్త యే వా రి వ స్కృ తా యౌ ష
ధీ నా ం ప త యే న మః.

నమః - భువన్తయే - వారివస్కృతాయ - ఓషధీనామ్ -
పతయే - నమః. ౧౧

భువన్తయే = భూమిని విస్తరిల్లఁ జేయువాఁడును, వారివస్కృతాయ = ధనము చేయువాఁడు నగురుద్రునికొఱకు, నమః = నమస్కారము అగుఁగాక. ఓషధీనామ్ = ఓషధులకు, పతయే = నాథుఁ డగురుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక.

భూమిని బోషించువాఁడును ధనమును గల్పించువాఁడు నగురుద్రునకు నమస్కారము, ఓషధులకుఁ బ్రభువైన రుద్రునకు నమస్కారము.

భ. భువన్తయే = ప్రపంచమునకు ఆధారమయినవాఁడు, విశ్వమస్మిన్ భవతి యని వ్యుత్పత్తి, లేక, సర్వదా సర్వత్ర భవతి, ఎల్లప్పుడును ఎల్లయెడల నుండువాఁడు, లేక, భువంతనోతి, భూమిని విస్తరిల్లఁ జేయువాఁడు, భూమి యందలి తృణము గుల్మములు ఓషధులు వృక్షములు మొదలగువానిఁ బెంచువాఁడనుట. వారివస్కృతాయ = ధనము చేయువాఁడును, వరివః ధనమ్ కరోతీతి, వరివస్కృత్, వరివస్కృ దేవవారివస్కృతః అని వ్యుత్పత్తి, లేక, వరివస్కృతామ్ అయమ్, ధనము సంపాదించువారలకు సంబంధి, సహాయుఁ

డనుట, లేక, వరివః అనఁగా సేవ, అది చేయువారలు వరివస్కృత్తులు భక్తులు, వారికిసంబంధి, వారియందుఁ బ్రీతిగలవాఁడు, భక్తవత్సలుఁ డనుట, లేక, వారిణిజలేవాసఃకృతోయేనతస్మై, జలమునందు వాసము చేసినవాఁడు, నారాయణరూపుఁడు, లేక, వరుణరూపుఁ డనుట, అట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. ఓషధీనామ్ = పండువఱకు నుండునట్టివానికి, ఫలించిన తోడనే నశించునట్టి యరఁటి మొదలగు వృక్షముల కనుట, పతయే = పాలకుఁ డగు రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. ౧౧

---

న మ ఉ చ్చై ర్ఘో షా యా ౽౽ క్ర న్ద య తే ప
త్తీ నా ం ప త యే న మః

నమః - ఉచ్చైర్ఘోషాయ - ఆక్రన్దయతే - పత్తీనామ్ -
పతయే - నమః. ౧౨

ఉచ్చైఃఘోషాయ = గొప్పదైన ధ్వనిగలవాఁడును, ఆక్రన్దయతే = శత్రువులను ఏడ్పించువాఁడు నగురుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. పత్తీనామ్ = పాదచారు లగుభటులకు, పతయే = ప్రభు వగురుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక.

యుద్ధకాలమునందు గొప్పధ్వని గలవాఁడును శత్రువుల నేడ్పించువాఁడు నగు రుద్రునికి నమస్కారము. పదాతిసైన్యములకుఁ బ్రభువయిన రుద్రునికి నమస్కారము.

భ. ఉచ్చైఃఘోషాయ = గొప్పశబ్దము గలవాఁడు, లేక, గొప్పస్తోత్రము గలవాఁడు, లేక, గొప్పశబ్దముగల మేఘాదులరూపము గలవాఁడు,

ఆక్రన్దయతే = యుద్ధమునందుఁ బిలుచుటను జేయించువాఁడు, శూరు లొకరి నొకరుపిలుచుటకుఁ గారణ మయినవాఁడు, వారియందు శౌర్యమురూపమున నున్నవాఁడనుట, లేక, శత్రువులను ఏడ్పించువాఁడు, జయము గలిగించువాఁడనుట, అట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. పత్తీనామ్ = "ఏకోరథో గజశ్చైకో నరాః పంచపదాతయః, త్రయశ్చ తురగాస్తజ్ఞైః పత్తిరి త్యభిధీయతే" ఒకరథమును ఒకయేనుఁగును అయిదుగురుకాలిబంటులును మూఁడుగుఱ్ఱములును జేరిన సేనాభాగము పత్తియని చెప్పఁబడును, అనిచెప్పఁబడిన పత్తియను సేనాభాగములకు, సర్వవిధము లయినసేనల కనుట, పతయే = స్వామియగు రుద్రునికొఱకు, లేక, పత్తీనామ్‌పతయే=కాలిబంటులకు పాలకుఁడగురుద్రునికొఱకు, పదాతిరూపమున సర్వలోకములను జయింపఁజాలినట్టి రుద్రునికొఱ కనుట, నమః = నమస్కార మగుఁగాక. ౧౨

---

న మః కృ త్స్న వీ తా య ధా వ తే స త్త్వ నా ం
ప త యే న మః.

నమః - కృత్స్నవీతాయ - ధావతే - సత్త్వనామ్ -
పతయే - నమః. ౧3

ఇతి శ్రీమద్యజుస్సంహితాయాం చతుర్థకాణ్డే పఞ్చమ
ప్రపాఠకే, ద్వితీయోఽనువాకః.

---

కృత్స్నవీతాయ కృత్స్న = ఎల్లసైన్యము, వీతాయ = పరివేష్టింపఁబడినదిగాఁ గలవాఁడును, సమస్తసైన్యములను దాను బరివేష్టించియుండువాఁడనుట, ధావతే = పరుగెత్తుచున్నవాఁడును, పరుగెత్తుచున్న శత్రుసైన్యముల

వెంబడించి తఱుమువాఁడు ననుట, అగు రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. సత్త్వనామ్ = శరణాగతు లగుసాత్త్వికులకు, పతయే = పాలకుని కొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

సైన్యములనంతయుఁ బరివేష్టించియుండువాఁడును శత్రుసేనలు పరుగెత్తునపుడు వాని వెంటనంటి తఱుమువాఁడు నగు రుద్రునికొఱకు నమస్కారము, శరణాగతులగు సాత్త్వికులను బాలించునట్టి రుద్రునకు నమస్కారము.

భ. కృత్స్నవీతాయ - కృత్స్న=సమస్తశరీరమును, వీతాయ=కప్పఁబడినదిగాఁ గలవాఁడు, సమస్తశరీరమును కంచుకాదులచేఁ గప్పికొనియుండువాఁడనుట, లేక, కృత్స్న = సమస్తజగత్తును, వీతాయ = భక్షింపఁబడినదిగాఁ గలవాఁడు, ప్రలయకాలమునందు సమస్తజగత్తును, భక్షించువాఁడనుట, లేక, కృత్స్న=ఎల్లజగత్తుచేత, వీతాయ = వీగతివ్యాప్తి ప్రజనకాన్త్యసనఖాదనేషు అనుటచే, పొందఁబడినవాఁడును, వ్యాపింపఁబడినవాఁడును, బుట్టినవాఁడును, కోరఁబడినవాఁడును, వేయఁబడినవాఁడును, భక్షింపఁబడినవాఁడును, ఈరూపములుగలవాఁడుననుట, లేక, 'కృత్స్నేత్మ నావతిష్ఠతే' జగత్తంతయు నష్టము కాఁగా, తాను సర్వాత్మరూపముచే నుండువాఁడు, దృశ్య ప్రపంచమంతయుం నష్టమగునపుడు తదధిష్ఠాన సత్తాస్వరూపుఁడయిన తానుమాత్రము శేషించువాఁడనుట, ధావతే=శీఘ్రముగాఁ నడచువాఁడును, లేక, శీఘ్రముగా ననుగ్రహించువాఁడును, లేక, భక్తులపాపములను కడుగువాఁడును, భక్తులపాపములను బోఁగొట్టువాఁడుననుట, అట్టిరుద్రునికొఱకు, నమః = నమస్కారమగుఁగాక. సత్త్వనామ్=ప్రమథగణములకు, పతయే=ప్రభు వగురుద్రునికొఱకు, నమః= నమస్కార మగుఁగాక. ౧3

ఈయనువాకమునకు ఋషి మండూకుఁడు, ఛందస్సు మహాగాయత్రి, దేవత రుద్రుఁడు. ఇఁకఁ బురశ్చరణము, అర్ధకృచ్ఛ్రము గావించి చరువు భుజించుచు నెనిమిదివేలు జపము సేయునది. పూర్ణ మగువఱకు సంధ్యా కాలములయందు శివాలయమునకుఁ బదునొకండు ప్రదక్షిణములు సేయుచుండునది. జపము ముగిసినపిమ్మట శివునిఁ బూజించి తత్సన్నిధానమునఁ బదునొకండుగురు బ్రాహ్మణుల భుజింపఁ జేసినచోఁ బురశ్చరణ మగును.

ఇఁకఁ బ్రయోగము. దీనిచే రాజులకుఁ జెప్పఁబడుచున్నది. శత్రువుల మారణము కోరువాఁడు, ప్రతి ఋతువునందును తైలముచేఁ దడుపఁబడిన యెఱ్ఱ యావలు పదివేలు హోమము సేయునది. అందుచే శత్రువులు నశింతురు. ఆవపిండిచే దేవునకు లేపనముచేసి శత్రువు పేరు చెప్పుచు నెనిమిదివేలు జపించునది, పదునొకండురాత్రులలో శత్రురాజులకు మహాజ్వరముకలుగును, దానిచేతనే వారలు నశింతురు. యుద్ధము సమీపించినపుడు దేవునిమీఁదఁ బసుపుబొట్టుముగప్పి, తాను శుద్ధుఁడై కుడిచేతియంగుష్ఠముచే దాని స్పృశించుచు, అనువాకాంతమున "గచ్ఛ" హ్మ్రు అని చెప్పుచు నెనిమిదివే లైదుదినములు జపము సేయవలెను. శత్రురాజున కుచ్చాటనమగును. వశీకరణము గోరువాఁడు మధుఘృతంబులచేఁ దడుపఁబడిన పాలాశములు (మోదుగు) గాని అశ్వత్థములు (రావి) గాని వైకంకతములు (ములువెలమ) గాని అపామార్గములు (ఉత్తరేను) గాని సమిధలు పదివేలు వేల్చునది. క్రమముగా బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులు వశంగతు లగుదురు. రాజ్యము గోరునట్టిరాజు, తేనెచేఁ దడుపఁబడిన తెల్లగలువలు చెంగలువలు నల్లగలువలు పదివేలు వేల్వవలయును. రాజ్యలక్ష్మిని పొందును. సంపద గోరువాఁ డగునేని, కమలములు పదివేలు హోమము సేయునది శ్రీమంతుఁడగును. ధారణాశక్తి గలబుద్ధిని గోరువాఁడు కపిలగోవునేతిచేఁ దడుపఁబడిన పలాశపుష్పములు పదివేలు వేల్చునది. మేధావియగును. శత్రువుల జయింపఁగోరినవాఁడు పదొకండువేల యావృత్తు

లీయనువాకము జపించినచో నతనికి శత్రువులు పరాజితు లగుదురు. ప్రతి దినమును నూటయెనిమిదిగాని యిరువదియెనిమిదిగాని యావృత్తులు జపపూర్వక ముగాఁ బ్రదక్షిణనమస్కారములు యావజ్జీవము సేయునతఁడు, ఈలోకమున సుఖ మనుభవించి యంతమునం గైలాసముఁ బ్రాప్తించును.

## ధ్యానము.

ముక్తాలంకృతసర్వాఙ్గ మిన్దుగఙ్గాధరం హరమ్,
ధ్యాయే త్కల్పతరో ర్మూలే సమాసీనం సహో మయా.

ముత్తెములచే నలంకరింపఁబడిన సర్వావయవములును గలవాఁడును, జంద్రుని గంగను ధరించినవాఁడును, బార్వతితోఁ గూడఁ గల్పవృక్షముః క్రిందఁ గూర్చుండినవాఁడు నగుహరుని ధ్యానించునది. అని దీని యర్థము.

ఇది శ్రీమ త్కవాటోపనామ సుందరరామప్రణీతం బగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందు ద్వితీయానువాకము.

---

## ఓం నమో భగవతే రుద్రాయ
## అథ తృతీయానువాకః.

ద్వితీయాను వాకమునఁ బదుమూఁడు యజుస్సు లుభయతో నమ స్కారములు చెప్పఁబడినవి. ఇఁక, నట్టివే తృతీయాను వాకమునఁ బదునేడు యజుస్సులు చెప్పఁబడును.

---

నమ స్సహమానాయ నివ్యాధిన ఆవ్యాధి
నీనాం పతయే నమః.

నమః - సహమానాయ - నివ్యాధినే - ఆవ్యాధినీనామ్ -
పతయే - నమః ౧

సహమానాయ = శత్రువులను లోఁబఱచుకొనువాఁడును, నివ్యాధినే = శత్రువులను మిక్కిలి కొట్టువాఁడునగు రుద్రునికొఱకు, నమః = నమస్కారము అగుఁగాక. ఆవ్యాధినీనామ్ = అంతటను కొట్టునట్టి శూరసేనలకు, పతయే = పాలకుఁడగు రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక.

శత్రువులను జయించువాఁడును అధికముగా కొట్టువాఁడునగు రుద్రునకు నమస్కారము, అన్ని ప్రదేశములందును వ్యాపించి శత్రువులను బ్రహారించునట్టి శూరసేనలఁ బాలించువాఁడగు రుద్రునకు నమస్కారము.

భ. క్రిందటి యనువాకమునందు దేవుఁడు ద్రవ్యములకు నధిపతి యనుట ప్రతిపాదింపఁబడినది. ఈయనువాకమునఁ గర్మలకు నధిపతి యనుట ప్రతిపాదింపఁబడును.

సహమానాయ = తనకంటె వ్యతిరిక్తమగు సమస్తమును లోఁబఱచుకొనువాఁడును, లేక, ఓర్పువాఁడును, భక్తు లపరాధములు చేసినను క్షమించువాఁడుననుట, నివ్యాధినే = మిక్కిలి కొట్టుట స్వభావముగాఁ గలవాఁడును, అపరాధము చేయకున్నను భక్తులు గానివారలను మిక్కిలి పీడించువాఁడుననుట, అట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. ఆవ్యాధినీనామ్ = ఎదురుకొనివచ్చి, లేక, అంతటను కొట్టు స్వభావముగల సేనలకు, అంతటను వ్యాపించి భక్తులుగాని వార లెచ్చటనున్నను బాధించు సేనలకు అనుట, పతయే = స్వామియగు రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. ౧

నమః కకుభాయ నిషఙ్గిణే స్తేనానాంపతయే నమః.

నమః - కకుభాయ - నిషఙ్గిణే - స్తేనానాం - పతయే -
నమః. ౨

కకుభాయ = ఏఱు మద్దిచెట్టు వంటివాఁడును, దానివలెఁ బొడవైన వాఁడనఁగా ప్రధానభూతుఁ డనుట, నిషఙ్గిణే = ఖడ్గము గలవాఁడు నగు రుద్రునికొఱకు, నమః = నమస్కారమగుఁగాక. స్తేనానామ్ = గుప్తచోరులకు, రహస్యపు దొంగలకు, రహస్యముగా దొంగిలించువారల కనుట, పతయే = పాలకుఁడగు రుద్రుని కొఱకు, నమః = నమస్కారమగుఁగాక. రుద్రుఁడు విలాసార్థము నటునివలె నయ్యాయి వేషములు ధరించును కావున దొంగలకుఁ బాలించువాఁడని చెప్పఁబడినది, లేక, రుద్రుఁడు సమస్త జగదాత్మకుఁ డగుట వలన, ఎవ్వ రెచ్చట నెట్లుందురో, అతం డచ్చట నారూపమున నుండును కావున, రుద్రుఁడు సర్వాత్మకుఁ డనుట ననుసంధించుటకై స్తేనపతిత్వాదులు మంత్రములం జెప్పఁబడుచున్నవి. స్తేనాదిశరీరములందు రుద్రుఁడు, జీవ రూపము ఈశ్వరరూపము నను రెండు రూపములచే నుండును. అందు జీవరూప మేదిగలదో, అది స్తేనాది శబ్దములకు వాచ్యార్థము. ఆజీవుఁడే చౌర్యాది దోషమువలన శాస్త్రములంపు నిందనీయుఁడు. ఇఁక ఈశ్వరరూప మేదిగలదో అది స్తేనాదిశబ్దములకు లక్ష్యార్థము. అట్టి స్తేనాది శరీరగతుఁడైన యీశ్వరు ననుసంధించుట పాపక్షయహేతు వగుటవలనఁ బరమపురుషార్థమగును. కావున, ఈశ్వర రూపమగు లక్ష్యార్థము వివక్షించి మంత్రములందు స్తేనాది లౌకిక శబ్దములు ప్రయోగింపఁబడునని తెలియవలెను. "శాఖాగ్రమునందుఁ జంద్రుఁ డున్నాఁడు" ఇత్యాదుల యందువలె లక్షకశబ్దముయొక్క వాచ్యార్థముమూల మున లక్ష్యార్థము బాలురకేనియు శీఘ్రమునఁ జక్కఁగాఁ దెలియ నలవియగును. కావున, లక్ష్యార్థమె వివక్షితమయ్యును, సుఖబోధమునకు మార్గ మగుటచే ముఖ్యార్థవాచకములగు శబ్దములు ప్రయోగింపఁబడుచున్నవి.

సర్వదేవతలందుఁ బ్రధానభూతుఁడై ఖడ్గధరుఁడగురుద్రునకు నమస్కారము, దొంగలకుఁ బ్రభువైన వానియందును అంతర్యామియయి తద్రూపుఁడై యున్న రుద్రునకు నమస్కారము.

భ. కకుభాయ = ప్రధానుఁడును, లేక, ఉన్నతుఁడును, లేక, కకుభాయ= కకుద్విభాతి, వృషభముయొక్క మూఁపునందుఁ బ్రకాశించువాఁడును, వృషభారూఢుఁడు ననుట, నిషఙ్గిణే=ఖడ్గము గలవాఁడును, ఖడ్గముచేఁ బోరుటయందు సమర్థుఁడనుట, అట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. స్తేనానామ్ = దాఁగియుండి దొంగలించునట్టి వారికి, పతయే=స్వామియగువాఁడు, దొంగలయినను భక్తులయినయెడ వారియందలి వాత్సల్యముచే వారికి స్వామియయి వారి పాపముల హరించి రక్షించువాఁడనుట, లేక, దొంగతనమునందు అందఱికన్నను సమర్థుఁడనుట, అట్టి రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. ౨

---

న మో ని ష ఙ్గి ణ ఇ షు ధి మ తే త స్క రా ణా ం
ప త యే న మః.

నమః - నిషఙ్గిణే - ఇషుధిమతే - తస్కరాణామ్ -
పతయే - నమః. 3

నిషఙ్గిణే = ధనుస్సునందు సంధించుటకై చేతంబట్టుబాణము నిషంగ మనఁబడును. అది గలవాఁడును, ఇషుధిమతే=మూఁపున ధరించు బాణాధారము ఇషుధి యనఁబడును, అమ్ములపొది యనుట, అది గలవాఁడునగు రుద్రుని కొఱకు, నమః=నమస్కారమగుఁగాక. తస్కరాణామ్=ప్రకటముగా దొంగిలు నట్టి దొంగలకు, పతయే = పాలకుఁడగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

ధనుస్సునందు సంధించుటకు హస్తమున బాణమును ధరించుచున్నవాఁడును అమ్ముల పొదిని మూఁపునఁ దాల్చినవాఁడును నగు రుద్రునకు నమస్కారము, బాహాటముగా దొంగిలించునట్టి దొంగలను, అనఁగా నరణ్యము మొదలగు ప్రదేశములనుండి దారిఁ బోవువారలఁ గొట్టి వారిసొమ్ము హరించు ప్రకట చోరులను బాలించువాఁడగు రుద్రునకు నమస్కారము.

భ. నిషఙ్గిణే = ఖడ్గము గలవాఁడును, ఇషుధిమతే = అమ్ములపొది గలవాఁడునగు రుద్రునికొఱకు, ఖడ్గమును అమ్ములపొదియు రెండును గలవాఁడని చెప్పుటకై మరల నిషంగి గ్రహణము, లేక, నిషఙ్గిణే=మిక్కిలి యాసక్తి గలవాఁడును, భక్తులయందు మిక్కిలి ప్రీతి గలవాఁడనుట, లేక, దొంగతనమునందు మిక్కిలి యాసక్తి గలవాఁడనుట, ఇషుధిమతే=అమ్ములపొది గలవాఁడునగు రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. తస్కరాణామ్ = అడవి మొదలగుచోటులనుండి బాటసారులనుగొట్టి ప్రత్యక్షముగా దొంగిలించువారలకు, పతయే = ప్రభువగు రుద్రునికొఱకు, నమః = నమస్కార మగుఁగాక. 3

---

న మో వ ఞ్చ తే ప రి వ ఞ్చ తే స్తా యూ నాం
ప త యే న మః.

నమః - వఞ్చతే - పరివఞ్చతే - స్తాయూనామ్ - పతయే - నమః. 4

వఞ్చతే = తనప్రభువునకు అప్తుఁడైన యతనివ్యవహారములుచేయుచు నతనికిఁగా విలచునప్పుడును విక్రయించునప్పుడును ఒకానొకప్పుడు కొంచెము

ద్రవ్యము నపహరించువాఁడును, పరివఞ్చతే = అన్నివ్యవహారములయందును మోసపుచ్చువాఁడునగు రుద్రునికొఱకు, నమః=నమస్కారమగుఁగాక. స్తాయూనామ్=గుప్తచోరులు రెండువిధములు, దూరమునుండివచ్చి రాత్రి యెవ్వరికిని దెలియనట్లు కన్నము మొదలగునవి వేసి ద్రవ్యము నపహరించువారలు స్తేనులనఁబడుదురు. ఇంటిలోనే స్వామికి స్వీయులయియుండి రాత్రిగాని పగలుగాని యితరులకుఁ దెలియక యపహరించువారలు స్తాయువు లనఁబడుదురు. అట్టి దొంగలకు, పతయే = పాలకుఁడగు రుద్రునికొఱకు, నమః=నమస్కారమగుఁగాక.

ప్రభువున కాప్తుఁడై యుండి యతనికిఁగాఁ దాను గావించు క్రయవిక్రయాది వ్యవహారములందు ఒకానొకచోఁ గొంచెము ద్రవ్య మపహరించునట్టి వంచకుని రూపము గలవాఁడును బ్రభువునకుగాఁ దానుజేయు సర్వవ్యవహారములందును ద్రవ్య మపహరించునట్టి పరివంచకుని రూపము గలవాఁడు నగు రుద్రునకు నమస్కారము, స్వామి యింటిలోనే యతనికి స్వీయులై యుండి రాత్రిగాని పగలుగాని యితరులకుఁ దెలియనట్లు అతని సొమ్ము నపహరించునట్టి యింటి దొంగలకుఁ బాలకుఁడగు రుద్రునకు నమస్కారము.

భ. వఞ్చతే = మోసముసేయువాఁడును, పరివఞ్చతే = అంతటను మోసము సేయువాఁడును, అంతటను అప్రతిహతముగా మోసము సేయువాఁడు ననుట, అట్టి రుద్రునికొఱకు, నమః = నమస్కారమగుఁగాక. స్తాయూనామ్ = సత్పురుషులవేషము గలవారలై కపటముచే దిరుగుచు ఎండవేసిన వస్త్రములు మొదలగువానిని అపహరించునట్టి దొంగలకు, పతయే = ప్రభువగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

న మో నిచేరవే పరిచ రా యా రణ్యా నాం
ప త యే న మః.

నమః - నిచేరవే - పరిచరాయ - అరణ్యానామ్ - పతయే -
నమః. 21

నిచేరవే = అపహరించుటకు ఎప్పు డవకాశము చిక్కునను తలంపుతో స్వామియింటనే సావధానుఁడై యెల్లప్పుడు తిరుగు స్వభావముగలవాఁడును, పరిచరాయ=అంతటను అనఁగా నంగడివీధి మొదలగు నెల్లచోటులయందు దొంగిలించుతలంపునఁ దిరుగువాఁడు నగు రుద్రునికొఱకు, నమః=నమస్కారమగుఁగాక. అరణ్యానామ్=దారియందుఁ బోవువారిని బాధించి వారిసొమ్ము హరించుటకై యెల్లప్పుడు నడవియందున్నట్టి దొంగలకు, పతయే=పాలకుఁడగు రుద్రునికొఱకు నమః=నమస్కార మగుఁగాక.

దొంగిలించుట కవకాశ మారయుచు స్వామి గృహము నందే యెల్లప్పుడు జాగ్రత్తతోఁ దిరుగువాని రూపము గల వాఁడును అట్లు అంగడివీధి మొదలగు ప్రదేశములందు దొంగి లించుటకై తిరుగువాని రూపముగలవాఁడు నగు రుద్రునికి నమ స్కారము, దారి నడచువారలం గొట్టి వారిధనము నపహరించు టకై యరణ్యముల వసించునట్టి దొంగలకుఁ బ్రభువైన రుద్రు నకు నమస్కారము.

భ. నిచేరవే=రహస్యముగాఁ దిరుగువాఁడును, లేక, మిక్కిలి తిరుగు వాఁడును, పరిచరాయ=వెల్లడిగాఁ దిరుగువాఁడును, లేక, అంతటను దిరుగు వాఁడునగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. అరణ్యానామ్=అడవి

యందుండువారలకు, అరణ్యమున నుండువార లగుటచే నరణ్యులని చెప్పఁబడు చున్నారు. అరణ్యవాసులగు దొంగలకనుట, లేక, అరణ్యముఁ బాలించువారల కనుట, పతయే=ప్రభువగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. ౫

---

న మ స్సృ కా వి భ్యో జి ఘాం స ద్భ్యో ము ష్ణ
తాం ప త యే న మః.

నమః - సృకావిభ్యః - జిఘాగ్ంసద్భ్యః - ముష్ణతామ్ -
పతయే - నమః. ౬

సృకఅవిభ్యః = వజ్రాయుధముచే తమశరీరమును రక్షించుకొనునట్టి వారును, దృఢమయిన యాయుధముచేఁ దమశరీరము గాపాడుకొనువార లనుట, జిఘాంసద్భ్యః=చంపఁగోరినవారలగు చోరులకొఱకు, ఆయుధములచేఁ దమ్ము రక్షించుకొనుచు ప్రాణులను హింసింపఁగోరునట్టి అట్టిచోరులరూపముగల రుద్రునికొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక. ముష్ణతామ్=సేద్యముసేయు వారలయి తమయేలిక ధాన్యములను దొంగిలునట్టి వారలయొక్క, పతయే = పాలకుఁడగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

ఉత్తమమగు నాయుధముచే తమ్ము రక్షించుకొనువార లును ప్రాణులను జంపఁగోరు వారలునగు చోరులరూపముగల రుద్రునకు నమస్కారము, సేద్యగాండ్రై భూస్వామియొక్క ధాన్యములను హరించునట్టి దొంగలనాథుని రూపముగలరుద్రునకు నమస్కారము.

భ. సృకావిభ్యః=సృక మనఁగా వజ్రము, అది యాయుధమాత్రమున కుపలక్షకము, ఆయుధములుగల రుద్రానుచరులకొఱకు, మత్వర్థీయాంతము. లేక,

సృకావిభ్యః = వజ్రము మొదలగు నాయుధముల రక్షించునట్టి రుద్రానుచరుల కొఱకు, లేక, ఆయుధములందు నేర్పరులయి ఆయుధములచేత జీవించునట్టి యొక తెగమనుష్యులు సృకావు లనఁబడుదురని కొందఱు, అట్టివారలకొఱకు, వారలరూపముగల రుద్రునికొఱకనుట, జిఘాంసద్భ్యః = చంపఁగోరునట్టి రుద్రానుచరులకొఱకు, వీరలు మనుష్యజాతి విశేషములని కొందఱు, ఆపక్షమున, అట్టిమనుష్యులరూపముగల రుద్రునికొఱకు, నమః=నమస్కారము. ముష్ణతామ్= దొంగిలించువారలకు, పతయే = ప్రభువైన రుద్రునికొఱకు, నమః = నమస్కారము. ౬

న మో ఽ సి మ ద్భ్యో న క్త ఞ్చ ర ద్భ్యః ప్ర కృ న్తా నాం ప త యే న మః.

నమః - అసిమద్భ్యః - నక్తఞ్చరద్భ్యః - ప్రకృన్తా నామ్ - పతయే - నమః. ౭

అసి మద్భ్యః=కత్తి గలవారలకొఱకు, కత్తిదాల్చిన చోరులకొఱకును, నక్తఞ్చరద్భ్యః=రాత్రియందు తిరుగుచుండువారలకొఱకును, రాత్రియందుఁ దిరుగుచు దారివచ్చువారిని బాధించునట్టి దొంగలకొఱకును, ఆ యిరుతెగల చోరుల రూపముగల రుద్రునికొఱ కనుట, నమః = నమస్కార మగుఁగాక. ప్రకృన్తానామ్=చంపి దొంగిలించునట్టిదొంగలకు, పతయే=పాలకుఁడగు రుద్రుని కొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

ఖడ్గము ధరించినవారలును రాత్రులం దిరుగుచు వీధికి వచ్చినవారి బాధించువారలు నగు చోరుల రూపముగల రుద్రు

నకు నమస్కారము, ప్రాణులను వధించియే వారి ధనాదుల దొంగిలించు దొంగలకు నాథుని రూపము గల రుద్రునకు నమస్కారము.

భ. అసిమద్భ్యః=ఖడ్గముగలవారలును, నక్తఞ్చరద్భ్యః=రాత్రులందుఁ దిరుగువారలునగు రుద్రులకొఱకు, నమః=నమస్కార మగుఁగాక. ప్రకృన్తానామ్=మిక్కిలి ఛేదించునట్టివారలకు, రాత్రులు దిరుగుచు ప్రాణులను వధించియే వారిధనాదిక మపహరించునట్టి చోరులకనుట, పతయే=ప్రభువగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. 2

న మ ఉ ష్ణీ షి ణే గి రి చ రా య కు లు ఞ్చా నాం
ప త యే న మః.

నమః - ఉష్ణీషిణే - గిరిచరాయ - కులుఞ్చానామ్ -
పతయే - నమః. ౮

ఉష్ణీషిణే=తలగుడ్డ గలవానికొఱకు, తలగుడ్డ ధరించి పెద్దమనుష్యునివలె నటించుచు జనసమూహామునడుమ దొంగిలించుటకై తిరుగునట్టి చోరునికొఱకు, గిరిచరాయ = పర్వతమునందుఁ దిరుగువానికొఱకు, కట్టెలు మొదలగువానికై వచ్చుజనులనుకొట్టి వారివస్త్రాదుల నపహరించుటకై కొండలయందుఁ దిరుగుచుండునట్టి దొంగకొఱకు, వీరియిద్దఱి రూపముగల రుద్రునికొఱ కనుట. నమః =నమస్కార మగుఁగాక. కులుఞ్చానామ్=భూమి నపహరించునట్టి దొంగలకు, పతయే=ప్రభువగు రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

గ్రామమునందుండు జనులవలెనే తలగుడ్డధరించి వారి నడుమ సంభావితునియట్లు తిరుగుచు దొంగిలించునట్టి చోరుని

రూపముగల రుద్రునకును బర్వతములందుఁ దిరుగుచు నడవికిఁ గట్టెలు మొదలగువానికై వచ్చునట్టి జనులవస్త్రాదు లపహరించు నట్టి దొంగయొక్క రూపముగల రుద్రునికిని, నమస్కారము. భూమిని అనఁగా ఇల్లు కయ్య మొదలగువానిని అపహరించునట్టి దొంగలకు నాథుని రూపముగల రుద్రునికి నమస్కారము.

భ. ఉష్ణీషిణే = శిరోవేష్టనముగల, లేక, బొమిడికము (శిరఃకవచము) గల రుద్రునికొఱకును, గిరిచరాయ=పర్వతమునందుఁ దిరుగునట్టి రుద్రునికొఱకును, నమః=నమస్కార మగుఁగాక. కులుఞ్చానామ్=భూమి నపహరించునట్టి వారికి, లేక, కుత్సితముగా నపహరించువారికి, ప్రాణులకు నానావిధవ్యసనములు గల్గించి, వారు వానికి లోఁబడియుండునపుడు వారిధనాదు లపహరించువారల కనుట, లేక, గృహములను అపహరించువారలకు, పతయే=ప్రభువయిన రుద్రునికొఱకు, నమః=నమస్కార మగుఁగాక. ౧౯

---

న మ ఇ షు మ ద్భ్యో ధ న్వా వి భ్య శ్చ వో న మః.

నమః - ఇషుమద్భ్యః - ధన్వావిభ్యః - చ - వః - నమః. ౨౦

హేరుద్రాః (అధ్యాహృతము, ఇట్లు ముందును,) ఓరుద్రులారా! ఇషుమద్భ్యః=బాణములు గలవారలగు, భయపఱచుటకై చేత బాణముదాల్చినవారలనుట, అగు మీకు, నమః=నమస్కార మగుఁగాక. ధన్వావిభ్యః=ధనుస్సుగలవారలును, భయపఱచుటకై ధనుస్సు ధరించినవారలు ననుట, అగు, వః చ=మీకును, నమః=నమస్కార మగుఁగాక.

ఓరుద్రులారా! భక్తులు గానివారి భయపఱచుటకై చేత బాణము పట్టినట్టి మీకు నమస్కారము; హస్తమున ధనుస్సు ధరించినట్టి మీకు నమస్కారము.

భ. ఇఁక యుష్మచ్ఛబ్దప్రయోగము గలుగుటవలన ఈమంత్రములు ప్రత్యక్షకృతములు. ఈమంత్రములందు సంఘాతములు నమస్కరింపఁబడును. ఇదివఱకు ప్రాయికముగా దత్పతియె నమస్కరింపఁబడెను. తక్కినది సమానము. ౯

న మ ఆ త న్వా నే భ్యః ప్ర తి ద ధా నే భ్య శ్చ వో నమః.

నమః - ఆతన్వానేభ్యః - ప్రతిదధానేభ్యః - చ - వః - నమః. ౧౦

రుద్రాః = రుద్రులారా! ఆతన్వానేభ్యః = వింటియందు అల్లెత్రాటిని ఎక్కుపెట్టువారలగు మీకొఱకు, నమః = నమస్కార మగుఁగాక. ప్రతిదధానేభ్యః = బాణము సంధించువారలగు, వః చ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

రుద్రులారా! ధనుస్సును మోపెట్టు వారలగు మీకు నమస్కారము, మోపెట్టిన ధనుస్సునందు బాణము సంధించు వారలగు మీకు నమస్కారము. ౧౦.

భ. సమానము.

న మ ఆ యచ్ఛ ద్భ్యో వి సృ జ ద్భ్య శ్చ వో న మః.

నమః - ఆయచ్ఛద్భ్యః - విసృజద్భ్యః - చ - వః - నమః.

రుద్రాః = రుద్రులారా! ఆయచ్ఛద్భ్యః = అల్లెత్రాటి నాకర్షించు వారలగు మీకొఱకు, నమః = నమస్కార మగుఁగాక. విసృజద్భ్యః=బాణము ప్రయోగించు చున్నట్టి, వః చ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁ గాక.

రుద్రులారా! బాణము సంధించి యల్లెత్రాడు లాగు చున్న మీకు నమస్కారము, అట్లు అల్లెత్రాడు లాగి శత్రువు మీఁద బాణము ప్రయోగించుచున్న మీకు నమస్కారము.

భ. సమానము.

న మో ఽ స్య ద్భ్యో వి ధ్య ద్భ్య శ్చ వో న మః.

నమః - అస్యద్భ్యః - విధ్యద్భ్యః - చ - వః - నమః. ౧౨

రుద్రాః = రుద్రులారా! అస్యద్భ్యః = బాణము వేయుచున్న మీకొఱకు, బాణమును గుఱియొద్దకుఁ బోవునట్లు చేయునట్టి మీకొఱకనుట, నమః = నమస్కారమగుఁగాక. విధ్యద్భ్యః = శత్రుదేహములో గ్రుచ్చుటను చేయుచున్న, వః చ= మీకొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

బాణమును గుఱియొద్దకుఁ బాఱునట్లు చేయుచున్న మీకు నమస్కారము, బాణమును గుఱియైన వాని దేహములో గ్రుచ్చునట్లు చేయుచున్న మీకు నమస్కారము.

భ. విధ్యద్భ్యశ్చ = కొట్టునట్టి, వః=మీకు, నమః = నమస్కార మగుం గాక. ఇతరము సమానము. ౧౨

---

న మ ఆ సీ నే భ్య శ్శ యా నే భ్య శ్చ వో న మః.

నమః - ఆసీనేభ్యః - శయానేభ్యః - చ - వః - నమః. ౧౩

భ. రుద్రాః = రుద్రులారా! ఆసీనేభ్యః = కూర్చుండియున్న మీ కొఱకు, నమః = నమస్కార మగుంగాక. శయానేభ్యః = పరుండియున్న వారగు, వః చ = మీకొఱకును, నమః = నమస్కార మగుంగాక.

విశ్రమించుటకై కూర్చుండియున్న మీకు నమస్కారము, అటు పిమ్మట పరుండియున్న మీకు నమస్కారము. ౧౩

---

న మ స్స్వ ప ద్భ్య జా గ్ర ద్భ్య శ్చ వో న మః.

నమః - స్వపద్భ్యః - జాగ్రద్భ్యః - చ - వః - నమః. ౧౪

భ. రుద్రాః = రుద్రులారా! స్వపద్భ్యః = నిదురించు చున్న మీకొఱకు, నమః=నమస్కార మగుం గాక. జాగ్రద్భ్యః= మేలుకొన్న వారగు, వః చ = మీకొఱకును, నమః=నమస్కార మగుంగాక.

అంత నిదురించుచున్న మీకు నమస్కారము, అటు పిమ్మట మేలుకొనియుండు మీకు నమస్కారము. ౧౪

---

న మ స్తి ష్ఠ ద్భ్య ధా వ ద్భ్య శ్చ వో న మః.

నమః - తిష్ఠద్భ్యః - ధావద్భ్యః - చ - వః - నమః. ౧౫

భ. రుద్రాః = రుద్రులారా! తిష్ఠద్భ్యః = నిలుచుండినమీకొఱకు, నమః = నమస్కార మగుఁగాక. ధావద్భ్యః = పరుగెత్తుచున్నవారగు, వః చ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

అంత నిలిచియుండు మీకు నమస్కారము, అటుపిమ్మటఁ బరుగెత్తుచున్న మీకు నమస్కారము. ౧౫

---

న మ స్స భా భ్య స్స భా ప తి భ్య శ్చ వో న మః.

నమః - సభాభ్యః - సభాపతిభ్యః - చ - వః - నమః. ౧౬

భ. రుద్రాః=రుద్రులారా! సభాభ్యః = సభలయిన మీకొఱకు, సమూహాముగాఁ జేరి కూర్చుండియుండు మీకొఱకనుట, నమః = నమస్కార మగుఁగాక. సభాపతిభ్యః = సభలకు ప్రభువులయిన, లేక, సభాస్థానములకుఁ బ్రభువులయిన, వః చ=మీకొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

సమూహాముగాఁజేరి కూర్చుండి యుండునట్టి మీకు నమస్కారము, అట్టి సమూహాములకుఁ [అవియుండు స్థానములకు] ప్రభువులయిన మీకు నమస్కారము. ౧౬

---

న మో అ శ్వే భ్యో ఽ శ్వ ప తి భ్య శ్చ వో న మః.

నమః - అశ్వేభ్యః - అశ్వపతిభ్యః - చ - వః - నమః. ౧౭

ఇతి శ్రీమద్యజు స్సంహితాయాం - చతుర్థ కాణ్డే,
పఞ్చమ ప్రపాఠకే, తృతీయో ఽనువాకః.

భ. రుద్రాః = రుద్రులారా ! అశ్వేభ్యః = గుఱ్ఱముల రూపముగల మీకొఱకు, అశ్వేభ్యః = (శసల కచ్ఛేదము) ధనము లేనివారలగు మీకొఱకు, దరిద్రుల స్వరూపముగల మీకొఱకనుట, లేక, అశ్వేభ్యః = శ్వస్తనమయిన ధనము లేని వారలకొఱకు, రేపటికి నిలువధనము లేని వారలకొఱకు, మఱునాటికి మిగులకుండ నానాటికిఁ దెచ్చుకొని జీవించునట్టి అశ్వస్తనికులనంబడు ఋషుల స్వరూపముగల మీకొఱకనుట, నమః=నమస్కారమగుఁగాక. అశ్వపతిభ్యః = గుఱ్ఱములకుఁ బ్రభువులయిన, ధనములేనివారికి, లేక, అశ్వస్తనికులగు ఋషులకుఁ బాలకులయిన, వః చ = మీకొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

రుద్రులారా! అశ్వరూపులగు మీకు (దరిద్ర రూపులగు, లేక, మఱునాటికి మిగత యుంచుకొనని యశ్వస్తనికులగు ఋషుల రూపముగలమీకు) నమస్కారము, గుఱ్ఱములకుఁ బ్రభువులయి శ్రీమంతులయిన (దరిద్రులను అశ్వస్తనికులగు మునులను బాలించునట్టి) మీకు నమస్కారము.

ఈయనువాకమునందు నమస్కరింపఁబడిన వారలందఱు దేవునియనుచరులు, లేక, దేవునివే లీలావిగ్రహ విశేషములని తెలియవలెను.

ఈయనువాకమునకు ఋషి మహాదేవుఁడు, ఛందస్సు బృహస్పతి, దేవతయు మహాదేవుఁడే, ఇఁక దీని పురశ్చరణాదులు. ఒక ప్రాజాపత్యము చేసి యయిదువేలావృత్తులు జపించినచోఁ బురశ్చరణ సిద్ధియగును. దేశము వ్యాధిచేఁ బీడింపఁబడునప్పుడు, రాజు దీనిచేఁ దచ్ఛాంతి గావింపవలెను.

తత్ప్రకారము. సిద్ధులగు పదునొకండుగురు బ్రాహ్మణులను సంపాదింపవలెను. అందైదుగురు జపమును ఐదుగు రాజ్యహోమమును జేయవలెను. ఒకఁడు, నమశ్శబ్దము వచ్చునప్పుడంతయు, తిలాదనము వేల్చుచుండునది. ఇట్లు జపహోమములు లక్షావృత్తులు గావించినచో జనపదమునందు వ్యాధి

యుండదు. గుఱ్ఱములు మొదలగు వాహనములకు రోగము గలుగునెడ, నువ్వు పిండిగలిసిన యపూపములు ఆహుతి ప్రమాణములు చేయించి పదునొకండు వేలు వేల్చవలయును. వాహనములకు సామాన్యవ్యాధి నశించును. ఇతరవ్యాధి గలుగునపుడు, ఏవాహనములకు వ్యాధిగలుగు నావాహనముల కొట్టమునందు, నేయి గలిపిన యుత్తరేను బియ్యముచే నెనిమిదివే లాహుతులు వేల్చునది. ఆవాహనముల వ్యాధి యడఁగును. ప్రధానమంత్రికి రోగము గలిగినయెడ, శివాలయమునందు నేతిచేఁ దడుపఁబడిన శుద్ధతండులములచే లక్షాహుతులు వేల్చవలయును. అతని కారోగ్యము గలుగును. ఇతరమంత్రులకైనచో, దూర్వలచేత నపామార్గములచేత నెనిమిదేసి వేలాహుతులు వేల్చవలయును. వారలరోగము నశించును.

ఇఁక రాజునకు వ్యాధిగలిగినపక్షమునఁ జెప్పఁబడుచున్నది. తచ్ఛాంతిసిద్ధులగువార లిరువదియొకండుగురు బ్రాహ్మణులు గావింపవలెను. అగ్ని ప్రక్కల రాజుయొక్క ప్రమాణముగల కుండమునిర్మించి యందుమథితాగ్నిం బ్రతిష్ఠించి హోమము చేయవలెను. అందొక్కఁడు బ్రహ్మ, తక్కినయిరువదిమంది బ్రాహ్మణులును ఇద్దఱేని యొకటిగాఁ జేరి యొక్కొక హోమద్రవ్యముచే వేల్చవలయును. తండులములు, తిలలు శ్యామాకము (చామలు) నీవారము అపామార్గము దూర్వలు కమలములు కింజల్కములు శుద్ధోదనము ఆజ్యము ఇవి పది హోమద్రవ్యములు. హోమద్రవ్యములన్నియు నావునేతిచేఁ దడుపఁబడి యుండవలెను. అయ్యగ్ని కుండమునకు నిర్ౠతిదిశను జలపూర్ణమగుకలశముఁ బ్రతిష్ఠించి బ్రహ్మ దాని స్పృశించుచు జపము సేయుచుండునది. ఇట్లు హోమమును జపమును ప్రతిదినము ఏడునాడికలు నిరంతరముగావింపవలెను. ఇట్లు అమావాస్య మొదలుకొని మరల నమావాస్యవఱకుఁ జేయునది. రాజువ్యాధి యధికమగు నేని యుదయము మొదలుకొని యస్తమయముపనుక హోమము సేయవలెను. హోమము ఏడునాడికలు సేయునెడ ప్రతిపురుషునకును అర్ధనిష్కముదక్షిణ,

పగలంతయు నైనచో నిష్కము, ఆచార్యునకు ద్విగుణమీవలెను. రాజు ఉపభోగించు వస్తువులను గలశజలముచేఁ బ్రోక్షించు చుండునది. ఇట్లు గావించినచో రాజు ఆరోగ్యము నొందును.

మఱియొక ప్రకారము. రాజునకు రోగములేకయుండుటకై నువ్వులు నేయి కలిసిన శుక్ల తండులములచే నీయనువాకము పఠించుచు నెనిమిదివేలాహుతులు ప్రతిదినము వేల్వవలయును. ఇందుచే రాజు ఎల్లప్పుడు రోగములేనివాఁడై దీర్ఘాయువునగును. ఇతరులకు రోగమగునేని, నేయిచేతను దేనెచేతను దడుపఁబడిన తిల వ్రీహియవములచే నెనిమిదివేలాహుతులు వేల్చినయెడ వారిరోగములు నశించును.

ఇఁక నీయనువాకముచే నభిచారములు చెప్పఁబడును. శత్రురాష్ట్రమునకు రోగపీడ గోరువాఁడు, "రిపురాష్ట్రం సముద్దిశ్యాభిచారం కరోమి ఫట్ స్వాహా" అని మంత్రాంతమున నుచ్చరించుచు పంది మొదలగువాని మాంసముచే లక్షహోమము చేయునది, ఒకమాసమున శత్రురాష్ట్రమును అందలి ప్రజలును శోషింతురు. ఎఱ్ఱనూలిచేఁ జుట్టఁబడిన వికంకత [ములువెలను] సమిధలచే లక్షహోమము చేసినయెడ, శత్రువునకు మహాజ్వరము కలుగును. శత్రుదేశమునందలి జనులు వాడుకొను జలము మొదలగు వస్తువులను తాఁకిగాని చూచిగాని లక్షజపము చేయునది. ఆవస్తువు నుపభోగించినవాఁడు ఒకసంవత్సరమునకు నాశమునొందును. శ్మశానాగ్నియందు జిల్లేడుసమిధలచే లక్షహోమము గావించుటవలన శత్రువుపట్టణము వ్యాధిచే నశించి యర్కారణ్యమగును. చాముండాలయమందు దక్షిణాభిముఖుఁడై నూనెచేఁ దడుపఁబడిన మినుముల నువ్వులచేఁ బదునొకండు వేలాహుతులు వేల్చునది. శత్రుదేశప్రజలు మసూరికచే బాధింపఁబడుదురు.

ప్రకారాంతరము. పడమటి వాకిలిగల శివాలయమునందు దేవుని పాదపీఠమున అపస్మారియగు నగ్నిని ధ్యానించి, ఏడువేలు జపముసేయవలెను.

మంత్రాంతమున "శత్రురాజ్యే ప్రజ్వలజ్వాలాపస్మారిణే" అని పఠింపవలెను. ఇందుచే శత్రు వపస్మారరోగము గలవాఁడగును. మఱియును శత్రురాజు ఎల్ల చోటులను నుండునట్లు తలంచుచుఁ దెల్లనిబియ్యపుపిండిచే లక్షహోమము చేసిననో, శత్రురాజు రాజయక్ష్మ పొంది దానిచేతనె నశించును.

## ధ్యానము.

రూపయౌవనసంపన్నా మూర్తేవ వనదేవతా
పుష్పితాశోకపున్నాగ సహకారశిఖోపమః. ౧
పఞ్చవింశతి నక్షత్రో మాయూరకృతశేఖరః
అకలఙ్కశరచ్చన్ద్రపూర్ణబిమ్బసమాననః. ౨
ప్రాన్తే బద్ధకపర్దాన్తో వసానశ్చర్మ కోమలమ్
సవ్యాపసవ్య విధృతకృతమాలవిభూషితః. ౩
ధారాకదమ్బపుంజేన నాభిదేశప్రలమ్బినా
ఆజఙ్ఘప్రేక్షణీయేన ప్రేక్షణీయోఽపి శత్రుభిః. ౪
భార్యాస్య చారుసర్వాంగీ వన్యాలఙ్కారభూషితా
ఆదర్శ మూర్తిశోభానాం వన్యానామివ నిర్మలా. ౫
తస్యా హస్తే ధనుర్దత్వా శరమేకం చ నిర్మలమ్
ద్వితీయమంసమాలమ్బ్య స్థితం వామేన బాహునా. ౬
సుగన్ధి పుష్పస్తబక మాఘ్రాయాఘ్రాయ పాణినా
వీజ్యమానో మన్దమన్దం నవపల్లవశాఖయా. ౭
సమావృతో బాలకైశ్చ శ్వభిశ్చాపి మనోహరైః
గచ్ఛద్భిరగ్రతో దృష్టైర్ధ్యాతవ్యో జగతాం గురుః. ౮
ఏవంభూతో మహాతేజాః కిరాతవపురీశ్వరః.

ఆకారము వహించిన రూపయౌవన సంపన్నయగు వనదేవతయో యనందగినవాడును బుష్పితములగు నశోకపున్నాగసహకారముల గున్నలవలె నున్నవాడును ఇరువదేండ్ల వయసు గలవాడును నెమిలిపింఛము శిరస్సునం దాల్చినవాడును కలంకములేని శరత్కాలచంద్రుని నిండు బింబముంబోలు మోముగలవాడును ఒకప్రక్కకు ముడువఁబడిన జటాజూటము గలవాడును కోమలమగు వ్యాఘ్రచర్మము ధరించినవాడును సవ్యముగాను నపసవ్యముగాను ఔలపూదండలఁ దాల్చినవాడును నాభిప్రదేశము మొదలుగఁ బిక్కల వఱకు వ్రేలుకాడునట్టి కడిమిపూలదండలచే శత్రువులకును ఆనందకరంబగు సౌందర్యము గలవాడును తనయట్లు వన్యాలంకారములచే నలంకృతయయి నిర్మలయయి అడవియందలి శోభలకు దర్పణమో యనందగి యొప్పుచున్న సర్వాంగసుందరియగు దేవిహస్తమున ధనుస్సును నిర్మలమగు నొక బాణము నొసంగి యామె రెండవ (ధనుర్ధరమగు దానికన్న నితరమయిన) మూఁపును దన వామబాహువుచే నవలంబించి రెండవచేత సుగంధియగు పూగుత్తిని పలుమాఱు మూర్కొనుచు క్రొంజిగురురెమ్మచే వీవఁబడుచున్నవాడును తనముందు గర్వించి నడచుచున్న పిల్లవాండ్రచేతను మనోహరములగు కుక్కలచేతను బరివేష్టితుండును ఇట్టియాకారముదాల్చిన కిరాతవేషుఁడగు లోకగురువు నీశ్వరుని ధ్యానింపవలెను. అని యర్థము.

---

ఇది శ్రీమత్తవాటోపనామ సుందరరామప్రణీతంబగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందుఁ
దృతీయానువాకము.

---

ఓం నమో భగవతే రుద్రాయ.

అథ చతుర్థానువాకః.

---

నమ ఆవ్యాధినీభ్యో వివిధ్యన్తీభ్యశ్చ వో నమః.

నమః - ఆవ్యాధినీభ్యః - వివిధ్యన్తీభ్యః - చ - వః - నమః. ౧

తృతీయానువాకమున నుభయతో నమస్కారములగు కొన్ని యజుస్సులు చెప్పఁబడినవి. ఇఁక మఱికొన్ని యుభయతో నమస్కారములగు యజుస్సులు చతుర్థానువాకమునందుఁ జెప్పఁబడును.

రుద్రాః = రుద్రులారా ! ఆవ్యాధినీభ్యః = అంతటను కొట్టునట్టి స్త్రీమూర్తులయిన మీకొఱకు, నమః = నమస్కారము అగుఁగాక. వివిధ్యన్తీభ్యః= విశేషించి కొట్టునట్టి స్త్రీమూర్తులగు, వఃచ = మీకొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

రుద్రులారా! అంతటను వ్యాపించి శత్రువులను కొట్టునట్టి శక్తుల రూపముగల మీకు నమస్కారము, విశేషించి కొట్టునట్టి శక్తుల రూపముఁగల మీకు నమస్కారము.

భ. ఇఁకమీఁద దేవుఁడు ద్రవ్య క్రియాగుణముల కధిపతియని ప్రతిపాదింపఁబడును. ఇయ్యనువాకమున నన్నిమంత్రములును బ్రత్యక్షకృతములు. సంఘాతములే నమస్కరింపఁబడును. ఆవ్యాధినీభ్యః = అంతటను కొట్టునట్టి రుద్రసేనలు ఆవ్యాధినులు, లేక, ఆవ్యాధినులని కొన్నిజాతులు కలవు, వాని రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కారమగుఁగాక. వివిధ్యన్తీభ్యః =

నానా విధముగా కొట్టునట్టి సేనలగు, లేక జాతులగు, తద్రూపులగుననుట, వః చ=మీకొఱకును, నమః = నమస్కారమగుగాక. ౧

---

నమ ఉగణాభ్యస్తృగంహతీభ్యశ్చవో నమః.

నమః - ఉగణాభ్యః - తృగంహతీభ్యః - చ - వః - నమః. ౨

రుద్రాః = రుద్రులారా! ఉగణాభ్యః = ఉత్కృష్టగణ రూపలగు సప్తమాతృకలు మొదలుగాఁగల శక్తులకొఱకు, వాని రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కారమగుఁగాక. తృంహతీభ్యః=హింసించుటకు సమర్థలగు నుగ్రదేవతలయిన దుర్గ మొదలయిన, వాని రూపముగలవారగు అనుట, వః చ = మీకొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

ఉత్కృష్ట గణస్వరూపలగు సప్త మాతృకాది శక్తుల రూపముగల మీకు నమస్కారము, హింసించుటయందు సమర్థలయిన దుర్గాదులగు నుగ్రదేవతల రూపముగల మీకు నమస్కారము.

భ. ఉగణాభ్యః = ఇరువదియేడు రథములును అన్ని యేనుఁగులును ఎనుబదియొక్క గుఱ్ఱములును నూటముప్పది యయిదుగురు కాల్బంట్లును గలసేనా విశేషము గణమనఁబడును. ఉత్కృష్టములగు గణములను సేనా విశేషములుగల వారలకొఱకు, లేక, అతిశయించిన గణములను సేనా విశేషములుగల వారలకొఱకు, గొప్ప సేనలు గలవారలకొఱకనుట, అట్టి స్త్రీదేవతల రూపములగల మీకొఱకు, నమః = నమస్కారమగుఁగాక. తృంహతీభ్యః = హింసించునట్టి స్త్రీ దేవతల రూపములగల, వః చ = మీకొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

న మో గృ త్సే భ్యో గృ త్స ప తి భ్య శ్చ వో న మః.

నమః - గృత్సేభ్యః - గృత్సపతిభ్యః - చ - వః - నమః. 3

రుద్రాః = రుద్రులారా! గృత్సేభ్యః=ఆశపడునట్టి స్వభావముగల వారలకొఱకు, విషయ లోలురనుట, అట్టివారల రూపముగల మీకొఱకు, నమః = నమస్కారమగుఁగాక. గృత్సపతిభ్యః = విషయాసక్తులకు పాలకులగు, వఃచ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

విషయాసక్తుల రూపముగల మీకు నమస్కారము. విషయాసక్తులఁ బాలించువారి రూపముగల మీకు నమస్కారము.

భ. గృత్సేభ్యః = మిక్కిలి బుద్ధిగల వారలకొఱకు, బుద్ధిమంతులయి జీవించువారలు గృత్సులనఁబడుదురు, వారి రూపముగల మీకొఱకు, నమః = నమస్కారమగుఁగాక. గృత్సపతిభ్యః=బుద్ధిమంతులకు ప్రభువులగు, వఃచ = మీకొఱకును, వారి రూపముగల మీకొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక. 3

---

న మో వ్రా తే భ్యో వ్రా త ప తి భ్య శ్చ వో న మః.

నమః - వ్రాతేభ్యః - వ్రాతపతిభ్యః - చ - వః - నమః. ౪

రుద్రాః = రుద్రులారా! వ్రాతేభ్యః = నానాజాతుల సమూహములకొఱకు, వాని రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కారమగుఁగాక. వ్రాతపతిభ్యః = ఆసమూహములకుఁ బ్రభువులయిన, వఃచ = మీకొఱకును, తత్ప్రభువుల రూపముగల మీకొఱకు నమః=ననుట, నమస్కారమగుఁగాక.

రుద్రులారా! నానావిధ జాతులవారి సమూహముల రూపముగల మీకు నమస్కారము. ఆసమూహములకుఁ బాలకులగువారి రూపముగల మీకు నమస్కారము.

భా. వ్రాతేభ్యః = నియతమయిన జీవికలేని నానా జాతీయుల సమూహములకొఱకు, వాని రూపముగల మీకొఱకు, నమః = నమస్కార మగుఁగాక. తక్కినది సమానము. ౪

నమో గణేభ్యో గణపతిభ్యశ్చ వో నమః.

నమః - గణేభ్యః - గణపతిభ్యః - చ - వః - నమః. ౫

రుద్రాః = రుద్రులారా! గణేభ్యః = దేవుని సేవకులయిన ప్రమథులను భూతవిశేషములకొఱకు, వాని రూపము గల మీకొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక. గణపతిభ్యః = ప్రమథ గణములకుఁ బాలకులయిన; పాలకుల రూపము గల యనుట, వఃచ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

ప్రమథగణముల రూపముగల మీకు నమస్కారము, వానికిఁ బ్రభువుల రూపముగల మీకు నమస్కారము.

భా. సమానము. ౫

నమో విరూపేభ్యో విశ్వరూపేభ్యశ్చ వో నమః.

నమః - విరూపేభ్యః - విశ్వరూపేభ్యః - చ - వః - నమః. ౬

రుద్రాః = రుద్రులారా ! విరూపేభ్యః = వికృతమయిన ఆకారము గలవారలకొఱకు, దిగంబరులు ఎచ్చు తక్కువలయిన యవయవములు గల వారలు మొదలగు వారలయొక్క రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కారమగుంగాక. విశ్వరూపేభ్యః=సమస్తరూపములును గలవారలగు, స్వేచ్ఛచే గుఱ్ఱములు పులు లేనుంగులు సింహములు మొదలగు వానిరూపముల ధరించినట్టి యనుట, వఃచ = మీకొఱకును, నమః = నమస్కారమగుంగాక.

రుద్రులారా! నగ్నులు మొదలగు వికృత రూపముగల వారల రూపముగల మీకు నమస్కారము, గుఱ్ఱములు మొదలగు నానారూపములను స్వేచ్ఛచే ధరించినట్టి మీకు నమస్కారము.

భ. సమానము. ౬

న మో మ హ ద్భ్యః క్షు ల్ల కే భ్యశ్చ వో న మః.

నమః - మహద్భ్యః - క్షుల్లకేభ్యః - చ - వః - నమః. ౭

రుద్రాః = రుద్రులారా ! మహద్భ్యః = అణిమాద్యష్టైశ్వర్యములుగల గొప్పవారల కొఱకు, వారి రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కారమగుంగాక. క్షుల్లకేభ్యః = అణిమాదులులేనివారలగు, వారిరూపము గలవారలగు ననుట, వః చ=మీకొఱకును, నమః=నమస్కార మగుంగాక.

అణిమ గరిమ మహిమ లఘిమ ప్రాప్తి ప్రాకామ్యము ఈశత్వము వశిత్వము అను నెనిమిది యైశ్వర్యములుగల మహానుభావుల రూపముగల మీకు నమస్కారము; అవిలేని యల్పులగు వారి రూపముగల మీకు నమస్కారము.

భ. రుద్రాః = రుద్రులారా ! మహద్భ్యః = జ్ఞానముచేతను ఆకారముచేతను ప్రభావముచేతను గొప్పవారలకొఱకు, వారిలక్షణము, "సార్కే న్దుగ్రహనక్షత్రం ద్యాం కుర్యుర్యే మహీతలే, ప్రాప్యాష్టగుణమైశ్వర్యం యేన యాన్తి సువిస్మయమ్, యేషాం విస్మయతే నిత్యం కర్మభిర్భగవాన్ శివః" ఎవ్వరు సూర్యచంద్రనక్షత్రములతోఁ గూడిన ఆకాశమును భూమియందు నిర్మింతురో, ఎవ్వరు ఎనిమిది విధములయిన యైశ్వర్యమునొందియు నంతగా నాశ్చర్యము పడరో, ఎవ్వరి కార్యములచే భగవంతుండగు శివుఁ డెల్లప్పుడు నాశ్చర్యపడునో, అట్టివారలు మహచ్ఛబ్దవాచ్యులు, అని చెప్పఁ బడినది, అట్టి వారి రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కార మగుఁ గాక. క్షుల్లకేభ్యః = నీచములయిన జ్ఞానమును ఆకారమును ప్రభావమును గల, లేక "క్షోదయిత్వా లోలయిత్వా కదనం కృత్వా వర్తమానేభ్యః" నలిపి కదలించి కొట్టియుండు వారలగు, లేక, "క్షుధం క్షోదం వా లాన్తీతి క్షుల్లకాః తేభ్యః" ఆఁకలిని నలుపుటను గాని గ్రహించువారలగు, అట్టి వారి రూపముగలయనుట, వః చ=మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౭

న॒మో॒ ర॒థిభ్యో॑ఽర॒థేభ్య॑శ్చ॒ వో॒ నమః॑.

నమః - రథిభ్యః - అరథేభ్యః - చ - వః - నమః. ౮

రుద్రాః = రుద్రులారా! రథిభ్యః = రథముగల వారల కొఱకు, రథమునెక్కియున్న వారలకొఱకు, వారి రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కార మగుఁగాక. అరథేభ్యః = రథము లేనివారలగు, రథము నెక్కక యుండు వారలనుట, వారిరూపముగల, వఃచ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

రథము నారోహించి యుండు వారల రూపముగల మీకు నమస్కారము, అట్లు కాని వారల రూపముగల మీకు నమస్కారము.

భ. సమానము. ౮

న మో ర థే భ్యో ర థ ప తి భ్య శ్చ వో న మః.

నమః - రథేభ్యః - రథపతిభ్యః - చ - వః - నమః. ౯

భ. రుద్రాః = రుద్రులారా! రథేభ్యః = రథములకొఱకు, రథముల రూపముగల మీకొఱకనుట, లేక, రథావయవ రూపులగు మీకొఱకనుట, "హయాంశ్చ చతురో వేదాం త్సర్వదేవమయం రథమ్" నాలుగువేదములను గుఱ్ఱములను సర్వదేవ మయంబగు రథమును" అని మహాభారతమునందును, "అర్కాబ్జనేమిర్వేదాశ్వస్త్రయస్త్రింశన్మరున్మయః; పురారేః కల్పితో దైవై స్సరథో బ్రహ్మసారథిః" సూర్యచంద్రులు చక్రములుగాఁ గలదియు ముప్పది మూఁడు కోటులదేవతల వికార మయినదియు బ్రహ్మసారథిగాఁ గలదియునగు నారథము పురహరునకు దేవతలచేఁ గల్పింపఁబడినది. అని భవిష్యత్పురాణము నందును, దేవునిరథముయొక్క యవయవము లన్నియు దేవతలని చెప్పఁబడినది. రథావయవభూతలగుదేవతల రూపముగల మీకొఱకని భావము. నమః=నమస్కార మగుఁగాక. రథపతిభ్యః = రథమునకు నాథులగు, వఃచ = మీకును, నమః = నమస్కార మగుఁగాక.

రథ స్వరూపులు, లేక, రథావయవ స్వరూపులగుమీకు నమస్కారము, ఆరథమునకుఁ బ్రభువులరూపముగల మీకు నమస్కారము. ౯

న మ స్సే నా భ్య స్సే నా ని భ్య శ్చ వో న మః.

నమః - సేనాభ్యః - సేనానిభ్యః - చ - వః - నమః. ౧౦

భ. రుద్రాః = రుద్రులారా! సేనాభ్యః = సేనల కొఱకు, సేనల రూపమున క్రీడించునట్టి మీకొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక, సేనానిభ్యః = సేనలను నడపువారలగు, సేనాపతుల రూపము గలయనుట, వఃచ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

సేనలరూపమున విహరించునట్టి మీకు నమస్కారము, సేనాపతుల రూపముగల మీకు నమస్కారము. ౧౦

---

న మః క్ష త్తృ భ్యస్సం గ్ర హీ తృ భ్య శ్చ వో న మః.

నమః - క్షత్తృభ్యః - సంగ్రహీతృభ్యః - చ - వః - నమః.

భ. రుద్రాః = రుద్రులారా! క్షత్తృభ్యః = గుఱ్ఱములను మరపువారల కొఱకు, వారి రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కార మగుఁగాక. సంగ్రహీతృభ్యః = పట్టువారలగు, పగ్గములనుబట్టి రథముఁదోలునట్టి సారథులగు. వారి రూపము గలయనుట, వఃచ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

అశ్వములను మరపు వారి రూపము గల మీకు నమస్కారము, రథము తోలువారి రూపముగల మీకు నమస్కారము. ౧౧

న మ స్త క్ష భ్యో ర థ కా రే భ్య శ్చ వో న మః.

నమః - తక్షభ్యః - రథకారేభ్యః - చ - వః - నమః. ౧౨

భ. రుద్రాః = రుద్రులారా! తక్షభ్యః = వడ్లంగులకొఱకు, వడ్లంగుల రూపముగల మీకొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక. రథకారేభ్యః= రథముల చేయువారలగు, తద్రూపముగల వారలగు, వఃచ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

వడ్లంగుల రూపముగల మీకు నమస్కారము. రథము చేయువారి రూపముగల మీకు నమస్కారము. ౧౨

న మః కు లా లే భ్యః క ర్మా రే భ్య శ్చ వో న మః.

నమః - కులాలేభ్యః - కర్మారేభ్యః - చ - వః - నమః. ౧౩

భ. రుద్రాః=రుద్రులారా! కులాలేభ్యః=కుమ్మరవాండ్రకొఱకు, వారి రూపముగల మీకొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక. కర్మారేభ్యః=కరుమలవాండ్రగు, కరుమలవారి రూపముగల, వః చ=మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

కుమ్మరవారి రూపముగల మీకు నమస్కారము. కమ్మరవారి రూపముగల మీకు నమస్కారము. ౧౩

---

న మః పు ఞ్జి ష్టే భ్యో ని షా దే భ్య శ్చ వో న మః.

నమః - పుఞ్జిష్టేభ్యః - నిషాదేభ్యః - చ - వః - నమః. ౧౪

రుద్రాః = రుద్రులారా! పుంజిష్ఠేభ్యః = పక్షుల సమూహముల చంపునట్టి వారల కొఱకు, వారి రూపముగల మీకొఱకు, నమః=నమస్కార మగుఁగాక. నిషాదేభ్యః = మత్స్యములను చంపు వారలగు, వారి రూపముగల యనుట, వః చ =మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

పక్షులఁ జంపువారల రూపముగల మీకు నమస్కారము, మత్స్యములఁ జంపువారల రూపముగల మీకు నమస్కారము.

భ. పుంజిష్ఠేభ్యః=సమూహముగల పక్షులను బంధించు వారలరూపము గల మీకొఱకు; నమః = నమస్కార మగుఁగాక. నిషాదేభ్యః=మిక్కిలి నశింపఁ జేయువారలు, అనఁగా సమూహములుగా చుట్టి చంపువారలు కావున, మత్స్య ఘాతులు నిషాదు లనఁబడుదురు. వారలరూపముగల, వః చ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౧౪

---

న మ ఇ షు కృ ద్భ్యో ధ న్వ కృ ద్భ్య శ్చ వో న మః.

నమః - ఇషుకృద్భ్యః - ధన్వకృద్భ్యః - చ - వః - నమః. ౧౫

భ. రుద్రాః = రుద్రులారా! ఇషుకృద్భ్యః = మంచి బాణములను జేయు వారలకొఱకు, తద్రూపముగల మీకొఱ కనుట, నమః = నమస్కార మగుఁగాక. ధన్వకృద్భ్యః = మంచి ధనుస్సులను జేయువారలగు, తద్రూపము గలయనుట, వః చ = మీకొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

బాణములు చేయు వారల రూపముగల మీకు నమస్కారము, ధనుస్సులు చేయు వారల రూపముగల మీకు నమస్కారము. ౧౫

న మో మృ గ యు భ్య శ్శ్వ ని భ్య శ్చ వో న మః.

నమః - మృగయుభ్యః - శ్వనిభ్యః - చ - వః - నమః. ౧౬

రుద్రాః = రుద్రులారా! మృగయుభ్యః = వేటకాండ్రగు వారలకు, వారి రూపముగల మీకొఱకు, నమః = నమస్కారమగుఁగాక. శ్వనిభ్యః = కుక్కల నడపువారలగు, కుక్కలమెడలకుఁ దగిలించిన పగ్గములను బట్టువారలగు, అట్టివారి రూపముగల వారలగుననుట, వః చ = మీకొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

వేటయాడువారి రూపముగల మీకు నమస్కారము, కుక్కలను మెడకు త్రాడు తగిలించి పట్టుకొనియుండు వారల రూపముగల మీకు నమస్కారము.

భ. మృగయుభ్యః = మృగముల వేటాడువారలకొఱకు, మృగములను చంపఁ గోరికచే పొందుదురు. కావున మృగయువు లనఁబడుదురు, లేక, మృగములను తమకుఁగోరువారలు మృగయువులు, వ్యాధులు, అట్టివారి రూపముగల మీకొఱకనుట, నమః = నమస్కారమగుఁగాక. శ్వనిభ్యః = కుక్కల నడపువారలగు, కుక్కలకుఁ బాలకులగు, వారి రూపముగల యనుట, వః చ = మీకొఱకును, నమః = నమస్కారమగుఁగాక. ౧౬

---

న మ శ్శ్వ భ్య శ్శ్వ ప తి భ్య శ్చ వో న మః.

నమః - శ్వభ్యః - శ్వపతిభ్యః - చ - వః - నమః. ౧౭

ఇతి శ్రీమద్యజుస్సంహితాయాం - చతుర్థకాణ్డే,
పఞ్చమ ప్రపాఠకే, చతుర్థోఽనువాకః.

ఇందు, దేవుఁడు విలాసార్థముధరించు నానావిధమూర్తులందు, ద్వితీయానువాకమున దేవతామూర్తిని బ్రధానీకరించి స్తోత్రము సేయఁబడెను. తృతీయానువాకమునఁజోరమూర్తిని జతుర్థానువాకమున నానాజాతి మూర్తిని బ్రధానీకరించి స్తోత్రము చేయఁబడెనని విభాగము తెలియునది.

భ. శ్వభ్యః = కుక్కలకొఱకును, తద్రూపముగల మీకొఱకనుట, నమః= నమస్కార మగుఁగాక. శ్వపతిభ్యః = కుక్కలకుఁ బ్రభువులయిన, లేక, క్షేత్రపాలకరూపులయిన, వః చ = మీకొఱకును, నమః=నమస్కారమగుఁగాక.

కుక్కల రూపముగల మీకు నమస్కారము, వానిని బాలించువారి (క్షేత్రపాలకుల) రూపముగల మీకు నమస్కారము. ౧౭

ఇందు నానావిధముగాఁ బరమేశ్వరు నుపాసించి తత్ప్రసాదమును బొందిన జాతి విశేషములే నమస్కరింపఁబడునని కొందఱు వక్కాణింతురు.

---

ఇఁక నీయనువాకమునకుఁ బురశ్చరణము. ఒక ప్రాజాపత్య కృచ్ఛ్రమును తదర్ధమును చరించి తొమ్మిదివేలు జపముసేయవలెను, అంత శివాలయమున తొమ్మిదివేలు ప్రదక్షిణములు సేయవలెను. ప్రదక్షిణము లగువఱకు నిరంతరము జపించుచుండునది. అంతఁ బురశ్చరణసిద్ధుఁడగును. ఇందు తిథ్యాది నియమములేదు, ఇష్టమగునపుడు చేయవచ్చును. రాజయక్ష్మ పీడితుఁడగువాఁడు సిద్ధుఁడగు బ్రాహ్మణుని వరించి యతనిచే శాంతి చేయించుకొనవలెను. ఆసిద్ధుఁడు రోగపీడితునియింట బాహుప్రమాణమగు కుండముగావించి యతనియగ్నిం బ్రతిష్ఠించి దానిముందట వేదినిర్మించి యందు జలపూర్ణము తంతువేష్టితమగు నూతనఘటము ప్రతిష్ఠించి దానియందు ఈయనువాకముచే దేవు నావాహనముచేసి, గంధాదులచేఁ బూజించి, కస్తూరిగంధము తామరస

పుష్పము ఉశీరాదిదశాంగధూపము ఆజ్యదీపము సమర్పించి, యిట్లుఆరాధించి పదునొకండుదినములు దీక్షవహించి చేయవలెను. ప్రారంభదినమునందు ఆవాహనాది మంత్రపుష్పాంతము నారాధించి ఈయనువాకముచేఁ బదునొకండుమాఱులు ప్రతి నమస్కారము నేతిచే హోమముచేసి తత్సన్నిధానమునందు ఇరువదియొక్కవేలు జపము సేయవలెను. ఆదినము మొదలు కడవఱకు అగ్నిని రక్షింపవలెను. మఱునాఁడు నిత్యకార్యమయినపిదప, నేతిచేతను దేని చేతను దడుపఁబడిన తిలలాజ దూర్వా వ్రీహియవలచే నీయనువాకము పదునొకండావృత్తులుగాఁ బ్రతినమస్కారము హోమము సేయవలెను. ఇట్లె ఆపిమ్మట మూఁడుదినములు ప్రతిదినమును తేనెగలిసిన నేతిచే వేల్వవలయును. అటుపిమ్మట మునుపటివలెనే, ఆఱవదినమునందు అశ్వత్థసమిధలచేతను ఏడవదినమున నుత్తరేను సమిధలచేతను హోమము సేయునది. అటుపిమ్మట నొకదినము ఆవశ్యకములయిన నిత్యకర్మలకు విరోధములేనట్లు ఉదయము మొదలుకొని యస్తమయము వఱకు నిరంతర మీయనువాకము జపముసేయవలెను. తొమ్మిదవ దినమునందు తేనెగలిసిన నేతిచే హోమము. పదియవ దినమునందు ఉదయము మొదలుగా నస్తమయమువఱకు జపము. అంత సమాప్తి దినమందనఁగాఁ బదునొకండవ దినమునందు ఈయనువాకము జపించుచు నెనిమిదివేల తామరస పుష్పములచేఁ బ్రతినమస్కారము దేవునిఁ బూజింపవలెను. పిమ్మట గౌరీపూజ చేయవలెను. అంత బ్రాహ్మణులచే "వ్యాధి నిర్మోచనమస్తు" అని పలికించి యాశీర్వాదము పొందునది. అటుపిమ్మట దక్షిణ. రాజు ఎనిమిదివేలుగాని తదర్ధముగాని యెనిమిదినూఱులుగాని నిష్కము లీవలెను. ఇతరులైనచో ఎనిమిది నూఱులుగానితదర్ధముగాని యిరువదియైదుగాని నిష్కము లిచ్చునది. పెక్కండ్రు కర్తలగునెడ ఒక్కొక్కఁడు వేయువేయుగా దక్షిణ యీవలెను. వెనుకఁ గర్మ దక్షిణ యిచ్చునది. ప్రతిదినమును ఒక్కొక నిష్కమునిచ్చి పూర్తిపొందిన పిదప సమష్టి దక్షిణగా నొకగోవు నొసంగవలెను. అనంతరము దేవోద్వాసనము సేయునది. అంతఁ గలశజలముచే కర్తను స్నానముసేయించునది, లేక

ప్రోక్షించునది. ఇందుచే రాజయక్ష్మ నశించును. శంభు ప్రసాదముచే దీర్ఘాయువు నగును.

ఇఁక నీయనువాకముచేతనే మహాశాంతి చెప్పఁబడును. మహాపీడితుఁడగువాఁడు తనయగ్నియందు, ప్రతినమస్కారము తొమ్మిదివేలాహుతులు వేల్చినయెడ మహాశాంతి యగును. ఇతరములగు కుష్ఠము మొదలగువ్యాధులకును, అనువాకము లక్షమార్లు జపించునది. ఆవ్యాధులు నశించును. గొప్పజ్వరములు వచ్చినపుడు, శక్తుఁడైన బ్రాహ్మణుఁడు బొడ్డుబంటినీటఁ బ్రవాహమున నిలుచుండి యనువాకముజపించుచుఁ బ్రతినమస్కారము నొక్కొకటిచొప్పున నెనిమిదివే లెల్లదామర పూవులను జలమునందు వేయునది. అటుపిమ్మట భృంగిరిటపూజ చేయునది. ఇట్లు చేసినచో మహాజ్వరము నశించును. ఇది మిక్కిలి ఘోరమగుటంజేసి విద్వాంసుండగు బ్రాహ్మణుఁడే గురువుగావలెను. లేనిచో విఘ్నమగును. కాఁబట్టి లోపము సేయఁజనదు.

---

ధ్యానము.

భస్మోద్భాసితసర్వాఙ్గం జటామణ్డలమండితమ్,
ధ్యాయేత్త్ర్యక్షం వృషారూఢం గణేశ్వరయుతం హరమ్.

విభూతిచేఁ బ్రకాశించునట్టి యెల్లయవయవములుగలవాఁడును జటాసమూహముచే నలంకరింపఁబడినవాఁడును మూఁడుకన్నులుగలవాఁడును గణనాథునితోఁ గూడినవాఁడును వృషభము నారోహించినవాఁడునగు హరుని ధ్యానింపవలెను. అని యర్థము.

---

ఇది శ్రీమత్కవాటోపనామ సుందరరామ ప్రణీతంబగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందుఁ
జతుర్థానువాకము.

---

ఓం నమో భగవతే రుద్రాయ

అథ పఞ్చమానువాకః.

న మో భ వా య చ రు ద్రా య చ.

నమః - భవాయ - చ - రుద్రాయ - చ. ౧

చతుర్థానువాకమున నుభయతో నమస్కారములగు యజుస్సులు సమాప్తములయ్యెను. ఇఁక నైదవది మొదలుకొని యైదనువాకములయందు నమస్కారము మొదలుగాఁగల యజుస్సులే పఠింపఁబడును. అందుఁ బంచమానువాకమునఁ బంచదశయజుస్సులు చెప్పఁబడును.

భవాయచ = ప్రాణులకుఁ గారణమైన వానికొఱకును, భవన్తిప్రాణినః అస్మాత్, వీనివలనఁ బ్రాణులు కలుగుదురు అని వ్యుత్పత్తి, రుద్రాయచ = రుదం రోదన హేతుభూతం దుఃఖం ద్రావయతీతి రుద్రః, రోదనమును అనఁగా దానికిఁ గారణమైన దుఃఖమును పోఁగొట్టువానికొఱకును, నమః = నమస్కారము.

సర్వప్రాణులకును గారణమయినవానికి నమస్కారము, రోదనమునకుఁ గారణమైన దుఃఖమును హరించువానికి నమస్కారము.

భ. ఇట్లు మూఁడనువాకములచే దేవుఁడు విశ్వనాథుఁడగుట ప్రతిపాదింపఁబడినది. ఇఁకమీఁద నష్టమూర్త్యధిష్ఠానము నుగ్గడించి, దేవుఁడు స్తుతింపఁబడును. ఉభయతో నమస్కారములగు యజుస్సులు ముగిసినవి. ఇఁక నన్యతరతో నమస్కారములు, అందును ఆదియందు నమస్కారము గలయజుస్సులు పఠింపఁబడును.

భవాయచ=భవత్యసౌ సర్వత్ర సర్వదా ఇతి భవః, ఇతఁడు ఎల్లచోటులను ఎల్లప్పుడు నుండువాఁడు, లేక, ఎల్లప్పుడును ఉండనే యుండువాఁడు,

ఒకప్పుడును లేనివాఁడుకాఁడు, లేక, సర్వంభావయతి, సమస్తమును కలుగఁ జేయువాఁడు, లేక, సర్వైర్భావ్యతే, అందఱిచేత ధ్యానింపఁబడువాఁడు, లేక, భవతి అస్మిన్ సర్వమ్, ఇతనియందు సమస్తము నుండును. అట్టివానికొఱకును; భవుఁడు అష్టమూర్తులయందు జలమున కధిష్ఠాత. రుద్రాయచ=రోదయతి సర్వమన్తకాలే ఇతిరుద్రః, ప్రలయకాలమునందు సమస్తము నేడ్పించువానికొఱకును, నమః=నమస్కారము. రుద్రుఁడు సూర్యమూర్తి కధిష్ఠాత, అధిష్ఠాతృప్రకరణముకావున మరల రుద్రశబ్ద మామ్నాత మయ్యెను. ౧

---

న మ శ్శ ర్వా య చ ప శు ప త యే చ.

నమః - శర్వాయ - చ - పశుపతయే - చ. ౨

శర్వాయచ=శృణాతి హినస్తి పాపమితి శర్వః, పాపమును హింసించువానికొఱకును, పాపమును బోఁగొట్టువానికొఱకు ననుట, పశుపతయేచ = పశువులవంటివారికి అజ్ఞానులగుపురుషులకుఁ బాలకుఁడగువానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

పాపములఁ బోఁగొట్టువానికొఱకును అజ్ఞానులగుటచేఁ బశువులవంటివారగు పురుషులఁ బాలించువానికొఱకును నమస్కారము.

భ. శర్వాయచ=శృణాతిహినస్తి సర్వమన్తకాలే ఇతిశర్వః, ప్రలయకాలమునందు సమస్తమును హింసించువానికొఱకును, ఇతఁడు అగ్నిమూర్తి కధిష్ఠాత, పశుపతయేచ=బ్రహ్మాదిస్థావరాంతము లగుపశువులయొక్క పాలకుఁడగువానికొఱకును, ఇతఁడు భూమిమూర్తి కధిష్ఠాత, నమః = నమస్కార మగుఁగాక. ౩

న మో నీ ల గ్రీ వా య చ శి తి క ణ్ఠా య చ.

నమః - నీలగ్రీవాయ - చ - శితికణ్ఠాయ - చ. 3

నీలగ్రీవాయచ = నల్లనికంఠము గలవానికొఱకును, కాలకూటముధరించుటచే నల్లనైన కంఠమందలి యేకదేశము గలవానికొఱకు ననుట, శితికణ్ఠాయచ= తెల్లని కంఠముగలవానికొఱకును, తెల్లనైన తక్కినకంఠప్రదేశము గలవానికొఱకు ననుట, నమః=నమస్కార మగుఁగాక.

కాలకూటము ధరించుటచే నల్లనైన కంఠమునందలి యేకదేశము గలవానికొఱకు నమస్కారము, తెల్లనైన తక్కిన కంఠభాగముగల రుద్రునకు నమస్కారము.

భ. శితికణ్ఠాయచ= తెల్లనికంఠము గలవానికొఱకును, కాలకూటధారణముచే భగవంతుని కంఠమునందు వేయింట నొకభాగము మాత్రమె నల్లనైనది కావున తక్కిన కంఠమంతయు తెల్లగానే యుండునని భావము. లేక నల్లని కంఠము గలవానికొఱకును, "శితీధవళమేచకౌ" అని నిఘంటువు, పునరుక్తి యాదరార్థము, నమః=నమస్కార మగుఁగాక. తక్కినది సమానము. 3

---

న మః క ప ర్ది నే చ వ్యు ప్త కే శా య చ.

నమః - కపర్దినే - చ - వ్యుప్తకేశాయ - చ. ౪

కపర్దినేచ = జటాజూటము గలవానికొఱకును, వ్యుప్తకేశాయచ = ఛేదింపఁబడిన వెండ్రుకలు గలవానికొఱకును, ముండితమయిన శిరస్సు గలవానికొఱకుననుట. నమః = నమస్కార మగుఁగాక.

జటాజూటము ధరించి పాశుపతాదుల వేషముగలవాని

కొఱకును ముండితమయిన శిరస్సుధరించి సన్యాసి మొదలగు వారి వేషము గలవ నికొఱకును నమస్కారము.

భ. వ్యుప్త కేశాయచ = ముండితములయిన వెండ్రుకలు గలవాని కొఱకును, సగము ముండితములయిన కేశములు గలవాఁడు వ్యుప్తకేశుఁ డనఁ బడును. యజమానమూర్తిగలవానికొఱకు ననుట, నమః = నమస్కారమగుఁ గాక. ఇతఁడు యజమూర్తి కథిష్ఠాత. ౪

---

నమస్సహస్రాక్షాయ చ శతధన్వనే చ.

నమః - సహస్రాక్షాయ - చ - శతధన్వనే - చ. ౫

సహస్రాక్షాయచ = వేయికన్నులు గలవానికొఱకును, ఇంద్రరూప మున వేయికన్నులు గలవానికొఱకు ననుట, శతధన్వనేచ = నూఱుధనుస్సులు గలవానికొఱకును, వేయి భుజములుగలుగు నవతారముపొందినవాఁడగుటచే నూఱు ధనుస్సులు గలవానికొఱకుననుట, నమః = నమస్కార మగుఁగాక.

ఇంద్రరూపమున వేయికన్నులుగల రుద్రునకును వేయి భుజములుగల యవతారమునందు నూఱు ధనుస్సు లేక కాల మున ధరించిన రుద్రునికొఱకును నమస్కారము.

భ. సహస్రాక్షాయచ = పెక్కుకన్నులు గలవానికొఱకును, శతధన్వనేచ = పెక్కుధనుస్సులు గలవానికొఱకును, లేక, ధనుస్సు ఆయుధోపలక్ష కము, పెక్కాయుధములు గలవానికొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక. ౫

న మో గి రి శా య చ శి పి వి ష్టా య చ.

నమః - గిరిశాయ - చ - శిపివిష్టాయ - చ. ౬

గిరిశాయచ = కైలాసమను పర్వతమునందుండువానికొఱకును, శిపివిష్టాయచ = విష్ణురూపుఁడైనవానికొఱకును "విష్ణుశ్శిపివిష్టః" అని శ్రుతి. నమః = నమస్కార మగుఁగాక.

భక్తుల ననుగ్రహించుటకై కైలాస పర్వతమునందు ఉమామహేశ్వరరూపంబున వెలసియున్నవానికొఱకును సర్వలోకంబుల రక్షించుటకై విష్ణురూపము వహించువానికొఱకును నమస్కారము.

భ. గిరిశాయచ = కైలాసపర్వతమునందుండువానికొఱకును, లేక, ప్రశస్తమయిన గిరి (పర్వతము) గలవానికొఱకును, ప్రశస్తమయిన పర్వతమగు కైలాసము నివాసము గాఁగలవానికొఱకుననుట, లేక, గిరేః ఈశః, కైలాస పర్వతమునకు నాథునికొఱకును, గిరామ్ ఈశః, వాచకములగు వేదములకు ప్రణవమునకు నాథునికొఱకును, శిపివిష్టాయచ = ఆదిత్యస్వరూపునికొఱకును, "శైత్యాచ్ఛ యనయోగా ద్వాశీతి వారి ప్రచక్షతే, తత్పానా ద్రక్షణాద్వాపి శిపయో రశ్మయో మతాః, తేషు ప్రవిష్టస్సవితా శిపివిష్టస్తదోచ్యతే" శైత్యము వలనఁగాని శయనము గలుగుట వలనఁగాని శి యనఁగా జలమని చెప్పుచున్నారు. దానిని పానము చేయుటవలనఁగాని రక్షించుటవలనఁగాని శిపులు అనఁగా కిరణములు చెప్పఁబడును. ఆకిరణములందు ప్రవిష్టుఁడుగావున సూర్యుఁడు శిపివిష్టుండని చెప్పఁబడుచున్నాఁడు. అని స్కాందపురాణము. లేక, శిపులనఁగా పశువులు "యజ్ఞోవై విష్ణుః పశవశ్శిపిః" అని శ్రుతి. వానియందు విష్ణుఁడు అనఁగా ప్రవిష్టుఁడు, సర్వప్రాణులయందును, అంతర్యామిరూపమున వ్యాపించినవాఁడనుట, అట్టి రుద్రునికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౬

న మో మీ ఢు ష్ట మా య చే షు మ తే చ.

నమః - మీఢుష్టమాయ - చ - ఇషుమతే - చ. ౭

మీఢుష్టమాయచ = మేఘరూపమున మిక్కిలి వర్షించువానికొఱకును, ఇషుమతేచ = బాణములు గలవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

సర్వభూతములకును పోషణార్థమై మేఘరూపమున మిక్కిలి వర్షించువానికొఱకును, సాధువులను బాధించువారి శిక్షించుటకై బాణములు ధరించియుండువానికొఱకును నమస్కారము.

భ. ఇషుమతేచ = పెక్కుబాణములు గలవానికొఱకును, మహాశూరుని కొఱకు ననుట. తక్కినది సమానము. ౭

---

న మో హ్ర స్వా య చ వా మ నా య చ.

నమః - హ్రస్వాయ - చ - వామనాయ - చ. ౮

హ్రస్వాయచ = అల్పమయిన ప్రమాణముగలవానికొఱకును, పొట్టి వానికొఱకు ననుట, వామనాయచ = సంకుచితములయిన యవయవములు గలవానికొఱకును, పొట్టి యవయవములు గలవానికొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక.

పొట్టిశరీరము గలవానికొఱకును, పొట్టి యవయవములు గలవానికొఱకును నమస్కారము.

భ. సమానము. ౮

న మో బృ హ తే చ వ ర్షీ య సే చ.

నమః - బృహతే - చ - వర్షీయసే - చ ౯

**బృహతేచ = ఆకారముచే పెద్దయయినవానికొఱకును, వర్షీయసేచ = గుణములచే మిక్కిలి పెద్దయయినవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.**

ఆకారముచే గొప్పయయినవానికొఱకును గుణములచే నధికుఁడయినవానికొఱకును నమస్కారము. ౯

భ. సమానము.

---

న మో వృ ద్ధా య చ స ం వృ ధ్వ నే చ.

నమః - వృద్ధాయ - చ - సంవృధ్వనే - చ. ౧౦

వృద్ధాయచ = వయసుచే నధికునికొఱకును, సంవృధ్వనేచ = చక్కఁగా వేదములచే పొగడఁబడినవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

మిక్కిలి వయసుచెల్లినవానికొఱకును, వేదములచేఁ జక్కఁగా స్తుతింపఁబడినవానికొఱకును నమస్కారము.

భ. సంవృధ్వనేచ = మిక్కిలి వృద్ధునికొఱకును, ఎల్లప్పుడును స్తోత్రములచే వృద్ధిఁబొందుచున్నవానికొఱకు ననుట, లేక, భక్తులను జక్కఁగా వృద్ధిఁ బొందించువానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౧౦

న మో అ గ్రి యా య చ ప్ర థ మా య చ.

నమః - అగ్రియాయ - చ - ప్రథమాయ - చ. ౧౧

అగ్రియాయచ = మొదటనున్నవానికొఱకును, జగత్తు పుట్టుటకుముం దున్నవానికొఱకు ననుట, ప్రథమాయచ = ముఖ్యుఁడైనవానికొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక.

ప్రపంచము గలుగుటకు ముందున్నవానికొఱకును సభ యందు ఉత్తముఁడైనవానికొఱకును నమస్కారము.

భా. సమానము.

న మ ఆ శ వే చా జి రా య చ.

నమః - ఆశవే - చ - అజిరాయ - చ. ౧౨

ఆశవేచ = శీఘ్రముగా వ్యాపించువానికొఱకును, అజిరాయచ = గమ నమునందు సమర్థుఁడైనవానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ౧౨

సమస్త ప్రపంచమును శీఘ్రముగా వ్యాపించినవానికొఱ కును గమనమునందు సమర్థుఁడైనవానికొఱకును నమస్కారము.

భా. సమానము.

న మ శ్శీ ఘ్రి యా య చ శీ భ్యా య చ.

నమః - శీఘ్రియాయ - చ - శీభ్యాయ - చ. ౧౩

శీఘ్రియాయచ = వేగముగా నడచువానికొఱకును, శీభ్యాయచ = శీభ మనఁగా జలప్రవాహము, జలప్రవాహమునందున్నవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

శీఘ్రముగా నడచువానికొఱకును జలప్రవాహము నందున్నవానికొఱకును నమస్కారము.

భ. సమానము. ౧౩

---

న మ ఊ ర్మ్యా య చా వ స్వ న్యా య చ.

నమః - ఊర్మ్యాయ - చ - అవస్వన్యాయ - చ. ౧౪

ఊర్మ్యాయచ=తరంగములయందున్నవానికొఱకును, అవస్వన్యాయచ= ధ్వనిలేని జలమునందున్నవానికొఱకును, నమః = నమస్కార మగుగాక.

తరంగములయందున్న రుద్రునికొఱకును, నిలిచియుండుటచే ధ్వనిలేక యుండుజలమున నున్నవానికొఱకును నమస్కారము.

భ. సమానము. ౧౪

---

న మ స్స్రో త స్యా య చ ద్వీ ప్యా య చ.

నమః - స్రోతస్యాయ - చ - ద్వీప్యాయ - చ. ౧౫

ఇతి శ్రీయజుస్సంహితాయాం
చతుర్థకాణ్డే పఞ్చమ ప్రపాఠకే,
పఞ్చమోఽనువాకః.

స్రోతస్యాయచ=ప్రవాహము నందున్నవానికొఱకును, ద్వీప్యాయచ= జలమధ్యముననుండు భూమియందున్నవానికొఱకును, నమః = నమస్కార మగుగాక.

జలప్రవాహము నందున్న వానికొఱకును జలప్రవాహము నడుమనుండు భూమియందున్న వానికొఱకును నమస్కారము.

భ. ఇందు అధిష్ఠాన వ్యాపారభేదముచే భేదము నవలంబించి నమస్కారములు చెప్పఁబడినవి.

---

ఇది శ్రీమత్కవాటోపనామ సుందరరామప్రణీతం బగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందుఁ
బంచమానువాకము.

---

ఓం నమోభగవతే రుద్రాయ.

అథ షష్ఠానువాకః.

---

న మో జ్యే ష్ఠా య చ క ని ష్ఠా య చ.

నమః - జ్యేష్ఠాయ - చ - కనిష్ఠాయ - చ. ౧

పంచమానువాకమునందుఁ గొన్ని యన్యతరతో నమస్కారము లగు యజుస్సులు పఠింపఁబడినవి. షష్ఠానువాకమునందును మఱికొన్ని యట్టివే పఠింపఁబడును.

జ్యేష్ఠాయచ = విద్య యైశ్వర్యము మొదలగువానిచే నధికునికొఱకును, కనిష్ఠాయచ = అవిద్య మొదలగునవి తక్కువ యగుటవలన మిక్కిలిఅల్పుఁడైన వానికొఱకును, వారియిద్దఱికిని అంతర్యామియయిన రుద్రునికొఱకనుట, నమః = నమస్కార మగుఁగాక.

విద్య నైశ్వర్యము మొదలగువానిచే నధికుఁడైనవాని రూపముగల రుద్రునికొఱకును, అవి తక్కువయగుటచే నల్పుఁడైన వానిరూపముగల రుద్రునికొఱకును నమస్కారము.

భ. జ్యేష్ఠాయచ = మిక్కిలి వృద్ధునికొఱకును, లేక, మిక్కిలి యుత్తముఁడగువానికొఱకును, కనిష్ఠాయచ = మిక్కిలిచిన్నవానికొఱకును, లేక, మిక్కిలి తక్కువయయినవానికొఱకును, వీరియిద్దఱి రూపముగల రుద్రునికొఱకనుట, నమః = నమస్కార మగుఁగాక. ౧

---

న మః పూ ర్వ జా య చా ప ర జా య చ.

నమః - పూర్వజాయ - చ - అపరజాయ - చ. ౨

పూర్వజాయచ = ముందుపుట్టినవానికొఱకును, సృష్టికి మొదట హిరణ్యగర్భరూపమునఁ బుట్టినవానికొఱకును, అపరజాయచ = వెనుకనుబుట్టినవానికొఱకును, ప్రలయకాలమునందు కాలాగ్ని మొదలగువానిరూపమునఁ బుట్టినవానికొఱకును అనుట, నమః=నమస్కార మగుఁగాక.

సృష్టి యారంభమునందు హిరణ్యగర్భరూపమున నవతరించి జగత్తులను సృజించినవానికొఱకును, ప్రలయమప్పుడు కాలాగ్ని మొదలగువాని రూపమునఁ బ్రలయము గావించినవానికొఱకును నమస్కారము.

భ. పూర్వజాయచ=ముందుపుట్టినవానికొఱకును, సర్వప్రాణులు పుట్టుటకుముందును ఉన్నవానికొఱకును అనుట, ముఖ్యమయిన పుట్టుట యీశ్వరునందు సంభవింపదు కావున, సర్వప్రాణులును పుట్టుటకుముందు గలసత్తయే యిచ్చట నుపలక్షితమగుచున్నది. జన్మలేనివానికొఱకును, లేక అనాది

యయినవానికొఱకును అనిభావము. అపరజాయచ = వెనుకను ఉన్న వానికొఱకును, సమస్తప్రాణులు నశించిన వెనుకను ఉన్న వానికొఱకును అనుట, అనంతునికొఱకని భావము. నమః = నమస్కార మగుఁగాక. ౨

---

న మో మ ధ్య మా య చా ప గ ల్భా య చ.

నమః - మధ్యమాయ - చ - అపగల్భాయ - చ. 3

మధ్యమాయచ = మధ్యకాలమునందును పుట్టినవానికొఱకును, దేవనరతిర్యగాదిరూపమునఁ బుట్టినవానికొఱకును అనుట, అపగల్భాయచ = ఇంద్రియజ్ఞానములేని బాలునికొఱకును, ఇంద్రియములచే విషయములను జక్కఁగా గ్రహించుటకుఁ దెలియని మిక్కిలి శిశువైనవానికొఱకును అనుట, తద్రూపముగల రుద్రునికొఱకును అనిభావము. నమః = నమస్కార మగుఁగాక.

మధ్యకాలమున దేవమనుష్యతిర్యగాదిరూపమున నావిర్భవించినవానికొఱకును చక్కఁగా నింద్రియజ్ఞానముకలుగని శిశువురూపముగల రుద్రునికొఱకును నమస్కారము.

భ. మధ్యమాయచ = మధ్యకాలమునందును ఉన్నవానికొఱకును, అపగల్భాయచ = మిక్కిలి శిశువైనవానికొఱకును, తద్రూపునికొఱకును ననుట. నమః = నమస్కార మగుఁగాక. 3

న మో జ ఘ న్యా య చ బు ధ్ని యా య చ.

నమః - జఘన్యాయ - చ - బుధ్నియాయ - చ. ४

జఘన్యాయచ = జఘనమునందుఁ బుట్టినవానికొఱకును, గోవు మొదలగువానిజఘనమునందు అనఁగా పశ్చాద్భాగమందు దూడలు మొదలగువాని

రూపమునఁ బుట్టినవానికొఱకును, బుధ్నియాయచ = బుధ్నమునందును, అనఁగా మూలమునందుఁ బుట్టినవానికొఱకును, వృక్షాదులమూలములందు కొమ్మలు మొదలగువానిరూపమునఁ బుట్టినవానికొఱకును అనుట, నమః = నమస్కార మగుఁగాక.

ఆవులు మొదలగువాని పశ్చాద్భాగమునందు దూడలు మొదలగువానిరూపముచే నావిర్భవించినవానికొఱకును వృక్షములమూలమునందు కొమ్మలు మొదలగువానిరూపమునఁ బుట్టిన వానికొఱకును నమస్కారము.

భ, సమానము. ౪

---

న మ స్సో భ్యా య చ ప్ర తి స ర్యా య చ.

నమః - సోభ్యాయ - చ - ప్రతిసర్యాయ - చ. ౫

సోభ్యాయచ = ఉభాభ్యాం పుణ్యాపాపాభ్యాం సహావర్తతే ఇతిసోభః, తత్ర భవస్సోభ్యః, పుణ్యాపాపముల రెంటితోఁగూడిన మనుష్యలోకమున నున్న వానికొఱకును, ప్రతిసర్యాయచ = వివాహాదికర్మలయందు హస్తమునందు ధరించునట్టి రక్షాబంధము ప్రతిసరము, దానికి యోగ్యుఁ డయినవానికొఱకును, వివాహము మొదలగుకర్మలచే సంస్కరింపఁబడువాని రూపముగలవానికొఱకును అనుట, నమః = నమస్కార మగుఁగాక.

పుణ్యాపాపముల రెంటితోఁగూడిన మనుష్యలోకమున నున్నవానికొఱకును వివాహాదిసంస్కారములచే సంస్కరింపఁబడు పురుషుఁడు స్వరూపముగాఁ గలవానికొఱకును నమస్కారము.

భ. సోభ్యాయచ = సోభమనఁగా గంధర్వనగరము, సాల్వస్సోభమధిష్ఠాయ, సాల్వుఁడు సోభమునధిష్ఠించి యని సాల్వుని యాకాశగమనమగు నగరము సోభసంజ్ఞమని భారతము. ఇది నగరమాత్రమునకుపలక్షణము, ఎల్లనగరముల యందును ఉన్నవానికొఱకును, లేక, శీతోష్ణముల రెంటితోఁగూడినది సోభము ద్వంద్వములతోఁ గూడినదనుట, అట్టి శరీరమునం దున్నవానికొఱకును తక్కినది సమానము. ౫

న మో యా మ్యా య చ క్షే మ్యా య చ.

నమః - యామ్యాయ - చ - క్షేమ్యాయ - చ. ౬

యామ్యాయచ = యమలోకమునందుఁ బాపులను శిక్షించువాని రూపమున నున్నవానికొఱకును, క్షేమ్యాయచ = క్షేమమనఁగా మోక్షము, దానికి యోగ్యుఁడైనవానికొఱకును, జ్ఞానిస్వరూపునికొఱకును అనుట, నమః = నమస్కారమగుఁగాక.

యమలోకమునందుఁ బాపము చేసినవారి శిక్షించు యమునిరూపమున నుండువానికొఱకును ఆత్మాపరోక్షజ్ఞానము నొంది మోక్షము పొందువాని రూపముగలవానికొఱకును నమస్కారము.

భ. యామ్యాయచ=యమ మనఁగా ప్రలయకాలము, లేక, ప్రాణముల నిగ్రహము, అందున్నవానికొఱకును, లేక, యమునిపురము యామ్యము, అందున్నవానికొఱకును, క్షేమ్యాయచ = క్షేమమనఁగా రక్ష, లేక, మోక్షము, లేక, రక్షాస్థానము, అందున్నవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక. ౬

న మ ఉ ర్వ ర్యా య చ ఖ ల్యా య చ.

నమః - ఉర్వర్యాయ - చ ఖల్యాయ - చ. ౭

ఉర్వర్యాయచ = ఉర్వర. యనఁగా ఎల్లసస్యములతో నొప్పినభూమి, ధాన్యరూపమున దానికి యోగ్యుఁడైనవానికొఱకును, ఖల్యాయచ=ఖల మనఁగా ధాన్యము నుఱుచుభూమి,అందు పశువులను గట్టుటకుఁ బాఁతినగుంజ మొదలగు వానిరూపమున, ఆఖలమునకుఁ యోగ్యుఁడైనవానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

భూమియందు ధాన్యరూపమునఁ బుట్టినవానికొఱకును, ధాన్యము నుఱుచు కళ్లమునందు మేధి మొదలగువానిరూపమున నున్నవానికొఱకును నమస్కారము.

భ. ఉర్వర్యాయచ = సర్వసస్యములతోనొప్పు భూమియందున్నవానికొఱకును, ఖల్యాయచ=ధాన్యము నుఱుచు ప్రదేశమునందున్నవానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ౭

---

న మః శ్లో క్యా య చా వ సా న్యా య చ.

నమః - శ్లోక్యాయ - చ - అవసాన్యాయ - చ. ౮

శ్లోక్యాయచ = శ్లోకములనఁగా వైదికమంత్రములు, వానియందున్న వానికొఱకును, వైదిక మంత్రములచేఁ బ్రతిపాదింపఁబడువానికొఱకును అనుట, అవసాన్యాయచ = అవసాన మనఁగా వేదాంతము, అందున్నవానికొఱకును, వేదాంతముచేఁ బ్రతిపాదింపఁబడువానికొఱకును అనుట, నమః=నమస్కార మగుఁగాక.

వైదికమంత్రములచేఁ బ్రతిపాద్యుఁ డగుటచే వానియం దున్నవానికొఱకును, వేదాంతములచేఁ బ్రతిపాద్యుఁడగుటచే నవ్వేదాంతములయందున్నవానికొఱకును నమస్కారము.

భ. శ్లోక్యాయచ = పాదబద్ధమయిన అక్షరసముదాయము శ్లోకమనఁ బడును, దానియందుండువానికొఱకును, అవసాన్యాయచ = అవసానమనఁగా సర్వార్థముల యుపసంహారము, లేక, జీవితావసానము, అందున్నవానికొఱకును, లేక, శ్లోక్యాయచ = వేదములయం దున్నవానికొఱకును, అవసాన్యాయచ = వేదముల యవసానమయిన యుపనిషత్తునందున్నవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౮

న॒మో॒ వ॒న్యా॑య చ॒ కక్ష్యా॑య చ.

నమః - వన్యాయ - చ - కక్ష్యాయ - చ. ౯

వన్యాయచ=అడవియందున్నవానికొఱకును, అడవియందున్న వృక్షాది రూపమున నున్నవానికొఱకును అనుట, కక్ష్యాయచ=బోదెలేనిచెట్లయందున్న వానికొఱకును, అందు లతాదిరూపమున నున్నవానికొఱకును అనుట, నమః = నమస్కార మగుఁగాక.

అడవియందు వృక్షాదిరూపమున నున్నవానికొఱకును గుల్మములయందు లతాదిరూపమున నున్నవానికొఱకును నమస్కారము.

భ. ఇవి భూమి మూర్త్యధిష్ఠాతృ భేదములు. ౯

న మ శ్శ్రి వా య చ ప్ర తి శ్రి వా య చ.

నమః - శ్రవాయ - చ - ప్రతిశ్రవాయ - చ. ౧౦

శ్రవాయచ=శ్రూయత ఇతి శ్రవః శబ్దః, వినఁబడునది కావున శ్రవమనఁగా శబ్దము, శబ్ద స్వరూపునికొఱకును, ప్రతిశ్రవాయచ = ప్రతిధ్వని స్వరూపునికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

శబ్దము స్వరూపముగాఁ గలవానికొఱకును బ్రతిధ్వని స్వరూపముగాఁ గలవానికొఱకును నమస్కారము.

భ. శ్రవాయచ=శబ్దస్వరూపుని కొఱకును, లేక, అంతటనువినఁబడుచుఁ బ్రసిద్ధుఁడైన వానికొఱకును, ప్రతిశ్రవాయచ = ప్రతిధ్వని స్వరూపునకును, లేక, ప్రత్యుత్తరము స్వరూపముగాఁ గలవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౧౦

---

న మ ఆ శు షే ణా య చా శు ర థా య చ.

నమః - ఆశుషేణాయ - చ - ఆశురథాయ - చ. ౧౧

ఆశుషేణాయచ = శీఘ్రముగా నడచునట్టి సేన గలవానికొఱకును, ఆశురథాయచ = శీఘ్రముగాఁ బోవునట్టి రథము గలవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

భక్తులరక్షించుటకై, శీఘ్రముగా నడచునట్టి సేనగలవానికొఱకును వేగముగాఁ బోవునట్టి రథము గలవానికొఱకును నమస్కారము.

భ. సమానము. ౧౧

న మ శ్శూ రా య చా వ భి న్ద తే చ.

నమః - శూరాయ - చ - అవభిన్దతే - చ. ౧౨

శూరాయచ = యుద్ధమునందు ధైర్యము గలవానికొఱకును, అవభిన్దతేచ = శత్రువులను బగులఁగొట్టువానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

యుద్ధములందు భయములేక ధైర్యము గలవానికొఱకును శత్రువుల వధించువానికొఱకును నమస్కారము.

భ. అవభిన్దతేచ=భక్తులయొక్క శత్రువులను అప్రయత్నముగా భేదించువానికొఱకును, ధర్మమునకు శత్రువులయినవారి శిరస్సును పగల్చువానికొఱకును. ౧౨

---

న మో వ ర్మి ణే చ వ రూ థి నే చ.

నమః - వర్మిణే - చ - వరూథినే - చ. ౧౩

వర్మిణేచ=కంచుకము గలవానికొఱకును, వరూథినేచ=మంచిగృహము గలవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

కవచము ధరించినవానికొఱకును ఉత్తమమయిన గృహము గలవాని కొఱకును నమస్కారము.

భ. సమానము. ౧౩

---

న మో బి ల్మి నే చ క వ చి నే చ.

నమః - బిల్మినే - చ - కవచినే - చ. ౧౪

బిల్మినేచ = బిలముగలది బిల్మము, శిరఃకవచము బొమిడికము, అదిగల వానికొఱకును, కవచినేచ = దేహమునకు రక్షకము కవచము. అది గలవాని కొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

---

శిరస్త్రాణము ధరించినవానికొఱకును కవచము దాల్చిన వాని కొఱకును నమస్కారము.

భ. బిల్మినేచ = బొమిడికము గలవానికొఱకును, భస్మపాత్రము గలవాని కొఱకని కొందఱు, "బిల్మం భాజనమ్" అని నైరుక్తులు, కవచినేచ = శరీరరక్ష గలవానికొఱకును, లేక, కవచమనఁగా పాదములపఱకు వ్రేలాడుకంచుకము, అది గలవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

---

న మ శ్శ్రు తా య చ శ్రు త సే నా య చ.

నమః - శ్రుతాయ - చ - శ్రుతసేనాయ - చ. ౧౫

ఇతి శ్రీమద్యజుస్సంహితాయాం - చతుర్థకాణ్డే,
పఞ్చమప్రపాఠకే, షష్ఠోఽనువాకః.

---

శ్రుతాయచ = వేదములయందుఁ బ్రసిద్ధుఁడైన వానికొఱకును, వేదములవలననె తెలియఁబడువాఁడనియు ఇతర ప్రమాణములవలనఁ దెలియరాని వాఁడనియు భావము. శ్రుతసేనాయచ = ప్రసిద్ధమయిన సేన గలవాని కొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

వేదములవలననే ప్రసిద్ధుఁడైన వానికొఱకును వేదములయందు ప్రసిద్ధములయిన సేనలు గలవానికొఱకును నమస్కారము.

భ. శ్రుతసేనాయచ=శ్రుతియందు ప్రసిద్ధమయిన సేన గలవానికొఱ కును, దేవుని యాయుధములు బాణాదులేవి చెప్పఁబడినవో, అవియు శ్రుతి ప్రసిద్ధములే యనుట. ౧౫

---

ఈరెండనువాకములకును దేవత భగవంతుఁడగు శంభువు, అతఁడేఋషి, ఛందస్సు మహావిరాట్టు. వీనికిఁ బురశ్చరణము. మూఁడురాత్రులు చరుభోజి యై దీక్షించి పిదపఁ బదునొకండు దినములు నిరంతరము జపముసేయవలెను. పురశ్చరణ మగును.

ఇఁకఁ బ్రయోగము. అందు రాజులకు మొదటఁ జెప్పఁబడుచున్నది. ఈరెండనువాకములు పదునొకండుమాఱులు జపించుచుఁ బ్రతినమస్కారమును, లింగముమీఁద శ్వేతకమలములు వేయునది, ఇట్లు ప్రతిదినము ఒకమాసము సేయవలెను. అటుపిమ్మట దక్షిణామూర్తిసన్నిధిని బదునొకండుగురు బ్రాహ్మణుల భుజింపఁజేయునది. రాజ్యశ్రీ వర్ధిల్లును. రాజు జన్మదినమునందు వాని యగ్ని యందుఁగాని మథితాగ్నియందుఁగాని నేతితోఁ దడుపఁబడిన యశ్వత్థ సమిధలు ఇరువదియొక్కవేలును, దూర్వలు పదునొక్కవేలును వేల్వవలయును. ఇట్లు చేసినచో రాజునకు జయము నాయువును వృద్ధిఁబొందును. ప్రతి మాసము, నీయనువాకముల లక్షమాఱులు జపించినచో ఎల్లప్పుడును విజయము గలుగును. యుద్ధము వచ్చినపుడు రాజునకువండునట్టి మహానసంబున వండిన సోపదంశమగు నన్నము దధిమధుఘృతంబులచేఁ దడిపి, యీయనువాకములు పదునొకండు మాఱులు జపించుచుఁ బ్రతినమస్కారము వేల్చి, శేషము భూమి యందు బలి యుంచి, దానింకీసి జలమునంగలిపి శత్రుసేనవైపు చల్లవలెను. ఆసేన శీఘ్రమున నష్ట మగును. అట్లె యాజ్యమునందడిపిన శుద్ధ తండులములచే హోమముచేసి శేషము శత్రువున కభిముఖముగా వేయునది. ఆశత్రువు నశించును. రాజునాయుధములన్నియు స్పృశించి వీనిచే వేయిమాఱు లభి మంత్రించునది. ఆయాయాయుధంబులకుఁ దేజస్సు వర్ధిల్లును. ఇఁక శత్రుసైన్య

స్తంభనము, ప్రతినమస్కారమును 'పరసేనా స్తంభం కరోమి స్వాహా" అని పఠించుచు జిల్లేడు సమిధలచే లక్ష వేల్వవలయును. శత్రుసేన స్తంభితమగును. వీనిచేతనే రాజు భోజ్యవస్తువులన్నియు నభిమంత్రించునది. అవి యమృతము లగును. పరరాజ్య ప్రజల శోషణము గోరినవాఁడు ఇట్లు ప్రయోగించునది. నదీ మధ్యంబున శూద్రునిచేఁ దేఁబడిన యగ్నియందు హారిణవరాహశశకపింజల కలవింక మృగంబుల మాంసములచే నొకొకటి చేతను లక్షహోమము చేయ వలెను. ఆహుతి ప్రమాణములయిన యపూపములును లక్ష వేల్వవలయును. ప్రతినమస్కారమును "పరరాష్ట్ర ప్రజాశోషణం కరోమి స్వాహా" అని పఠింపవలెను. ఇట్లు చేసినచో పరరాష్ట్ర ప్రజలు శోషింతురు. వీనికి సువర్ణము రజతము గోవులు భూమి వస్త్రము మొదలగునవి దక్షిణయిచ్చునది. ఇట్లు రాజులకు.

ఇఁక నితరులకుఁ జెప్పఁబడుచున్నది. అనపత్యలగు స్త్రీలకుఁ బుత్రోత్పత్తికొఱకు దధిమధు ఘృతములచేఁ దడుపఁబడిన యత్తి సమిధలు స్వాగ్ని యందుఁ బ్రతినమస్కార మొక్కొకటిచొప్పున నిరువది యొక్క వేలు వేల్చునది. నమస్కార సంఖ్యగలవి తంతువేష్టితములు నూతనవస్త్రావృతములు జలపూర్ణములగు కలశములచేఁ బ్రతినమస్కార మభిషేకము చేయ వలెను. ఎనిమిదివేలావృత్తులు జపింపవలెను. పిమ్మట ఈయనువాకములు పఠించుచు ఏడు నాడికలకాలము మహాదేవు నభిషేకింపవలెను. వీని జపించుచు నెనిమిదివేలు ప్రదక్షిణములు చేయవలెను. పిండిచే పిండము గావించి దాని వీనిచే నభిమంత్రించి భుజింపఁ జేయునది. నదీతీరమునఁ బ్రతినమస్కారము శమీపత్త్రములు వేయుచు వీనిని బదునొకండుమాఱులు జపింపవలెను. ఈ ప్రయోగములు చేసినయెడ శుద్ధలగు స్త్రీలకు రుద్రతుల్యుఁడగు పుత్త్రుండు జనించును. క్రమంబుగా ముప్పదియెనిమిది నలుపదియెనిమిదేండ్ల వయసుగల జాయాపతులు గావించినను, తప్పక పుత్త్రుం బొందఁగలరు. ఆకుమారుఁడు వంశకరుఁడై శివభక్తుఁడై యుండును. అతనిహస్తంబుల శూలరేఖ యొప్పును.

ఘృతపాయసము వండి యీయనువాకముల చేత నెనిమిదివేలాహుతులు వేల్చినయెడ జన్మాంతరమునందు బ్రాహ్మణుఁడై జనించును. వీనిచేనొక సూత్రము నభిమంత్రించి గర్భిణీహస్తమున బంధించినచో గర్భము సురక్షితమగును. కుమారగ్రహము మొదలగువానిచే నావిష్టులగువారలకు వీనిచే నభిమంత్రితములగు భస్మతోను ధూపముతోను రక్ష సేయుచునది. రాత్రికాలముల జుట్టు వీడకుండునట్లు ముడివేయునది. కుమార గ్రహాదిభయము తొలఁగును.

ధ్యానము.

గౌరీకరామ్బుజన్యస్తస్వర్ణశైలశరాసనమ్,
ఇషుహస్తం రథారూఢం నరనారీతనుం స్మరేత్.

పార్వతి హస్తమున మేరు ధనుస్సు పట్టినవాఁడును స్వహస్తమున బాణము దాల్చినవాఁడును రథారూఢుండునగు నర్ధనారీశ్వరుని ధ్యానింపవలెను అని దీనియర్థము.

ఇది శ్రీమత్కవాటోపనామ సుందరరామప్రణీతం బగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందు
షష్ఠానువాకము.

---

ఓం నమో భగవతే రుద్రాయ.

అథ సప్తమానువాకః.

---

న మో దు న్దు భ్యా య చా హ న న్యా య చ.

నమః - దున్దుభ్యాయ - చ - ఆహనన్యాయ - చ. ౧

సప్తమానువాకమునందును మఱికొన్ని యన్యతరలో నమస్కారములగు యజుస్సులే పఠింపఁబడుచున్నది.

దున్దుభ్యాయచ = భేరియందుఁ బుట్టినవానికొఱకును, తదీయధ్వని రూపుఁడైన వాని కొఱకు ననుట, ఆహనన్యాయచ = ఆహన్యతే అనేనేతి ఆహననః, భేరి యిందుచేఁ గొట్టఁబడునుగావున ఆహనన మనఁగా వాయించు దండము, అందుఁ బుట్టినవాని కొఱకును, అందుఁ దాడనరూపమునఁ బుట్టినవాని కొఱకును అనుట, నమః = నమస్కార మగుఁగాక.

భేరియందు శబ్ద రూపమునఁ బుట్టినవానికిని దాని వాయించు దండమునందు తాడనరూపమునఁ బుట్టినవానికిని నమస్కారము.

భ. దున్దుభ్యాయచ = భేరియందుఁ బుట్టినవాని కొఱకును, తద్ధ్వని రూపుని కొఱకనుట, అట్లు ప్రసిద్ధమయిన మహిమ గలవాని కొఱకునని భావము. లేక, దుందుభి మొదలగు వాద్యములయందున్నవానికొఱకును, ఆహనన్యాయచ = దానివాయించు దండమునందున్నవాని కొఱకును. నమః=నమస్కార మగుఁగాక. ౧

---

న మో ధృ ష్ణ వే చ ప్ర మృ శా య చ.

నమః - ధృష్ణవే - చ - ప్రమృశాయ - చ. ౨

ధృష్ణవేచ = యుద్ధమునందు వెనుదీయని వానికొఱకును, ప్రమృశాయచ = శత్రుసైన్యవృత్తాంతము విచారించువానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

యుద్ధమునందు వెనుదీయక పోరువానికిని శత్రుసైన్యముల వృత్తాంతమునారయునట్టి రుద్రునకును నమస్కారము.

భ. ధృష్ణవే = తిరస్కరించుట స్వభావముగాఁ గలవానికొఱకును, లేక, సమస్తలోకములను రక్షింప సమర్థునికొఱకును, ప్రమృశాయచ = అందఱను

బరామర్శించుటయందు సమర్థునికొఱకును, పండితునికొఱకును, మఱియొకఁడు చెప్పుచున్నాఁడు. ప్రమృశాయచ = ఉత్తమమయిన స్వభావము గలవాని కొఱకును, అంగఖుడు స్వర్గాది శ్రేయస్సునకుఁగాని నిశ్శ్రేయసమునకుఁగాని తమ కార్యార్థమే దేవుని భజించుచున్నారు. దేవుఁడో, తానవియంతయుఁ దన కొఱకె యైనట్లు దలఁచి వారల కవియిచ్చి రక్షించుచున్నాఁడు, కాఁబట్టి యుత్తమ స్వభావుఁడని చెప్పఁబడినది, నమః=నమస్కార మగుఁగాక. ౨

---

న మో దూ తా య చ ప్ర హి తా య చ.

నమః - దూతాయ - చ - ప్రహితాయ - చ. 3

దూతాయచ=వృత్తాంతముఁ దెలుపుటయందు నేర్పరి యయినవాని కొఱకును, ప్రహితాయచ = ప్రభువుచేఁ బంపఁబడిన పురుషుని కొఱకును, తద్రూపుఁడైన రుద్రునికొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక.

తనస్వామికిఁ బరులవృత్తాంతముఁ దెలుపుటకు సమర్థుఁడైనవాని, రూపముగలవానికిని, తనస్వామిచేఁ బంపఁబడినవాని రూపముగలవానికిని నమస్కారము.

భ. భక్తుల రక్షించుటకై దూత కృత్యాదులుకూడ భగవంతుఁడు చేయుచున్నాఁడని చెప్పఁబడుచున్నది. దూతాయచ = వృత్తాంతము కొనిపోవువాని కొఱకును, దేవుఁడు శ్రీకరకృష్ణార్థమయి దూతునిరూపమునుకూడ చేకొను ననుట, లేక, అగ్నిరూపమున దేవతలకు దౌత్యము చేయువానికొఱకును, ప్రహితాయచ=పంపఁబడువానికొఱకును, కార్యార్థము పంపఁబడునట్టి సేవకుని కొఱకును, భక్తవాత్సల్యమున నట్టిదియు దేవుఁడు చేయువాఁడనుట. లేక, అగ్నిరూపమున దేవతలయొద్దకు యజమానునిచేఁ బంపఁబడినవానికొఱకును, లేక, మిక్కిలి హితునికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. 3

న మో ని ష ఙ్గి ణే చే షు ధి మ తే చ.

నమః - నిషఙ్గిణే - చ - ఇషుధిమతే - చ. ౪

నిషఙ్గిణేచ=ఖడ్గముగలవానికొఱకును, ఇషుధిమతేచ=అమ్ముల పొదులు గలవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

ఆశ్రితులరక్షించుటకై ఖడ్గమును అమ్ములపొదులును దాల్చియుండునట్టి రుద్రునకు నమస్కారము.

భ. ఈరెండు విశేషణములును మున్ను చౌర్యసాధనత్వాభిప్రాయమునఁ బఠింపఁబడినవి. ఇప్పుడు రక్షణ సాధనత్వాభిప్రాయము నని భేదము తెలియఁగునది. భూతరక్షణార్థము దేవుఁ డాయుధగ్రహణముగూడ గావించునని భావము. ౪

---

న మ స్తీ క్ష్ణే ష వే చా యు ధి నే చ.

నమః - తీక్ష్ణేషవే - చ - ఆయుధినే - చ. ౫

తీక్ష్ణఇషవేచ = కఱకులయిన బాణములు గలవానికొఱకును, ఆయుధినేచ = పెక్కు ఆయుధములు గలవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

వాఁడియయిన బాణములు గలవానికిని అసంఖ్యములగు నాయుధములు దాల్చినవానికిని నమస్కారము.

భ. సమానము. ౫

న మ స్స్వా యు ధా య చ సు ధ న్వ నే చ.

నమః - స్వాయుధాయ - చ - సుధన్వనే - చ. ౬

సుఆయుధాయచ=మంగళకరమయిన త్రిశూలరూపమగు నాయుధము గలవానికొఱకును, సుధన్వనేచ=మంగళకరమయిన పినాకమను ధనుస్సుగలవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

త్రిశూల మను మంగళకరమయిన యాయుధముకలవానికిని పినాకమను మంగళకరమయిన ధనుస్సుగలవానికిని నమస్కారము.

భ. స్వాయుధాయచ = శోభనమయిన ఆయుధముగలవానికొఱకును. లేక, వ్యర్థముకాని యాయుధముగలవానికొఱకును, లేక, ఆయుధము గలవాఁడు ఆయుధుఁడు, శోభనాకారుఁడైన ఆయుధుఁడు స్వాయుధుఁడు అట్టివానికొఱకును, దేవుఁడే తనయాయుధములు ధరింప నర్హుఁడు కావున, లోకోత్తరసుందరములయిన ఆయుధములను మించునట్టి లోకోత్తర సౌందర్యము గలవాఁడనుట, సుధన్వనేచ=శోభనమయిన ధనుస్సుగలవానికొఱకును, ప్రధానమగుటచే ధనుస్సు వేఱుగాఁజెప్పఁబడినది, లేక కాంచనపర్వతరూప మగుట వలన సర్వాయుధములయందు నుత్తమమని దెలుపుటకై వేఱుగఁ బ్రతిపాదింపఁబడినది. ౬

---

న మ స్స్రు త్యా య చ ప థ్యా య చ.

నమః - స్రుత్యాయ - చ - పథ్యాయ - చ. ౭

స్రుత్యాయచ=స్రుతియనఁగా కాలిదారి, దానికిఁదగినవానికొఱకును, లేక, అందున్నవానికొఱకును, పథ్యాయచ = పథమనఁగా రథము మొదలగునవి

సంచరించుటకుఁదగిన గొప్పమార్గము, దానికిఁదగినవానికొఱకును, లేక అందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

భక్తుల రక్షించుటకై కాలిదారులయందుఁ దిరుగువాఁడును రాజమార్గములందు సంచరించువాఁడునగు రుద్రునకు నమస్కారము.

భ. సమానము. ౭

---

న మః కా ట్యా య చ నీ ప్యా య చ.

నమః - కాట్యాయ - చ - నీప్యాయచ. ౮

కాట్యాయచ = కాట మనఁగా కొంచెముగా నీటిపాఱుదలగలకాలువ, అందున్నవానికొఱకును, నీప్యాయచ = నీప మనఁగాఁ బర్వతశిఖరమునుండి జలముపడు ప్రదేశము, అందున్నవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

కాలువయందు జలరూపమున నున్నరుద్రునకును, సెలయేఱులయందు జలరూపమున నున్నరుద్రునకును నమస్కారము.

భ. కాట్యాయచ = కాటమనఁగా నూయి, అందున్నవానికొఱకును, లేక, కాటమనఁగా కటియందు భవము, లింగము దానియందున్నవానికొఱకును, నీప్యాయచ=జలము వెడలు ప్రదేశము నీప మనఁబడును, అందున్నవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౮

---

న మ స్సూ ద్యా య చ స ర స్యా య చ.

నమః - సూద్యాయ - చ - సరస్యాయ - చ. ౯

సూద్యాయచ = సూద మనఁగా బురదగానుండు ప్రదేశము, అందున్న వానికొఱకు, సరస్యాయచ = కొలనియందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

బురద ప్రదేశమునందు జలరూపమున నున్న వాఁడును, కొలఁకులయందు జలరూపమున నున్న వాఁడు నగు రుద్రునకు నమస్కారము.

భ. సమానము. ౯

---

న మో నా ద్యా య చ వై శ న్తా య చ.

నమః - నాద్యాయ - చ - వైశన్తాయ - చ. ౧౦

నాద్యాయచ = నదియందున్న వానికొఱకును, నదియందు జలరూపమునున్న వానికొఱకు ననుట, వైశన్తాయచ= వేశంతమనగా చిన్నకొలను, దానియందు జలరూపమున నున్న వానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

నదియందు జలరూపముననున్న రుద్రునకును అల్పసరస్సులయందు జలరూపముననున్న రుద్రునకును నమస్కారము.

భ. నాద్యాయచ = నాద్యమనఁగా నదియందలిజలము, దానియందున్న వానికొఱకును, వైశన్తాయచ = వేశంతమనఁగా అల్పసరస్సు, దానియందున్న వానికొఱకును, లేక దేవతర్పణము మొదలగువానికొఱకు, ఎచట జలముంచఁబడునో, ఆదేవఖాతములగు సరస్సులు వేశంతము లనఁబడును. వానియందు జలరూపముననున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

న మః కూ ప్యా య చా వ ట్యా య చ.

నమః - కూప్యాయ - చ - అవట్యాయ - చ. ౧౧

కూప్యాయచ = నూతియందున్న వానికొఱకును, నూతియందు జలరూపమున నున్న వానికొఱకు ననుట, అవట్యాయచ = అవటమనఁగా పల్లము, దానియందు జలరూపముననున్న వానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

నూతియందు జలరూపముననున్న రుద్రునకును పల్లములయందు జలరూపముననున్న రుద్రునకును నమస్కారము.

భ. సమానము. ౧౧

న మో వ ర్ష్యా య చా వ ర్ష్యా య చ.

నమః - వర్ష్యాయ - చ - అవర్ష్యాయ - చ ౧౨

వర్ష్యాయచ = వర్షజలమునం దున్న వానికొఱకును, అవర్ష్యాయచ = వర్షజలము కానట్టి సముద్రాదిజలమునం దున్న వానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

వర్షమువలనఁగలుగు జలమునందున్న వానికిని, వర్షముచేఁగలుగని సముద్రాదిజలమునందున్న వానికిని నమస్కారము.

భ. సమానము. ౧౨

న మో మే ఘ్యా య చ వి ద్యు త్యా య చ.

నమః - మేఘ్యాయ - చ - విద్యుత్యాయ - చ. ౧౩

మేఘ్యాయచ=మేఘములయందున్నవానికొఱకును, విద్యుత్యాయచ= మెఱపులతోఁగూడ నుండువానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

మేఘములయందున్న రుద్రునికిని మెఱపులతోఁ గూడ నుండు రుద్రునకును నమస్కారము.

భా. సమానము. ౧3

న మ ఈ ధ్రి యా య చా త ప్యా య చ.

నమః - ఈధ్రియాయ - చ - ఆతప్యాయ - చ. ౧౪

ఈధ్రియాయచ = ఈధ్రమనఁగా నిర్మలమగుటచేఁ బ్రకాశించునట్టి శరత్కాలమేఘము, అందున్నవానికొఱకును, ఆతప్యాయచ = ఎండతోఁగూడ వర్షించువర్షము ఆతప్యము, అందున్నవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

శరత్కాలమునందు జలములేనిదగుటచే నిర్మలమయి ప్రకాశించుచుండు మేఘమునందున్నవానికిని, ఎండకాయు నప్పుడు వర్షించువర్షమునందున్నవానికిని నమస్కారము.

భా. ఈధ్రియాయచ = (అర్థాంతరము) అగ్నిమొదలగువానిసంయోగముచే కాఁచబడిన జలమునందున్నవానికొఱకును, ఆతప్యాయచ=ఎండయందున్నవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక. ౧౪

---

న మో వా త్యా య చ రే ష్మి యా య చ.

నమః - వాత్యాయ - చ - రేష్మియాయ - చ. ౧౫

వాత్యాయచ=గాలితోఁగూడిన వానయందుండువానికొఱకును, శ్లేష్మియాయచ=శ్లేష్మమనఁగా, రిష్యన్తిభూతానిఅత్ర, ఇందుభూతములు నశించును, కావునఁబ్రలయకాలము, అప్పుడు గలుగునది ఱాలుమొదలగునవి వర్షించునట్టి వర్షము శ్లేష్మియము, తద్రూపుఁడైనవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

గాలితోఁగూడిన వానయందున్నవానికిని, ప్రళయకాలము నందుఁ గురియునట్టి పాషాణాదిసహితమయిన వర్షముయొక్క రూపముగలవానికిని నమస్కారము.

భ. శ్లేష్మియాయచ = ప్రలయకాలమునందుఁ బాషాణాదులవర్షించునట్టి సంవర్తమనెడువాయువు శ్లేష్మము, దానియందున్నవానికొఱకును, కొందఱు శ్లేష్మమనఁగా గ్రీష్మర్తువందురు. మఱికొందఱు, గాలికిరేఁగునట్టిదుమ్ము శ్లేష్మమని యెదరు. వానియందున్నవానికొఱకును, అని యర్థము. నమః = నమస్కార మగుఁగాక. ౧౫

---

న మో వా స్త వ్యా య చ వా స్తు పా య చ.

నమః - వాస్తవ్యాయ - చ - వాస్తుపాయ - చ. ౧౬

ఇతి శ్రీయజుస్సంహితాయాం చతుర్థకాణ్డే
పఞ్చమప్రపాఠకే, సప్తమోఽనువాకః.

---

వాస్తవ్యాయచ = వస్తువనఁగా గోవులు అశ్వములు మొదలయినపదార్థములరూపముగలధనము, అందు అధ్యైకార్యరూపమననున్నవాఁడు వాస్తవ్యుఁడు, అట్టివానికొఱకును, వాస్తుపాయచ = వాస్తువనఁగా గృహమునిర్మించుచోటు, దానిపాలించువానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

గవాశ్వాదిపదార్థరూపమయిన ధనమునందు తత్తత్కార్య రూపమున నున్నవానికిని, గృహమునిర్మించునట్టి క్షేత్రమును బాలించువానికిని నమస్కారము.

భ. వాస్తవ్యాయచ=(అర్థాంతరము) గృహమునిర్మించు చోటునందున్న వానికొఱకును, వాస్తుపాయచ = గృహమునిర్మించుచోటును బాలించువాని కొఱకును, నమః = నమస్కారము. ౧౬

---

ఈయనువాకమునకు ఋషి హేమకోశుఁడు, దేవత శ్రీరుద్రుఁడు, ఛందస్సుమహాపంక్తి. ఇఁక దీనిపురశ్చరణము. ఒకయుపవాసముచేసి యెనిమిది నూర్లు జపించునది, పురశ్చరణవంతుఁడగును.

ప్రయోగము. బ్రాహ్మణ క్షత్రియవైశ్యశూద్రుల వశీకారము గోరిన వాఁడు క్రమముగా అశ్వత్థోదుంబరవటప్లక్ష సమిధలను దధిమధుఘృతములచేఁ దడిపి, పదివేలు వేల్వవలయును, వారలు వశ్యులగుదురు. మేథాకాముఁడు కపిలగోవునేతిని ఐదువేలు వేల్చునని. మేధావియగును. పుష్టికాముఁడు అపూప ములు తొమ్మిదివేలు హోమముసేయవలెను. ఆరోగ్యకాముఁడు దధిమధుఘృత ములచేఁ దడుపఁబడిన ఖదిరసమిధలైదువేలు వేల్వవలయును. సౌందర్యముగోరు వాఁడు దధిమధుఘృతంబులం దడిపిన మావిచివురులు పదివేలు వేల్చునది. శ్రీకా ముఁడు వనమునందు తనయాకారమంత ప్రమాణముగల కుండము ద్రవ్వి యందు మథితాగ్నిఁ బ్రతిష్ఠించి, పెరుఁగుమొదలగువానిచేఁ దడుపఁబడిన తెల్లదామర పూవు లైదువేలు వేల్వవలయును. అతనికి సాక్షాల్లక్ష్మి ప్రసన్నయగును. తత్ప్ర సాదమునంజేసి భూమియుండుదనుక నాతనివంశము ప్రవర్ధమానమగుచుండును. ప్రత్తివస్త్రములఁగోరువాఁడు ప్రత్తివిత్తనములఁ దేనియందడిపి పదివేలువేల్చి నచోఁ బ్రత్తిపుట్టములఁ బెందును. గోవులుకోరువాఁడు, గోవులమందయందు నీయనువాకము జపించుచుఁ బదివేలు ప్రదక్షిణములుచేయునది, గోవులంబడ

యును. పుత్త్రకాముఁడు పెరుఁగు మొదలగువానితోఁ దడుపఁబడిన మోదుగ సమిధలు పదివేలు వేల్వవలయును. అతనికి వంశకరుండగు పుత్త్రుండు లభించును. ఆయుష్యము గోరువాఁడు ప్రతివర్షము నేతిచేఁ దడుపఁబడిన దూర్వలు పదివేలు వేల్చుచుండునది, నూఱేండ్లు జీవించును. విద్యాకాముఁ డాజ్యముచేఁ దడుపఁబడిన యశ్వత్థ సమిధలు లక్షహోమము సేయునది, సర్వవిద్యాపారీణుఁ డగును. రాజ్యము నపేక్షించువాఁడు తేనియందడిపిన సౌగంధికంబు లైదులక్షలు వేల్చినయెడ సామ్రాజ్యము నొందును.

ఇఁక మోక్షోపాయము చెప్పఁబడును. అందు మొదటఁ జాంద్రాయణ కృచ్ఛ్రము చరించునది, పిమ్మట, నీయనువాకము నిరువదియైదువేలమార్లు జపించి యటువెనుక నైదువేలమార్లు ప్రదక్షిణములు ప్రాణాయామములు చేయవలెను. అటుపిమ్మట, శంభుసన్నిధానమునఁ దనయగ్నియందు మధుఘృతములచేఁ దడుపఁబడిన పలాశాశ్వత్థసమిధల మూఁడులక్షల వేలువవలయును. శంభుప్రసాదమున మోక్షముపొందును. తద్వంశజులగు నితరులును రౌరవనరకంబున బాధింపఁబడుచుండువారు గూడ, కైలాసమునొంది యచ్చట రమింతురు. ఐదుగురింద్రులు కడచనువఱకును, ఈభూమి నిలిచియుండుదనుకను, తద్వంశము వర్ధిల్లును.

## ధ్యానము.

జటాభిర్లమ్బమానాభిర్నృత్యన్తమభయప్రదమ్,
దేవం శుచిస్మితం ధ్యాయేద్వ్యాఘ్రచర్మపరిష్కృతమ్.

వ్రేలాడుచున్న జడలతోఁ గూడినవాఁడై నృత్యము సేయుచున్నవాఁడును అభయమునిచ్చువాఁడును స్వచ్ఛమైన చిఱునగవుగలవాఁడును వ్యాఘ్రాజినముచే నలంకరింపఁబడినవాఁడునగు దేవుని ధ్యానింపవలెను. అని దీనియర్థము.

ఇది శ్రీమత్ఖవాటోపనామ సుందరరామ ప్రణీతంబగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందు
సప్తమానువాకము.

ఓం నమో భగవతే రుద్రాయ.

అథాష్టమానువాకః.

---

న మ స్సో మా య చ రు ద్రా య చ.

నమః - సోమాయ - చ - రుద్రాయ - చ. ౧

సప్తమానువాకంబునఁ గొన్ని యన్యాక్షరతో నమస్కారములు చెప్పఁబడినవి, ఇఁక నష్టమానువాకంబునను అవే మఱికొన్ని చెప్పఁబడును.

సోమాయచ = సోముఁడనఁగా పార్వతితోఁగూడినవాఁడు, అట్టివానికొఱకును, రుద్రాయచ = రుత్ అనఁగా రోదనహేతువైనదుఃఖము, దానిఁ బోఁగొట్టువానికొఱకును, నమః=నమస్కారమగుఁగాక.

పార్వతితోఁగూడినవానికిని, రోదనమునకుఁ గారణమయిన దుఃఖమును బోఁగొట్టువానికని నమస్కారము.

భ. ఇందు దేవునియనుగ్రహరూపములు చెప్పఁబడును. రుద్రపశుపత్యాది నామములిందు మరలఁ జెప్పుట, యవియు దేవునియనుగ్రహాకరూపములని తెలుపుటకని తెలియునది. సోమాయచ=పార్వతితోఁగూడినవానికొఱకును, భక్తులఁ బ్రసాదించుకాలమున దేవుఁడు పార్వతీసహితుఁడై సన్నిధానముసేయును, లేక, చంద్రస్వరూపునికొఱకును, దేవుఁడు చంద్రరూపుఁడై పితృదేవమనుష్యులను దృప్తిపఱచుచున్నాఁడు, లేక, సోమయాగస్వరూపునికొఱకును, తత్స్వరూపముచే భగవంతుఁడు పురుషుల కభ్యుదయముకలిగించును. రుద్రాయచ = ప్రళయకాలమునందుఁ బ్రాణుల నేడ్పించువానికొఱకును, భగవంతుఁడు దయచేతనే జీవులకు సంసారఖేదము పోవుఁగాక యని మహాసంహారముచేయుచున్నాఁడు; ఇందలియర్థవిశేషములు మున్నే ప్రతిపాదింపఁబడినవి, నమః=నమస్కారమగుఁగాక. ౧

న మ స్తా మ్రా య చా రు ణా య చ.

నమః - తామ్రాయ - చ - అరుణాయ - చ. ౨

తామ్రాయచ = ఆదిత్యరూపముచే ఉదయకాలమునందు, మిక్కిలి యెఱ్ఱనివానికొఱకును, అరుణాయచ=ఉదయమునకుఁ బిమ్మట కొంచెమెఱ్ఱనివాని కొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

ఆదిత్యరూపమున నుదయకాలమునందు మిక్కిలి రక్త వర్ణుఁడైనవానికిని, ఉదయమునకుఁ బిమ్మటఁ గొంచెము రక్తవర్ణుఁ డైనవానికిని నమస్కారము.

భ. తామ్రారుణశబ్దములు ఆదిత్యవిషయములై యిదివఱకే వివరింపఁ బడినవి. ఆదిత్యరూపముననే, భగవంతుఁడు, మేలుఁకువగలిగించుట మొదలగు వానిచే జగత్తు ననుగ్రహించుచున్నాఁడు, జంతువులకర్మలకు సాక్షియగు చున్నాఁడు. ౨

---

న మ శ్శ ఙ్గా య చ ప శు ప త యే చ.

నమః - శఙ్గాయ - చ - పశుపతయే - చ. 3

శఙ్గాయచ=సుఖమునుబొందించువానికొఱకును, పశుపతయేచ=పశువుల పాలించువానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

సుఖముగలిగించువానికిని పశువులరక్షించువానికిని నమ స్కారము.

భ. శఙ్గాయచ=సుఖమునేపొందించువానికొఱకుననుట, పశుపతయేచ=

పాపరోగచోరాదిభయములనుండి బ్రహ్మాదిపిపీలికాంతపశువుల రక్షించువాని కొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ౩

---

న మ ఉ గ్రా య చ భీ మా య చ.

నమః - ఉగ్రాయ - చ - భీమాయ - చ. ౪

ఉగ్రాయచ = కోపము గలవానికొఱకును, శత్రువులను వధించుటకు కోపము గలవాని కొఱకుననుట, భీమాయచ = భయము గలిగించు వానికొఱకును, చూచినమాత్రాన శత్రువులకు భయము గలిగించు వాని కొఱకుననుట, నమః = నమస్కార మగుఁగాక.

శత్రువుల వధించుటకై కోపము గలవానికిని శత్రువులు తన్నుఁ జూచినంతనె వారికి భయము గలిగించు వానికిని నమస్కారము.

భ. ఉగ్రాయచ = పాప రోగాదుల చేతను నరకాదుల చేతను జయింప నలవి గానివాని కొఱకును, లేక, ఏభయములవలనఁ దాను పశువుల రక్షించునో, ఆభయములను బలిమిచే జయించువానికొఱకును, ఈయుగ్రుఁడు యజమానమూర్తికధిష్ఠాత, భీమాయచ = ఆపాపరోగాదులకే భయముగలిగించువాని కొఱకును, వేనివలన జగత్తు భయపడునో ఆపాపరోగాదులు భగవంతునివలన భయపడునని భావము, ఈభీముఁడాకాశమూర్తికధిష్ఠాత, నమః = నమస్కార మగుఁగాక. ౪

---

న మో అ గ్రే వ ధా య చ దూ రే వ ధా య చ.

నమః - అగ్రేవధాయ - చ - దూరేవధాయ - చ. ౫

అగ్రేవధాయచ = ఎదుట చంపుట గలవానికొఱకును, ఎదుటనున్న శత్రువును జంపువానికొఱకు ననుట, దూరేవధాయచ=దూరమునందుఁ జంపుట గలవాని కొఱకును, దూరముననున్న శత్రువును జంపువాని కొఱకుననుట, నమః= నమస్కార మగుఁగాక.

అనాయాసమున నెదుటనున్న శత్రువును జంపువానికిని, అట్లె దూరమున నున్న వానినిగూడఁజంపువానికిని నమస్కారము.

భ. అగ్రేవధాయచ=ఎదుటనుండి చంపువానికొఱకును, శత్రువున కభిముఖుఁడై యతనిఁ జంపువానికొఱకుననుట, లేక, ముందు, అనఁగా శత్రువులు దన్నుఁ జంపఁ దలంచునంతనె వారలఁ జంపువానికొఱకును, దూరే వధాయచ=దూరముననున్న వారినిగూడ చంపువానికొఱకును, లేక, దూరమునందును అనఁగా, అకాలమునందును దురాత్ములఁ జంపువానికొఱకును, నమః= నమస్కార మగుఁగాక. ౫

---

న మో హ న్త్రే చ హ నీ య సే చ.

నమః - హన్త్రే - చ - హనీయసే - చ. ౬

హన్త్రేచ=చంపువానికొఱకు, లోకమునందు ఎవ్వఁడేని శత్రువుఁ జంపునప్పుడు, తద్రూపమున రుద్రుఁడే శత్రువుఁ జంపువాఁడని భావము. కావుననే, "మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్" నాచేతనే వీరలు ఇంతకుముందే చంపఁబడిరి, అర్జునా ! నీవు నిమిత్తమాత్ర మగుము. అని యర్జునునితో నీశ్వరునిచేఁ జెప్పఁబడెను; హనీయసేచ=అతిశయముచేత చంపువానికొఱకును, సంహారకాలమునందు అందఱను జంపువానికొఱకుననుట, నమః=నమస్కార మగుఁగాక.

లోకమునందు ఎప్పుడు ఎక్కడ ఎవ్వఁడు శత్రువునువధించి నను, అపుడంతయు నచ్చట ఆవధించువాని స్వరూపముతో నుండువానికిని, ప్రళయకాలమునందు విశేషించి ప్రజలనందఱు నశింపఁజేయువానికిని నమస్కారము.

భ. హన్త్రేచ=చంపువారందఱు నీబలముచేతనే చంపెదరని భావము హనీయసేచ=అధికముగాఁ జంపువానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ఇట్లు సమస్తమునతిశయించిన బలముగలవాఁడగుటను నీవే పశువులకుఁ బలి కాఁదగుదువని భావము. ౬

---

నమో వృక్షేభ్యో హరికేశేభ్యః.

నమః - వృక్షేభ్యః - హరికేశేభ్యః. ౭

హరికేశేభ్యః = ఆకుపచ్చరంగుగల వెండ్రుకలవంటి పత్రములుగల, వృక్షేభ్యః=వృక్షములకొఱకు, అట్టి కల్పవృక్షములు మొదలైన వృక్షముల రూపముకల రుద్రునికొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక.

ఆకుపచ్చవన్నెగల వెండ్రుకలవంటి వర్ణములుగల కల్ప తరువులు మొదలగు వృక్షములరూపమునొందినట్టి రుద్రునకు నమస్కారము.

భ. ఉభయతోనమస్కారములందు "నమో వృక్షేభ్యో హరికేశేభ్యః పశూనాం పతయే నమః" అను యజుస్సువ్యాఖ్యానమున వివరింపఁబడినది. దేవుఁడు తనకుఁ బ్రియమగు నాకారమున వృక్షాదిరూపముసంగూడ నావిర్భ వించి జగము ననుగ్రహించుచుండును. ౭

న మ స్తా రా య.

నమః - తారాయ. ౮

తారాయ = ప్రణవముచేఁ బ్రతిపాదింపఁ బడువానికొఱకు, నమః నమస్కార మగుఁగాక.

ప్రణవముచేఁ బ్రతిపాద్యమయిన ముఖ్యార్థమగు రుద్రునకు నమస్కారము.

భ. తారాయ = సంసారసాగరాత్ సర్వజన్తూం స్తారయతీతి తారః, సంసారమను సముద్రమునుండి యెల్ల జంతువులను దరింపఁజేయునది, కావున ప్రణవము తార మనఁబడును, ప్రణవరూపుని కొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక. ౮

---

న మ శ్శ మ్భ వే చ మ యో భ వే చ.

నమః - శమ్భవే - చ - మయోభవే - చ. ౯

శమ్భవేచ = సుఖమును గలిగించు వాని కొఱకును, విషయసుఖమును గలిగించు వానికొఱకు ననుట, మయోభవేచ = సుఖమును గలిగించువాని కొఱకును, మోక్షసుఖము గలిగించు వానికొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక.

విషయసుఖమును గలిగించు వానికిని మోక్ష సుఖమును గలిగించువానికిని నమస్కారము.

భ. శమ్భవేచ = అర్థాంతరము, సుఖమునందే యెల్లప్పుడు నుండువాని కొఱకును, లేక, సుఖస్వరూపమును తెలియువాని కొఱకును, మయోభవేచ,

మయస్సనఁగా సుఖమనియెయర్థము ఈరెంటికిని, ఐహిక సుఖము ఆముష్మిక సుఖము అనిగాని, అభ్యుదయము నిశ్శ్రేయసము అనిగాని, భేదమునూహించు నది, లేక, దుఃఖశమన రూపమయిన సుఖము "శమ్" అనుటచేఁ జెప్పఁబడి నది. ఇతరసుఖము మయశ్శబ్దముచేత నని గ్రహించునది. ౯

---

న మ శ్శ ఙ్క రా య చ మ య స్క రా య చ.

నమః - శఙ్కరాయ - చ - మయస్కరాయ - చ. ౧౦

శఙ్కరాయచ=సుఖమును జేయువానికొఱకును, తండ్రి మొదలగు వారిరూపమున ఈలోకమునందలి సుఖమును జేయువానికొఱకు ననుట; మయ స్కరాయచ=సుఖమును జేయువానికొఱకును, ఆచార్యుఁడు శాస్త్రము మొద లగు రూపమున మోక్షసుఖమును జేయువానికొఱకు ననుట; నమః=నమస్కార మగుఁగాక.

తండ్రి మొదలగు వారిరూపమున లౌకికసుఖమును గలి గించు వానికిని, ఆచార్యుఁడు శాస్త్రము మొదలగు రూపమున మోక్ష సుఖమును గలిగించువానికిని నమస్కారము.

ఈరెండు పదములచే సాక్షాత్సుఖ కారిత్వము చెప్పఁబడినది, శంభు మయోభూ శబ్దములచే, వీరిమూలమున సుఖముచేయించుట చెప్పఁబడినది.

భ. శఙ్కరాయచ=ఎల్లప్రాణులకును స్వభావముచేతనే సుఖముచేయు వాని కొఱకును, లేక, సుఖమునే చేయువాని కొఱకును; మయస్కరాయచ= మయస్సనఁగా చెప్పఁబడినది, దాని స్వభావముచేతనే యెల్లప్రాణులకును జేయువాని కొఱకును, లేక, దానినే చేయువాని కొఱకును; నమః=నమస్కార మగుఁగాక. ౧౦

న మ శ్శి వా య చ శి వ త రా య చ.

నమః - శివాయ - చ - శివతరాయ - చ. ౧౧.

శివాయచ=కల్యాణ రూపునికొఱకును, దోషము లేనివాని కొఱకు ననుట, శివతరాయచ=మిక్కిలి కల్యాణ రూపుని కొఱకును, తనభక్తులను గూడ నిర్దోషులుగాఁ జేయువానికొఱకుననుట, నమః=నమస్కార మగుఁగాక.

నిర్దోషుఁడగుటచేఁ గల్యాణ రూపుఁడైనవానికిని, తన భక్తులను గూడ నిర్దోషులుగఁజేయునట్టి మిక్కిలి కల్యాణరూపుఁడైనవానికిని నమస్కారము.

భ. శివాయచ=త్రైగుణ్యాతీతుఁ డగుటచే నిష్కల్మషుఁ డైనవాని కొఱకును, సర్వవిధములచేతను గల్యాణరూపునికొఱకు ననుట, ఇట్టి శివుఁడు సుప్రసిద్ధుఁడు; శివతరాయచ = కల్యాణవాచకమైన శివశబ్దము, అభ్యుదయ నిశ్శ్రేయసముల నెడు కల్యాణముఁ జేయువానియందును గుణవృత్తిచేత వర్తించుచున్నది. శివమైనమార్గము శివమైన యుపాయము అనునట్లు, అట్లు మహాభారతము "స మేధయతి యన్నిత్యం సర్వార్థాన్ సర్వకర్మసు, శివమిచ్ఛన్ మనుష్యాణాం తస్మాద్దేవశ్శివః స్మృతః" ఎందువలన, యెల్లప్పుడును సమస్తకర్మల యందును మనుష్యులకుఁ గల్యాణము గోరువాఁడై, సర్వార్థములను వృద్ధిఁ బొందించుచున్నాఁడో, అందువలన, దేవుఁడు శివుఁడని చెప్పఁబడెను, అని చెప్పఁబడినది. అట్లు మేలుచేయువాఁడు శివుఁడు, మిక్కిలి మేలుచేయువాఁడు శివతరుఁడు, అట్టివానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ౧౧.

---

న మ స్తీ ర్థ్యా య చ కూ ల్యా య చ.

నమః - తీర్థ్యాయ - చ - కూల్యాయ - చ. ౧౨

తీర్థ్యాయచ=తీర్థము లందున్న వానికొఱకును, ప్రయాగాది పుణ్యతీర్థ ములయందు సన్నిహితుఁడై యున్నవానికొఱకుననుట; కూల్యాయచ=తీరము నందున్నవానికొఱకును, నదీతీరములందు లింగరూపమున నున్నవాని కొఱకు ననుట; నమః = నమస్కార మగుఁగాక.

ప్రయాగ మొదలయిన పుణ్య తీర్థములందు ఎల్లప్పుడు సన్నిహితుఁడై యున్న రుద్రునకును గంగాది నదీతీరములందు లింగరూపమున వెలసియుండు రుద్రునకును నమస్కారము.

భ. ఇఁక అర్థ్యాద్యాధారముల రూపమున దేవుఁడు లోకము నను గ్రహించుట చెప్పఁబడుచున్నది. అర్థము సమానము. ౧౨

---

న మః పా ర్యా య చా వా ర్యా య చ.

నమః - పార్యాయ - చ - అవార్యాయ - చ. ౧౩

పార్యాయచ = పారమనఁగా నావలిగట్టు, అందున్నవానికొఱకును, సంసారసముద్రము నావలిగట్టునందు ముముక్షువులచే ధ్యేయమై యున్నవాని కొఱకు ననుట; అవార్యాయచ=అవార మనఁగా ఈవలిగట్టు, అందున్నవాని కొఱకును, సంసారమధ్యమునందుఁ గామ్యఫలము నిచ్చుచున్నవాని కొఱకు ననుట; నమః = నమస్కార మగుఁగాక.

సంసారసముద్రము నావలి గట్టునందు ముముక్షువులచే ధ్యానింపఁదగిన వాఁడై యున్న రుద్రునికిని, సంసారము నడుమఁ గామ్యఫలముల నిచ్చుచున్న రుద్రునకును నమస్కారము.

భ. పార్యాయచ = నది మొదలగువాని యావలితీరము నందున్న వానికొఱకును, అవార్యాయచ = ఈవలితీరము నందున్న వానికొఱకును,

నమః = నమస్కార మగుఁగాక. ఒకఁడు చెప్పుచున్నాఁడు. ఈతీర్థాదికము సంసార పరము. తీర్థ్యాయచ = తీర్థ స్థానీయములగుశైవ సమవాయములు తీర్థము లనఁబడును, అందున్న వానికొఱకును, అందుండి జగత్తునను గ్రహించుచున్నాఁడనుట, కూల్యాయచ= కాలాదికము కూలమనఁబడును, అందున్న వానికొఱకును, పార్యాయచ = పారమనఁగాశుద్ధతీరము, అందున్నవానికొఱకును, అవార్యాయచ= అవారమనఁగా అపరిశుద్ధమయినతీరము, అందున్నవానికొఱకును. ౧౩

---

న మః ప్ర త ర ణా య చో త్త ర ణా య చ.

నమః - ప్రతరణాయ - చ - ఉత్తరణాయ - చ. ౧౪

ప్రతరణాయచ = మిక్కిలి తరించుటకు హేతువైనవానికొఱకును, మంత్ర జపాదిరూపమునఁ బాపముఁ బోఁగొట్టుటకు సాధనమైన వానికొఱకు ననుట, ఉత్తరణాయచ=సంసారమునుండి తరించుటకు సాధనమైన వానికొఱకును, తత్త్వజ్ఞానరూపమున సర్వసంసారమును దరింపఁ జేయువాని కొఱకు ననుట, నమః = నమస్కార మగుఁగాక.

మంత్ర జపాదిరూపమునఁ బాపముఁ బోఁగొట్టువానికిని తత్త్వజ్ఞానరూపమున సంసారమునుండి ముక్తునిఁ జేయువానికిని నమస్కారము.

భ. ప్రతరణాయచ = తరణమనఁగా దాఁటుట, ఉత్తమ యోనియందు జన్మప్రకర్ష మునొందుటయనుట. ఈసంసారమునందు ఉత్తమజన్మముఁబొందించువాని కొఱకును, ఉత్తరణాయచ = ఈసంసారమునుండి వెలువరించువానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౧౪

న మ ఆ తా ర్యా య చా లా ద్యా య చ.

నమః - ఆతార్యాయ - చ - ఆలాద్యాయ - చ. ౧౫

ఆతార్యాయచ = సంసారమునుండి తరింపఁజేయు తత్త్వజ్ఞానము సంభవించినను దాని నుపేక్షించి కామ్యకర్మల ననుష్ఠించుటచే మరల సంసారము నొందుట ఆతారము, దానికిఁ దగినవాని కొఱకును, అట్టివాని రూపము గలవాని కొఱకుననుట, ఆలాద్యాయచ=అలం సుపూర్ణం యథా భవతి తథా కర్మఫలమ్ అత్తి, సంపూర్ణముగా కర్మఫలము కుడుచువాఁడు అనువ్యుత్పత్తిచే ఆలాదుఁడనఁగా జీవుఁడు, తత్సంబంధి యైనవానికొఱకును, జీవులను బ్రేరించు వాని కొఱకుననుట, నమః = నమస్కార మగుఁగాక.

సంసార నాశకారణమగు తత్త్వజ్ఞానము సంభవించినను, గామ్యకర్మ యనుష్ఠించుటచే మరల సంసారమునొందిన జీవుని రూపముగల రుద్రునకును, జీవులను అగ్న్యాది కర్మలయందుఁ బ్రేరించురుద్రునకును నమస్కారము.

భ. ఆతార్యాయచ = సంసారము నావలిగట్టును బొందియుఁ గర్మశేషమున మరల సంసారముపొందుట యూతారము. అందున్నవాని కొఱకును, అందుండి యనుగ్రహించువాని కొఱకుననుట, ఆలాద్యాయచ=ఆలాదమనఁగా సర్గము, లేక, సంసారసముద్రమునందు మాటిమాటికిఁ బరిభ్రమించుట, అందున్నవానికొఱకును, లేక, ఆలాదమనఁగా స్వర్గము. అందున్నవాని కొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ౧౫

---

న మ శ్శ ష్పా్య య చ ఫే న్యా య చ.

నమః - శష్ప్యాయ - చ - ఫేన్యాయ - చ. ౧౬

శష్ప్యాయచ=శష్పమనఁగా గంగానదీతీరములందుఁ బుట్టిన దర్భాంకురము మొదలగు బాలతృణము, దానికిఁ దగినవానికొఱకును, దానిచేఁ బూజింపఁబడువానికొఱకుననుట, ఫేన్యాయచ=నదిలోనుండు నురుఁగునకుఁ దగినవానికొఱకును, నమః=నమస్కారమగుఁగాక.

గంగానదీతీరంబులంబుట్టిన పవిత్రమగు దర్భాంకురాదితృణముచేఁ బూజింపఁబడువానికొఱకును, ఏటినురుఁగుచేఁ బూజింపఁబడువానికొఱకును నమస్కారము.

భ. శష్ప్యాయచ=గంగాతీరము మొదలగు పవిత్రప్రదేశములంబుట్టిన దర్భలు మొదలగు తృణమునందున్నవానికొఱకును, ఫేన్యాయచ = నురుఁగునందున్నవానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ౧౬

న మ స్సి క త్యా య చ ప్ర వా హ్యా య చ.

నమః - సికత్యాయ - చ - ప్రవాహ్యాయ - చ. ౧౭

ఇతి శ్రీయజుస్సంహితాయాం చతుర్థకాణ్డే,

పఞ్చమ ప్రపాఠకే, అష్టమోఽనువాకః.

సికత్యాయచ = ఇసుకకుఁదగినవానికొఱకును, సైకతప్రదేశస్వరూపునికొఱకుననుట, ప్రవాహ్యాయచ=ప్రవాహమునకుఁ దగినవానికొఱకును, తత్ప్రదేశస్వరూపునికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

సైకతప్రదేశము స్వరూపముగాఁగలవానికిని ప్రవాహప్రదేశము స్వరూపముగాఁగలవానికిని నమస్కారము.

ఏపురుషుఁడు గంగాదినదీతీరమున శ్రద్ధమెయి స్నానాదితత్పరుండై నిరంతరము నివసించునో, శద్రూపుఁడైనవానికొఱకని, శష్ప్యాదిశబ్దములు నాల్గింటికిని దాత్పర్యార్థము కానచ్చును.

భ. సికత్యాయచ=ఇసుకయందున్న వానికొఱకును, ప్రవాహ్యాయచ = ప్రవాహమునందున్న వానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక. ౧౭

ఇది శ్రీమత్కవాటోపనామ సుందరరామ ప్రణీతంబగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందు
అష్టమానువాకము.

---

ఓం నమో భగవతే రుద్రాయ.

అథ నవమానువాకః.

---

నమ ఇరిణ్యాయ చ ప్రపథ్యాయ చ.

నమః - ఇరిణ్యాయ - చ - ప్రపథ్యాయ - చ. ౧

ఇఁక నవమానువాకమునందును మఱికొన్ని యన్యతరతోనమస్కారములగు యజుస్సులే పఠింపఁబడును.

ఇరిణ్యాయచ = ఇరిణమనఁగా చవుటినేల, అందున్న వానికొఱకును, ప్రపథ్యాయచ=ప్రపథమనఁగా బహుజనులచే సేవింపఁబడినమార్గము, అందున్న వానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

ఊషరక్షేత్రమునందున్న వానికిని పెక్కండ్రు నడచు మార్గమునన్నున్న వానికిని నమస్కారము. ౧

భ. సమానము.

న మః కి గ్ ం శి లా య చ క్ష య ణా య చ.

నమః - కిగ్ంశిలాయ - చ - క్షయణాయ - చ. ౨

కింశిలాయచ = సన్నఱాలుగల ప్రదేశము కింశిలమనఁబడును, అందున్న వాఁడగుటచే తచ్ఛబ్దవ్యపదేశము, అట్టి ప్రదేశమునందున్న వానికొఱకును, క్షయణాయచ = క్షయణమనఁగా వాసయోగ్యమయిన ప్రదేశము, తచ్ఛబ్దవ్యపదేశము సమానము. అందున్న వానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

సన్న ఱాలుగల ప్రదేశమునందున్న వానికిని వాసయోగ్యమగు ప్రదేశమునందున్న వానికిని నమస్కారము.

భ. కింశిలాయచ = అర్థాంతరము, శిలలా లేక స్ఫటికాదులా అను సందేహ మెచటఁ గలుగునో ఆప్రదేశము కింశిలము, అందున్న వాని కొఱకును, క్షయణాయచ = వాసయోగ్యమగు దేశమునందున్న వానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక. మఱియొకఁడు చెప్పుచున్నాఁడు. ఈశష్పాదులన్నియు జీవభేదములు, అందు శష్పములనఁగా బాలతృణ సమానులు స్వల్పప్రాణులగు జీవులు, ఫేనము లనఁగా తత్సదృశు లగు నల్పాయువులు, సికతలనఁగా ఇసుకవంటి మిక్కిలి యల్పులు. ప్రవాహము లనఁగా ప్రకృష్టవాహములు మహావిభూతులు, ఇరిణములనఁగా ఊషరభూమికల్పులు శూన్యశక్తులు, ప్రపథులనఁగా నుత్తమమార్గముననుండువారలు, కింశిలులనఁగా కుత్సితమయిన శీలముగలవారలు, హ్రస్వము ఛాందసము, క్షయణులనఁగా క్షయించుస్వభావముగలవారలు, వారలయందఱియందు భేదములేక యనుగ్రహించువాఁడై యుండువానికొఱకని యర్థము. అందఱను అనుగ్రహించువాఁడని భావము. ౨

న మః క ప ర్ది నే చ పు ల _స్త యే చ.

నమః - కపర్దినే - చ - పుల_స్తయే - చ. 3

కపర్దినేచ=జడము ముడిగలవానికొఱకును, పుల_స్తయేచ=భక్తులముందట నుండువానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

జటాబంధముఁగలవానికిని భక్తులయెదుట నుండువానికిని నమస్కారము.

భ. కపర్దినేచ=జటాబంధముగలవానికొఱకును, పుల_స్తయేచ=వెంట్రుకలు గలవానికొఱకును, నమః=నమస్కారమగుఁగాక. ప్రసాదకాలమున భగవంతుఁడొకానొకప్పుడు కపర్దియై, యొకానొకప్పుడు కుంతలములుగలవాఁడై పొడ సూపును. కొందఱుచెప్పుదురు, పుల_స్తయేచ = ఎల్లప్పుడును ఎల్లవారియెదుటను నిలుచుండువానికొఱకును, ఇందుచే మహానుభావుఁడైనను ఎల్లప్పుడును సులభుఁడని చూపఁబడినది. 3

---

న మో గో ష్ఠ్యా య చ గృ హ్యా య చ.

నమః - గోష్ఠ్యాయ - చ - గృహ్యాయ - చ. ర

గోష్ఠ్యాయచ=గోష్ఠమనఁగా గోవులస్థానము, అందున్నవానికొఱకును, గృహ్యాయచ = గృహమునందున్నవానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

ఆవులుండుచోట నున్నవానికిని గృహమునందున్నవానికిని నమస్కారము.

భ. ఆసౌలభ్యమే వి_స్తరించి చెప్పఁబడుచున్నది. అర్థము సమానము.

---

న మ స్త ల్ప్యా య చ గే హ్యా య చ.

నమః - తల్ప్యాయ - చ - గేహ్యాయ - చ. ౫

తల్ప్యాయచ = పాన్పునందున్న వానికొఱకును, గేహ్యాయచ = గేహ మనఁగా మేడ, అందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

పాన్పునం దున్న వానికిని మేడయం దున్న వానికిని నమస్కారము.

భ. సమానము. ౫

---

న మః కా ట్యా య చ గ హ్వ రే ష్ఠా య చ.

నమః - కాట్యాయ - చ - గహ్వరేష్ఠాయ - చ. ౬

కాట్యాయచ = కటమనఁగా ముండ్లతోఁగూడిన తీఁగె మొదలగునవి, దానిచే నిండియుండుటవలన దుష్ప్రవేశమగునరణ్యవిశేషము కాటమనఁబడును. అందున్న వానికొఱకును, గహ్వరేష్ఠాయచ = విషమమగు గిరి గుహా మొదలగు ప్రదేశమునం దున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

ముండ్లతీఁగెలు మొదలగువానిచే నిండిన దగుటవలనఁ జొరరానిదగు నరణ్యమున నున్న వానికిని, పర్వతగుహా మొదలగు విషమప్రదేశమునం దున్న వానికిని నమస్కారము.

భ. కాట్యాయచ = వ్యాఖ్యాతము, నూతియందలి జలము రూపముచే లోకము ననుగ్రహించువానికొఱకని భావము. తక్కినది సమానము. ౬

---

న మో హ్ర ద య్యా య చ ని వే ష్ప్యా య చ.

నమః - హ్రదయ్యాయ - చ - నివేష్ప్యాయ - చ. ౭

హ్రదయ్యాయచ = హ్రదము లనఁగా లోఁతైన మడుఁగులు, వాని యందున్న వానికొఱకును, నివేష్ప్యాయచ = నివేష్ప మనఁగా మంచునీరు, అందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాఁక.

లోఁతైన మడుఁగులయం దున్న వానికొఱకును హిమ జలమం దున్న వానికొఱకును నమస్కారము.

భ. సమానము. ౭

---

న మః పా గ్ం స వ్యా య చ ర జ స్యా య చ.

నమః - పాగ్ంసవ్యాయ - చ - రజస్యాయ - చ. ౮

పాంసవ్యాయచ = పాంసువులనఁగా, మిక్కిలి సూక్ష్మమయినదుమ్ము, దానియందున్న వానికొఱకును, రజస్యాయచ = రజస్సనఁగా స్థూలమయినదుమ్ము, దానియందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

సూక్ష్మమై కంటికిఁ గానఁబడని దుమ్మునం దున్న వానికిని, స్థూలమయిన దుమ్మునం దున్న వానికిని నమస్కారము.

భ. రజస్యాయచ = లేక, రజోగుణమునందున్న వానికొఱకును, లేక, రజోలోకమునందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక. ౮

న మ శ్శు ష్కా్య య చ హా రి త్యా య చ.

నమః - శుష్క్యాయ - చ - హారిత్యాయ - చ. ౯

శుష్క్యాయచ = శుష్కములనఁగా ఎండినకట్టెలు, వానియందున్న వానికొఱకును, హారిత్యాయచ = హరితమనఁగా పచ్చికట్టెలు, వానియందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

ఎండినకట్టెలయందున్న వానికిని పచ్చికట్టెలయందున్న వానికిని నమస్కారము.

భ. సమానము.

---

న మో లో ప్యా య చో ల ప్యా య చ.

నమః - లోప్యాయ - చ - ఉలప్యాయ - చ. ౧౦

లోప్యాయచ = లోపమనఁగా తృణాదు లిందులోపించుననువ్యుత్పత్తిచే కఠినప్రదేశము, అందున్న వానికొఱకును, ఉలప్యాయచ=ఉలపమనఁగా తృణాదులు, ఆందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

తృణాదులు మొలువనికఠినప్రదేశమునందున్న వానికొఱకును, తృణాదులయందున్న వానికొఱకును నమస్కారము.

భ. ఉలప్యాయచ=ఉలపమనఁగా తృణాదులు అందున్న వానికొఱకును, లేక, అవిగలప్రదేశమునందున్న వానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

---

న మ ఊ ర్వ్యా య చ సూ ర్మ్యా య చ.

నమః - ఊర్వ్యాయ - చ - సూర్మ్యాయ - చ. ౧౧

ఊర్వ్యాయచ=ఊర్వియందు అనఁగా భూమియందున్న వానికొఱకును, సూర్మ్యాయచ=సూర్మియనఁగా మంచితరఁగలుగలనది, అందున్న వానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

భూమియందున్న వానికిని మంచితరంగంబులుగల నదియందున్న వానికిని నమస్కారము.

భ. సూర్మ్యాయచ = సూర్మి యనఁగా లోపల రంధ్రముగల ప్రతిమ, దానియందున్నవానికొఱకును, లోపలబోలుగనుండు ప్రతిమయందున్నవాని కొఱకుననుట, నమః=నమస్కార మగుఁగాక. ౧౧

---

న మః ప ర్ణ్యా య చ ప ర్ణ శ ద్యా య చ.

నమః - పర్ణ్యాయ - చ - పర్ణశద్యాయ - చ. ౧౨

పర్ణ్యాయచ = పత్త్రములయందున్నవానికొఱకును, పర్ణశద్యాయచ = పర్ణశదమనఁగా, ఎండుటాకులసమూహము, దానియందున్నవానికొఱకును, నమః=నమస్కార మగుఁగాక.

ఆకులయందున్నవానికిని ఎండుటాకులసమూహములయం దున్నవానికిని నమస్కారము.

భ. వీనిచే దేవుఁడింత యత్యంతసులభుఁడని దేవునియనుగ్రహప్రకార ములు చెప్పఁబడెను. ౧౨

---

నమో ऽ ప గు ర మా ణా య చా భి ఘ్న తే చ.

నమః - అపగురమాణాయ - చ - అభిఘ్నతే - చ. ౧౩

అపగురమాణాయచ = ఆయుధముపట్టుచున్నవానికొఱకును, అభిఘ్నతేచ=శత్రువుల కభిముఖుఁడై కొట్టుచున్నవానికొఱకును, నమః = నమస్కార మగుఁగాక.

దుష్టులవధించుటకై యాయుధము ధరించుచున్నవాని కిని, వారి నెదిరించి ప్రహరించుచున్నవానికిని నమస్కారము.

భ. ఇఁక నిగ్రహింపఁదగిన దురాత్ములవిషయమై భగవంతుని ప్రకారము చెప్పఁబడును. ౧౩

---

న మ ఆ ఖి ద తే చ ప్ర ఖి ద తే చ.

నమః - ఆఖిదతే - చ - ప్రఖిదతే - చ. ౧౪

ఆఖిదతేచ = కొంచెము శ్రమపఱచువానికొఱకును, ప్రఖిదతేచ = మిక్కిలి శ్రమపఱచువానికొఱకును, నమః = నమస్కారమగుఁగాక.

వారివారి యపరాధమునకుఁ దగునట్లు కొందఱిని కొంచెముగాఁ బీడించువానికిని కొందఱిని అధికముగాఁ బీడించువానికిని నమస్కారము.

భ. ఇట్లు దేవుఁడు నిగ్రహింపఁదగినవారి నిగ్రహించు ప్రకారము చెప్పఁబడినది. ౧౪.

నమస్సోమాయ అను నష్టమానువాకాది మొదలుగ నిదివఱకు నొక మంత్రము. ఇందుకు దేవతయు ఋషియు భగవంతుఁడే, ఛందస్సు మహానుష్టుప్పు, ఇఁకఁ బురశ్చరణప్రకారము. రెండు ప్రాజాపత్యకృచ్ఛ్రములు చరించి పంచశతము జపించునది. పురశ్చరణ సిద్ధియగును.

ప్రయోగము. అందు మొదట రాజులకుఁ జెప్పఁబడును. సామ్రాజ్యము గోరునట్టిరాజు, ఈచెప్పఁబోవు ప్రకారమున గావింపవలెను. అందుకుఁగాలము వసంతర్తువు, దేశము పర్వతముగాని శివాలయముగాని వనముగాని గ్రహించునది. అందు శివాలయమం దైనచో దేవునిఁ బూజించి తత్సన్నిధియందుఁ గావించునది. ఆర్ద్రానక్షత్రవిశిష్టమగు నమావాస్యయందుఁగాని ఆర్ద్రానక్షత్రమునఁ గాని యమావాస్యయందుఁగాని ప్రారంభము సేయునది. మొదట బ్రాహ్మణులఁ బూజించి వారలచేఁ గార్యసిద్ధి యగుఁగాకయని పలికించి పిమ్మటఁ గర్మ యారం

భింపవలెను. మంత్రసిద్ధులగు బ్రాహ్మణుల గ్రహింపవలెను. అట్టి బ్రాహ్మణులు దొరకనిచో, ఆచార్యుఁడు కర్త్రార్థము, వారలకు సద్యస్సిద్ధి సంపాదించునది. కల్పవిమందును సిద్ధుఁడునగు బ్రాహ్మణోత్తముఁడాచార్యుఁడనఁదగును. అతండు పలికినట్లు సిద్ధియగును. సద్యస్సిద్ధిప్రకారము. బ్రాహ్మణులు శుద్ధులై అట్టి యాచార్యునివలన మంత్రము గ్రహించి, పదునేనుదినములు నిరంతరము జపింపవలయును. అంతఁ గర్మయోగ్యులగుదురు. ఇది సద్యస్సిద్ధి యనంబడును. అట్టి వారలచే హోమము సేయింపవలెను. ప్రతినమస్కారము నాహుతి వేల్చునది. నేతితోఁగూడిన తిలవ్రీహియవాదులు హోమద్రవ్యములు. ఉదయము మొదలుగ నస్తమయముపఱకు నిరంతరము హోమముసేయునది. ఇట్లు పదునొకండు బ్రాహ్మణులచే ముప్పదిదినములు చేయించునది. హోమముసేయువారలకు త్తరీయాదులీవలెను. ఆచార్యునకును భోగులు మొదలగునవి యీవలెను. హోమాగ్నికిమీఁద నాజ్యపాత్రము సన్నధారగాఁ బడుచుండునట్లుంచవలెను. ఇట్లు కర్మము ముగియువఱకు దేవునకుఁ బ్రతిదినము నెనిమిదివేలపురుషులయాహారము నివేదనముచేయవలెను. బ్రాహ్మణులనుగూడఁ బ్రతిదినము ఎనిమిదివేలమందిని భుజింపఁ జేయవలెను. కడపటిదినమున నిత్యమునకన్నను ద్విగుణము గావింపవలెను. ఆచార్యుని భగవంతునిఁగా భావించి యతనికి సారభూతమయిన భూమి యీవలెను. ఋత్విజులకు ఒక్కొకరికి నూఱేసి నిష్కములుగాని తదర్థముగాని దక్షిణ యిచ్చునది. ఆచార్యునకు ద్విగుణదక్షిణ యీవలెను. అందు, శివపూజకు, గంధము కర్పూర మిశ్రితమయిన గంధము, పుష్పములు కమలములు, ధూపము కర్పూరమిశ్రితమయిన గుగ్గులువు, దీపము గోఘృత దీపము నుపయోగింపవలెను. నైవేద్యము మున్నె చెప్పఁబడినది. ఇట్లు రుద్రారాధనము ప్రతిసంవత్సరము చేయవలెను. ఇట్లుఆరాధించుటవలన రాజు సమ్రాట్టగును. సాగరమధ్యభూమియందుండు నితరరాజులుఁదఱు రుద్రరూపులచే హతులగుదురు. సాధకుఁ డిచట భూమండలమంతయు ననుభవించి యంత మున రుద్రరూపులచే ననుగ్రహింపఁబడి కైలాసమునొందును. అచట రుద్ర

చూపుఁడై పదివేలకల్పములు భోగములనుభవించి పిమ్మట సప్తద్వీపాధిపతియగు రాజై శివభక్తుఁడై జన్మించును. అతని హస్తములం బినాకాంకము కనఁబడును. ఆలక్షణముగలవాఁడు రుద్రారాధనము సేయువాఁడని తెలియునది.

ప్రయోగాంతరము. అది శత్రునాశము గోరురాజు మిక్కిలి సమర్థుఁడగు బ్రాహ్మణునిచేఁ జేయింపవలెను. చంద్రకొయ్యచే శత్రురాజు ప్రతిమను జేసి, యేకాంతప్రదేశమున జలపూర్ణకుంభమునందు దేవు నావాహనము గావించి, తత్సన్నిధానంబున నగ్నిం బ్రతిష్ఠించి ముండ్లతోఁగూడిన జమ్మి సమిధలను బిడాలరక్తముతోఁదడిపి వానిని బ్రతినమస్కారము లక్ష వేల్వవలయును. అంత నాప్రతిమకుఁ బ్రతినమస్కారము లోహశంకువులు ప్రయోగించి దానిమీఁద రాజు తనవామపాదము నుంచునది. విన్యాసకాలమున నాచార్యుఁడు జపము సేయవలయును. అంత రాజు నూర్గురు బ్రాహ్మణుల భుజింపఁజేసి దేవు నుద్వాసనముచేయునది. ఇట్లు గావించినచో శత్రురాజు మూఁడుసంవత్సరముల నశించును. మఱియొక ప్రయోగము. ఆప్రతిమనే శృంఖలితముగావించి, మునుపటివలె హోమాదులు చేయునది. అంత శీఘ్రమున శత్రువు వశ్యుఁడగును. మఱియును సిద్ధులగు రాజపురుషులు కృత్రిమవేషధారులై బ్రాహ్మణసహితులై శత్రునగరము ప్రవేశించి, యందుఁ జనుకములందును చైత్యములందును దేవాలయములందును రాజసభలయందును రాజద్వారమునందును నల్లని లోహశంకువుల లక్షవారాభిమంత్రితములుగావించి గుప్తముగానుంచవలెను. అంత నభిమంత్రితమగు భస్మమును జలమును అంతటం జల్లునది. ఆనగరము మూఁడుసంవత్సరములలో నశించును. మఱియును వికృతవేషులయి శత్రునగరమునందలి కొలంకులందు కంఠప్రమాణజలమున నిలుచుండి సూర్యాభిముఖులై యెనిమిదినూర్లదినములు ప్రతిదినము అష్టశతము జపించుచు జపకాలమునందు భగవంతుని కంఠస్థితమగు హాలాహలముచే తజ్జలము నభిమంత్రించునది. అట్లు గావించినచో నాజలము త్రాగువారలు

విషదష్టులవలె నశింతురు. ఇట్లు చేయించువారలకు రాజ్యార్ధసమానమయిన దక్షిణ యీవలెను.

ధ్యానము.

పినాకపాణిం భూతేశ ముద్యత్సూర్యాయుతద్యుతిమ్
భూషితం భుజగై ర్ధ్యాయే త్కణ్ఠేకాలం కపర్దినమ్.

పినాకమనుధనుస్సు హస్తమునం గలవాఁడును ఉదయించుచున్న పది వేల సూర్యులకుంబోలె తేజస్సుగలవాఁడును సర్పములచే నలంకృతుండును కంఠమున నీలవర్ణుఁడును జటాజూటము గలవాఁడునగు భూతనాథు నీశ్వరుని ధ్యానింపవలెను. అని యర్థము. ౧౪

---

న మో వః కి రి కే భ్యో దే వా నా గ్ం హృ ద యే భ్యః.

నమః - వః - కిరికేభ్యః - దేవానామ్ - హృదయేభ్యః. ౧౫

దేవానామ్=దేవతలకు, హృదయేభ్యః = మనస్సువంటివారలు, ప్రియులనుట, అగు, కిరికేభ్యః = భక్తులకు ధనమును వెదచల్లునట్టి రుద్రావతారములయిన, వః=మీకొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

దేవతలకందఱకుఁ బ్రియులును భక్తులకధికముగా ధనమునొసంగువారలు నగు రుద్రావతారములయిన మీకు నమస్కారము.

భ. ఇదిమొదలుగ ననువాకము చివరవఱకు నొకమంత్రము, యుష్మచ్ఛబ్దప్రయోగమువలన నియ్యది ప్రత్యక్షకృతము. ఇదివఱకు దేవుని లీలావిగ్రహములు వేఱువేఱ నమస్కరింపఁబడినది. ఇప్పుడు సమూహరూపమున నమస్కరింపఁబడుచున్నవి. ఇదివఱకు దేవుని నమస్కరించి యిప్పుడు తదనుచరులు

నమస్కరింపఁబడెదరని కొందఱు, ప్రసిద్ధములైన దేవుని యాకారములు నమస్కరింపఁబడినది. అప్రసిద్ధములైనవి, అనఁగా లోకమునకుఁ దెలియనివి, జగద్రక్షకములగు దేవునియాకారములు పెక్కులుగలవు. ఇఁక నవి నమస్కరింపఁబడునని మఱికొందఱు. ఈపక్షమే యుక్తము. దేవానాం హృదయేభ్యః= ఈవిశేషణము విక్షీణకాదులకును అనువర్తించును. దేవతలహృదయమువంటి వారలగు, దేవతలహృదయము ఎట్లు దేవతలకుమాత్రమే తెలియునో అట్లు దేవతలకుమాత్రమె తెలియఁదగినవారలగు ననుట, కిరికేభ్యః=ఇదివఱకు చెప్పఁబడినవారికన్నను భిన్నులయినవారలగు కిరికులు అనఁగా ఉదారస్వభావులు మొదలయినవారలకొఱకును, వః=మీకొఱకును, నమః=నమస్కార మగుఁగాక. మీరలును అనుగ్రహించి యాయుధముల నుపసంహరింపుఁడని శేషము.

అర్థాంతరము—దేవానామ్=దేవతలయొక్క, హృదయేభ్యః=మనస్సులందుండువారలగు, హృదయమున నుండువారలగుటచే హృదయశబ్ద వ్యపదేశము. దేవతలకుమాత్రమె తెలియతగినవారలనుట, లేక, దేవతల హృదయమునందు అనుగ్రహించుటకొఱకు ఆవిర్భవించువారలగు, దేవతలచే ఇష్టసిద్ధికొఱకెల్లప్పుడు స్మరింపఁబడువారలనుట, లేక, దేవతలకు హృదయభూతులయినవారలగు, వారలకు మిక్కిలి యాప్తులగువారలనుట, కిరికేభ్యః=స్వేచ్ఛచే లోకములను హింసించువారలగు, లేక స్వేచ్ఛచే లోకములను చేయువారలగు, వః=మీకొఱకు, రుద్రులకొఱకనుట, నమః=నమస్కార మగుఁగాక.

---

న మో వి క్షీ ణ కే భ్యః

నమః - విక్షీణకేభ్యః. ౧౬

విక్షీణకేభ్యః=క్షీణులనఁగా క్షయము నాశము గలవారలు, వారలకన్న విపరీతులు విక్షీణకులు, నాశములేనివారలగు, దేవానాం హృదయేభ్యః, వః = మీకొఱకు, నమః=నమస్కార మగుఁగాక.

దేవతలకుఁ బ్రియులును నాశములేనివారలునగు మీకు నమస్కారము.

భ. విక్షీణకేభ్యః=వివిధంక్షిణ్వన్తి, క్షీణన్తి, ఇతి విక్షీణకాః, భక్తులు గానివారలను వ్యాధి చౌర్యనరకాదులచేత నానావిధముగా హింసించు వారలగు, దేవానాం హృదయేభ్యః, వః, నమః. ౧౬

---

న మో వి చి న్వ త్కే భ్యః.

నమః - విచిన్వత్కేభ్యః. ౧౭

విచిన్వత్కేభ్యః=విచిన్వన్తీతి విచిన్వత్కాః, అపేక్షింపఁబడినదాని సంపాదించువారలగు, దేవానాం హృదయేభ్యః, వః, నమః.

దేవతలకుఁ బ్రియులును భక్తులుకోరినదాని సంపాదించు వారలునగు మీకు నమస్కారము.

భ. విచిన్వత్కేభ్యః=వీరలు పుణ్యవంతులు, వీరలు పాపులు అని జంతువులను పరిశీలించువారలు విచిన్వత్కు లనఁబడుదురు. అట్టివారలగు, దేవానాం హృదయేభ్యః, వః, నమః. ౧౭

---

న మ ఆ ని ర్హ తే భ్యః.

నమః - ఆనిర్హతేభ్యః. ౧౮

ఆనిర్హతేభ్యః=అంతటను నిశ్శేషముగా పాపము ఎవరిచే హతమగునో, వారలు ఆనిర్హతులు. పాపనాశముసేయు వారలగు, దేవానాం హృదయేభ్యః, వః, నమః.

దేవతలకుఁ బ్రియులును అంతటను బాపము కొంచెమేని లేకుండునట్లు హరించువారలునగు మీకు నమస్కారము.

**భ. అనిర్హతేభ్యః = ఏది మర్యాదచేతను నిశ్చయముచేతను చేయఁ బడునో, అహింస అనిర్హతము. అట్టిదిగలవారలగు, లేక మర్యాదచేతను నిశ్చయముచేతను వధించువారలగు, ఎవ్వరిని అన్యాయముచే హింసింపరనియు అప రాధుల నుపేక్షింపరనియుభావము ఇతరులుచెప్పెదరు. మర్యాదచే వెలువరింపఁ బడినవారలగు, ఇతరదేవతలతోడ యజించుటకును గీర్తించుటకును అనుచిత మగుటచే, ఇతరదేవతలనుండి వేఱుపఱుపఁబడినవారలనుట, దేవానాం హృద యేభ్యః, వః, నమః.** ౧౮

---

న మ ఆ మీ వ త్కే భ్యః.

నమః - ఆమీవత్కేభ్యః. ౧౯

ఇతి శ్రీయజుస్సంహితాయాం - చతుర్థకాణ్డే,
పఞ్చమప్రపాఠకే, నవమానువాకః.

---

**ఆమీవత్కేభ్యః= అంతట స్థూలభావమును బొందువారలు ఆమీవ త్కులు, అట్టివారలగు, దేవానాం హృదయేభ్యః, వః, నమః.**

దేవతలకుఁ బ్రియులును స్థూలమగు ప్రపంచము రూప మునఁ బరిణమించినవారలునగు మీకు నమస్కారము.

**ఇట, విక్షీణకాదులందును "దేవానాం హృదయేభ్యః" అనునది యను వర్తించును. పంచమానువాకము మొదలుగ నవమానువాకాంతమువఱకు అన్య తరతో నమస్కారములగు యజుస్సులు పెక్కులు పఠింపఁబడినవి. పరమేశ్వరుని**

సర్వాత్మత్వము నిరూపించుటకై వానియందు ఒక్కొక యజుస్సుచే నొక్కొకటి దేవుని స్థావరరూపము జంగమరూపము చెప్పఁబడినది. అనువాకభేదము, యక్షేతరప్రయోగములందు మంత్రభేదసిద్ధికొఱకని తెలియునది. అప్పుడు ఒక్కొకయనువాకము ఒక్కొకమంత్రమగును. వాని పురశ్చరణాదిప్రకారము రుద్రకల్పంబునం జెప్పఁబడును.

భ. ఆమీవత్కేభ్యః=అంతటను విజృంభించువారగు, లేక, అంతటను హింసించువారగు, దురాత్ములకు కొంచెమేని యవకాశము లేనియట్లు హింసించువారలనుట, దేవానాం హృదయేభ్యః, వః, నమః. ౧౯

---

ఈమంత్రమునకు, ఋషియు దేవతయు భగవంతుఁడగుశంభువు, ఛందస్సు షట్పదజగతి. ఇఁకఁ బురశ్చరణము, పరాకకృచ్ఛ్రమాచరించి నలువదివేలు జపింపవలెను. పురశ్చరణమగును. పిమ్మట మంత్రశోధనార్థము గురుసన్నిధానమున నెనిమిదివేలు జపించునది. అంతఁ గర్మయోగ్యుఁడగును. ఈ మంత్రము ప్రభావముచే సర్వము సిద్ధించును. దీనికి అసాధ్యమేదియు లేదు.

దీనిచేఁ గామ్యకర్మము చెప్పఁబడుచున్నది. దక్షిణామూర్తిసన్నిధానంబునఁ దనయగ్నియందు మథితాగ్నియందుఁగాని లాజలును నువ్వులునుగలిపి లక్షవేల్వవలయును. సువర్ణముకలుగును. దధిమధుఘృతములచేఁ దడుపఁబడిన యుత్తరేనుబియ్యమును వెదురుబియ్యమును యవలును పదివేలు వేల్చినయెడల వేయిసువర్ణములు కలుగును. కన్యఁగోరువాఁడు, తనకిష్టయగుకన్యకు సమానాకృతియయినగుగ్గులుప్రతిమనుగావించి దానిస్పృశించుచు నైదువేలుజపించి యంతట దానిఛేదించి యూఱువేలు వేల్చునది. సర్వాభరణభూషితయయిన యిష్టకన్యం బడయును. కమలోత్పలకుముదంబులు లక్షవేల్చినవానికి రాజ్యలక్ష్మి ప్రత్యక్షయగును. పాలలోఁ దడుపఁబడిన మోదుగుమొలకలు లక్ష హోమముచేసినచో యక్షరాక్షసభూతప్రేతపిశాచాదులు దృశ్యులును

వశ్యులును అగుదురు. పెద్దయడవియందు అగ్నికుండముగావించి మథితాగ్ని యందు పదివేలు బిల్వఫలంబులు వేల్చునది. పిమ్మట ఘృతాక్తములగు బిల్వ పత్రములు ముష్టిమాత్రములుగా అయిదువేలాహుతులు వేల్వవలయును. అంత బిల్వఫలాకారమగు సువర్ణపిండము సిద్ధించును. అది పరుసవేదియగును. ఆవు నేతితోఁదడిపిన తెల్లదామరపూవులు లక్షహోమము చేసినవానికి సార్వభౌముఁ డగుపుత్త్రుఁ డుదయించును. శమీసమిధలను కొనలువంచి రజతపాత్రమున నుంచి దధిమధుఘృతాక్తములుగావించి పదివేలు వేల్చువాఁడు శివభక్తుండగు పుత్త్రుంబడయును. అఱపలము తెల్లవస చూర్ణముగావించి వెండిపాత్రయందు కాపిలాజ్యముతో రంగరించి పదివేలమార్లీమంత్రముతో నభిమంత్రించి సేవించినవాఁడు కవియగును. దధిమధుఘృతాక్తములగు నుదుంబరసమిధలు పదివేలు వేల్చునతండు మహాభోగి యగును.

ఇఁక మనోజవసిద్ధికిఁ బ్రయోగప్రకారము. మనోజవము గోరినవాఁడు ముప్పది కృచ్ఛ్రములుచరించి దేహశుద్ధినొందినవాఁడై పిమ్మట చరుశాకమూల ఫలంబు లాహారముగాఁ గొనుచుఁ బదునెనిమిది దినములు నిరంతరము జపింప వలెను. ఈలోపల బుద్ధిపూర్వముగా నిదురింపఁగూడదు. బుద్ధిపూర్వముగాక నిదురించినచోఁ దక్షణము స్నానము ప్రాయశ్చిత్తము. పదునెనిమిదిదినము లయినపిమ్మట మంత్రము వశ్యమగుటకై గురువునకు ఐదుస్వర్ణనిష్కములీవలెను. అటుపిమ్మట, గురుసన్నిధియందుఁగాని దేవునిసన్నిధియందుగాని యేఁబదివేలు జపముసేయవలెను; అంత నుమాసహాయుండగు రుద్రుఁడు ప్రత్యక్షమగును. తదనుగ్రహమున మనోజవసిద్ధి యగును. అంత, ఏదేశమునకుఁ బోఁదలఁచునో, ఆదేశమును గురువును స్మరించి యీమంత్రము నెనిమిదినూర్లు జపించినచో, ఆదేశము పొందఁగలఁడు.

ఇఁక నదృశ్యత్వసిద్ధికి విధానము చెప్పఁబడును. దీనికిని బురశ్చరణము పూర్వమువలెనే చేయవలెను. అంత నదృశ్యత్వముఁగోరినకాలమునందు, రక్త

చందనము కపిలాక్షీరముతో రంగరించి యశ్వత్థపత్రమునందుంచి దాని స్పృశించుచు నెనిమిదివేలు జపించునది. అంత దానిదేహమంతయుఁ బూసి కొని దేవుని స్పృశించియు స్మరించియు ప్రాణాయామధారణము చేయునది. అంత నదృశ్యుఁడగును. రాజవశ్యముగోరినవాఁడు రక్తచందనచూర్ణము నీమంత్రముచే పదివేలమార్లభిమంత్రించి రాజగృహమునకుఁ బోవునప్పు డంతయు లలాటమున ధరించి పోవునది. రాజును రాజపురుషులును వశ్యులగు దురు. శత్రునాశమునుగోరినవాఁడు ఆశత్రువుపేరుగ్రహించి, శివుని సన్నిధి యందు, ఒక్కపాదము నిల్చి, పదివేలు జపించునది. ఆశత్రువు సంవత్సర మునకు నశించును. దక్షిణామూర్తిసన్నిధానమున నిత్యము నష్టశతము జపించు చుండినచో రాజపురుషులవలన భయముగలుగదు.

ధ్యానము.

విశ్వతఃపాణిపాదాబ్జం విశ్వతోక్షి శిరోముఖమ్,
జ్వలన్తం విశ్వ మావృత్య తేజోరాశిం శివం స్మరేత్.

అంతటను హస్తములును పాదములును గలవాఁడును అంతటను కన్ను లును శిరస్సులును ముఖములును గలవాఁడును సమస్తము నావరించి జ్వలించు చున్నవాఁడు నగు తేజోరాశిస్వరూపుఁడయిన శివుని ధ్యానింపవలయును అని యర్థము.

ఇది శ్రీమత్థవాటోపనామ సుందరరామప్రణీతం బగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందుఁ
నవమానువాకము.

ఓం నమోభగవతే రుద్రాయ.

అథ దశమానువాకః.

---

ద్రా పే అన్ధ స స్ప తే ద రి ద్ర న్నీ ల లో హి త,
ఏ షాం పు రు షా ణా మే షాం ప శూ నా ం మా
భే ర్మా ఽ రో మో ఏ షాం కిం చ నా మ మ త్.

ద్రాపే - అన్ధసః - పతే-దరిద్రత్ - నీలలోహిత - ఏషామ్ -
పురుషాణామ్ - ఏషామ్ - పశూనామ్ - మా - భేః -
మా - అరః - మా- ఉ - ఏషామ్ - కిమ్ - చన - అమమత్. ౧

ద్రాపే=పాపులను కుత్సితగతి నొందించువాఁడా! పాపులకు నరక మిచ్చువాఁడా యనుట, అన్ధసస్పతే=అన్నమునకుఁ బాలకుఁడా! భక్తుల యన్నమును పాలించువాఁడా యనుట, దరిద్రత్=ఏమియు లేనివాఁడా! తానుదక్కఁ దనకు మఱేమియు లేనివాఁడా యనుట, నీలలోహిత=కంఠము నందు నల్లనివాఁడును దక్కిన శరీరమునందు ఎఱ్ఱనివాఁడును అయినవాఁడా! కాలకూటధారణముచే కంఠముమాత్రము నల్లనైనదని భావము. ఇట్టి యో. రుద్రుఁడా! ఏషాం=ఈ, మా సంబంధులగుననుట, పురుషాణామ్ = పురుషుల యొక్కయు, ఏషామ్ = ఈ, మా సంబంధులగు, పశూనామ్ = పశువుల యొక్కయు, సమూహమునని యధ్యాహార్యము, మా భేః = భయపఱుపకుము. ఏషామ్=వీనిలో, కించన=ఏదియును, మా అరః=నశింపకుండుఁగాక, మో అమమత్=రోగము పొందకయె యుండుఁగాక.

పాపులను నరకములోఁ బడవేయువాఁడవు భక్తుల యన్నము రక్షించువాఁడవు కేవలుండవు కాలకూటవిషము ధరించినవాఁడవగుటచే కంఠమునందు నీలవర్ణుఁడవుఁ దక్కినశరీరమంతయు రక్తవర్ణుఁడవునగు రుద్రుఁడా! నీభక్తులగు మాపుత్రపౌత్రులు మొదలగు పురుషులకును, మాగోమహిష్యాది పశువులకును కొంచెమయినను భయము కలిగింపకుము. ఇప్పుడు చెప్పినవానిలో ఏదియు నాశముపొందకయు కొంచెమయినను రోగముపొందకయును నుండునట్లు అనుగ్రహింపుము.

భ. ఇదివఱకు విశ్వరూపమున దేవుని స్తుతించి యింక నభయము ప్రార్థింపఁబడుచున్నది. ద్రాపే = నికృష్టమయినగతిని అనఁగా యాతనానుభవరూపమయిన దానిని, లేక, దారిద్ర్యానుభవరూపమయినదానిని, పొందించువాఁడా! లేక, ద్రాపి యనఁగా కవచము, అదిగలవాఁడా! అన్ధసస్పతే=అన్నమునకు నాథుఁడా! దరిద్రత్ = దేనిని అంటనివాఁడా, అన్నమునకుఁ బతియయ్యును దరిద్రస్వభావుఁడా యనుట, నీలలోహిత = దేవుని హృదయమునుండి యావిర్భూతుఁడైనరుద్రుండు నీలలోహితుఁ డనఁబడును. ఇతఁడే భిక్షాటనాదికము గావించెను. ఇతని దేహములో, అర్ధము నీలవర్ణము, అర్ధము లోహితవర్ణము, నరనార్యాత్మకుఁడగుటవలన, లేక, నామరూపాత్మకుఁడగుటవలన నని తెలియునది. మఱియొకఁడు చెప్పుచున్నాఁడు. కంఠమునందు నీలవర్ణుఁడును, ఇతరభాగమునందు లోహితవర్ణుఁడును, లేక, నిలీనము అనఁగా మిక్కిలి నిరస్తమయిన లోహితము అనఁగా కాలుష్యము గలవాఁడు, అట్టివాఁడా యని సంబోధనము, ఏషామ్ = ఈ, మావారయిన యనుట, పురుషాణామ్=పుత్రులు మొదలగు పురుషులను, ఏషామ్=మావైన, పశూనామ్=గోవులు మొదలయిన పశువులను, ద్వితీయార్థమున షష్ఠి, మాభేః = భయము పఱుపకుము. ఏషామ్=వీనిలో, కించన = దేనినిగూడ, మా అరః=రుధాతువు ఆజ్

భూర్వామయి వ్యసనము దెలుపును, ఇప్పు డుపసర్గములేకయే యాయర్థమునే జెప్పుచున్నది. అంతర్భావి తణ్యంతము, ఆర్తినిబొందింపకుము. మో అమ మత్=పురుషవ్యత్యయము రోగము పొందింపకుము, లేక, మా అరః=పురుష వ్యత్యయము, ఆర్తి పొందకయుండుగాక. మో అమమత్=రోగము పొంద కుండుగాక. అప్పుడు కిం చన అనునది కర్తృపదమగును.

ఈమంత్రమునకు ఋషి పులహుడు, దేవత రుద్రుడు, ఛందస్సు ఆస్తారపంక్తి. ఒకదిన ముపవాసముచేసి పదివేలు జపించినచో బురశ్చరణ మగును. ఆర్ద్రానక్షత్రదినమునందు కపిలాజ్యముచే పదివేల హోమముచేసిన చో ధనము నొందును. సన్నిపాతజ్వరముగలవాని శయనము శిరఃపార్శ్వమున నగ్నిం బ్రతిష్ఠించి దూర్వాగ్రము లయిదువేలు వేలుచునది. అజ్వరమువలన ముక్తుండై యతండు దీర్ఘాయువునగును. అభిచారమోక్షము గోరువాడు వికంకతసమిధలు పదివేలహోమము చేయవలయును. వాని కభిచారమువలన భయముగలుగదు. మహాజనము తన్ను ద్వేషించునపుడు ఘృతాక్తమగు తిలలు పదివేలహోమము చేసినయెడ వారివలన భయముగలుగదు. అత్తి సమిధలును తిలలును పదివేలువేల్చినచో సర్వభూతంబులవలనను భయముగలుగదు. గ్రామ మధ్యంబునగాని నగరమధ్యంబునగాని యగ్నిం బ్రతిష్ఠించి యాజ్యాక్తమగు నువ్వుపిండిచే పదివేలాహుతులు వేలుచునది. అశ్వత్థపత్రములయందు బలి యుంచునది. ముందును వెనుకను ఎనిమిదివేలు జపము సేయవలెను. అతనికి రుద్రుడు సర్వభూతసహితుండై భైరవరూపంబున బ్రత్యక్షమగును. అప్పు డతండుచూచి చలించునేని యున్మాదము నొందును. అచలుండై యుండెనేని మహాసిద్ధిం బడయును. తద్రూపము స్మరించినచో నాపదలు తొలగును.

## ధ్యానము.

అగుల్ఫాసిత కఞ్చుకో డమరుకాశ్లిష్టో లసత్కున్తలీ
కాలీ కుణ్డలితక్రవా స్సతిలకో మన్దక్వణన్నూపురః,

శ్రీమన్నిర్మల దన్తపఙ్క్తికిరణ శ్వేతాయమానాననో
దేవో భైరవవేషభూషితవపు ర్ధ్యేయో మృడానీపతిః.

చీలమండలవఱకు జీరాడునట్టి నల్ల చొక్కాయ గలవాఁడును డమరు
వుతోఁ గూడినవాఁడును ప్రకాశించుచున్న చెంద్రుకలు గలవాఁడును
శూలము ధరించినవాఁడును ఐోఁగులతోఁగూడిన చెవులుగలవాఁడును నొసట
బొట్టు ధరించినవాఁడును తిన్నగా మ్రోయుచున్న యందెలు గలవాఁడును
అధికమయిన కాంతిగల స్వచ్ఛమయిన దంతపఙ్క్తి కిరణములచేఁ దెల్లనైనట్లున్న
ముఖముగలవాఁడును భైరవవేషముచే నలంకరింపఁబడిన దేహము గలవాఁడు
నగుదేవుని పార్వతీనాథుని ధ్యానింపవలెను. అని దీని యర్థము. ౧

---

యా తే రుద్ర శివా తనూః శివా విశ్వాహ భేషజీ,
శివా రుద్రస్య భేషజీ తయా నో మృడ జీవసే.
యా - తే - రుద్ర - శివా - తనూః - శివా - విశ్వాహ
భేషజీ - శివా - రుద్రస్య - భేషజీ - తయా - నః - మృడ -
జీవసే. ౨

రుద్ర=రుద్రుఁడా! శివా=శాంతమయిన, ఎందువలననఁగా, విశ్వాహ
భేషజీ = ఎల్లదినములయందును ఔషధమువంటిది, ఔషధమువలె రోగము
లను దారిద్ర్యాదులను పోఁగొట్టునదియనుట, కావుననే, శివా = మంగళకర
మయినదియు, రుద్రస్య = రుద్రునకు, రుద్రుని తాదాత్మ్యము పొందుట
కనుట, భేషజీ = ఔషధమయినది, జ్ఞానదానముచే రుద్రుని తాదాత్మ్యము
పొందుటకు సాధనమయినదియనుట, కావుననే, శివా = మంగళకరమైనదియు
నగు, తే = నీయొక్క, తనూః = రూపము, యా = ఏదికలదో, తయా =

అరూపముచే, నః = మమ్ము, జీవసే = జీవింపఁజేయుటకు, మృడ = సుఖింపఁజేయుము.

రుద్రుఁడా! భక్తులకు సర్వకాలములయందును రోగములను దారిద్ర్యాదులను బోఁగొట్టునదియు, జ్ఞానమొసంగి నీతాదాత్మ్యము కలుగునట్లుచేసి జన్మమరణాది సంసారదుఃఖమును బోఁగొట్టునదియుఁ గావున మంగళకరమై శాంతమయిన నీరూపము ఏదిగలదో, అరూపముచే మమ్ము ఈలోకమునందు రోగాదిబాధలులేక జీవించునట్లుచేసి తుదను జ్ఞానముగలిగించి నీతాదాత్మ్యమొసంగి జన్మమరణాదిసంసారదుఃఖము తొలఁగించి మోక్షసుఖము నొందింపుము.

భ. రుద్ర = రుద్రుఁడా! తే = నీయొక్క, శివా = సుఖకరమయిన, తనూః=రూపము, సర్వదుఃఖనివృత్తికి భేషజమగుటవలనను సంసారదుఃఖనివృత్తికి భేషజమగుటవలనను దేవునిరూపముయొక్క శివత్వము రెండువిధములు. అందు మొదటిదిమాత్రమె పరిగ్రహించినచో ధనము పుత్త్రులు మొదలయిన సాంసారికసుఖమునుమాత్రమొసంగును. రెండవదిమాత్రమె పరిగ్రహించినచో నిశ్శ్రేయసముమాత్రమె గలిగించును. ద్వివిధమయినసుఖమునుం గావలసినది కావున ద్వివిధశివత్వమునుం గొండాడఁబడుచున్నది. విశ్వాహా భేషజీ = సర్వదినములయందును ఔషధమైనది, ఇతరమయిన ఔషధము అట్లుకాదు. దేశకాల శరీరవయోవస్థాభేదముఁబట్టి యొకానొకప్పుడే ఔషధమవును, కావుననే, శివా = సుఖకరమయినదియు, దారిద్ర్యాది సర్వదుఃఖములను హరించి సుఖమొసఁగునదియుననుట, రుద్రస్య = సంసారరోగమునుహరించునట్టి, తవ [అధ్యాహృతము] నీయొక్క, భేషజీ= ఔషధమయినది, నీవు ఏయౌషధముచే భక్తులకు సంసారరోగముఁబోఁగొట్టుదువో అట్టిదియనుట, కావుననే, శివా =

సుఖకర మయినదియు, సంసారదుఃఖమును బోఁగొట్టి నిశ్శ్రేయసలక్షణమయిన ఆత్యంతికసుఖము గలిగించునదియు ననుట, అట్టిరూపము, యా = ఏదిగలదో, తయా = అట్టిద్వివిధమయిన శివత్వముగల రూపముచేత, నః = మమ్ము, జీవసే = జీవించుటకు, మృడ = సుఖింపఁజేయుము, మేము ఈలోకమునందుఁ దృప్తిఁ బొంది ఆత్మలాభమునుంజెంది స్వస్థులమై జీవించునట్లు గావింపుమనుట. లేక, నః=మమ్ము, జీవసే=జీవింపఁ జేయుటకొఱకు, మృడ. నీవే అందఱను అభిమానము లోనంగి బ్రతికింపవలసినవాఁడవనుట.

ఈమంత్రమునకు ఋషిస్కందుఁడు, దేవతయును స్కందరూపుఁడగు రుద్రుఁడు, ఛందస్సు అనుష్టుప్పు, ఎనిమిదియూర్లు ప్రాణాయామములు గావించి యైదువేలుజపించినచోఁ, బురశ్చరణమగును.

దీనిచే గర్భరక్ష చేయునది. ఆరక్షను గర్భము వ్యక్తమయిన పిదప మూఁడవమాసమునందుఁ జేయవలెను. ఆవశ్యకమని తోఁచినప్పుడైనను జేయవచ్చును. మంత్రసిద్ధుఁడగు బ్రాహ్మణునిచేఁ జేయించునది. అతని శివునింబోలె భావించి నమస్కరించునది. గృహమధ్యమందు యగ్నికుండమును వేదికను నిర్మించి, వేదికయందు శుద్ధతండులములుపఱచి, సాధారణఘటము ప్రతిష్ఠించి యందు మహాసేనమంత్రముచే స్వర్ణపుష్పమున శివు నావాహనము గావించి బిందు యుక్తంబులు తంతువేష్టితంబులు స్వర్ణగర్భంబులు శరావపిహితంబులు సముద్రగామి నదీజలపూర్ణములు నూతనవస్త్రచ్ఛన్నంబులునగు కలశంబులుంచి తన్మధ్యంబున జలపూర్ణంబును ఆర్ద్రానక్షత్ర దినమునసైనచో బంగారము చేతను కానిచో నవరత్నములచేతను బూర్ణంబునగు నొకఘటము నుంచి, వానిని ఉత్తమ వస్త్రములచేఁ గప్పి కదలకుండునట్టు లుంచి, దేవు నారాధించునది. కడవఱకు నాజ్యముతో దీపము నుంచునది. పూజా ద్రవ్యములన్నియు కర్పూర మిశ్రములు గావలయును. అంతఁ దక్షిన్నిధియందు దుపస్థానమంత్రము జపించి పిమ్మటఁ బట సంస్కారమంత్రముచే

హోమముగావించునది. దధిమధ్వాజ్యసంయుక్తంబులగు తిలదూర్వాగ్రలాజ తులస్యక్షీరములు హోమద్రవ్యము. అంత హవిస్సుఁ బూజింపవలెను. పక్వమైన ప్రస్థపరిమిత తండులములు హవిస్సు. దాని నగ్నియందు వేలుచునది. ఇట్లు సాయంకాలమునుం జేయునది. ఆచార్యుఁడు జపించునది. నిత్యము బ్రాహ్మణుల భుజింపఁజేయవలెను. ఇట్లుగావించి నచో ఆయుష్మంతమగు సదపత్యము కలుగును. గర్భపాతము సంభవింపదు. హోమదేశము స్త్రీలు శూద్రులును బ్రవేశింపఁగూడదు. మంత్రము వైదికమగుటచేఁ బాషండులును బ్రవేశింపఁజనదు. అంతముపఱకు దీక్షించి కడపటి దినమున స్నానము సేయునది. పిమ్మట గురువునకు దక్షిణయిచ్చునది. తదనంతరము కుమారగ్రహశాంతికొఱకు గణపూజ సేయవలెను. ఆయపత్యము దీర్ఘాయువగును.

ప్రసంగవశమునఁ బ్రయోగాంతరములు చెప్పఁబడుచున్నవి. కన్యార్థియగువాఁడు ఘృతప్లుతంబులగు లాజలు వేల్చినచో నభీష్టకన్యకం బడయును. ఉత్తరేనుసమిధల వేల్చుటచే నలక్ష్మి నశించును. తిల హోమముచే సర్వపాపములు నశించును. తెల్లనివియు నెఱ్ఱనివియు నల్లనివియుఁ బీతవర్ణములునగు తంతువులచేఁ జుట్టఁబడిన ఖదిరసమిధల హోమముచేఁ గ్రమమున బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రులు వశ్యులగుదురు. నేతిచే లక్షహోమము గావించిన యెడ సర్వకామంబులు సిద్ధించును. వస్త్రము గోరువాఁడు కలువలు మొదలగు పూవులు వేల్చునది. తాను వేల్చు పూవులవన్నెగల వస్త్రముంబొందును. వర్షము గోరువాఁడు ఈప్రయోగము గావింపవలెను. గోమయముచేనలికిన శుచిప్రదేశమున నెఱ్ఱమట్టితో మండలముగావించి ఆమండలమునకు ముందు, సూత్రవేష్టితము జలపూరితమునగు నూతనకుంభముఁ బ్రతిష్ఠించి యందు సూర్యునావాహనముచేసి పూజించి క్షీరముచే నూటయెనిమిదాహుతులు వేల్చునది. అంత సూర్యుని ధ్యానించుచు సహస్రము జపించునది. ఇట్లు ఏడుదినములుగాని

పండ్రెండు దినములుగాని చేసినచో భగవంతుండు ప్రసన్నుండై మహావర్షము గురియించును. పుత్త్రునిఁ గోరువాఁడు అహోరాత్ర ముపవసించి శుచియై పాయసము నూటయెనిమిదాహుతులు వేల్చి యెనిమిదినూర్లుజపించి ఋతుస్నాతయుఁ బరిశుద్ధయునగు భార్యచే హుతశేషముఁ దినిపించునది. అంత బ్రాహ్మణుల భుజింపఁజేసి వారలయాశీర్వాదము పొందునది. తేజస్వియు రోగరహితుండు నగు పుత్త్రుం బడయును. మఱియు ననిష్టము దోఁచినప్పుడును దుస్వప్నము గలిగినప్పుడును అభిచారము దోషముసంభవించినప్పుడును అలక్ష్మీబాధ కలిగినప్పుడును యుద్ధము మొదలగు నాపదలు కలిగినప్పుడును గ్రహచారము క్రూరమగునప్పుడును భూతావేశము సంభవించినప్పుడును మఱియు నితరసంకటముల యందును, మున్ను చెప్పినయట్లు మండలముగావించి యందు నూతనకుంభంబు సర్వమంగళయుక్తంబు గంధజలపూరితంబుగావించి యందు ఏలాలవంగకర్పూర నింబజాతీఫలంబులుంచి, దేవు నావాహనముచేసి పూజించి హోమముచేసి, యీమంత్రముచే తజ్జలము వేయునూటయెనిమిదిమార్లభిమంత్రించి యాజలముచే నాతురు నభిషేకించునది. సర్వదోషంబులు నశించును. నిత్యము ప్రాతఃకాలమున స్నానముచేసి యీమంత్రమును సహస్రము జపించినచో శ్రీయు నారోగ్యమును దేజస్సును నిరంతరము వృద్ధిఁ బొందుచుండును. క్షీరము నాహారముగాఁ గొనుచు జితేంద్రియుండై యొకసంవత్సరము ప్రతిదినము యథాశక్తిఁ బూజగావించుచుఁ బదివేలుజపించిన, భగవంతుని ప్రసాదంబున నణిమాదిసిద్ధులుపొందును. మఱియు భగవంతునియందే హృదయమునుంచి యేకాగ్రుండై దృఢభావనతో నిరంతరము జపించుచుండువాఁడు ముక్తుఁడగును.

### ధ్యానము.

ద్రుతచామీకరప్రఖ్యం శక్తిపాణిం షడాననమ్,
మయూరవాహనారూఢం స్కందరూపం శివం స్మరేత్.

కరఁగిన బంగారువంటి మేనుగలవాఁడును శక్తియను నాయుధము హస్తమునందుఁ గలవాఁడును ఆఱు మోములుగలవాఁడును నెమిలి వాహనము నారోహించినవాఁడునగు స్కందునిరూపముగల శివుని ధ్యానింపవలెను అని యర్థము.

---

ఇ మా గ్ం రు ద్రా య త వ సే క ప ర్ది నే క్ష య
ద్వీ రా య ప్ర భ రా మ హే మ తి మ్, య థా న
శ్శ మ స ద్ద్వి ప దే చ తు ష్ప దే వి శ్వం పు ష్టం
గ్రా మే అ స్మి న్న నా తు ర మ్.

ఇమామ్ - రుద్రాయ - తవసే - కపర్దినే - క్షయద్వీరాయ - ప్రభరామహే - మతిమ్ - యథా - నః - శమ్ - అసత్ - ద్విపదే - చతుష్పదే - విశ్వమ్ - పుష్టమ్ - గ్రామే - అస్మిన్ - అనాతురమ్. 3

యథా = ఎట్లు, నః = మాయొక్క, ద్విపదే= మనుష్యుని కొఱకును, పుత్త్రపౌత్త్రాదులకొఱకు ననుట, చతుష్పదే = పశువుకొఱకును, గోమహిష్యాదులకొఱకు ననుట, శమ్=సుఖము, అసత్=కలుగునో, అస్మిన్=ఈ, గ్రామే= గ్రామమునందు, విశ్వమ్= సమస్తమును, ప్రాణిసమూహమంతయు ననుట, పుష్టమ్ = పుష్టికలదియు, మిక్కిలి సుఖముగలదియు ననుట, అనాతురమ్ = ఉపద్రవములేనిదియు, అసత్ (అధ్యాహృతము)=అగునో, తథా = (అధ్యాహృతము) అట్లు, వయమ్ (అధ్యాహృతము) = మేము, తవసే = బలము గల వాఁడును, మాకోర్కెలెఱవేర్చుటకు సమర్థుఁడుననుట, కపర్దినే=జటాజూటము గలవాఁడును, ఋషివేషము గలవాఁడుననుట, క్షయత్ వీరాయ=నశించుచున్న

శత్రువీరులుగలవాఁడును, లేక, నశించుచున్న అన్యథాభాన రూపమయిన పాపముగలవాఁడును, అన్యథాభానము నశింపఁజేయువాఁడుననుట, అగు, రుద్రాయ = రుద్రునికొఱకు, ఇమామ్ = ఈ, మతిమ్ = బుద్ధిని, పూజ ధ్యానము మొదలుగాఁగలవానియందలితలంపుననుట, ప్రభరామహే = మిక్కిలి పోషించు చున్నాము, ఎక్కువగా చేయుచున్నామనుట.

మాయొక్క పుత్త్రపౌత్త్రాది మనుష్యవర్గమునకును గోమహిష్యాది పశువర్గమునకును సుఖము గలుగుటకును, ఈ గ్రామమునందుండు ప్రాణులన్నియు పుష్టిగలిగి యుపద్రవము లేక యుండుటకును, మాకోరిక నెఱవేర్చుటకు సమర్థుఁడును జటాజూటము గలవాఁడును శత్రువీరుల నశింపఁజేయువాఁడును (అన్యథా జ్ఞానము నశింపఁజేయువాఁడు) నగు రుద్రునిఁ బూజ ధ్యానము మొదలగువానిచే మిక్కిలి యారాధించెదము

భ. యథా = ఎట్లు, ఎట్లు గావించినయెడననుట, నః = మాయొక్క, ద్విపదే = పుత్త్రులు మొదలగువారలకొఱకును, చతుష్పదే = పశువులు మొదలగువానికొఱకును, శమ్ = సుఖము, అసత్ = కలుగునో, యథా (అధ్యాహృతము), అస్మిన్ = ఈ, గ్రామే = గ్రామమునందు, మేము వసించుగ్రామమునందనుట, విశ్వమ్ = సమస్తమును, మావికాని ప్రాణిజాతము గూడననుట, పుష్టిమ్ = పుష్టిగలదియు, అనాతురమ్=రోగములేనిదియు, అసత్ = అగునో, "రుద్రాధ్యాయీ వసేద్యత్ర గ్రామే వానగరేపివా, నతత్ర క్షుత్పిపాసాద్యా దుర్భిక్ష వ్యాధయోపిచ" రుద్రాధ్యాయియగువాఁడు గ్రామమందుఁగాని నగరమందుఁగాని యెచ్చట వసించునో, అచ్చట క్షుత్పిపాసాదులుగాని దుర్భిక్షవ్యాధులుగాని కలుగవు. అని పౌరాణికులు. లేక, యథా = ఎట్లు, నః = మాయొక్క, అస్మిన్ = ఈ, గ్రామే = గ్రామమునందు, ద్విపదే, చతుష్పదే,

శమ్, అసత్. విశ్వమ్=ధనము ధాన్యము మొదలగునది, పుష్టమ్=సమృద్ధమును, అనాతురమ్ = బాధలేనిదియు, అసత్ = అగునో, తథా = అట్లు, తవసే = వృద్ధిఁ బొందించువాఁడును, లేక, తవస్సనఁగా బలము, అదికలవాఁడును, మత్వర్థీయలోపము, కపర్దినే = జటాజూటము గలవాఁడును, క్షయద్వీరాయ = వసించుచున్న వీరులుగలవాఁడును, ఎవ్వని నాశ్రయించి శూరులు వసియింతురో అట్టివాఁడును అనుట, లేక, నశించుచున్న వీరులు గలవాఁడును, ఎవ్వనిఁబొంది వీరులు నశింతురో అట్టివాఁడును, అగు, రుద్రాయ = రుద్రునికొఱకు, ఇమామ్ = ఇట్టి, మతిమ్ = బుద్ధిని, మానస పూజాత్మకమగు తలఁపును, ప్రభరామహే=మిక్కిలి ధరించుచున్నాము, ఎల్లప్పుడు రుద్రుని మనస్సుచేఁ బూజించెదమనుట. లేక, మతిమ్ = స్తోత్రమును, స్తోత్రాత్మకమగు పూజను,ప్రభరామహే. ఎల్లప్పుడు రుద్రునిస్తోత్రములచే నారాధించెదమనుట లేక, ప్రభరామహే=మిక్కిలి పోషించెదము, స్తోత్రములచేతను హవిః ప్రదానములచేతను రుద్ర విషయకమయినబుద్ధిని అవిచ్ఛిన్నముగాఁ గావించెదమనుట లేక, రుద్రుఁడే స్తోతవ్యుఁడు ఉపాసితవ్యుఁడు ఇత్యాదిశ్రుతిచేత, రుద్రవిషయకమయిన బుద్ధినే యెల్లప్పుడు ధరించెదమని తాత్పర్యము. 3

---

మృ డా నో రు ద్రో త నో మ య స్కృ ధి క్ష య
ద్వీ రా య న మ సా వి ధే మ తే, య చ్ఛం చ యో
శ్చ మ ను రా య జే పి తా త ద శ్యా మ త వ రు ద్ర
ప్ర ణీ తౌ.

మృడ - నః - రుద్ర - ఉత - నః - మయః - కృధి - క్షయ
ద్వీరాయ - నమసా - విధేమ - తే - యత్ - శమ్ - చ -

యోః - చ - మనుః - ఆయజే - పితా - తత్ - అశ్యామ -
తవ - రుద్ర - ప్రణీతౌ. ౪

రుద్ర=రుద్రుఁడా! నః = మమ్ము, మృడ = ఈలోకమునందు సుఖింపఁ జేయుము. ఉత = మఱియును, నః = మాకు, మయః = పరలోకసుఖమును, కృధి = చేయుము. క్షయద్వీరాయ = నశించుచున్న పాపములుగల, నశింపఁ జేయఁబడిన మాపాపములు గలవాఁడనుట, అగు, తే = నీకొఱకు, నమసా= నమస్కారముచేత, విధేమ = పరిచరించెదము, ఆరాధించెద మనుట. రుద్ర = రుద్రుఁడా ! పితా=పాలకుఁడైన, మనుః = ప్రజాపతి, శంచ = సుఖమును, యోశ్చ =దుఃఖమునుండి వేఱగుటను, దుఃఖములేమిననుట, యత్ = దేనిని, ఆయజే = కొంచెముకలిగించెనో, తత్ = దాని, తవ = నీయొక్క, ప్రణీతౌ= ప్రణయమునందే, నీప్రేమకలిగిననే యనుట, అశ్యామ = పొందుదుము.

రుద్రుఁడా ! నీవు మాకు ఈలోకమునందును బరలోకము నందును సుఖముగలిగింపుము. అందుకై మాపాపములు పోఁగొట్టు నట్టి నిన్ను నమస్కారముచేసి యారాధించెదము. ఇదిగాక ఓరుద్రా! నీయాజ్ఞచేఁ బాలకుఁడగు ప్రజాపతి మాకు సుఖ మును దుఃఖములేమియు నేమి గలిగించియున్నాఁడో, అదియు నీవు మామీఁద ననుగ్రహముంచినంగాని మాకుఁ గలుగదు.

భ. రుద్ర=ఓరుద్రా! నః=మమ్ము, మృడ = ధనాది సమృద్ధిచే సుఖము నొందింపుము. ఉత = మఱియును, నః = మాకు, మయః=నిశ్శ్రేయసమును, కృధి = చేయుము. క్షయద్వీరాయ, తే = నీకొఱకు, నమసా=నమస్కారము చేత, లేక, అన్నముచేత, చరుపురోడాశములచేత ననుట, విధేమ = పరిచరిం చెదము. మేము ఎట్లు నిన్నే యెల్లప్పుడును సేవించుచున్నామో, అట్లు నీవును, మాకు అభ్యుదయము నిశ్శ్రేయసమునిమ్మనితా. లేక, రుద్రా! నీవు మాకు అభ్యు

దయమును నిశ్శ్రేయసమును ఇమ్ము, అందుకొఱకై మేము నిన్ను సేవించెదమని తా. ఇట్లు సుఖసంప్రాప్తి ప్రార్థింపఁబడెను. ఇఁక దుఃఖనివృత్తి ప్రార్థింపఁబడును. యత్=ఎట్టి, శంచ=శమనమును, సంభవించిన దుఃఖహేతువుల శాంతిననుట, యోశ్చ = పృథగ్భావమును, అనాగతములయిన దుఃఖహేతువులు తలచూపకుండుటను, మనుః = సర్వజ్ఞుఁడగు, పితా=ప్రజాపతి, ఆయజే = మర్యాదచే ఇచ్చెనో, వర్ణాశ్రమాది భేదముచే వ్యవస్థితముగావించెనో, రుద్ర=రుద్రుఁడా! పునరుక్తియాభిముఖ్యాతిశయము కలుగుటకు, తవ = నీయొక్క, ప్రణీతౌ= ఆజ్ఞ కాఁగా, అనుగ్రహముకలుగఁగా, తత్ = దానిని, ఆ ఆగతదుఃఖహేతు శమనమును అనాగతదుఃఖహేతు పృథగ్భావమును, అశ్యామ=పొందుదుము. లేక, తత్ = దానిని, అశ్యామ=పొందుదుము, దానిని అట్లె అనఁగా, ప్రజాపతి వ్యవస్థచేసినట్లెపొందెదము. నీయనుగ్రహముచే ఏమఱినవారము గాకుండవలెను. ఒకవేళ ఏమఱిచేయకపోయినను నీయనుగ్రహముచే మాకు అయతిక్రమించిన దోషము లేకుండుఁగాకయని భావము. ఎందువలన ననఁగా, రుద్ర, తవ, ప్రణీతౌ=ఆజ్ఞయందు, వర్తామహే (అధ్యాహృతము)=ఉన్నాము. అర్థాంతరము. రుద్ర=రుద్రుఁడా! తవ=నీయొక్క, ప్రణీతౌ=ఆజ్ఞయందు, మనుః= సృష్టికర్తయైనవాఁడుననుట, పితా = ప్రజలకుహితముచేయుటచేఁ దండ్రివంటి వాఁడు, శంచ, యోశ్చ, రెండువిధములయిన దుఃఖహేతువులనివృత్త్యుపాయమును, యత్=ఎట్టిదానిని, ఆయజే=నియమించెనో, తత్=దానిని, అశ్యామ= పొందెదము, మునుపువ్యవస్థచేసినట్లే పొందెదము, నిన్నుఁబరిచరించుచున్నాము. కావున తద్వ్యవస్థాభంగము మాకుసంభవింపదనిభావము. మఱియొకయర్థము. రుద్ర, యత్, తవ=(అధ్యాహృతము) నీయొక్క, నీదైనయనుట, శంచ, యోశ్చ, ఉభయవిధదుఃఖనివృత్త్యుపాయమును, మనుః=సర్వజ్ఞుండైనను, పితా= జగత్తులకుఁదండ్రియయిన ప్రజాపతి, ఆయజే=అభిముఖ్యముచే ప్రశంసించెనో, లేక, తాను స్వీకరించెనో, తవ=నీయొక్క, ప్రణీతౌ=అనుగ్రహముకలుగఁగా, తత్=దానిని, అశ్యామ=పొందుదుము. నీవు ఏర్పఱచిన దుఃఖనివృత్త్యుపాయ

మునే, సర్వజ్ఞుఁడైనప్రజాపతి ప్రశంసించి స్వీకరించెను, నీయనుగ్రహమున్నచో మా కది సిద్ధించుననితా.

ఈరెండుమంత్రములకును ఋషి మాండవ్యుఁడు, ఛందస్సు జగతి, దేవత రుద్రుఁడు, ఈరెండు ఋక్కులును ఒకటేమంత్రము ఛందస్సు అనుష్టుప్పు అని కొందఱుచెప్పెదరు.

ఒక ప్రాజాపత్యకృచ్ఛ్రముచరించి తొమ్మిదివేలు జపించినచో వీని పురశ్చరణమగును. అమావాస్యయందుఁ జతుష్పథంబున నగ్నిం బ్రతిష్ఠించి నవనీతము పదివేలాహుతులు వేల్చినచో గోవులు మొదలగువానికి శాంతి యగును. జలము స్పృశించి పదివేలుజపించి యాజలమును రాజవాహనములపైఁ బ్రోక్షించినచోఁ దచ్ఛాంతియగును. ఆవాహనముల కుపయోగించు నాహారములలో నాజలము కొంచెము కలుపవలెను. ఆజ్యమిశ్రములగుతిలలు పదివేలువేల్చినయెడ దిర్యగ్జంతువులకు శాంతియగును. తక్కినజంతువులకు శాంతికావలయునేని, దూర్వలు పదివేలువేల్చునది. తచ్ఛాంతి యగును.

ధ్యానము.

దివ్యసింహాసనాసీనం స్తూయమానం మహర్షిభిః,
ప్రసన్నవదనం ధ్యాయేత్సోమం సోమార్ధధారిణమ్.

దివ్యసింహాసనంబునం గూర్చుండినవాఁడును మహర్షులచే స్తుతింపఁబడుచున్నవాఁడును ప్రసన్నమయిన మోముగలవాఁడును చంద్రకల ధరించినవాఁడునగు శివుని ధ్యానింపవలెను అని దీనియర్థము. ౪

మా నో మ హా న్త ము త మా నో అ ర్భ క ం మా
న ఉ క్ష న్త ము త మా న ఉ క్షి త మ్, మా నో

వ ధీః పి త ర ం మో త మా త ర ం ప్రి యా మా న
స్త ను వో రు ద్ర రీ రి షః. ౫

మా - నః - మహా న్తమ్ - ఉత - మా - నః - అర్భకమ్ -
మా - నః - ఉక్ష న్తమ్ - ఉత - మా - నః - ఉక్షితమ్ -
మా - నః - వధీః - పితరమ్ - మా - ఉత - మాతరమ్ -
ప్రియాః - మా - నః - తనువః - రుద్ర - రీరిషః. ౫

రుద్ర = రుద్రుఁడా! నః = మాయొక్క, మహాన్తమ్ = పెద్దవానిని, వృద్ధుఁడగుపురుషుని, పితామహాదులననుట, మావధీః = హింసింపకుము. "వధీః" అనునది ముందును అనువర్తించును. ఉత = మఱియు, నః = మాయొక్క, అర్భకమ్ = శిశువును, మావధీః = హింసింపకుము. నః = మాయొక్క, ఉక్షన్తమ్= తడుపువానిని, వీర్యసేచనముసేయ సమర్థుఁడైన తరుణపురుషుని, వంశకర్తననుట, మా=హింసింపకుము. ఉత=మఱియు, నః=మాయొక్క, ఉక్షితమ్ = గర్భమున నుండు శిశువును, మా=హింసింపకుము. నః=మాయొక్క, పితరమ్ = తండ్రిని, మా = హింసింపకుము. ఉత=మఱియును, మాతరమ్ = తల్లిని, మా=వధింపకుము. నః = మాయొక్క, ప్రియాః = ప్రియములయిన, తనువః = శరీరములను, మారీరిషః=హింసింపకుము.

రుద్రా! మాతాతలు మొదలగు వృద్ధులను బాలురను యౌవనముగలవారలను గర్భమునందుండు శిశువులను మాతల్లి దండ్రులను ప్రియములయిన మాశరీరములను నీవు రోగాదులచే బాధింపక రక్షింపకుము.

భ. "నః" అనుచోటిబహువచనము భార్యాపుత్త్రాద్యభిప్రాయము. మాశరీరములను మావారిశరీరములను బాధింపకుము అనితా. ఇట్లింతటను గ్రహించునది.

ఈమంత్రమునకు ఋషి దేవరాతుఁడు, దేవత నందీశ్వరరూపుఁడగు రుద్రుఁడు, ఛందస్సు జగతి. మూఁడుపవాసములు గావించి యైదువేలు జపించినయెడ దీని పురశ్చరణమగును. దీనిచే సర్వజనరక్షచేయునది. ఆజ్యముచేఁ దడుపఁబడిన యవలును తిలలును బదివేలు వేల్వవలెను. లేక అశ్వత్థ సమిధలు పదివేలువేల్వవలయును లేక, ఆజ్యముచేఁగాని పదివేలాహుతులు వేల్వవలయును. ప్రతిసంవత్సరము నార్ద్రానక్షత్రమునఁ బదివేలు హోమముసేయునది. ఇట్లుగావించువాని స్త్రీబాలవృద్ధ జనులకందఱకును శాంతియగును. ఇతరమయిన శాంతిప్రయోగమునందును ఈమంత్రము పదివేలు జపించినచో ఫలవిశేషమగును. రాజు శాంత్యర్థము ప్రతిమాసము నార్ద్రయందు ఈమంత్రముచే హోమము చేయింపవలెను. రాజు నంతఃపురాదిస్వజనము వర్ధిల్లును.

ధ్యానము.

బాలేన్దు మకుటం దేవం తరుణాదిత్యవిగ్రహమ్,
ధ్యాయే న్నన్దీశ్వరాకారం గణేశ్వరసమావృతమ్.

బాలచంద్రుని కిరీటమునందు ధరించినవాఁడు, బాలసూర్యునివంటి యాకారముగలవాఁడును, ప్రమథగణనాథులచేఁ బరివేష్టింపఁబడినవాఁడును, నందీశ్వరునిరూపముగలవాఁడునగు రుద్రుని ధ్యానింపవలెను. అనియర్థము. ౫౧

---

మా న స్తోకే తన యే మా న ఆ యు షి మా నో
గో షు మా నో అ శ్వే షు రీ రి షః, వీ రా న్మా నో

ర ద్ర భా మి తో వ ధీ ర్హ వి ష్మ న్తో న మ సా వి ధే
మ తే. ౬

మా - నః - తోకే - తనయే - మా - నః - ఆయుషి -
మా - నః - గోషు - మా - నః - అశ్వేషు - రీరిషః -
వీరాన్ - మా - నః - రుద్ర - భామితః - వధీః - హవి
ష్మన్తః - నమసా - విధేమ - తే. ౬

రుద్ర = రుద్రుడా! నః = మాయొక్క, తోకే = బిడ్డయందు, బిడ్డ విషయమయి యనుట, ఇట్లుముందును, తనయే=పుత్త్రునివిషయమయ్యును, మారీరిషః = హింసింపకుము. నః = మాయొక్క, ఆయుషి = ఆయుస్సువిషయమయి, మారీరిషః = హింసింపకుము. నః = మాయొక్క, గోషు = ఆవులవిషయమయి, మారీరిషః = హింసింపకుము. నః = మాయొక్క, అశ్వేషు = గుఱ్ఱములవిషయమయి, మారీరిషః = హింసింపకుము, భామితః=కోపించిన వాఁడవయ్యు, ఇది యంతటను అనువర్తింపఁదగును. నః=మాయొక్క, వీరాన్=భృత్యులను, మా= చంపకుము. వయమ్ (అధ్యాహృతము) = మేము, హవిష్మన్తః = హవిస్సుగలవారమయి, నమసా = నమస్కారముచేత, తే = నీకొఱకు, విధేమ = పరిచరించెదము.

రుద్రా! మేము నీకుఁ గోపముకలుగునట్లు అపచారము చేసినను, నీవు కరుణించి, మాబిడ్డలకును కొడుకులకును మా యాయుస్సునకును మాగోవులకును మాయశ్వములకును మా భృత్యులకును హింసచేయకుండవలయును. అందుకై మేము నీకు నమస్కారముచేసి హవిస్సువేల్చి సేవించుచున్నాము.

భ. రుద్ర = రుద్రుఁడా! నః = మాయొక్క, తోకే = కొడుకువిషయమయి, తనయే = వానికొడుకు విషయమయి, మనుమని విషయమయియనుట, లేక, ద్వితీయార్థమునషష్ఠి, కొడుకును, మనుమని ఇట్లు ముందును, మారీరిషః= హింసచేయకుము. నః = మాయొక్క, ఆయుషి = జీవితకాలము విషయమయి, పురుషాయువు నూట పదునాఱుసంవత్సరములని ఛాందోగ్యము. నూటయిరువది యని జ్యౌతిషికులు, నూట యిరువదియేడని కొందఱు, నూఱే యని మఱి కొందఱు, మా=హింస చేయకుము. నః = మాయొక్క, గోషు=గోవులవిషయమయి, ఇది మహిష్యాదులకు నుపలక్షణము, మా = హింసచేయకుము. నః = మాయొక్క, అశ్వేషు=గుఱ్ఱములవిషయమయి, ఇది గజాదులకు నుపలక్షణము, మా = హింసచేయకుము. భామితః = కోపింపఁ జేయఁబడినవాఁడవయ్యును, లేక, కోపము గలవాఁడవయ్యును, నః = మాయొక్క, వీరాన్ = సంతానములను, పునరుక్తి సత్పుత్రగ్రహణార్థము, లేక, వీరాన్=శూరులను, మావధీః= వధింపకుము, మేము, నీకు అపచారము చేసి కోపముకలిగించినను నీవు మావీరులను కృపచే వధింపవలదు. అందుకొఱకు, వయమ్ = మేము; హవిష్మ నః; నమసా; తే; విధేమ.

ఈమంత్రమునకు ఋషియు దేవతయు భగవంతుఁడు, ఛందస్సుజగతి. ఇఁకఁ బురశ్చరణము, ఒకకృచ్ఛ్రము చరించి యుదుంబరపాత్రమునఁ గపిలాజ్యము వేయుమార్లభిమంత్రించి దానిచేఁ దనయగ్నియందుఁగాని మథితాగ్నియందుఁగాని యెనిమిదివేలు వేల్చి మహావ్యాహృతులచే నూఱాహుతులు వేల్చి శేషము త్రాగునది, అంత మూఁడురాత్రు లుపవసించి పిమ్మటఁ జరువుభుజించుచు నేఁబదివేలు జపించునది, గురువున కైదునిష్కము లీవలెను. అంతఁ బురశ్చరణమగును.

ఇందుచే ఆయుష్కాములగు రాజులకుఁ బ్రయోగము చెప్పఁబడుచున్నది. ప్రతిదినమును రాజు తనయగ్నియందుఁగాని మథితాగ్నియందుఁగాని

నేతితోఁదడుపఁబడిన తిలలు పదివేలు వేల్వవలయును. మఱియును రాజుచుట్టు నెనిమిది దిక్కులయందును నెనమండ్రుబ్రాహ్మణు లెనిమిదినూర్లమార్లు భస్మమభి మంత్రించి రాజునకు రక్షసేయవలెను. ఇదియును ప్రతిదినమును జేయునది. రాజున కాయుర్వృద్ధియగును. మఱియును, రుద్రరూపులు పదునొకండుగురు బ్రాహ్మణులు మంత్రసిద్ధులుగాని సద్యస్సిద్ధులుగాని, రాజునకై, దధిమధు ఘృతాక్తంబులగు శ్వేతకమలంబులు పదివేలు వేల్వవలయును, రాజునకు శ్రీవర్ధి ల్లును. ఆచార్యునివలన మంత్రమునుబొంది మూఁడురాత్రులుపవసించి మూఁడు రాత్రులు నిరంతరము జపించిన సద్యస్సిద్ధి యగును. అందుచే నప్పటికర్మ యందు మాత్రమె యోగ్యత కలుగును. నేతిచేఁదడుపఁబడినవగు దూర్వలు పదివేలు ప్రతిదినమువేల్చుచుండినయెడ రాజు చిరజీవియగును. స్వర్ణ రజత తామ్రమయం బులగు కలశములు ఎనిమిదివేలుగాని యెనిమిదివందలుగాని జలపూర్ణంబులు గావించి యీమంత్రముచే నభిమంత్రించి నూతనవస్త్ర వేష్టితంబులు గావించి గంధాదులచే నర్చించి యితరములయిన మంగళాచారములును నిర్వర్తించి యాచార్యుఁడు, రాజును జజన్మదినంబున నాకలశములయన్నింటి జలములచే నభిషేకింపవలయును. రాజుయొక్క శరీరజదోషంబులును బాపంబులును నశిం చును. ఈమంత్రము ప్రతిదినమును ఒకబ్రాహ్మణునిచే నెనిమిదివేలుజపము సేయిం చినయెడ రాజున కభివృద్ధియగును. మఱియును వాహనశాలలయందును ఆయుధశాలలయందును రత్నాలగనులు మొదలగువానియందును ప్రతిమాసము సౌమ్యనక్షత్రమున నీమంత్రముచే శాంతి చేయవలెను. దధిమధ్వాజ్య సిక్తం బులగు నశ్వత్థాపామార్గసమిధలు పదివేలు వేల్చినచో గతాయువేనియు దీర్ఘాయువగును. ద్యూతమునందును వ్యవహారమునందును ఈమంత్రము జపిం చినయెడఁ బరాజయము గలుగదు. మూఁడురాత్రము లుపవాసముతో నిరంత రము జపముచేసి యటుపిమ్మటఁ జరువు భుజించువాఁడై తేనెతోఁ దడుపఁబడిన బిల్వఫలంబులు పదివేలు వేల్వవలయును, వేయిస్వర్ణములఁ బొందును. దధి మధ్వాజ్య సిక్తంబులగు కుముదంబులు పదివేలు వేల్చినయెడ నభీష్టకన్యకంబడ

యును. ఒకసంవత్సరము చరువు భుజించుచుఁ బ్రతిదినము తనయగ్నియందు కపిలాజ్యముచే నెనిమిదివేలుగాని యెనిమిదివందలుగాని యాహుతులు వేల్చినచో మహాపాతకము నశించును. చందనచూర్ణము నీమంత్రముచే నభిమంత్రించి లలాటంబునఁ దాల్చునది; యందఱును వశ్యులగుదురు. ప్రతిజన్మదినమునందును అపామార్గసమిధ లెనిమిదివేలు వేల్చినచో నపమృత్యువు తొలఁగును. వర్షము గోరువాఁడు రవివారమున రక్తవస్త్ర చందనాదులు ధరించి పదివేలదాసనిపూలచే సూర్యు నారాధింపవలయును, మహావర్షము గురియును. దూరమార్గము పోఁదలఁచినవాఁడుపది చిన్నరాలను ఎనిమిదివేలావృత్తు లీమంత్రముచే నభిమంత్రించి పది దిక్కులకును వేసి పోవునది, క్షేమముతో మరలి వచ్చును. గొప్పకర్మ యారంభించునపుడు, విఘ్ననాశము గోరువాఁడు, దీనిఁ బదివేలుజపించి, కర్మ యారంభింపవలెను. అనాయాసముగా నాకర్మ సమాప్తిఁ బొందును. పుత్త్రునిఁ గోరువాఁడు, ఆజ్యముచే లక్ష హోమము చేసినచో వంశకరుండగు పుత్త్రుం జెందును. జయముగోరువాఁ డెవ్వని జయింపఁదలఁచునో, అతని సైకతప్రతిమగానించి దానిశిరస్సున నిలుచుండి పదివేలుజపము చేయవలెను. అంతటను జయమునొందును. మఱియు నీమంత్రము ప్రభావముచే సర్వము సాధ్యమగును. అయిన మంత్రసిద్ధులకు మాత్రమె ఫలించునని తెలియునది.

## ధ్యానము.

దధానమేకాదశధా విభక్తం దేహం విశుద్ధస్ఫటికప్రకాశమ్,
తేజోనిధిం శూలినమిన్దుమౌళిం విచిన్తయే త్తత్ర సదైవ రుద్రమ్.

పదునొకండు రూపములుగా విభక్తమయిన దేహముదాల్చినవాఁడును స్వచ్ఛమయిన స్ఫటికమువలె వెలుంగువాఁడును తేజస్సుల గనియైనవాఁడును శూలాయుధముదాల్చినవాఁడును చంద్రుని శిరస్సునధరించినవాఁడునగురుద్రుని ఎల్లప్పుడును ధ్యానింపవలెను అని యర్థము.

ఆ రా త్తే గో ఘ్న ఉ త పూ రు ష ఘ్నే క్ష య ద్వీ
రా య సు మ్న మ స్మే తే అ స్తు, ర క్షా చ నో అ ధి
చ దే వ బ్రూ హ్య థా చ న శ్శ ర్మ య చ్ఛ ద్వి బ ర్హాః.

ఆరాత్ - తే - గోఘ్నే - ఉత - పూరుషఘ్నే - క్షయ
ద్వీరాయ - సుమ్నమ్ - అస్మే - తే - అస్తు, రక్ష - చ -
నః - అధి - చ - దేవ - బ్రూహి - అథ - చ - నః - శర్మ -
యచ్ఛ - ద్విబర్హాః. ౭

దేవ = ఓ రుద్రుఁడా! గోఘ్నే = (షష్ఠియర్థమునఁ జతుర్థి ఇట్లు ముందును) గోవులనుజంపు వాఁడవును; ఉత=మఱియును; పూరుషఘ్నే=పురుషులను జంపువాఁడవును; క్షయద్వీరాయ = నశించుచున్న భృత్యులు గలవాఁడవును, భృత్యుల నశింపఁజేయువాఁడవు ననుట, అగు; తే=నీయొక్క; రూపమ్ (అధ్యాహృతము) = క్రూరమయినరూపము, ఆరాత్ = దూరముగా, అస్తు= అగుఁగాక. తే = నీయొక్క, సుమ్నమ్ = సుఖమును జేయునట్టిరూపము, శాంతమయినరూపమనుట, అస్మే = మాయందు, అస్తు = అగుఁగాక. చ = మఱియును, నః = మమ్ము, రక్ష = కాపాడుము. చ = మఱియును, అధి బ్రూహి = మేము ఇతరులకన్నను అధికులనిచెప్పుము. అథచ = మఱియు, ద్విబర్హాః= రెండులోకములయందును వృద్ధిని జేయునట్టి, త్వమ్ = (అధ్యాహృతము) నీవు, నః = మాకు, శర్మ = సుఖమును, యచ్ఛ = ఇమ్ము.

రుద్రుఁడా! మాగోవులను పురుషులను భృత్యులను జంపునట్టి నీక్రూరరూపమేది గలదో అది మాకు దూరముగాఁ దొలఁగిపోవుఁగాక. సర్వజనులకు సుఖమునిచ్చునట్టి నీశాంత

రూపమేదిగలదో, అది మాయొద్దను దయచేయుఁగాక. మఱియు, మమ్ము సర్వవిధములను రక్షింపుము, దేవతలకంటెను మేము అందఱికన్న నధికులమని చెప్పుము, మఱియు రెండు లోకముల యందును భక్తులకభివృద్ధి యొసంగువాఁడవు కావున మాకు ఇహపరముల రెంటియందును సుఖమునిమ్ము.

భ. దేవ=రుద్రుఁడా! గోఘ్నం, ఉత, పూరుషఘ్నం, తే=నీయొక్క, సుమ్నమ్ = సుఖము, ఆరాత్ = దూరమునందు, అస్తు = అగుఁగాక; గోవులను బురుషులనుహింసించునట్టి నీతృప్తియేదిగలదో అదిమావిషయమునందుఁగాక మాక న్నను దూరమునందుండుఁ గాకయనుట, మాగోవులను మాపురుషులను వదలి మాకుదూరముగా నెచటనేని గోవులనుబురుషులను హింసించుసుఖమును బొందు మనిభావము. క్షయద్వీరాయ=వసించుచున్నప్రజలుగల, ఎవ్వనియందుఁ బ్రజలు వసింతురో అట్టియనుట, ప్రజలస్థితికి హేతువు అగుటచే శాంతుఁడవైనయని భావము, తే = నీయొక్క, సుమ్నమ్ = సుఖము, అస్మే = మాయందు, అస్తు = అగుఁగాక. జగత్తుయొక్కస్థితికి హేతువగుటచే శాంతుండవై హింసించుటను వదలుటవలనఁ గలుగుసుఖమును మాయందుఁ బొందుముఅనుట. మమ్ము హింసింప వలదనిభావము. లేక, గోఘ్నం, పురుషఘ్నం, తే, రూపమ్ = (అధ్యాహృతము) క్రూరమయినరూపము, ఆరాత్, అస్తు. గోవులను బురుషులను హింసించునట్టి నీక్రూరమయినరూపము మాకు దూరమున నుండుఁగాకయనుట. క్షయద్వీరాయ, తే, సుమ్నమ్ = సుఖము, తృప్తియనుట, అస్మే, అస్తు లోకములస్థితికి ఆధారమ వయి వాని కభిగమ్యుఁడవై యనుగ్రాహకుఁడవైన నీతృప్తి మాయందుండుఁ గాకయనుట, మమ్ము అనుగ్రహింపుమని భావము. చ, నః, రక్ష. చ, అధి బ్రూహి=భయపడవలదు రక్షించెదమని మాకుఁజెప్పుము, లేక, మావిషయమును పక్షపాతముగాఁజెప్పుము. అథచ = మఱియును, నః = మాకు, ద్విబర్హాః = రెండులోకములయందును ప్రసిద్ధమయిన, శర్మ=సుఖమును, ఐహికాముష్మిక

సుఖములననుట, యచ్ఛ=ఇమ్ము. లేక, ద్విబర్హాః=ఈలోక సుఖముయొక్కయుఁ బరలోకసుఖముయొక్కయువృద్ధిఁ బొందించునట్టి, లేక, రెండులోకములయందు వృద్ధిఁబొందించునట్టి, లేక, రెండుపక్షములుగల, మిత్రశత్రు పక్షములరెంటిని అవలంబించునట్టి, పరమశాంతుఁడవైనయనుట, త్వమ్ = నీవు, శర్మ, యచ్ఛ.

ఈమంత్రమునకు ఋషి యత్రి. దేవత శంభువు, ఛందస్సు త్రిష్టుప్పు. మూఁడురాత్రు లుపవసించి పిమ్మట మూఁడురాత్రులు నిరంతరము జపము చేసినఁ బురశ్చరణమగును.

ఇది యాయుష్కాములకే యుపయుక్తమని చెప్పెదరు. పురుషుఁడు శతాయువని శ్రుతిచెప్పుచున్నది. అయినను ఈజన్మమునందు జన్మాంతరమునందుఁగాని సంభవించిన యాయుర్వినాశహేతువులచేఁ బరిక్షీణాయువులై, జనులు బాల్యాద్యవస్థలయందె మృతిఁ బొందెదరు. అట్టివారలకు ఆయుర్వృద్ధి కొఱకు ఈమంత్రముచేఁ బ్రయోగము చెప్పఁబడుచున్నది.

ప్రతిదినమును దనయగ్నియందు ఆజ్యముచే నెనిమిదివేలుగాని యెనిమిదినూర్లుగాని హోమము సేయవలెను. దధిమధ్వాజ్య సిక్తంబులగు దూర్వలెనిమిదివేలయినను వేల్వవలయును. ఎల్లప్పుడు తనజన్మనక్షత్రమున నెనిమిదివేలు జపముసేయవలెను. విశేషించి యార్ద్రానక్షత్రమున జపముచేయవలెను. ఆర్ద్రానక్షత్రము వచ్చినప్పుడెల్ల దూర్వలపామార్గ సమిధలు తిలలు దధిమధ్వాజ్య సిక్తంబులు గావించి ప్రత్యేకము పదివేలు వేల్వనలయును. మఱియు రేయి దేవునకుఁ బ్రదక్షిణములుసేయుచు నైదువేలు జపింపవలెను, రాజయినచో జన్మదినమున ఈదూర్వాదులొక్కొక్కటియుఁ బదివేలువేల్వవలయును, రాజు దీర్ఘాయువగును. అశక్తులగువారలు నదీప్రవాహమున హోమము సేయునది. మిక్కిలి యశక్తులగువారలు జపముసేయునది. తేనెచేతను నేతిచేతను దడుపఁబడిన శుద్ధతండులములచేఁ బదివేలాహుతులు వేల్చిన నాయుర్వృద్ధి [illegible]

ల్లును. పశ్చిమద్వారమగు శివాలయమునందు, క్షీరలవణంబులు వర్జించి చరువు భుజించుచు బ్రహ్మచర్యమునవలంబించినవాఁడై నేలమీఁదఁ బరుండుచు దేవుని యన్నిపార్శ్వములందును వేయి వేయిమార్లు జపముసేయవలెను, ఇట్లు గావించినచో వరుసగా నేడుజన్మములయందు శతాయువగును, అందశక్తుఁడగువాఁడు భిక్షించి యాహారించునది.

### ధ్యానము.

సర్వాణం సన్నిధౌ దేవ్యా దేవమానన్దతాణ్డవమ్,
హుతాశనధరం ధ్యాయేత్తప్తకాఞ్చనసన్నిభమ్.

దేవియెదుట నానందతాండవముసేయుచున్నవాఁడును అగ్నిని ధరించినవాఁడును ఉత్తమమయిన బంగారముతో సమానుఁడైనవాఁడు నగురుద్రుని ధ్యానింపవలెను. అని యర్థము. ౭

---

స్తు హి శ్రు తం గ ర్త స దం యు వా నం మృ గ
న్న భీ మ ము ప హ త్తు ము గ్ర మ్, మృ డా జ రి త్రే
రు ద్ర స్త వా నో అ న్యం తే అ స్మ న్ని వ ప న్తు సే నాః.

స్తుహి - శ్రుతమ్ - గర్తసదమ్ - యువానమ్ - మృగమ్ -
న - భీమమ్ - ఉపహత్తుమ్ - ఉగ్రమ్, మృడ - జరిత్రే -
రుద్ర - స్తవానః - అన్యమ్ - తే - అస్మత్ - ని - వపన్తు -
సేనాః. ౮

మదీయవచః = ఓనాదైనవాక్కా! గర్తసదమ్=గర్తమనఁగా పల్లము దానివంటి హృదయమునందున్నవాఁడును, యువానమ్=ఎల్లప్పుడును యౌవ

నముగలవాఁడును, ఉపహత్నుమ్=సంహరించుటకు, ఉగ్రమ్=భయంకరుండును, భీమమ్ = భయంకరమైన, మృగంన = సింహమువంటివాఁడునగు, నకార ముపమావాచకము, శ్రుతమ్=ప్రసిద్ధుఁడయినరుద్రుని, స్తుహి=పొగడుము. రుద్ర = రుద్రుఁడా! స్తవానః = పొగడఁబడుచున్న, త్వమ్ (అధ్యాహృతము) = నీవు, జరిత్రే = జీర్ణించుట స్వభావముగాఁగల శరీరమునందు, మృడ= సుఖింపఁజేయుము. తే = నీయొక్క, సేనాః = సేనలు, అస్మత్=మాకన్నను, అన్యమ్=ఇతరుఁడైన శత్రువును, నివపన్తు = నశింపఁజేయుఁగాక.

నావాక్కా! నీవు హృదయపుండరీకమున నున్నవాఁడును ఎల్లప్పుడును యౌవనముగలవాఁడును ఏనుఁగును జంపుటకు సింహము భయంకరమగునట్లు ప్రలయకాలమునందు లోకముల సంహరించుటకు ఉగ్రరూపుఁడగువాఁడునగు ప్రసిద్ధుఁడయిన రుద్రుని స్తుతింపుము. ఓరుద్రా! నావాక్కుచే స్తుతింపఁబడిన వాఁడవై నీవు ప్రతిదినమును క్షీణించుచుండు నీశరీరమునందు నాకు సుఖము గలిగింపుము, నీసేనలు నన్ను వదలి నాశత్రువును వధించుఁగాక.

భ. హేమదీయాన్తరాత్మన్ = (అధ్యాహృతము) ఓనాదైనయంతరాత్మా! గర్తసదమ్=గర్తమనఁగారథము, త్రిపురవధానాద్యవసరమందు అందున్నవాఁడును, లేక, గర్తమనఁగా హృదయాభ్యన్తరమనికొందఱు, అందున్న వాఁడును, లేక, "గిరతివిశ్వమ్" ప్రపంచమును మ్రింగును కావున గర్త మనఁగా గొప్పతేజస్సు, దానిని బొందినవాఁడును, లేక "గీర్యన్తే అగ్నినా ప్రజాఅత్ర" ఇందగ్నిచేఁ బ్రజలు భక్షింపఁబడుదురు కావున గర్తమనఁగా శ్మశానము, అందున్నవాఁడును, యువానమ్, మృగంన=సింహమువలె, భీమమ్= భయంకరుండును,ఉపహత్నుమ్=సంహరింపవలసిన శత్రుప్రభృతుల సంహరించు

టకు, ఉద్యతమ్ (అధ్యాహృతము)=పూనినవాఁడును, ఉగ్రమ్=తిరస్కరింప రానివాఁడును, "ఉపసంహర్తుం మృత్యుమ్" అని కొందఱు పఠించెదరు, ఉప సంహరించుటకు మృత్యువుపంటివాఁడు అని యర్థము. శ్రుతం=శ్రుతియందుఁ జెప్పఁబడినవాఁడునగు భగవంతుని, స్తుహి=పొగడుము. లేక, మదీయాంత రాత్మక అనుసంబోధనమువలదు, స్తుహియనుట పురుషవ్యత్యయము, పొగడెద నని యర్థము. రెండవయర్ధర్చము ప్రత్యక్షకృతము. రుద్ర=రుద్రుఁడా! స్తవానః = స్తుతింపఁబడదలసినట్టి, త్వమ్ = నీవు, జరిత్రే = స్తోత్రముచేయు వానికొఱకు, అట్టినాకొఱకనుట, మృడ = సుఖింపఁజేయుము, నిన్ను స్తుతించు నట్టి నన్ను సుఖింపఁజేయుమనుట. తే=నీయొక్క, సేనాః=అనుచరసమూహ ములు, అస్మత్, అన్యమ్, నివపన్తు = వధించుఁగాక. ఈమూర్తి యత్యుగ్ర మగుటవలన పూర్వార్ధముచే దేవుఁడు పరోక్షుఁడుగా స్తుతింపఁబడెను.

ఈమంత్రమునకు ఋషి వైయాఘ్రుఁడు, దేవత రుద్రుఁడు, ఛందస్సు త్రిష్టుప్పు, ఒకరాత్రి యుపవసించి మూఁడురాత్రులు నిరంతరము జపించిన యెడ దీని పురశ్చరణమగును.

విషతైలాక్తములగు వికంకతసమిధలు లక్ష శ్మశానాగ్నియందు వేల్చిన యెడ శత్రువులు నశింతురు. దేవుని సన్నిధానమున హస్తమున భస్మధరించి శత్రునామము గ్రహించి పదివేలు జపించినయెడ శత్రువునకు మహాజ్వరము గలుగును. తెల్లావాలు పదివేలు వహోమముచేసినయెడ శత్రువు మసూరికచే మృతుఁడగును. శత్రువు గృహక్షేత్రాదులయందు ఈమంత్రము జపించుచుఁ బల్లము ద్రవ్వి యందు రోమము లస్థులు రాళ్లుపాఁతునది. ఆశత్రువు శీఘ్రం బున నశించును.

## ధ్యానము.

ఉద్యద్భాస్కరకోటిప్రకాశమాదీప్తదహానమూర్ధానమ్,
అమ్బరనిలయం భీమం ధ్యాయేదభయం శివం సురౌఘనుతమ్.

ఉదయించుచున్న కోటిసూర్యులకాంతిగలవాఁడును మండుచున్నయగ్ని వంటి వెండ్రుకలుగలవాఁడును ఆకాశమున నుండువాఁడును శత్రువులకు భయంకరుండును భక్తులకు నభయమునొసంగువాఁడును దేవసమూహములచేఁ బొగడఁబడినవాఁడునగు శివుని ధ్యానింపవలయును. అని దీనియర్థము. శరభావ తారమూర్తి ధ్యానింపవలెనని కొందఱు. ౧.

---

ప రి ణో రు ద్ర స్య హే తి ర్వృ ణ క్తు ప రి త్వే ష స్య దు ర్మ తి ర ఘా యోః, అ వ స్థి రా మ ఘ వ ద్భ్య స్త ను ష్వ మీ ఢ్వ స్తో కా య త న యా య మృ డ య.

పరి-నః - రుద్రస్య - హేతిః - వృణక్తు - పరి - త్వేషస్య - దుర్మతిః - అఘాయోః, అవ - స్థిరా - మఘవద్భ్యః - తనుష్వ - మీఢ్వః - తోకాయ - తనయాయ - మృడయ. ౯

రుద్రస్య = రుద్రునియొక్క, హేతిః=ఆయుధము, నః = మమ్ము, పరివృణక్తు = అంతటను విడుచుఁగాక. త్వేషస్య = కోపమునొందినవాఁడును, అఘాయోః = పాపమునుగోరునట్టివాఁడును, హింసించుట యను పాపమును గోరునట్టివాఁడునగు, రుద్రస్య=రుద్రునియొక్క, దుర్మతిః=ఉగ్రమయినబుద్ధి, నః=మమ్ము, పరి (వృణక్తు)=అంతటను విడుచుఁగాక, స్థిరా=స్థిరమయిన, యా (అధ్యాహృతము) = ఏయుగ్రబుద్ధిగలదో, తాం (అధ్యాహృతము) = దానిని, మఘవద్భ్యః = హవిస్సె వెడు అన్నము గలవారివలన, అట్టివారియొద్దనుండి అవతనుష్వ=తొలఁగింపుము. మీఢ్వః=కోర్కులవర్షించునట్టి యోరుద్రుఁడా! తోకాయ=మాపుత్త్రునికొఱకును, తనయాయ=వానికొడుకుకొఱకును, మృడయ =సుఖము నొసంగుము.

రుద్రుని యాయుధము మమ్ము మావారలను బాధింప కుండుఁగాక, కుపితుండై హింసింపఁగోరునట్టి యారుద్రుని యుగ్రబుద్ధియు మమ్ము మావారలను బాధింపకుండుఁగాక. రుద్రుఁడా! శత్రువుల నశింపఁజేయుటకొఱకు నీవు ధరించునట్టి స్థిరమయిన యుగ్రబుద్ధి యేదిగలదో, అది నీకు హవిస్సు సమర్పించునట్టి మావంటియజమానులయందుఁ బ్రసరింపకుండుఁగాక. మఱియును, కోర్కులనువర్షించునట్టి యోభగవంతుఁడా! మాపుత్త్రులకును వారిపుత్త్రులకును సుఖముగలిగింపుము.

భ. రుద్రస్య, హేతిః, నః, పరివృణక్తు. త్వేషస్య, అఘాయోః=అఘమనఁగా వ్యసనము,దానిని పాపము చేసినవారలకుఁ గోరునట్టివాఁడునగు దేవుని యొక్క, దుర్మతిః = నిగ్రహరూపమయినబుద్ధి, నః, పరివృణక్తు మేము దేవుని నిగ్రహమునకుఁ బాత్రులయినట్టి పాపకారులము కాకయుండవలెనని ప్రార్థన. స్థిరా = ద్వితీయైకవచనమునకు ఆకారము ఛాందసము, లేక, బహువచనమని గ్రహించునది, ధనుస్సులని యర్థము, ధనుస్సులను, మఘవద్భ్యః=మఘమనఁగా ధనము. హవిస్సనెడు ధనముగలవా రలవలన, వారియొద్దనుండి, అవతనుష్వ = శిథిలమయిన యల్లెత్రాళ్లుగలవిగాఁ జేయుము. హవిస్సుగల మేము నిర్భయులమై నిన్ను ఆరాధింపఁగలుగునట్లు నీవు ధనుస్సుల మో పెడలింపుము అనిభావము. మఱియొక్కరుచెప్పుచున్నారు, స్థిరా=నిశ్చలమయినట్టి,యాదుర్మతిః=ఏదుర్మతి గలదో, దుర్మతియనఁగా, వీనికీయఁగూడదు అనుబుద్ధి, తామ్ = దాని, మఘవద్భ్యః=హవిస్సుగలవారికొఱకు, అవతనుష్వ=శిథిలముగావింపుము, వారివిషయమయి యట్టితలంపు ఉంచకుము అనుట, వారికి యథేష్టముగ నిమ్ము అనిభావము. తక్కినది సమానము.

ఈ మంత్రమునకు ఋషియు దేవతయు భగవంతుఁడు, ఛందస్సు త్రిష్టుప్పు. ఈమూర్తియు నుగ్రమగుటవలన మొదటి యర్ధర్చము పరోక్షముగాఁ బఠింపఁబడెను. ప్రాజాపత్యకృచ్ఛ్రము చరించి తొమ్మిదిదినములు ప్రతిదినము నెనిమిదివేలు జపించునది, పురశ్చరణమగును.

ఇందుచేఁ బుత్త్రకాములకుఁ బ్రయోగము చెప్పఁబడుచున్నది. అది గుప్తముగాఁ జేయవలెను. దావానలముచే దగ్ధమయినస్థలమున మొలచిన పలాశము ఖదిరము మొదలయినవాని సమిధలు పదివేలు దధిమధ్వాజ్య సిక్తములు గావించి పడమటిద్వారముగల శివాలయమున హోమము సేయవలెను. శివతుల్యుండగు పుత్త్రుని బెందును. ప్రయోగాంతరము. దీనికి దేవాలయముగాని అశ్వత్థమూలముగాని స్వగృహముగాని ఆవులమందలుండుచోటుగాని స్థానమగును. ఆర్ద్రయనునక్షత్రము అమావాస్య కృష్ణాష్టమిగాని ప్రారంభకాలము, మొదటిదినము దంపతులు చరువు భుజించి యుండవలెను. ప్రతిమంత్రాక్షరము తంతువేష్టితము జలపూర్ణమునగు నొక్కొకకలశము ప్రతిష్ఠించి వానినడుమ నొకయున్నతకుంభమునుంచి యందు "అయాతుభగవాన్ కైలాసాత్" భగవంతుఁడు కైలాసమునుండి వచ్చుఁగాకయని దేవునావాహనముసేసి గంధాదులం బూజించి యంత నడిమికలశము మొదలు ప్రతికలశము మంత్రము మొదటియక్షరము మొదలుకొని యొక్కొక్క యక్షరము న్యాసముసేయవలెను. అంతఁ దొమ్మిదివేలు జపింపవలెను. అంత స్వాగ్నియందు శ్యామాకలాజలు మధ్వాజ్యసిక్తములు గావించి యెనిమిదివేలువేల్చి పిమ్మట నేతిచే నన్నిమాఱులు వేల్వవలయును. అంత దంపతుల నేకాసనమునఁ గూర్చుండఁబెట్టి యొక్కొక కలశమునెత్తి తత్తదక్షరరూపుఁడగు భగవంతునిధ్యానించుచు నభిషేకింపవలెను. అనంతరము మధ్యకుంభజలముచే నభిషేకించునది. అటుపిమ్మట బ్రాహ్మణుల నెనిమిదివేలమందినిగాని యెనిమిదినూర్లమందినిగాని నూఱుమందినిగాని భుజింపఁజేయునది. ఆకలశములను తద్వస్త్రములను వానిక్రింది వ్రీహ్యా

దులను ఆచార్యునకొసంగి యతని భుజింపఁజేసి రెండునిష్కములు మూఁడు నిష్కములుగాని దక్షిణయీయవలెను. తక్కువకారాదు. ఇట్లు సమాప్తినొందించి పిమ్మట దంపతులు భుజించునది. వారలకు ఉత్తముఁడును దీర్ఘాయువునగు పుత్త్రుఁడు పుట్టును. ఈకర్మయం దశక్తులగువారలకుఁ బ్రయోగాంతరము చెప్పఁబడును. అశక్తుఁడగువాఁడు ఈమంత్రము జపించునది. పశ్చిమద్వారంబగు శివాలయమున ఉదయము మొదలుగ నస్తమయమువఱకును అస్తమయము మొదలుగ నుదయమువఱకును ఇట్లహోరాత్రము ప్రదక్షిణము సేయునది. శక్తుఁడగు వాఁడు అశక్తునివలె నటించి చేసిన నాశమునొందును. కాఁబట్టి పురశ్చరణ సిద్ధుఁడగు నాచార్యుఁడు ఈవిషయమున నేమఱకుండవలెను. ఇఁక మిక్కిలియు నశక్తులై పుత్త్రకాములగు నగలికులయనుగ్రహార్థము సులభమయిన ప్రయోగము చెప్పెదము. ఎనిమిదినూర్లు నలువదిగొకటి యిరువదియొకటిగాని దినములు చరుభోజి యయి దీక్షించి పశ్చిమద్వారమగు నాలయమునందుఁ బ్రతిదినము నెనిమిదినూర్లు జపింపవలెను, ఎనిమిదినూర్లు ప్రదక్షిణములు చేయవలెను. మఱియును ప్రతిదినమును అశ్వత్థవృక్షము పూర్వపార్శ్వముగాని యుత్తరపార్శ్వముగాని మొదలుకొని నాలుగుపార్శ్వములయందును ఎనిమిదినూర్లు జపించునది, అంతమువఱకుఁగాని యంతమునందుఁగాని శక్తియున్నవఱకు దీక్షితులగు బ్రాహ్మణులను భుజింపఁజేయవలెను. ఇట్లు గావించి నచో వంశకరుండగు పుత్త్రుంబడయును.

## ధ్యానము.

గజచర్మావృతతనుం స్ఫురత్ప్రహరణోజ్జ్వలమ్,
సర్వపాపహరం ధ్యాయేద్దేవం క్షుక్షురభేదినమ్.

ఏనుఁగుచర్మముచేఁ గప్పఁబడిన దేహముగలవాఁడును ప్రకాశించుచున్న యాయుధములచే నొప్పుచున్నవాఁడును సమస్తపాపములను హరించు

వాఁడును గజాసురుని వధించినవాఁడునగు దేవుని ధ్యానింపవలెను. అని యర్థము. ౯

---

మీ ఢు ష్ట మ శి వ త మ శి వో న స్సు మ నా భ వ,
ప ర మే వృ క్ష ఆ యు ధం ని ధా య కృ త్తిం
వ సా న ఆ చ ర పి నా కం బి భ్ర దా గ హి.

మీఢుష్టమ - శివతమ - శివః - నః - సుమనాః - భవ,
పరమే - వృక్షే - ఆయుధమ్ - నిధాయ - కృత్తిమ్ -
వసానః - ఆ - చర - పినాకమ్ - బిభ్రత్ - ఆ - గహి. ౧౦

మీఢుష్టమ=అధికముగాఁ దడుపువాఁడా, కోర్కులను అధికముగా వర్షించువాఁడాయనుట; శివతమ = మిక్కిలిశాంతుఁడైనవాఁడా! నః=మమ్ము గూర్చి, శివః=శాంతుఁడవు, కోపములేనివాఁడవు, సుమనాః=మంచిమనస్సుగల వాఁడవు, స్నేహముగలవాఁడవనుట, అనుగ్రహబుద్ధిగలవాఁడవని భావము; భవ=అగుము. ఆయుధమ్=త్రిశూలము మొదలయిన యాయుధమును, పరమే= మిక్కిలియున్నతమయిన, వృక్షే=చెట్టునందు; నిధాయ=ఉంచి, కృత్తిమ్=చర్మమును, పులిచర్మముననుట, వసానః=ధరించినవాఁడవై, ఆచర=ఎదురుగారమ్ము, పినాకమ్=పినాకమను ధనుస్సు, బిభ్రత్=ధరించినవాఁడవై, ఆగహి=రమ్ము.

భక్తులకు కోర్కులను అధికముగా నొసంగువాఁడా! మిక్కిలి శాంతుఁడా! నీవు మామీఁద కోపమువిడిచి శాంతుఁడవై యనుగ్రహము గలవాఁడవగుము. మఱియు, మాకు భయముగలిగించునట్టి నీత్రిశూలాదిసర్వాయుధములను మాకు

కనఁబడనట్లు మిక్కిలి యున్నతమగు వృక్షముననుంచి పులితోలు కట్టినవాఁడవై మాకభిముఖముగా రమ్ము, వచ్చునపుడును బాణము మొదలగువానిని విడిచి, అలంకారార్థము నీపినాక ధనుస్సును మాత్రము ధరించినవాఁడవై రమ్ము.

భ. మీఢుష్టమ=మిక్కిలి తడుపువాఁడా! ఉత్తమమయిన పురుషత్వము గలవాఁడాయనుట. శివతమ = మిక్కిలి మంగళమును జేయువాఁడా! నః = మాయొక్క, మావాఁడవైయనుట. శివః=మంగళముసేయువాఁడవు, సుమనాః= మంచిమనస్సుగలవాఁడవు. ఉపకారముచేయవలెనను తలంపుగలవాఁడవనుట, భవ. పరమే = మిక్కిలియున్నతమయిన, లేక, మిక్కిలిదూరమయిన వృక్షే, ఆయుధమ్, నిధాయ, కృత్తిమ్, వసానః, ఆచర=ఉండుము, లేక, మాకభిముఖముగా రమ్ము. తక్కినది సమానము.

ఈమంత్రమునకు ఋషి వైరాజుఁడు, దేవత శంభువు, ఛందస్సు పంచపదయగుత్రిష్టుప్పు. ఒకరాత్రి పదునైదువేలు జపించినచోఁ బురశ్చరణమగును.

ధనహానివలనఁగాని ప్రాణసంశయమునఁగాని మహాదుఃఖమువలనఁగాని దొంగలవలనఁగాని భయము గలుగునపుడు, ఆజ్యముచే నైదువేలాహుతుల హోమముసేయునది, ఆభయములు తొలంగును.

## ధ్యానము.

మఙ్గలాయతనం దేవం యువానమతిసున్దరమ్,
ధ్యాయేద్వనచరాకారమాగచ్ఛన్తం పినాకినమ్.

మంగళములకుఁ జోటయినవాఁడును యౌవనముగలవాఁడును మిక్కిలి చక్కనివాఁడును పినాకధనుస్సు దాల్చినవాఁడై యభిముఖముగా వచ్చుచున్న వాఁడును కిరాతుని యాకారముగలవాఁడు నగుదేవుని ధ్యానింపవలెను అని దీనియర్థము. ౧౦

వి కి రి ద వి లో హి త న మ స్తే అ స్తు భ గ వః, యాః
స్తే స హ స్ర గ్ం హే త యో ఽ న్య మ స్మ న్ని
వ ప న్తు తాః.

వికిరిద - విలోహిత - నమః - తే - అస్తు - భగవః,
యాః - తే - సహస్రమ్ - హేతయః - అన్యమ్ - అస్మత్ -
ని - వపన్తు - తాః. ౧౧

వికిరిద=భక్తులకు వెదచల్లఁబడుచున్నవి కావున కిరులనఁగా ధనములు, వానిని విశేషించి యిచ్చువాఁడా! విలోహిత=ఎఱ్ఱఁదనములేనివాఁడా! తెల్లనివాఁడాయనుట, పంచాక్షరధ్యానమునందు, భగవంతుఁడు ధవళవర్ణుఁడని చెప్పఁబడియున్నది, లేక, మిక్కిలి యెఱ్ఱనివాఁడా! అష్టాక్షరధ్యానమునందు దేవుఁడు లోహితవర్ణుఁడని చెప్పఁబడినది, భగవః=భగవంతుఁడా! సమగ్రమయిన యైశ్వర్యము వీర్యము యశస్సు శ్రీజ్ఞానము వైరాగ్యము అను షడ్గుణములు భగమనఁబడును, అవి గలవాఁడాయనుట, లేక, ఉత్పత్తివినాశములను భూతములరాకపోకలను విద్యను అవిద్యను తెలిసినవాఁడు భగవంతుఁడగును, అట్టి యో రుద్రుఁడా! తే=నీకొఱకు, నమః = నమస్కారము, అస్తు = అగుఁగాక. తే= నీయొక్క, సహస్రమ్=వేయిసంఖ్యగల, హేతయః = ఆయుధములు, యాః= ఏవిగలవో, తాః=అవి, అస్మత్ = మాకన్నను, అన్యమ్ = ఇతరుని, నివపన్తు= నశింపఁజేయుఁగాక.

భక్తులకధికముగా ధనమునిచ్చువాఁడవు తెల్లనివన్నెగలవాఁడవు (మిక్కిలియు నెఱ్ఱనివాఁడవు) భగవంతుఁడవునగు నోరుద్రుఁడా! నీకు నమస్కారముచేసెదము. వేనవేలసంఖ్యగల నీయాయుధము లేవిగలవో అవి మమ్ము వదలి మాకన్న నితరుని మాశత్రువును బాధించుఁగాక.

భ. వికిరిద = కిరి యనఁగా హింస, దాని నిచ్చునవి కిరిదము లనఁగా నాయుధములు, అవిలేనివాఁడా! ఆయుధములు లేనివాఁడా యనుట, లేక, ప్రాణులను హింసించును గావున కిరు లనఁగా రోగములు, వానిని విశేషించి ఖండించువాఁడా యనికొందఱు, వికిరిద = బాణములను వెదచల్లి చంపవలసిన వారిఖండించు వాఁడా యని కొందఱు, విలోహిత=ఎఱ్ఱఁదనములేనివాఁడా ఎఱ్ఱఁదనములేని సగముదేహముగలవాఁడా యనుట, సగము నీలవర్ణమును సగమురక్తవర్ణమును ఐన దేహముగలవాఁడాయని భావము, లేక, కాలుష్యములేనివాఁడా, నిర్వికారుఁడా యని కొందఱు, భగవః=ఇట్టి భగవంతుఁడవగు ఓరుద్రుఁడా! తే, నమః, అస్తు. ఇట్లు పరమార్థమున నీకు ఒక్కయాయుధమేనియుంలేదు, ఐనను జగదుపసంహారాదిసమయమందు, తే,సహస్రమ్, హేతయః, యాః=ఏవిగలవో, తాః, అస్మత్, అన్యమ్, నివపన్తు. లేక, పరమార్థమున నీకు వికారహేతువేమియులేదు, అయినను, దుష్టనిగ్రహార్థము, తే, సహస్రమ్, హేతయః = హింసలు, యాః = ఏవిగలవో, తాః, అస్మత్, అన్యమ్, నివపన్తు = పీడించుఁగాక. మేము ఎల్లప్పుడును నీనిగ్రహమునకుఁ బాత్రులు గాకుండవలయునని ప్రార్థన.

ఈమంత్రమునకు ఋషి పులహుఁడు, దేవత శంభువు, ఛందస్సు అనుష్టుప్పు, మూఁడురాత్రులు చరుభోజియై పదివేలు జపింపవలెను. పిమ్మట, నీమంత్రము జపించుచుఁ బదివేలు ప్రదక్షిణములు చేయునది, అంతఁ బురశ్చరణమగును.

మహాజనవిరోధము గలిగినప్పుడు, దధిమధుఘృతాక్తములగు నానావిధయోగ్యసమిధలు పదివేలువేల్చినచో తద్భయమునశించును. సర్వమును జయింపఁగోరువాఁడు కాపిలాజ్యముచేఁ దడుపఁబడిన యుత్తరేను సమిధలు లక్ష వేల్వవలయును. జయముగలుగును. ఇాదుచేతనే వరాహాది మృగములును వశ్యములగును. తిర్యగ్జంతువుల జయింపఁగోరినవాఁడు దధిమధుఘృతాక్తంబులగు బిల్వసమిధలు లక్షవేల్చునది. జలముజయింపఁగోరినవాఁడు జలమధ్యమునఁ దనయగ్ని

ప్రతిష్ఠించి యందుఁ గపిలాక్షీరముచే లక్షహోమము సేయునది. జలమువలన భయముకలుగదు. ఇట్లు, ఇంక నేదేది జయింపఁ గోరునో దాని పేరు గ్రహించి కపిలాజ్యముచే లక్షహోమముచేసినచోఁ దత్తజ్జయము నొందును.

### ధ్యానము.

ప్రసన్నవదనం సౌమ్యం రచితోద్వాహమణ్డనమ్,
అమ్బయా సహితం ధ్యాయేత్సురసఙ్ఘై రభిష్టుతమ్.

ప్రసన్నముఖముగలవాఁడును శాంతుండును వివాహాలంకారముగలవాఁడును పార్వతితోఁగూడినవాఁడును దేవసమూహముచేఁ బొగడఁబడినవాఁడు నగు రుద్రుని ధ్యానింపవలెను. అని దీనియర్థము. ౧౧

---

స హ స్రా ణి స హ స్ర ధా బా హు వో స్తవ హే
త యః, తా సా మీ శా నో భ గ వః ప రా చీ నా
ము ఖా కృ ధి.

సహస్రాణి - సహస్రధా - బాహువోః - తవ - హే
తయః - తాసామ్ - ఈశానః - భగవః - పరాచీనా -
ముఖా - కృధి. ౧౨

ఇతి శ్రీయజుస్సంహితాయాం - చతుర్థకాణ్డే
పఞ్చమప్రపాఠకే, దశమానువాకః.

---

భగవః=భగవంతుఁడా! తవ=నీయొక్క, బాహువోః=చేతులయందు, హేతయః=ఆయుధములు, సహస్రధా = వేనవేల విధములయినవిగాను, సహస్రాణి=వేలసంఖ్య గలవిగాను, విద్యన్తే (అధ్యాహృతము)=ఉన్నవి, ఈశానః=

సమర్థుఁడవైన, త్వమ్ (అధ్యాహృతము)=నీవు, తాసామ్ = ఆఆయుధముల యొక్క, ముఖా=ముఖములను, మొనలననుట, పరాచీనా=పెడమొగముగల వానిఁగా, కృధి=చేయుము.

భగవంతుఁడా! నీహస్తములందుండు ఆయుధములు వేల కొలఁది సంఖ్యగలవి వేలకొలఁది భేదములుగలవి; నీవు వానికి ప్రభుఁడవు కాఁబట్టి, ఆయాయుధముల మొనలను మామీఁదికి రాకుండునట్లు గావింపుము.

భ. తవ, బాహువోః, హేతయః, సహస్రాణి = లెక్కలేనివి యనుట, సహస్రధా=వేయివిధములుగలవి, బాహువోః అనుచో ద్వివచనము తదభిప్రాయము గాదని మున్నె చెప్పఁబడినది. లేక, పెక్కుచేతు లాయుధధరములున్నను రెండేసిచేతులే ప్రహారమునం దుపయోగపడును. లేక, సహస్రాణి=ఒక్కొక యాయుధమును వేనవేలనుట. హేతయః=హింసలు, నీచేతులు చేయుహింసలు పెక్కులు పెక్కువిధములు అగుయినను జెప్పవచ్చును. భగవః, ఈశానః= సమర్థుఁడవగునీవు, వానిని ప్రయోగించుటకును ఉపసంహరించుటకును సమర్థుఁడవనుట, తాసాం, ముఖా = మొనలను, హింసాపక్షమందు, ఆరంభముల నని యర్థము. పరాచీనా, కృధి.

ఈమంత్రమునకు ఋషి నారదుఁడు, లేక కణ్వుఁడు, రుద్రుఁడు దేవత, ఛందస్సు అనుష్టుప్పు. అర్థకృచ్ఛ్రము చరించి పదునైదువేలు జపించి నచోఁ బురశ్చరణమగును.

ఈమంత్రముచే రాజులవలని యుపద్రవములను శాంతి చేయఁదగును. శాల్మలీవికంకతసమిధలచేఁగాని యాజ్యముచేఁ దడుపఁబడిన వ్రీహియవతిలలచేఁ గాని పదివేలువేల్వవలయును. రాజులవలన భయము నశించును. రాజువలనఁ బ్రధానపురుషునకు మరణభయము గలుగునప్పుడు దక్షిణామూర్తిసన్నిధానమున నీమంత్రము లక్ష జపించునది. లేక, వల్మీకమృత్తికచే లింగముగావించి యది

కరఁగువఱకు నీమంత్రముచే నభిషేకించి యామృత్తిక నదిలోఁ గలిపి తత్తీరం బున స్వాగ్నియందు నేతితోఁదడుపఁబడిన శుద్ధతండులములచేఁ బదివేలాహు తులు వేల్వవలయును. మరణభయము నశించును. పైయడవియందుఁ బోవలయు నేని యీమంత్రముచే నెనిమిదివేలమార్లభిమంత్రించి దానిచే శరీరమంతయుఁ బూసికొనిపోవునది, అతని కేభయమునుఁగలుగదు. కృష్ణచతుర్దశియందు రాత్రి శ్మశానంబున "రాక్షసేభ్యోబలి ముపహరామి" రాక్షసులకు బలియొసంగె దను అని పలుకుచు ఓదనసహితంబగు బిడాలమాంసముచే బలియిచ్చినచో రాక్షసులవలన భయముగలుగదు. రాజునకు దైవోపద్రవముగలుగు నేని, మహా శాస్తృసన్నిధానమున నాజ్యముచే నెనిమిదివేలాహుతులు వేల్వవలయును. కుక్కుటమాంసముచే బలియిచ్చునది, హోమమునకుఁ దొమ్మిదివస్త్రములును సువర్ణాదికమును దక్షిణయీవలెను. ఆచార్యునకు నిష్కములు మూఁడుగాని యొకటిగాని రాజ్యమునందు శతతమాంశముగాని యియ్యవలెను. ఇతరులకు దైవోపద్రవము గలుగునపుడు, ఆజ్యముచే నెనిమిదివేలు వేల్చునది. దైవోప ద్రవములు నశించును.

## ధ్యానము.

సర్వపాపహరం దేవం సర్వాభరణభూషితమ్,
సర్వాయుధధరం ధ్యాయేత్సర్వలోకమహేశ్వరమ్.

ఎల్లపాపములను హరించువాఁడును సమస్తభూషణములచే నలంకరింపఁ బడినవాఁడును సమస్తాయుధంబులను ధరించినవాఁడును సమస్తలోకంబులకును మహేశ్వరుండునగు దేవుని రుద్రుని ధ్యానింపవలెను. అని యర్థము.

ఇది శ్రీమత్ఖవాటోపనామ సుందరరామప్రణీతం బగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందు దశమానువాకము.

ఓం నమో భగవతే రుద్రాయ.

ఏ కా ద శా ను వా కః.

దశమానువాకమునందు ఋగ్రూపంబులగు కొన్నిమంత్రములు పఠింపఁబడినవి. ఇఁక నీయనువాకమునందు మిగిలిన ఋక్కులును మిగిలిన యజుస్సులును పఠింపఁబడును.

స హ స్రా ణి స హ స్ర శో యే రు ద్రా అ ధి భూ
మ్యా మ్, తే షా గ్ ం స హ స్ర యో జ నే ఽ వ
ధ న్వా ని త న్మ సి.

సహస్రాణి - సహస్రశః - యే - రుద్రాః - అధి - భూమ్యామ్ - తేషామ్ - సహస్రయోజనే - అవ - ధన్వాని - తన్మసి. ౧

అధిభూమ్యామ్ = భూమిమీఁద, యే = ఏ, రుద్రాః = రుద్రులు, సహస్రాణి = వేనవేలసంఖ్యగలవారలును, సహస్రమ్ = వేనవేలవిధములుగలవారలును, సన్తి (అధ్యాహృతము) = ఉన్నారో, తేషామ్ = ఆరుద్రులయొక్క, ధన్వాని = ధనుస్సులను, సహస్రయోజనే = వేయియోజనములుగల దేశమునందు, వేయియోజనములదూరమునందనుట, అవతన్మసి = మో పెడలించి పెట్టుచున్నాము.

భూమిమీఁద వినాయకులు ప్రమథులు నంది మొదలగు వేనవేలు జాతులుగలవారలును ఒక్కొక్కజాతియందును వేనవేల సంఖ్యగలవారలునగు రుద్రులెవ్వరుగలరో వారలయందఱి ధనుస్సులను మాకు ఎంతమాత్రమును బాధచేయకుండునట్లు

మాకు వేయియోజనములదూరమున నస్త్రాదు సడలించి యుంచెదము.

భ. ఈయనువాకము అవతానమను పేరుగలది. అందుఁ బదిఋక్కులానుష్టుభములు. అందు "తేషాగ్ంసహస్రయోజనే" అనునుత్తరార్ధము అన్నిటికిని అనువర్తించును. జపాదికమునందు ఆద్యంతఋక్కులమాత్రమె పఠింపఁ బడును. వెనుక మూఁడు యజుస్సులు. ఇచట, బ్రహ్మదేవునిచేఁ బ్రార్థితుఁడగు దేవునిచే సృష్టులయి దేవతుల్యులగు రుద్రులు సమస్త చరాచరవర్గములను రక్షించుట పోషించుట యుపసంహరించుట మొదలగుకార్యములను చేయుచుఁ బ్రాణులకుఁ గర్మానురూపమయిన ఫలము నొసంగుచు బ్రహ్మాండమందంతటను వాయువులు రశ్మలు మనుష్యులు మొదలగు నానావిధరూపంబుల విహరించెదరు, వార లీయనువాకమునఁ బ్రసన్నులుగాఁ జేయఁబడుచున్నారని చెప్పెదరు. భగవంతుఁడు భక్తులననుగ్రహించుటకొఱకు వారియభిసంధి కధీనుండై నూఱు విధములుగాను వేయివిధములుగాను లక్షవిధములుగాను దన్ను విభజించుకొని వారలకొక్కొక్కరికి సాక్షాత్కరించుట యభిమతమొసంగుట మొదలగు ననుగ్రహము సేయుచున్నాఁడు. అట్టిభక్తులగురుద్రులు సంసారమనాదియగుటం జేసి లెక్కకుమిఱినవారై లోకానుగ్రహార్థము ప్రవర్తించుచుందురు. వారల నధికరించి యీమంత్రములు పఠింపఁబడుచున్నవని కొందఱు. లోకముల సంహరించునట్టి రుద్రుని క్రోధస్వరూపముయొక్క స్ఫులింగములు ప్రాణులహింసించుటకై సర్వలోకములయందును సంచరించుచుండును. ఇవి తత్ప్రసాదనములని కొందఱువచించెదరు. మఱికొందఱు, రుద్రసదృశులు గణేశ్వరులగు రుద్రులిందు ప్రసన్నులు చేయఁబడుచున్నారని వక్కాణించెదరు.

సహస్రాణి = పెక్కువేలకొలఁదిగలవారలును, సహస్రశః = వేనవేలుగానున్నవారలును, ఒక్కొకరును పెక్కువేలకొలఁదిగలవారలును పెక్కువేల రూపములుగలవారలును అనుట, అగు, యే రుద్రాః = ఏరుద్రులు, అధిభూ

మ్యామ్=భూమిమీఁద, లేక, భూమియందు ఈశ్వరులయి, కర్మానురూపముగాఁ బ్రాణుల ననుగ్రహించుచు నిగ్రహించుచు భూమియందు ఈశ్వరులయి॥ సన్తి = ఉన్నారో, తేషాం, ధన్వాని, సహస్రయోజనే = వేయియోజనముల దూరమునందు, అవతన్మసి. మేముండుచోటికిఁ జుట్టు వేయియోజనముల దూరమువఱకు వారలధనుస్సులను అల్లెత్రాడుసడలించినవానిఁగాఁ గావించెదము. అంతకావలనుండువారి ధనుస్సులు మోపెట్టినవిగానే యుండుఁగాక, యనిభావము. లేక, వేయియోజనముల దూరమునున్నవారి ధనుస్సులనుగూడ మోపెడలినవానిఁగాఁ గావించెద మనగా, అంతకీవలనున్నవారి ధనుస్సుల నట్లుగావించెద మని చెప్పవలసినదే లేదనిభావము. స్తోత్రములచేతను నమస్కారములచేతను హవిఃప్రదానములచేత ఆరుద్రులను తమధనుస్సులమోపెడలించునట్లు ప్రసన్నులం గావించుకొనెద మనుట. ౧

అ॒స్మిన్మ॑హ॒త్య॑ర్ణ॒వే᳚ఽన్తరి॑క్షే భ॒వా అధి॑.

అస్మిన్ - మహతి - అర్ణవే - అంతరిక్షే - భవాః - అధి. ౨

అస్మిన్ = ఈ, కనఁబడుచున్నయనుట, మహతి = గొప్పదైన, అర్ణవే= సముద్రముతోసమానమయిన, అంతరిక్షే = ఆకాశమునందు, అధి=అధిష్ఠించి, యే(అధ్యాహృతము) = ఏ, భవాః = రుద్రులు, సన్తి (అధ్యాహృతము) = కలరో, తేషాం సహస్రయోజనే అను పూర్వఋక్కు నుత్తరార్ధముతోమ్మిదవ ఋక్కువఱకు ననువర్తించును. తేషాం, ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

మనకుఁ గనఁబడుచున్న మహాసముద్రసదృశమయి యనంతమగునాకాశమునందున్న రుద్రమూర్తు లెవ్వరుగలరో, వారల ధనుస్సును మాకు వేయియోజనములదూరము లోపల నున్నవాని అల్లెత్రాడు సడలించినవానిఁ గావించెదము.

భ. అస్మిన్, మహతి, అర్ణవే = జలముగల, వర్ష జలముగలయనుట, అంతరిక్షే = ఆకాశమునందు, అధి = మీఁద, లేక, ఈశ్వరులయి, యే, భవాః = రుద్రులు, సన్తి. తక్కినది సమానము. ౨

---

నీలగ్రీవాశ్శితికణ్ఠాశ్శర్వా అధః క్షమాచరాః.

నీలగ్రీవాః - శితికణ్ఠాః - శర్వాః - అధఃక్షమాచరాః. 3

నీలగ్రీవాః=నల్లనికంఠముగలవారలును, నల్లనికంఠమునందలి యేకదేశము గలవారలుననుట, శితికణ్ఠాః = తెల్లనికంఠముగలవారలును, తెల్లనితక్కినకంఠ భాగము గలవారలుననుట, అధఃక్షమాచరాః = భూమిక్రిందఁదిరుగువారలును, పాతాలమునందుఁ దిరుగువారలుననుట, అగు, యే=ఏ, శర్వాః=రుద్రులు, సన్తి=కలరో, తేషాం=ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

కాలకూటమును ధరించుటచేఁ గంఠమునం దేకదేశమున నల్లనై తక్కినకంఠమున తెల్లనై యుండువారలును భూలోకము నకుఁ గ్రిందఁ బాతాళమున విహరించువారలునగు రుద్రమూర్తు లెవ్వరుగలరో, వారల ధనుస్సులను వేయి యోజనముల దూరమువఱకు మోపెడలించెదము.

భ. సమానము. 3

నీలగ్రీవాశ్శితికణ్ఠా దివగ్ం రుద్రా ఉపశ్రితాః.

నీలగ్రీవాః - శితికణ్ఠాః - దివమ్ - రుద్రాః - ఉపశ్రితాః. ౪

నీలగ్రీవాః, శితికణ్ఠాః, దివమ్=స్వర్గమును, ఉపశ్రితాః=పొందినవారలు నగు, యే, రుద్రాః, సన్తి. తేషామ్, ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

కంఠమునందు ఏకదేశమునమాత్రము నల్లనై తక్కిన కంఠమునఁ దెల్లనై యున్నవారలును స్వర్గమున విహరించువారలునగు రుద్రులెవ్వరుగలరో, వారలధనుస్సుల వేయియోజనములవఱకు మోపు సడలించెదము.

భ. అర్థాదికము సమానము.

ఈనాలుగుమంత్రములకు ఋషి దుర్వాసుఁడు, రుద్రుఁడు దేవత. ఛందస్సు అనుష్టుప్పు. దేహశుద్ధికొఱకుఁ జాంద్రాయణకృచ్ఛ్రము చరించి పిమ్మట నైదువేలు జపించినచోఁ బురశ్చరణమగును.

ఈమంత్రములచే నాభిచారికకర్మ చేయునది, రాజు స్వదేశజులగు బ్రాహ్మణులచేఁ జేయింపవలెను. జిల్లేడుదూదిచేఁ బుట్టఁబడినవి కుందేటినెత్తుటం దడుపఁబడినవగు శాల్మలీసాలవేత్ర వేణుశరంబుల సమిధలు లక్ష వేల్వవలయును. సూక్ష్మమగుపిష్టముచే శత్రుప్రతిమను గావించి ప్రాణస్థాపనముచేసి, క్రమముగాఛేదించి వానిచే నెనిమిదివేలు వేల్వవలయును. అంత శశరుధిరాక్తములగు దర్భలచే నెనిమిదివేలువేల్చునది. ఈప్రయోగములచే శత్రువులు నశింతురు. శత్రుకృతాభిచారమునకుఁ బ్రతిక్రియ గోరినవాఁడు, దధిమధుఘృతాక్తములగు దూర్వలైదువేలు వేల్వవలయును. అట్లుచేయించురాజునకు నభిచారదోషములు నశించును.

## ధ్యానము.

దంష్ట్రాకరాళవదనం జ్వలజ్జ్వలనమూర్ధజమ్,
బిభ్రాణం త్రిశిఖం దీపం ధ్యాయే ద్భుజగభూషణమ్.

*కోఱలచే భయంకరమయిన ముఖముగలవాఁడును మండుచున్న నిప్పువంటి వెండ్రుకలుగలవాఁడును మూఁడుజ్వాలలుగలదీపమును ధరించువాఁడును సర్పములు అలంకారముగాఁ గలవాఁడు నగురుద్రుని ధ్యానింపవలెను.* అని దీనియర్థము. ౪

---

యే వృ క్షే షు స స్పి ఞ్జ రా నీ ల గ్రీ వా వి లో హి తాః.

యే - వృక్షేషు - సస్పిఞ్జరాః - నీలగ్రీవాః - విలోహితాః. ౫౭

వృక్షేషు=వృక్షములయందు, లోకములయందువలె వృక్షములయందును రుద్రులున్నారనుట, సస్పిఞ్జరాః = లేఁతగడ్డివలె పింజరవర్ణముగలవారును, ఎఱుపుమించిన పసపువర్ణము పింజరమనఁబడును, నీలగ్రీవాః = నల్లనికంఠము గలవారలును, విలోహితాః = మిక్కిలి యెఱ్ఱనివారలును, యేరుద్రాః = ఏరుద్రులు, సన్తి = కలరో, తేషామ్, ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

వృక్షములందున్న రుద్రులు కొందఱు లేఁతకసవువలెఁ బింజరవర్ణముగలవారలును, కొందఱు కంఠమున నల్లనైనవార లును, కొందఱు మిక్కిలి యెఱ్ఱనివారలు నగువార లెవ్వరు గలరో, వారలధనుస్సులను మాకు వేయి యోజనములదూరము వఱకు మోపు సడలించెదము.

భ. వృక్షేషు = స్థావరజంగమాత్మకులగు జీవులందు, లేక, చెట్లయందు, సస్పిఞ్జరాః = లేఁతగడ్డివలె పింజరవర్ణముగలవారును, లేక, లోకపీడకులగు వారలను జీర్ణింపఁజేయువారలును, లోకములకుఁ గీడుగావించువారి వధించు వారలుననుట, నీలగ్రీవాః, విలోహితాః = నానావిధముగా ఎఱ్ఱనైనవారలును, లేక, కాలుష్యములేనివారలనగు, యేరుద్రాః, సన్తి, తక్కినది సమానము. ౫౭

---

యే భూ తా నా మ ధి ప త యో వి శి ఖా సః క ప ర్ది నః.

యే - భూతానామ్ - అధిపతయః - విశిఖాసః - కపర్దినః. ౬౮

భూతానాం = భూతములకు, అంతర్ధానశక్తిగలవై మనుష్యులకు నుప ద్రవముసేయు గణవిశేషము లిచ్చట భూతములనఁబడుచున్నవి. అధిపతయః= ప్రభువులును, విశిఖాసః = జుట్టులేనివారలును, కపర్దినః = జటాజూటము

గలవారలునగు, యేరుద్రాః = ఏరుద్రులు, సన్తి=కలరో, తేషామ్, ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

భూతములకు నాథులగు రుద్రులు కొందఱు ముండిత మయిన శిరస్సుగలవారలును కొందఱు జటాజూటముదాల్చిన వారలు నగువార లెవ్వరుగలరో వారలధనుస్సులను వేయి యోజనములవఱకు అల్లెత్రాడు సడలించియుంచెదము.

భ. భూతానామ్=పంచమహాభూతములకు, లేక, గణవిశేషములకును, అధిపతయః=నియామకులు, అవిప్రవర్తించుటకును నివర్తించుటకును కారణము లయినవారు, వానికి సుఖము నిచ్చువారలు, విశిఖాసః = జుట్టులేనివారలును, లేక, నానావిధమయిన కిరణములుగలవారలును, కపర్దినః = జటామకుటము గలవారలును, యేసన్తి, తక్కినది సమానము. ౬

---

యే అన్నేషు వివిధ్యన్తి పాత్రేషు పిబతో జనాన్.

యే - అన్నేషు - వి - విధ్యన్తి - పాత్రేషు - పిబతః - జనాన్ ౭

యే రుద్రాః = ఏరుద్రులు, అన్నేషు = భుజించు వస్తువులయందు, అవస్థితాః (అధ్యాహృతము) = ఉన్నవారలయి, జనాన్ = భుజించుచున్న జనులను, వివిధ్యన్తి = విశేషించి బాధించుచున్నారో, యే (అధ్యాహృతము)=ఏరుద్రులు, పాత్రేషు=త్రాగఁదగినవానియందు, అవస్థితాః (అధ్యాహృతము) = ఉన్నవారలయి, పిబతః=త్రాగుచున్న, జనాన్=జనులను, వివిధ్యన్తి=విశేషించి బాధించుచున్నారో, తేషామ్, ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

ఏరుద్రులు భుజింపఁదగిన అన్నములయందును త్రాగఁదగినక్షీరాదులయందును ఉన్నవారలయి పాపులగు భుజించు జనులను త్రాగునట్టి జనులను ధాతువైషమ్యము మొదలగు

వా నీఁగలిగించి వారిపాపమునకుఁ దగునట్లుగా నానావిధంబుల బాధించుచుందురో, వారలధనుస్సులను వేయియోజనంబుల కీవలఁ గలవానినంతయు మోపెడలించెదము.

భ. పాత్రేషు = త్రాగఁదగినక్షీరాదులయందు, లేక, పాత్రలయందు. తక్కినది, సమానము.

ఈనూఁడు మంత్రములకును ఋషి దేవలుఁడు, దేవత రుద్రుఁడు, ఛందస్సు అనుష్టుప్పు. వీని పురశ్చరణాదిక మంతయు మునుపటి నాల్గింటికి వలె గ్రహింపవలెను.

---

యే ప థాం ప థి ర క్ష య ఐ ల బృ దా య వ్యు ధః.

యే - పథామ్ - పథిరక్షయః - ఐలబృదాః - యవ్యుధః. ౮

పథామ్ = మార్గములయొక్క, అన్నిమార్గములయొక్క యనుట, పథిరక్షయః = మార్గముల రక్షించువారలును, లౌకికములు వైదికములు అను మార్గముల రక్షించువారలుననుట, వృత్త్యంతర్భూతమున కావృత్తి సాకల్యద్యోతనార్థము, కొన్నిమార్గములు మాత్రమె కాదు, అన్ని మార్గములకును రక్షకులు ననుట, ఐలబృదాః = ఇర యనఁగా అన్నము, రలలక భేదము, దాని సమూహాము ఐలము, ఐలమును భరించువారలు కావున ఐలభృతులు, భకారమునకు బకారము తకారమునకు దకారము ఛాందసము అన్నసమూహామును భక్తుల కిచ్చుటకై ధరించియుండువారలును, యవ్యుధః=యుయుధులనఁగా శత్రువులు, వారలతోఁ యుద్ధముసేయువారలునుఆగు, యేరుద్రాః=ఏరుద్రులు, సన్తి, తేషామ్; ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

నానావిధములగు లౌకికవైదికమార్గముల నన్నింటిని రక్షించువారలును భక్తులఁ బోషించుటకై అన్నసమూహాము

ధరించి యుండువారలును శత్రువులతోఁ బోరువారలునగు ఏరుద్రులుగలరో, వారిధనుస్సులను వేయియోజనములపర్యంత ముండువానిని మోపెడలించెదము.

భ. ఐలబృదాః = అన్నసమూహము సన్మార్గమున నుండువారల కిచ్చుటకై ధరించినవారలు, లేక, అన్నసమూహమును బోషించువారలును, దానికిఁ బ్రభువులుననుట, యవ్యుధః = యోవనము గలవారితోనే యుద్ధముసేయువారలును లేక, యూయన్తే, శరీరేంద్రియప్రాణము లిందుచేఁ జేర్పఁబడుచున్నవి అనువ్యుత్పత్తిచేత, యువశబ్దముచే ఆయువు చెప్పఁబడుచున్నది. దాని ప్రహరించువారలు, అకారలోపము ఛాందసము, లౌకికవైదిక మార్గములనున్నవారలకుఁ గర్మానుగుణముగాఁ గొందఱి కన్నమొసంగుచుఁ గొందఱియన్నమపహరించుచు కొందఱి కన్నమొసంగి యాయువు నపహరించుచు కొందఱికాయువునొసంగి యన్నము నపహరించుచుఁ గొందఱికి అన్నము నాయువును రెంటిని ఒసంగుచు కొందఱికి రెంటిని అపహరించుచు విహరించు రుద్రులెవ్వరుగలరో అని తాత్పర్యము. యవ్యుధః=యత్ విధ్యన్తి, ఏది కొట్టఁదగినదో దానినే కొట్టువారలు, కొంచెమయినను ఒకప్పుడైనను మర్యాద నతిక్రమింపనివారు. ఇతరము సమానము. ౬౦

---

యే తీర్థాని ప్రచరన్తి సృకావన్తో నిషఙ్గిణః.

యే - తీర్థాని - ప్ర - చరన్తి - సృకావన్తః - నిషఙ్గిణః. ౯

యేరుద్రాః=ఏరుద్రులు, సృకావన్తః=బాకుగలవారలయి, నిషఙ్గిణః=ఖడ్గముగలవారయి, తీర్థాని=తీర్థములను, రక్షితుం=(అధ్యాహృతము) కాపాడుటకు, ప్రచరన్తి = తిరుగుచున్నారో, తేషాం, ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

ఏరుద్రులు హస్తముల బాకును ఖడ్గమును ధరించు వారయి, కాశీ ప్రయాగాది దివ్యతీర్థముల రక్షించుటకై యచటఁ దిరుగుచుందురో, వారల ధనుస్సులను వేయియోజన ములదూరమున మోపెడలించియుంచెదము.

భ. యేరుద్రాః, తీర్థాని. సృకావన్తః = ఆయుధముగలవారలయి, నిష ఙ్గిణః = ఖడ్గముగలవారయి, తీర్థాని, కొందఱికి తీర్థఫలము నిచ్చుటకు కొందఱికి తీర్థఫలము లేనట్లుచేయుటకు ననుట, ప్రచరన్తి. తక్కినది సమానము.

ఈమంత్రములకు ఋషి దేవలుఁడు, దేవత రుద్రుఁడు, ఛందస్సు అను ష్టుప్పు. ప్రాజాపత్యకృచ్ఛ్రము చరించి నైదువేలు జపించినచోఁ బురశ్చరణ మగును.

ఋతుగమన దినమునందు స్నానముచేసి, తనయగ్నియందు ఆజ్యమిశ్ర మగు కపిలాక్షీరముచే నెనిమిదివేలాహుతులు వేల్వవలయును. పిమ్మట ఋతు గమనముపొందుననది, అతనికి విద్వాంసుఁడు వంశకరుఁడు నగుపుత్త్రుండు గలు గును. తీర్థయాత్రకుఁబోవువాఁడు, తనయగ్నియందు ఆజ్యముచేఁ దడుపఁబడిన శుద్ధతండులములచేఁ బదివేలాహుతులువేల్చి మౌనముధరించి తీర్థమునకుఁబోయి స్నానముచేసివచ్చి యగ్ని నారాధించి మౌనము వదలవలెను. యథోక్తమగు తీర్థఫలముఁ బొందును. ధ్యానము పూర్వోక్తము తెలియునది. ౯

---

య ఏ తా వ న్త శ్చ భూ యాగ్ం స శ్చ ది శో
రు ద్రా వి త స్థి రే, తే షాగ్ం స హ స్ర యో జ నే
౽ వ ధ న్వా ని త న్మ సి.

యేః - ఏతావన్తః - చ - భూయాంసః - చ - దిశః - రుద్రాః - వితస్థిరే - తేషామ్ - సహస్రయోజనే - అవ - ధన్వాని - తన్మసి. ౧౦

యే = ఏ, రుద్రాః = రుద్రులు, ఏతావన్తశ్చ = ఇప్పుడు చెప్పఁబడి నంతమాత్రమువారును, భూయాంసశ్చ = ఇంక నధికులును, అధికసంఖ్యగల వారలుననుట, దిశః = దిక్కులను, వితస్థిరే=అధిష్ఠించియున్నారో, తేషామ్, ధన్వాని, సహస్రయోజనే, అవతన్మసి.

ఇప్పుడు ఈమంత్రములయందు వేనవేలుజాతులుగలిగి యొక్కొకజాతియందు వేనవేలసంఖ్య గలవారలయి యున్నారని చెప్పఁబడిన సంఖ్యగలవారలును అంతకన్నను అధికసంఖ్య గలిగి సంఖ్యకు మీఱియున్న వారలును, ఏరుద్రులు సమస్త దిక్కులయందును వ్యాపించియున్నారో, ఆరుద్రుల యందలి ధనుస్సులను, మాకు వేయియోజనములదూరమునకు లోఁబడి యున్న వానినెల్ల మోపెడలించి యుంచెదము.

భ. లేక, ఏతావన్తశ్చ = ఇంతమాత్రమువారని పరిచ్ఛేదించుట కలవిగానున్నను ఇంతమాత్రమువారని పూర్వమంత్రములఁ జెప్పఁబడినవారలును, భూయాంసశ్చ=అన్నివిధంబులను ఈపరిచ్ఛేదముల నతిక్రమించియున్నవారలును, తక్కినది సమానము.

ఈమంత్రమునకు ఋషి దేవలుఁడు, రుద్రుఁడు దేవత, ఛందస్సు అనుష్టుప్పు, పురశ్చరణము ప్రయోగము మొదలగునదియంతయుఁ బూర్వ మంత్రోక్తములె గ్రహింపవలెను.

---

న॑మో రు॒ద్రేభ్యో॒ యే పృ॑థి॒వ్యాం యేఽన్త॑రి॒క్షే యే ది॒వి యేషా॒మన్నం॒ వాతో॑ వ॒ర్షమిష॑వ॒స్తేభ్యో॒ దశ॒ ప్రాచీ॒ర్దశ॑ ద॒క్షిణా॒ దశ॑ ప్ర॒తీచీ॒ర్దశోదీ॑చీ॒ర్దశో॒ర్ధ్వాస్తేభ్యో॒ నమ॒స్తే నో॑

మృ డ య న్తు తే య ం ద్వి ష్మో య శ్చ నో ద్వే ష్టి
త ం వో జ మ్భే ద ధా మి.

నమః - రుద్రేభ్యః - యే - పృథివ్యామ్ - యే - అన్త
రిక్షే - యే - దివి - యేషామ్ - అన్నమ్ - వాతః -
వర్షమ్ - ఇషవః - తేభ్యః - దశ - ప్రాచీః - దశ -
దక్షిణాః - దశ - ప్రతీచీః - దశ - ఉదీచీః - దశ -
ఊర్ధ్వాః - తేభ్యః - నమః - తే - నః - మృడయన్తు - తే-
యమ్ - ద్విష్మః - యః - చ - నః - ద్వేష్టి - తమ్ - వః-
జమ్భే - దధామి. ౧౧

ఇతి శ్రీయజుస్సంహితాయాం - చతుర్థకాణ్డే
పఞ్చమప్రపాఠకే, ఏకాదశోఽనువాకః.
పఞ్చమప్రపాఠకస్సమాప్తః.

---

ఈమంత్రము మూఁడుయజుస్సులు, నమోరుద్రేభ్యః అనుటయు, దశ ప్రాచీరిత్యాదియు మూఁటికిని సమానము. యేపృథివ్యాం యేషామన్నమిషవః అనునవి మొదటిదానికిని, యే న్తరిక్షే, యేషాంవాతఇషవః అనునది రెండవదానికిని, యేదివి. యేషాంవర్షమిషవః అనునది మూఁడవ యజుస్సునకును విశేషము. కావున మొదటియజుస్సు, నమోరుద్రేభ్యో యేపృథివ్యాం యేషామన్న మిషవస్తేభ్యో దశప్రాచీర్దశ దక్షిణాదశ ప్రతీచీర్దిశోదీచీర్దశోర్ధ్వాస్తేభ్యోనమస్తేనో మృడయన్తుతే యం ద్విష్మో యశ్చనో ద్వేష్టి తం వో జమ్భేదధామి, రెండవది, నమోరుద్రేభ్యోయే న్తరిక్షే యేషాంవాతఇషవస్తేభ్యోదశ... మూఁడవది, నమోరుద్రేభ్యో యేదివియేషాంవర్షమిషవస్తేభ్యోదశ ..అని పృథివ్యాదిలోక

భేదమువలనను ఇషుభేదమువలనను మూఁడుయజుస్సుల పాఠక్రమము తెలియునది. ఇఁక వీనికిఁ గ్రమముగా నర్థము వ్రాయఁబడును.

యే=ఏరుద్రులు, పృథివ్యామ్ = భూమియందు, వర్తన్తే (అధ్యాహృతము) = ఉన్నారో, యేషామ్ = ఎవరికి, అన్నమ్ = అన్నము, ఇషవః= బాణములో, హింసాసాధనములోఅనుట; ఎవ్వరు తామెవ్వరిహింసింపఁదలఁతురో వారిచే అపథ్యమగునన్నముభక్షింపఁజేయుటచేతను, అన్నార్థము దొంగతనము చేయించుటచేతను వారల హింసింతురో, అని తాత్పర్యము. తేభ్యః= అట్టి, రుద్రేభ్యః=రుద్రులకొఱకు, నమః=నమస్కారము, అస్తు (అధ్యాహృతము) = అగుఁగాక. ఇఁక నమస్కారమునకు విశేషణము చేయఁబడుచున్నది. దశ=పది, ప్రాచీః=తూర్పుమొగమైన అంగుళులు, తూర్పుమొగమై అంజలి చేయఁగా, పదియంగళులు తూర్పుమొగములగుచున్నవి, తూర్పుమొగమయిన అంజలియనుట. ఇట్లుముందును గ్రహించునది. దశ=పది, దక్షిణాః=దక్షిణదిక్కుమొగమైన అంగుళులు. దశ=పది, ప్రతీచీః=పడమరమొగమయిన అంగుళులు. దశ=పది, ఉదీచీః=ఉత్తరదిక్కుమొగమైనయంగుళులు. దశ=పది, ఊర్ధ్వాః= ఊర్ధ్వదిక్కుమొగమయిన యంగుళులు. వీనిచేతనని యధ్యాహార్యము. తేభ్యః= ఆరుద్రులకొఱకు, నమః=నమస్కారమగుఁగాక. తే=ఆరుద్రులు, నః=మమ్ము, మృడయన్తు=సుఖింపఁజేయుదురుగాక. తే=అట్టి, వయమ్ (అధ్యాహృతము)= మేము, యమ్=ఎవ్వని, ద్విష్మః=ద్వేషించుచున్నామో. యశ్చ=ఎవ్వఁడును, నః = మమ్ము, ద్వేష్టి = ద్వేషించుచున్నాఁడో. తమ్ = అట్టిశత్రువును, వః= మీయొక్క, రుద్రులయొక్క, జమ్భే=తెఱవఁబడిననోటియందు, దధామి= ఉంచుచున్నాను.

ఏరుద్రులు భూమియందున్నారో మఱియు వారియం దెవ్వరు అపథ్యాన్నము దినిపించియు అన్నముకొఱకు దొంగతనము మొదలగునవి చేయించియు పాపులహింసించుచు

అన్నమె హింసచేయునాయుధముగాఁ గల్గియున్నారో అట్టి భూమియందున్న రుద్రులకును అన్నమె యాయుధముగా గల రుద్రులకును నమస్కారము. ఎట్లనఁగా తూర్పున ఒక అంజలియు దక్షిణదిక్కున ఒక యంజలియుఁ బడమర నొకయంజలియు నుత్తరమున నొకయంజలియు నూర్ధ్వదిక్కున నొకయంజలియు నిట్లు సర్వదిక్కులయందునున్న యారుద్రుల కంజలులు గావించి నమస్కారము చేసెదను. ఓరుద్రులారా! ఇట్లు నమస్కారముచేసిన మేము ఎవ్వనిమీఁదఁ బగగొనియున్నామో, ఎవ్వఁడు మామీఁదఁ బగగొనియున్నాఁడో, అట్టి మాశత్రువును మీ తెఱవఁబడిననోట వేయుచున్నాను.

భ. ఈయజుస్సుచే లోకత్రయవర్తులగు రుద్రుల నమస్కరించి వారల వలన తనకు సుఖమును తనద్వేషులకు నాశమును ప్రార్థింపఁబడుచున్నవి. యే, పృథివ్యామ్, వర్తన్తే, యేషామ్, అన్నమ్, ఇషవః=బాణములో, బాణస్థానీయములో అనుట, హింసాసాధనమనిభావము, కొందఱకు అపథ్యభక్షణాదులు గల్గించి వ్యాధులఁ బుట్టింతురు, కొందఱి కన్నములేనట్లుచేసి ఆఁకలిచే బాధ కలిగింతురు, కొందఱను అన్నార్థము దొంగతనము మొదలగునవిచేయించి రాజుచే శిక్షఁబొందింతురు. ఇట్లు పాపులను హింసించుటకు ఎవ్వరికి అన్నము సాధనమో అనితా. తేషామ్, నమః, అస్తు. ఇఁక నమస్కారమునకు విశేషణము చేయఁబడుచున్నది. దశ, ప్రాచీః, దశ, దక్షిణాః, దశ, ప్రతీచీః, దశ, ఉదీచీః, దశ, ఊర్ధ్వాః, ప్రతిదిక్కునందును ఇట్టి యంగుళులచే నేదిచేయఁబడుచున్నదో అట్టియీ, నమః=నమస్కారము, తేభ్యః, అస్తు. తే, నః, మృడయన్తు తే, యమ్, ద్విష్మః యశ్చ, నః, ద్వేష్టి, తమ్, వః, జమ్భే=దంతమునందు, కోఱయందని కొందఱు, దధామి=ఉంచుచున్నాను. ప్రాచీః, ఇత్యాది స్థలము

నందు, కుర్మః=చేయుచున్నాము. అని కొందఱు వ్యాఖ్యానముచేసెదరు. మఱి కొందఱు, మొదట "నమో రుద్రేభ్యః" అనుటచే వాచికనమస్కారము, దశ ప్రాచీరిత్యాదికముచే కాయికము, వెనుక తేభ్యో నమః అనుటచే మానసికము చేయఁబడుచున్నవి. వెనుక, తేనో మృడయన్త్విత్యాదికముచే స్వాభిమతము ప్రార్థింపఁబడుచున్నది" అని వచించెదరు. ౧

యే, అన్తరిక్షే = ఆకాశమునందు, వర్తన్తే=ఉన్నారో, యేషామ్= ఎవ్వరికి, వాతః=వాయువు, ఇషవః = బాణములో, వాయువుచే రోగాదులం బుట్టించి హింసించెదరో, లేక, ప్రాణాదిపంచవాయువులకు వికారముగలిగించి వానిచే హింసింతురో అని భావము, తేభ్యః, రుద్రేభ్యః, నమః, తక్కినది సమానము. ౨

యే, దివి=స్వర్గమునందు, వర్తన్తే, యేషామ్, వర్షమ్, ఇషవః, అతివృష్టి యనావృష్టి మొదలగునవిగలిగించి వర్షముచేఁ బ్రజల బాధింతురో. తేభ్యః, నమః. తక్కినది సమానము.

ఈయజుస్త్ర్యాత్మకమైన మంత్రమునకు ఋషియు దేవతయు భగవంతుఁడు, ఛందస్సు అనుష్టుప్పు. ఇఁకఁ బురశ్చరణము అందు మొదటనిరువదియైదుదినములు ఆహారనియమము ధరించియుండవలెను. మొదటియైదు దినములు క్షీరమాత్రమె యాహారించునది, రెండవపంచకము ఫలము, మూఁడవది పెరుఁగు, నాలవదియుఫలము నాహారించునది. ఐదవది యుపవాసముండునది. వెనుక నిరువదియొకదినములు హవిష్యభోజియై, నిలుచుండి యెల్లప్పుడును జపింపవలెను. పిమ్మట నైదుదినములు కంఠములోఁతునీళ్లలో నిలుచుండి జపించునది, అటుపిమ్మట నొకదిన మఘమర్షణవిధానమున జపించునది, ఆచార్యునకు పదినిష్కము లీవలెను. అంతఁ దత్తుల్యమైన శుశ్రూషగావించునది. పురశ్చరణసిద్ధుఁడగును. అటుపిమ్మట, ప్రతిదినమును దనయగ్నియందు ఆజ్యముచే నెనిమిదివేలుగాని యెనిమిదివందలుగాని యాహుతులు వేల్చుచు యావజ్జీవము ననన్యమనస్కుఁడై జపముసేయుచుండవలయును.

ఇఁక నీమంత్రముచేఁ జేయవలసిన ప్రయోగము చెప్పఁబడుచున్నది. ఇట్లు సిద్ధుఁడగువాఁడు అమావాస్యయందుఁ దనయగ్నియందుఁ గపిలాజ్యముచే నెనిమిది వేలాహుతులు వేల్వవలయును. అంతఁ గేశములకు లేపము గావించి యెనిమిదివందలు వేలుచునది. అంత నధర్వశిరస్సునందుఁ జెప్పఁబడినచొప్పున నారాధింపవలెను. అందువలన రక్తాంగియు నెఱ్ఱని వెండ్రుకలు గలదియు నెఱ్ఱని కన్నులుగలదియు నగుకృత్య ప్రాదుర్భవించును, ఆశక్తిని మున్నెసిద్ధముగానుంచిన యజారుధిరపూర్ణంబులగు నాలుగుకుంభములచేఁ దృప్తినొందింపవలెను. లేనిచో నాశక్తిచేఁ దాను నశించును. దానిచే స్వాభిమతమంతయు సాధించుకొనవచ్చును. మఱియును, ఆజ్యముచేఁ బదివేలాహుతులు వేల్చినచోఁ గాలజ్ఞానముగలుగును. సమగ్రమయిన యాయుఃప్రమాణము సిద్ధించును. కాపిలక్షీరముచేఁ బదివేలువేల్చినయెడ జాతిస్మరుఁడగును. మఱియు నీమంత్రముచే సర్వమును సాధ్యమగునని దేవుఁడు భగవంతుఁడగు శంభువు పలికెను.

## ధ్యానము.

వృషాధిరూఢం దేవేశం సర్వలోకైకకారణమ్,
ధ్యాయేద్బ్రహ్మాదిభిస్తుత్యం పార్వతీసహితం శివమ్.

వృషభము నారోహించినవాఁడును దేవతలకు నియామకుండును సమస్తలోకములకును మూలకారణమయినవాఁడును బ్రహ్మమొదలగువారలచేఁబొగడఁదగినవాఁడును బార్వతితోఁ గూడినవాఁడునగు శివుని ధ్యానింపవలెను. అని దీనియర్థము.

## సమష్టిరుద్రాధ్యాయ జపహోమాది క్రమము.

ఈరుద్రసముదాయము జపమాత్రముననె సిద్ధించును. మూఁడుకాలములయందు స్నానముసేయుచు జపించినయెడ పంచమహాపాతకములచే విముక్తుఁడగును. ఇఁక సర్వకామార్థము కొనకొక్తప్రయోగము చెప్పఁబడుచున్నది.

పూర్వోక్తవిధిచే మంత్రన్యాసాదికము గావించి ప్రస్థమాత్ర పరిమాణ కలశములను గంధాక్షత సహితంబులు జలపూర్ణంబులు గావించి మున్ను చెప్పిన చొప్పున దేవు నారాధించి దేవునిపార్శ్వమున ప్రథమానువాక మంత్రములచే నాజ్యాహుతులువేల్చి పదునొకండుమాఱులు రుద్రమును జపింపవలెను,ఒక్కొక మాఱు జపించినపుడును అంతమున చమకము పదునొకండను వాకములలో నొక్కొక యనువాకము జపించునది. పిమ్మటఁ బంచామృతములచేతను అటు పిమ్మటఁ బంచగవ్యముచేతను నభిషేకించునది. అంత నమస్తే అను మొదటి ఋక్కుచే సర్వోపచారములఁ గల్పింపవలెను. తదనంతరము రుద్రాధ్యాయులగు బ్రాహ్మణులను యథాశక్తి భుజింపఁజేయునది. సమస్తకామితంబులును సిద్ధించును. రుద్రమహారుద్రాతిరుద్రములయం దేదేని జపించి యుక్తసంఖ్యచేఁ బాయసహోమము సేయునది. అటుగానియెడ, యథాశక్తి క్షీరముచేతను ఆజ్యముచేతను అభిషేకించునది, లేక, రుద్రాధ్యాయముచే నభిమంత్రితమగు నాజ్యసహితపాయసముచేఁ బదివేలు వేల్చునది. సర్వకామంబులు సిద్ధించును. దుష్టగ్రహోచ్చాటనమునందును ఈవిధానమె గ్రహించునది. ఫట్కారముచే సర్వకార్యముల నారంభింపవలెను. రాజ్యకాముఁడగురాజు, ప్రముఞ్చధన్వనః అనుమంత్రముచేత శివుని శిరస్సున రక్తచందనముచేతను శ్వేత చందనముచేతను దిగ్ధంబులగు కమలసౌగంధికోత్పలంబులు లక్ష పూజించినయెడ రాజ్యలక్ష్మిఁ జెందును. మఱియు నమోవఃకిరికేభ్యః అనుమంత్రముచేత ఘృతాక్తంబులగు తిలతండులముల లక్షాహుతులు వేల్చినచో రాజ్యమునొందును. ఇఁక బోధాయనోక్తప్రయోగము. రుద్రమహారుద్రాతి రుద్రముల నేదేని జపియించి ఆజ్యసిక్తంబులగు యవలచేఁ బదివేలు వేల్చుటచే రాజ్యశ్రీ లభించును. శ్రీకాముఁడగు వాఁడు రుద్రమహారుద్రాతిరుద్రంబుల నేదేని జపించి పాయసముచేఁ పదివేలు వేల్వవలయును. శ్రీ ప్రాపించును. ధనకాముఁడు ఇమాగ్ంరుద్రాయ అనుమంత్రముచే లక్ష తిలహోమము సేయునది. కాళికాపురాణమున ననత్కుమారుఁడు. బ్రాహ్మణుఁడు స్నానముచేసి యంగన్యాసాదులుచేసి నదీతీరంబునఁ బశ్చి

మాభిముఖము వృషభాది పరివారరహితమగు లింగమును యథావిధిఁ బూజించి జలముచేతను బిమ్మట పలశతమితంబగు పంచగవ్యముచేతను అటుపిమ్మట మరల జలముచేతను అభిషేకించి ధ్యానముచేసి గోరోచనాదులచే తల్లింగమునకు లేపనముగావించి స్నిగ్ధములు నశిథిలములునగు బిల్వపత్త్రములచేఁ బూజించునది, పూజాంతమందు దక్షిణాభిముఖుండై మొదటిపదునొకండుదినములు ఆజ్యసహితములగు బిల్వదలములచేతను రెండవ పదొకండుదినములు నీలోత్పలములచేతను మూఁడవ పదొకండుదినములు గమలములచేతను హోమము గావించునది. మఱియును శివప్రియంబగుగుగ్గులువు నాజ్యసహితంబుగా దహించునది. ఇట్లు ముప్పదిమూఁడుదినములు గావింపవలెను. సిద్ధుఁడగును. ఎవ్వఁడు విత్తముగోరునో అప్పుడు వృక్షములను గౌఁగిలించుకొని శివునిధ్యానించుచు రుద్రముజపించినచో నావృక్షములు బంగారమగును. లేక, స్వయంభువును పశ్చిమాభిముఖమునగు లింగమును బంకజములచే నాచ్ఛాదించి పదునొకండుదినములు జపించునది. అదివఱకు నింద్యమగు పశువును జూడను స్పృశింపను గూడదు. వ్రతాంతమునందు దేనిఁచూచునో అది బంగారమగును. అన్నకామునకు శౌనకుఁడు. అసౌయస్తామ్రః అసౌ యోఽవసర్పతి అనురెండుమంత్రములచేతఁ బ్రతిదినము నుదయాస్తమయంబుల నాదిత్యు నుపస్థానము గావించుచుండునది. అక్షయమగు నన్నము గలుగును. మఱియును బోధాయనుఁడు, రుద్రమహారుద్రాతిరుద్రములలో నేదేని జపించి తేనెతోఁదడుపఁబడిన యుదుంబరసమిధలచే తంత్రోక్తసంఖ్యను హోమముచేసినచో నన్నవంతుఁడగును. వృష్టికామునకు శౌనకుఁడు. ఉదకము శాకము యవలు నాహారముగాఁగొని, అసౌయస్తామ్రః అనువానిచే గుడక్షీరాక్తములుగాని షట్టివిగాని వేతససమిధలు పదివేలు వేల్వవలయును. ఆయుష్కాముఁడు, పూర్వోక్తవిధిచే దేవునారాధించి యన్ని దిక్కులయందును రక్తపీత కృష్ణబలుల నొసంగి రుద్రైకాదశినిం బదునొకండుమాఱులు జపించి ఆరాత్తేగోఘ్న అనుమంత్రముచే షోడశోపచారములు కల్పించి దానినే సహస్రము జపించునది. వ్యాధిగ్రస్తుఁడు సిద్ధుఁడగు బ్రాహ్మణునకు దక్షిణయొసంగి

వానిచే సహస్రము జపింపఁజేయునేని సర్వవ్యాధివిముక్తుండై శతాయువగును. పుత్రకాముఁడు పరిణోరుద్రస్య అనుదానిచే వటసమిధలు పదివేలు వేలుచునది. గోవులుగోరువాఁడు నమోనః కిరికేభ్యః అనుదానిచే పెరుఁగుచేఁ దడుపఁబడిన వికంకతోదుంబర సమిధలు పదివేలు వేలువవలయును. వాక్కుఁగోరువాఁడు మహాచతుష్పథమందు వల్మీకమృత్తికచే లింగము స్థాపించి పంచగవ్యముచే నభిషేకించి నమోవఃకిరికేభ్యః అనుదానిచే నభిమంత్రించి మానస్తోకే అనుమంత్రముచే ఘృతపాయసమును బిల్వఫలము నుపహారమొసంగునది. దక్షిణామూర్తిసన్నిధానమున నుత్తమమగు వస యొకపలము చూర్ణముచేసి తామ్రపాత్రలోనుంచి కపిలాఘృతముతో తర్జనిచేఁ గలిపి లక్షాభిమంత్రితముగావించి త్రాగవలెను. ద్రాపేఅన్ధసస్పతే అనుమంత్రముచే లక్షహోమముచేసినచో నక్షతములగు వస్త్రములు గలుగును. వశ్యకామునకు బోధాయనుఁడు. రుద్రమహారుద్రాతిరుద్రముల నేదేని జపించి శ్వేతకుసుమంబులు వేల్చునది. జగమునంతయు వశీకరింపఁదలఁచువాఁడు, నాభిమాత్రజలమునన్నవాఁడై పెక్కుమార్లు రుద్రము జపించి నియమమున శివునిఁ బూజించియు సూర్యాభిముఖుండై జితేంద్రియుండై నిరంతరము రుద్రము జపించుచుండునది, వానికి శివుఁడు సాక్షాత్కరించును. ఆరోగ్యకాముఁడు మానోమహాన్తమ్ అను మంత్రముచే తిలాహుతులు పదివేలు వేలుచునది. బాలురకును బరిజనులకు నారోగ్యమగును. భయవిముక్తిఁ గోరువాఁడు ఇమాగ్ంరుద్రాయ అనుమంత్రముచే దధిమధుపాయసము లొక్కొకటిచేఁ బదివేలాహుతులు వేలుచునది. శాంతికాముఁడు మానోమహాన్తమ్ అను మంత్రముచేఁ బ్రతిసంవత్సరము నశ్వత్థసమిధలు పదివేలు వేల్వవలయును. యాత్రకుఁబోవునపుడును అట్లుగావించునది. నమోభవాయ నమోజ్యేష్ఠాయ యనుమంత్రములచే భస్మ యభిమంత్రించి కుమారగ్రహాదిగ్రస్తులకు దానిచే రక్షగావించి రాత్రికాలమున జుట్టు ముడివేసియుంచునది. కుమారగ్రహాది భయము తొలఁగును. చోరభయము మొదలగునవి సంభవించినపుడు, మీఁదు

ష్టమ శివతమయనుమంత్రము మనస్సునజపించునది. ఇమాగ్ం రుద్రాయయను మంత్రముచే లేతదూర్వాంకురములచే లక్షవేల్చినచో మహాజ్వరగ్రస్తుఁడై గతాయుఁవైనను దీర్ఘాయువగును. యాతేరుద్రశివాతనూః అనుమంత్రముచే ప్రతిసరము సహస్రామంత్రితముగావించి పదునొకండుముళ్లువేసి బాలురకును గర్భిణులకును హస్తంబున బంధించునది, వారలకు క్షేమమగును. గోష్ఠ మధ్యమున నగ్నింబ్రతిష్ఠించి ఇమాగ్ంరుద్రాయ అనుమంత్రముచే వికంకత సమిధలు పదివేలు వేల్చినచో గోవులకు శాంతియగును. ఇట్లే నమస్తే రుద్రమన్యవే అనుమంత్రముచేఁగాని హోమము సేయవచ్చును. చతుష్పాజ్జంతువుల కన్నిటికిని ఇదేశాంతి. ఇది ద్విగుణముగావించిన మహాశాంతియగును. ఇది శౌనకోక్తము. ఇఁక మేరుతంత్రోక్తము. నమస్తేరుద్ర అగ్నావిష్ణూ అను ప్రశ్నములురెండును ఆవర్తనము చేయుటచే గంగాస్నానఫలము గలుగును. ప్రతిదినము నావర్తనాభిషేకము చేయుచుండువానికి ఆయాదినమునందు దైవప్రకోపముచేఁ గలుగు నశుభమునశించును. ఆవర్తనమెట్టిదనఁగా, నమస్తే రుద్రమన్యవే అను నధ్యాయము నొక్కొకమాఱు పఠించినప్పుడును అగ్నావిష్ణూఅనునధ్యాయము నందలి యొక్కొక్క యనువాకము క్రమముగాఁ బఠింపవలెను. ఇట్లు నమస్తే పదునొకండుమాఱులు పఠించినచో అగ్నావిష్ణూ పదునొకండు అనువాకములును సరిపోవుచున్నవి. ఇది యావర్తన మనఁబడును. ఇది రుద్రియనఁబడును. ఇట్లు ఒకసంవత్సరము ప్రతిదినమును అభిషేకముచేసినచో సర్వజన్మకృతపాపములును నశించును. ఇట్లు పదునొకండురుద్రులు లఘురుద్ర మనఁబడును. దీనిచే శివు నభిషేకించినవారు యమునిఁ జూడరు. ఇవి పదునొకండైనచో మహారుద్రమగును. అది మహాపాతకముల నశింపఁజేయును. ఏకాదశమహారుద్రము లతిరుద్ర మనఁబడును. ఇందుచే నశింపనిపాపముగాని దోషముగాని యేదియుం గానరాదు. పాపనాశమున కింకకన్నను వేఱుపాయంబును లేదు. పాపమనఁగానేమి? కష్టము కలిగించునది. కావున ఫలప్రదమయి బంధరూప

మహాకష్టము గలిగించునది కావునఁ బుణ్యమును బాపమేయని తలంపవలెను. ఈపుణ్యపాపరూపమైనమలము నశించుటచేఁ జిత్తశుద్ధియగును. చిత్తశుద్ధిచే జ్ఞానేచ్ఛ గలుగును. జ్ఞానముచే మోక్షమని సర్వోపనిషదాఘోషము. కావున రుద్రపాఠము మోక్షమునకు ముఖ్యోపాయము. ఇచ్చట "యశ్శతరుద్రీయమధీతే-సోగ్నిపూతో భవతి-సురాపానాత్పూతో భవతి - బ్రహ్మహత్యాత్పూతో భవతి-కృత్యాకృత్యాత్పూతో భవతి - తస్మాదవిముక్తమాశ్రితో భవతి. అత్యాశ్రమీసర్వదాసకృద్వాజపేత్ - అనేన జ్ఞానమాప్నోతి సంసారార్ణవనాశనమ్. అను శ్రీకైవల్యోపనిషదుపదేశ మనుసంధేయము.

---

ఇది శ్రీమత్కవాటోపనామ సుందరరామ ప్రణీతం బగు
శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందు ఏకాదశానువాకము.

నమకభాష్యాంధ్రవివరణము సమాప్తము.

శ్రీ

శ్రీగణేశ శారదా గురుభ్యో నమః.

# శ్రీరుద్రాధ్యాయము, చమకము

## ఆంధ్రవ్యాఖ్యానసహితము.

శమ్భో! సకలాన్ దోషాన్ క్షమస్వ కృపయా ప్రమాదతః ప్రాప్తాన్,
దేహి చ నిఖిలా నర్థాన్ వాత్సల్యా ద్భక్తసఙ్ఘేషు.

---

అగ్నా విష్ణూ సజోషసేమా వర్ధన్తు వాం గిరః,
ద్యుమ్నైర్వాజేభిరాగతమ్.

అగ్నావిష్ణూ - సజోషసా - ఇమాః - వర్ధన్తు - వామ్ -
గిరః - ద్యుమ్నైః - వాజేభిః - ఆగతమ్. ౧.

అగ్నావిష్ణూ=అగ్నావిష్ణువులారా ! అగ్నియును విష్ణువునుజేరి యగ్నావిష్ణువు లనఁబడుదురు, యువామ్ (అధ్యాహృతము) = మీరలు, సజోషసా= సమానప్రీతిగలవారలు, భవతమ్ (అధ్యాహృతము) = కండు. వామ్= మీయొక్క, ఇమాః=ఈ, గిరః=స్తుతివాక్యములు, మిమ్ముగుఱించిన స్తుతివాక్యములనుట, వర్ధన్తు=వృద్ధిఁబొందుఁగాక. యువామ్ (అధ్యాహృతము)=మీరలు, ద్యుమ్నైః = ధనములతోను, వాజేభిః = అన్నములతోను, యుక్తౌ (అధ్యాహృతము) = కూడినవారలయి, ఆగతమ్=రండు.

అగ్నావిష్ణువులారా! మీరిద్దఱును మామీఁద సమానమైన ప్రీతియుంచుఁడు, అందుచే మిమ్ముఁగూర్చి మేముచేయు స్తుతి వాక్యములు వృద్ధిఁబొందుఁగాక, మఱియు, మీరలు ధనములను అన్నములను దీసికొని మాయొద్దకు రండు.

---

ఇఁక ఏకాదశానువాకాత్మకమగు మంత్రము పఠింపఁబడుచున్నది. యజ్ఞభిన్నమగు నుపాసనాదికర్మము మంత్రభేదముచే ననుష్ఠేయంబను నభిప్రాయంబున ననువాకభేదకల్పనమని యెఱుంగునది.

వాజశ్చ మే ప్రసవశ్చ మే ప్రయతిశ్చ మే ప్రసితిశ్చ మే ధీతిశ్చ మే క్రతుశ్చ మే స్వరశ్చ మే శ్లోకశ్చ మే శ్రావశ్చ మే శ్రుతిశ్చ మే జ్యోతిశ్చ మే సువశ్చ మే ప్రాణశ్చ మేఽపానశ్చ మే వ్యానశ్చ మేఽసుశ్చ మే చిత్తం చ మ ఆధీతం చ మే వాక్ చ మే మనశ్చ మే చక్షుశ్చ మే శ్రోత్రం చ మే దక్షశ్చ మే బలం చ మ ఓజశ్చ మే సహశ్చ మ ఆయుశ్చ మే జరా చ మ ఆత్మా చ మే తనూశ్చ మే శర్మ చ మే వర్మ చ మేఽఙ్గాని చ మేఽస్థాని చ మే పరూగ్ంషి చ మే శరీరాణి చ మే. ౧

వాజః = అన్నము, చకారమునకు వక్ష్యమాణమగు ప్రసవాదికముతో సముచ్చయమర్థము. మే = నాకు, కల్పతామ్ = కలుగుఁగాక, ఈక్రియ దశమానువాకమునందలిది, అంతటను అన్వయించును. ఇట్లు ముందును ఎఱుంగునది. చ మే అనుపదములు ప్రసవము మొదలగు ప్రతిశబ్దమునకును ఆవృత్తమగును.

అంతటను ఇప్పుడు వ్రాయఁబడినయర్థమె తెలియునది. ప్రసవః = అన్నము యొక్క అభ్యనుజ్ఞ, ఇయ్యఁబడుఁగాక భుజింపఁబడుఁగాక ఇత్యాకారకము. ప్రయతిః=శుద్ధి. ప్రసితిః=ఆసక్తి, అన్నమునందలి యుత్సుకతయనుట. ధీతిః = అన్నముధరించుట. క్రతుః = అన్నమునకుఁ గారణమయినయజ్ఞము. స్వరః= ఉదాత్తాదిస్వరము. శ్లోకః = స్తోత్రము. శ్రావః = వినిపించుశక్తి. శ్రుతిః = వినునట్టిసామర్థ్యము. జ్యోతిః=ప్రకాశము. సువః=స్వర్గము. ప్రాణః, అపానః, వ్యానః=ఈమూఁడును వాయువుయొక్క వ్యాపారభేదములు. అసుః=ఆవ్యాపారములుగల వాయువు. చిత్తమ్=మనస్సువలనఁ బుట్టుజ్ఞానము. ఆధీతమ్ = ఆజ్ఞానమునకు విషయమయినద్రవ్యము. వాక్ = వాగింద్రియము. మనః = మనస్సు. చక్షుః = నేత్రేంద్రియము. శ్రోత్రమ్ = శ్రోత్రేంద్రియము. దక్షః = జ్ఞానేంద్రియములందలి సామర్థ్యము. బలమ్ = కర్మేంద్రియములందలి సామర్థ్యము. ఓజః = బలమునకుఁ గారణమయిన యెనిమిదవధాతువు. సహః = శత్రువుల నెదిరించుట. ఆయుః=ఆయుస్సు. జరా=ముసలితనము, ముసలితనము గలుగువఱకు బ్రతికియుండుట యనుట. ఆత్మా=పరమాత్మ, తనూః = దేహము, మంచిదేహమనుట. శర్మ = సుఖము. వర్మ=కవచము. అఙ్గాని=అవయవములు, సంపూర్ణములైన యవయవములనుట. అస్థాని = అస్థులు, అస్థ్యైస్థానములఁ జక్కఁగా బలవంతములైనయస్థులనుట. పరూంషి=వ్రేళ్లు మొదలగువానిపర్వములు, లేక, గనుపులు. శరీరాణి=దేహముయొక్క అవయవములు, ఇదివఱకుఁ జెప్పనియవయవములనుట.

అన్నము మొదలగునవి యన్నియు నాకుఁ గలుగుఁగాక.

---

జ్యైష్ఠ్యం చ మ ఆధిపత్యం చ మే మన్యుశ్చ మే భామశ్చ
మేఽమశ్చ మేఽమ్భశ్చ మే జేమా చ మే మహిమా చ మే

వరిమా చ మే ప్రథిమా చ మే వర్ష్మా చ మే ద్రాఘుయా చ మే వృద్ధం చ మే వృద్ధిశ్చ మే సత్యం చ మే శ్రద్ధా చ మే జగచ్చ మే ధనం చ మే వశశ్చ మే త్విషిశ్చ మే క్రీడా చ మే మోదశ్చ మే జాతం చ మే జనిష్యమాణం చ మే సూక్తం చ మే సుకృతం చ మే విత్తం చ మే వేద్యం చ మే భూతం చ మే భవిష్యచ్చ మే సుగం చ మే సుపథం చ మ ఋద్ధం చ మ ఋద్ధిశ్చ మే క్లృప్తం చ మే క్లృప్తిశ్చ మే మతిశ్చ మే సుమతిశ్చ మే.

జ్యైష్ఠ్యమ్ = ప్రశస్తుఁడగుట. ఆధిపత్యమ్ = ప్రభుత్వము. మన్యుః = మానసకోపము. భామః = బాహ్యకోపము, ఈకోపములచే నితరులకు భయము గలుగుటయనుట. అమః=అప్రమేయత్వము,శత్రువుల కింతటివాఁడనని తెలియ నలవిగాకుండుట. అమ్భః=జలము, చల్లఁదనము తియ్యఁదనముగల జలమనుట. జేమా=జయించు సామర్థ్యము. మహిమా=గొప్పఁదనము, జయముచేఁగలిగిన ధనాదిసంపత్తియనుట. వరిమా = పూజ్యత్వము. ప్రథిమా=గృహక్షేత్రాదుల యతిశయము. వర్ష్మా=శరీరము, ద్రాఘుయా=పుత్త్రపౌత్త్రాదులదీర్ఘత్వము, అవిచ్ఛిన్నమయిన సంతతియనుట. వృద్ధమ్=అధికమయిన యన్నమును ధనమును. వృద్ధిః=విద్యమొదలగుగుణములచేఁ గలుగునుత్కర్షము. సత్యమ్ = యథార్థముఁ జెప్పుట. శ్రద్ధ=పరలోకముగలదనువిశ్వాసము. జగత్=గోవులుమొదలగు జంగమరూపమయినధనము. ధనమ్=బంగారముమొదలగునది. వశః = అందఱును స్వాధీనులై యుండుట. త్విషిః=దేహకాంతి. క్రీడా=జూదమాడుటమొదలగునది. మోదః=దానివలనఁగలుగు సంతోషము. జాతమ్=ఇదివఱకుఁబుట్టిన సంతానము. జనిష్యమాణమ్=పుట్టఁబోవుసంతానము. సూక్తమ్=ఋక్కులసమూహము.

సుకృతమ్ = పుణ్యము, దానిచేఁగలుగు నపూర్వమనుట. విత్తమ్ = ఇదివఱకుఁ బొందఁబడిన ద్రవ్యము. వేద్యమ్ = ఇఁకమీఁదఁ బొందఁదగిన ద్రవ్యము. భూతమ్ = ఇదివఱకు సిద్ధమయిన క్షేత్రాదికము. భవిష్యత్ = ఇఁకమీఁద సిద్ధించునట్టిది. సుగమ్ = చక్కఁగాఁబొందఁదగిన బంధుగ్రామము మొదలగునది. సుపథమ్ = మంచిమార్గము, చోరాదులులేనిమార్గమనుట. ఋద్ధమ్ = వృద్ధి నొందినధనాదికము, లేక, అనుష్ఠించినకర్మయొక్కఫలము. ఋద్ధిః = అనుష్ఠింపఁబోవుసత్రయాగాదుల ఫలము. క్లృప్తం=స్వకార్యమందు సమర్థమయిన ద్రవ్యము. క్లృప్తిః = తనసామర్థ్యము. మతిః = సాధారణమైన పదార్థముల నిశ్చయజ్ఞానము. సుమతిః = దుర్ఘటములయిన రాచకార్యములు మొదలగువాని నిశ్చయించు జ్ఞానము.

ఈజ్యైష్ఠ్యము మొదలగునవి యన్నియు నాకుఁ గలుగుఁ గాక. ౨

---

శం చ మే మయశ్చ మే ప్రియం చ మేఽనుకామశ్చ మే కామశ్చ మే సౌమనసశ్చ మే భద్రం చ మే శ్రేయశ్చ మే వస్యశ్చ మే యశశ్చ మే భగశ్చ మే ద్రవిణం చ మే యన్తా చ మే ధర్తా చ మే క్షేమశ్చ మే ధృతిశ్చ మే విశ్వం చ మే మహశ్చ మే సంవిచ్చ మే జ్ఞాత్రం చ మే సూశ్చ మే ప్రసూశ్చ మే సీరం చ మే లయశ్చ మ ఋతం చ మేఽమృతం చ మే యక్ష్మం చ మేఽనామయశ్చ మే జీవాతుశ్చ మే దీర్ఘాయుత్వం చ మేఽనమిత్రం చ మేఽభయం చ మే సుగం చ మే శయనం చ మే సూషా చ మే సుదినం చ మే. 3

శమ్=ఐహికసుఖము. మయః=పరలోకసుఖము. ప్రియమ్=సంతోషము నకుఁగారణమయినవస్తువు. అనుకామః=అనుకూల మగుటచేఁ గోరఁబడువస్తువు, ఈప్రియానుకామములురెండును ఐహికములు. కామః=ఆముష్మికయిన స్వర్గాదికము. సౌమనసః = మనస్సునకు నెమ్మదిగలిగించు బంధువర్గము. భద్రమ్ = ఇహలోకమందు రమణీయమయిన వస్తువు. శ్రేయః = పరలోకహితము. వస్యః = నివాసమునకు సాధనమయిన గృహము మొదలగునది. యశః=కీర్తి. భగః = సౌభాగ్యము. ద్రవిణమ్ = ధనము. యన్తా = నియామకుఁడు, ఆచార్యుఁడు మొదలగు వారనుట. ధర్తా = పోషకుఁడు, తండ్రి మొదలగువారు. క్షేమః = ఉన్నధనమును గాపాడుకొనుశక్తి. ధృతిః=ధైర్యము, ఆపదలయందు చలనము లేకుండుట. విశ్వమ్ = సమస్తజనులును అనుకూలురై యుండుట. మహః = పూజ. సంవిత్ = వేదశాస్త్రాదులజ్ఞానము. జ్ఞాత్రమ్ = తెలుపునట్టిసామర్థ్యము. సూః = కొడుకులు మొదలగువారలఁ బ్రేరేపించు సామర్థ్యము. ప్రసూః = భృత్యులు మొదలగువారలఁ బ్రేరించుశక్తి. సీరం = నాఁగలియెద్దులుమొదలగు కృషిసాధనములసంపత్తి. లయః = వానిప్రతిబంధములనాశము. ఋతమ్ = యజ్ఞము మొదలగుకర్మ. అమృతమ్ = ఆయాగాదులఫలము. అయక్ష్మమ్ = రాజయక్ష్మ మొదలగు గొప్పవ్యాధులు లేకుండుట. అనామయత్ =జ్వరము మొదలగు స్వల్పవ్యాధులు లేకుండుట. జీవాతుః = బ్రతుకుటకుఁ గారణమయిన యౌషధము. దీర్ఘాయుత్వమ్=దీర్ఘమయిన యాయుస్సుగలిగియుండుట, అపమృత్యువు లేకుండుట యనుట. మిత్రమ్ = శత్రువులు లేమి. భయమ్ = భయము లేమి. సుగమ్=మంచినడవడి, అందఱకును సమ్మతమయిన యాచారమనుట. శయనమ్= శయ్యతలగడ మొదలగువానిసంపత్తి. సూషా=మంచిప్రాతఃకాలము, స్నానసంధ్యావందనాదియుక్తమైనదనుట. సుదినమ్ = మంచిదినములు, యజ్ఞదానాధ్యయనాది సంపన్నమనుట.

ఈయైహిక సుఖము మొదలగునవి యన్నియు నాకుఁ గలుగుఁగాక. 3

ఊర్క్చ మే సూనృతా చ మే పయశ్చ మే రసశ్చ మే ఘృతం చ మే మధు చ మే సగ్ధిశ్చ మే సపీతిశ్చ మే కృషిశ్చ మే వృష్టిశ్చ మే జైత్రం చ మ ఔద్భిద్యం చ మే రయిశ్చ మే రాయశ్చ మే పుష్టం చ మే పుష్టిశ్చ మే విభు చ మే ప్రభు చ మే బహు చ మే భూయశ్చ మే పూర్ణం చ మే పూర్ణతరం చ మేఽక్షితిశ్చ మే కూయవాశ్చ మేఽన్నం చ మేఽక్షుచ్చ మే వ్రీహయశ్చ మే యవాశ్చ మే మాషాశ్చ మే తిలాశ్చ మే ముద్గాశ్చ మే ఖల్వాశ్చ మే గోధూమాశ్చ మే మసురాశ్చ మే ప్రియంగవశ్చ మేఽణవశ్చ మే శ్యామాకాశ్చ మే నీవారాశ్చ మే. ౪

ఊర్క్=సామాన్యమైనఅన్నము. సూనృతా=ప్రియవచనము. పయః=పాలు. రసః = దానియందలిసారము. ఘృతమ్ = నెయ్యి. మధు = తేనె. సగ్ధిః=బంధువులతోఁగూడి భుజించుట. సపీతిః=బంధువులతోఁగూడి పానము చేయుట. కృషిః = సేద్యము. వృష్టిః = వర్షము, ఇవిరెండును అన్నమునకు హేతువులు. జైత్రమ్ = జయించుస్వభావముగలది. సుక్షేత్రమనుట. ఔద్భిద్యమ్ = వృక్షగుల్మాదులయుత్పత్తి. రయిః = బంగారము, రాయః = రత్నము ముత్తెములు మొదలగునది. పుష్టమ్ = సమృద్ధమయిన సువర్ణము. పుష్టిః = దేహపోషణము. విభు = అధికమయినధాన్యము. ప్రభు = అంతకన్నను అధికమైన ధాన్యము. బహు = అంతకన్నను అధికధాన్యము. భూయః = మఱియధికమైన ధాన్యము. పూర్ణమ్ = నిండినధాన్యము. పూర్ణతరమ్ = మిక్కిలిపూర్ణధాన్యము.

అక్షితిః = ధాన్యములునశింపకుండుట. కూయవాః = కుత్సితములయినయవలు. అన్నమ్ = అన్నము. అక్షుత్ = ఆఁకలిలేకుండుట, అన్నముండుటచేననుట. వ్రీహయః = వడ్లు. యవాః = యవలు. మాషాః = ఉద్దులు. తిలాః=నువ్వులు. ముద్గాః= పెసలు. ఖల్వాః= పెసలకన్నను పెద్దలైన ధాన్యవిశేషము, లేక, సెనగలు. గోధూమాః=గోదుములు. మసురాః= పెసలవంటిధాన్యవిశేషము. ప్రియఙ్గవః = కొఱ్ఱలు. అణవః = సన్నవరి శ్యామాకాః = గ్రామమునందుఁగలుగు తృణ ధాన్యవిశేషము, చామలు. నీవారాః = అరణ్యమునందుఁగలుగు తృణధాన్య విశేషము.

ఈయన్నము మొదలగునవి యన్నియు నాకుఁ గలుగుఁ గాక. ౪

---

అశ్మా చ మే మృత్తికా చ మే గిరయశ్చ మే పర్వతాశ్చ మే సికతాశ్చ మే వనస్పతయశ్చ మే హిరణ్యం చ మేఽయశ్చ మే సీసం చ మే త్రపుశ్చ మె శ్యామం చ మే లోహం చ మేఽగ్నిశ్చ మ ఆపశ్చ మే వీరుధశ్చ మ ఓషధయశ్చ మే కృష్టపచ్యం చ మేఽకృష్టపచ్యం చ మే గ్రామ్యాశ్చ మే పశవ ఆరణ్యాశ్చ యజ్ఞేన కల్పన్తాం విత్తం చ మే విత్తిశ్చ మే భూతం చ మే భూతిశ్చ మే వసు చ మే వసతిశ్చ మే కర్మ చ మే శక్తిశ్చ మేఽర్థశ్చ మ ఏమశ్చమ ఇతిశ్చమే గతిశ్చ మే. ౫

అశ్మా=రాయి. మృత్తికా=మట్టి. గిరయః=కులపర్వతములు. పర్వతాః= ఇతరములైనపర్వతములు. సికతాః = ఇసుక. వనస్పతయః = వృక్షములు. హిర

ణ్యమ్ = బంగారము, లేక, వెండి. అయః = ఇనుము. సీసమ్=సీసము. త్రపుః = తగరము. శ్యామమ్ = కాతినుము. లోహమ్ = రాగి మొదలగు లోహము. అగ్నిః = నిప్పు. ఆపః = జలములు. వీరుధః = లతలు. ఓషధయః=ఫలించిన తోడనే నశించునట్టి చెట్లు. కృష్టపచ్యమ్ = దున్నినకయ్యయందు ఫలించునట్టి ధాన్యాదికము. అకృష్టపచ్యమ్ = దున్ననిచోట ఫలించునట్టిది. మే=నాకు, గ్రామ్యాశ్చ = గ్రామమునందుఁబుట్టినవియు, ఆరణ్యాశ్చ = అడవియందుఁ బుట్టినవియు నగు, పశవః = పశువులు, యజ్ఞేన = యజ్ఞము చేత, కల్పన్తామ్= సమర్థములగుఁగాక. నాకు గ్రామ్యపశువులును అర్యణపశువులును యజ్ఞము నందుపయుక్తములయి సఫలములగుఁ గాక యని తా. విత్తమ్ = మున్ను పొందఁ బడినది. విత్తిః = రాఁబోవులాభము. భూతమ్ = ఐశ్వర్యముతోఁగూడినపుత్త్రులు మొదలగునది. భూతిః = స్వకీయమయిన యైశ్వర్యము. వసు = నివాసమునకు సాధనమయిన గోవులు మొదలగునది. వసతిః = నివాసమునకు ఆధారమయిన గృహము మొదలగునది. కర్మ = అగ్నిహోత్రము మొదలగుకర్మ. శక్తిః = దాని ననుష్ఠించుసామర్థ్యము. అర్థః = ప్రయోజనము. ఏమః = పొందవలసినసుఖము. ఇతిః = ఇష్టమైనదానిఁ బొందునుపాయము, గతిః = ఇష్టప్రాప్తి.

ఈ అశ్మము మొదలగునవి యన్నియు నాకుఁ గలుగుఁ గాక. ౫

---

అగ్నిశ్చ మ ఇన్ద్రశ్చ మే సోమశ్చ మ ఇన్ద్రశ్చ మే సవితా చ మ ఇన్ద్రశ్చ మే సరస్వతీ చ మ ఇన్ద్రశ్చ మే పూషా చ మ ఇన్ద్ర మే బృహస్పతిశ్చ మ ఇన్ద్రశ్చ మే మిత్రశ్చ మ ఇన్ద్రశ్చ మే వరుణశ్చ మ ఇన్ద్రశ్చ మే త్వష్టా చ మ ఇన్ద్రశ్చ

మే ధాతా చ మ ఇన్ద్రశ్చ మే విష్ణుశ్చ మ ఇన్ద్రశ్చ మేఽ
శ్వినా చ మ ఇన్ద్రశ్చ మే మరుతశ్చ మ ఇన్ద్రశ్చ మే విశ్వే చ
మే దేవా ఇన్ద్రశ్చ మే పృథివీ చమ ఇన్ద్రశ్చ మేఽన్తరిక్షం చ
మ ఇన్ద్రశ్చ మే ద్యౌశ్చ మ ఇన్ద్రశ్చ మే దిశశ్చ మ ఇన్ద్రశ్చ
మే మూర్ధా చ మ ఇన్ద్రశ్చ మే ప్రజాపతిశ్చ మ ఇన్ద్రశ్చ మే.

ఇందు అగ్ని మొదలగువారలు ప్రసిద్ధదేవతలు. ఇంద్రుఁడు వీరలయందఱితోను సమానభాగము గలవాఁడగుటవలన, వీరియొక్కొక్కరితోను కూడఁ బఠింపఁబడుచున్నాఁడు. అగ్నిః=అగ్నిదేవుఁడు. ఇంద్రః=ఇంద్రుఁడు. సోమః=చంద్రుఁడు. సవితా = సూర్యుఁడు. సరస్వతీ = సరస్వతీదేవి. పూషా=పూష యనుదేవత. బృహస్పతిః=బృహస్పతియనుదేవత. మిత్రః=మిత్రుఁడు. వరుణః =వరుణుఁడు. త్వష్టా = విశ్వకర్మ. ధాతా=దేవతావిశేషము. విష్ణుః = విష్ణువు. అశ్వినా = అశ్విదేవతలు. మరుతః = వాయువులు. విశ్వేదేవాః = విశ్వదేవులు అనుదేవతలు. పృథివీ = భూమి. అన్తరిక్షమ్ = ఆకాశము. ద్యౌః = స్వర్గము. దిశః=నాలుగు దిక్కులు. మూర్ధా=ఊర్ధ్వదిక్కు. ప్రజాపతిః = ప్రజాపతి యనుదేవత.

వీరలందఱు నాకు అభిముఖు లగుదురుగాక. ౬

అగ్ంశుశ్చ మే రశ్మిశ్చ మేఽదాభ్యశ్చ మేఽధిపతిశ్చ
మ ఉపాగ్ంశుశ్చ మేఽన్తర్యామశ్చ మ ఐన్ద్రవాయవశ్చ మే

మైత్రా వరుణశ్చ మ ఆశ్వినశ్చ మే ప్రతిప్రస్థానశ్చ మే శుక్ర
శ్చ మే మన్థీ చమ ఆగ్రయణశ్చ మే వైశ్వదేవశ్చ మే ధ్రువశ్చ
మే వైశ్వానరశ్చ మ ఋతుగ్రహాశ్చ మేఽతి గ్రాహ్యాశ్చ మ
ఐన్ద్రాగ్నశ్చ మే వైశ్వదేవశ్చ మే మరుత్వతీయాశ్చ మే మా
హేన్ద్రశ్చ మ ఆదిత్యశ్చ మే సావిత్రశ్చ మే సారస్వతశ్చమే
పౌష్ణశ్చమే పాత్నీవతశ్చ మే హారియోజనశ్చ మే. ౭

ఇందు, అంశువు మొదలగునవి సోమగ్రహవిశేషములు, సోమప్రకరణమునందుఁ బ్రసిద్ధములు. ఇవియన్నియు నాకుఁ గలుగుఁగాక. ౭

---

ఇధ్మశ్చ మే బర్హిశ్చ మే వేదిశ్చ మే ధిష్ణియాశ్చ మే
స్రుచశ్చ మే చమసాశ్చ మే గ్రావాణశ్చ మే స్వరవశ్చ మ ఉప
రవాశ్చ మే ధిషవణేచ మే ద్రోణకలశశ్చ మే వాయవ్యాని
చ మే పూతభృచ్చ మ ఆధవనీయశ్చ మ ఆగ్నీధ్రం చ మే హవి
ర్ధానం చ మే గృహాశ్చ మే సదశ్చ మే పురోడాశాశ్చ మే
పచతాశ్చ మేఽవభృథశ్చ మే స్వగాకారశ్చ మే. ౮

ఇధ్మము మొదలగునవి యజ్ఞాంగ ద్రవ్యములు. యజ్ఞప్రకరణమునఁ బ్రసిద్ధములు. గృహాః=పత్నిశాల మొదలగునవి. సదః=సదస్సు. పురోడాశాః=

హావిస్సులు. పచతాః=శామిత్రులు మొదలగువారలు. అవభృథః = యాగాంత స్నానము. స్వగాకారః=శంయువాకము.

ఈయిధ్మము మొదలగునవి నాకు సమృద్ధములయి యుండుఁగాక. ౮

---

అగ్నిశ్చ మే ఘర్మశ్చ మేఽర్కశ్చ మే సూర్యశ్చ మే ప్రాణశ్చ మేఽశ్వమేధశ్చ మే పృథివీ చ మేఽదితిశ్చ మే దితిశ్చ మే ద్యౌశ్చ మే శక్వరీరఙ్గులయో దిశశ్చ మే యజ్ఞేన కల్పన్తామృక్చ మే సామ చ మే స్తోమశ్చ మే యజుశ్చ మే దీక్షా చ మే తపశ్చ మ ఋతుశ్చ మే వ్రతం చ మేఽహోరాత్రయోర్వృష్ట్యా బృహద్రథన్తరే చ మే యజ్ఞేనకల్పేతామ్. ౯

అగ్నిః=చయనము చేయునట్టివహ్ని. ఘర్మః=ప్రవర్గ్యము. అర్కః= "ఇన్ద్రాగ్నియార్కవతే పురోడాశమ్" అని విహితమయిన యాగము. సూర్యః= "సౌర్యంచరుమ్" అని విహితమయినయాగము. ప్రాణః = "ప్రాణాయ స్వాహా" అని విహితమయినహోమము. అశ్వమేధః=అశ్వము పశువుగాఁగలయాగము. పృథివీ=భూమి. అదితిః, దితిః, ద్యౌః=దేవతావిశేషములు. శక్వరీః=ఛందోవిశేషములు. అఙ్గులయః = విరాట్పురుషునకు వ్రేళ్లవంటివైన, దిశః=దిక్కులు, ఇట చకారముచే విదిక్కులును. మే=నాయొక్క, యజ్ఞేన=యజ్ఞముచేత, కల్పన్తామ్ = సమర్థములగుఁగాక, తమతమవ్యాపారములందు సమర్థములగుఁగాక యనుట. ఋక్, సామ=మంత్రవిశేషములు. స్తోమః=సామావృత్తి రూపమైన స్తోత్రము. యజుః=మంత్రవిశేషము. దీక్షా=యజమానుని సంస్కారము. తపః=

పాపక్షయార్థము చేయు నుపవాసము మొదలగునది. ఋతుః=యాగాంగభూత మయినకాలము. వ్రతమ్=వ్రతము. అహోరాత్రయోః = పగటియొక్కయు రాత్రియొక్కయు, వృష్ట్యా=వర్షముచేత. మదీయమ్ సస్యంకల్పతామ్=నాదైన పైరు సమర్థమగుఁగాకయని శేషము. బృహద్రథన్తరే = సామవిశేషములు. మే=నాయొక్క, యజ్ఞేన = యాగముచేత, కల్పేతాం=సమర్థములగుఁగాక, తమవ్యవహారమునందు సమర్థములగుఁగాక. ౯

గర్భాశ్చ మే వత్సాశ్చ మే త్ర్యవిశ్చ మే త్ర్యవీ చ మే దిత్యవాట్ చ మే దిత్యౌహీ చ మే పఞ్చావిశ్చ మే పఞ్చావీ చ మే త్రివత్సశ్చ మే త్రివత్సా చ మే తుర్యవాట్ చ మే తుర్యౌహీ చ మే పష్ఠవాట్చ మే పష్ఠౌహీ చ మ ఉక్షా చ మే వశా చ మ ఋషభశ్చ మే వేహచ్చ మేఽనడ్వాన్ చ మే ధేనుశ్చమ ఆయుర్యజ్ఞేన కల్పతామ్, ప్రాణో యజ్ఞేన కల్పతా మపానో యజ్ఞేన కల్పతాం వ్యానో యజ్ఞేన కల్పతాం చక్షుర్య జ్ఞేన కల్పతాగ్ం శ్రోత్రం యజ్ఞేన కల్పతాం మనో యజ్ఞేన కల్ప తాం వాగ్యజ్ఞేన కల్పతా మాత్మా యజ్ఞేన కల్పతాం యజ్ఞో యజ్ఞేన కల్పతామ్. ౧౦

గర్భాః=తల్లికడుపుననుండుదూడలు. వత్సాః=పుట్టినదూడలు. త్ర్యవిః= ఒకటియు నరసంవత్సరము ఈడుఁగలమగదూడ. త్ర్యవీ=అట్టియాఁడుదూడ. దిత్యవాట్ = రెండుసంవత్సరములయీడుగలకోడె. దిత్యౌహీ = అటువంటి

పెయ్య. పష్ఠావాః=రెండున్నరసంవత్సర మీదుగలకోడె. పష్ఠౌహీ=అటువంటి పెయ్య. త్రివత్సః=మూఁడేండ్లవయసుగలకోడె. త్రివత్సా=అట్టిపెయ్య. తుర్యవాట్=మూఁడునరసంవత్సరమువయస్సుగలమగదూడ. తుర్యౌహీ=అట్టియాఁడు దూడ. పష్ఠవాట్ = నాలుగేండ్లమగదూడ - పష్ఠౌహీ=అట్టియాఁడు దూడ. ఉక్షా=వీర్యసేచనము సేయ సమర్థమగువృషభము. వశా=గొడ్డుటావు. ఋషభః= ఉక్షముకన్నను అధికమయినవయస్సుగలయెద్దు. వేహత్ = ఈచుకపోవునట్టి యావు, గర్భమునొందినపిమ్మట ఆఁబోతుపైకొనుటచే నష్టగర్భయగు నావనుట. అనడ్వాన్=బండిలాగునట్టియెద్దు. ధేనుః=క్రొత్తగా ఈనినఆవు. ఇవన్నియు మే=నాకు, కల్పతామ్=సంపన్నమగుఁగాక, యాగార్థము కలుగుఁగాక యనుట. ఆయుః=ఆయుస్సు, యజ్ఞేన=యజ్ఞముచేత, కల్పతామ్=సమర్థమగుఁగాక. ప్రాణః = ప్రాణము, యజ్ఞేన = యజ్ఞముచేత, కల్పతామ్=సమర్థమగుఁగాక. అపానః=అపానము, యజ్ఞేన, కల్పతామ్. వ్యానః=వ్యానము, యజ్ఞేన, కల్పతామ్. చక్షుః=నేత్రేంద్రియము, యజ్ఞేన, కల్పతామ్ శ్రోత్రమ్=శ్రోత్రేంద్రియము, యజ్ఞేన, కల్పతామ్ మనః=మనస్సు; యజ్ఞేన; కల్పతామ్. వాక్= వాగింద్రియము; యజ్ఞేన; కల్పతామ్ ఆత్మా=శరీరము, యజ్ఞేన, కల్పతామ్. ఈయాయుస్సు మొదలగునవియన్నియు నాయజ్ఞముచే కార్యసమర్థములగుఁగాకయనితా. యజ్ఞః=చేయఁబోవునశ్వమేధాదియాగము, యజ్ఞేన=ఇప్పుడు చేయఁబడుయాగముచేత, కల్పతామ్=స్వకార్యసమర్థమగుఁగాక. ౧౦

ఏకా చ మే తిస్రశ్చ మే పఞ్చ చ మే సప్త చ మే నవ చ మ ఏకాదశ చ మే త్రయోదశ చ మే పంచదశ చ మే సప్తదశ చ మే నవదశ చ మ ఏకవిగ్ంశతిశ్చ మే త్రయోవిగ్ంశతిశ్చ మే పఞ్చవిగ్ంశతిశ్చ మే సప్తవిగ్ంశతిశ్చ మే

నవవిగ్ంశతిశ్చ మ ఏకత్రిగ్ంశచ్చ మే త్రయస్త్రిగ్ంశచ్చ మే
చతస్రశ్చ మే ఽష్టౌ చ మే ద్వాదశ చ మే షోడశ చ మే విగ్ం
శతిశ్చ మే చతుర్విగ్ంశతిశ్చ మేఽష్టావిగ్ంశతిశ్చ మే ద్వాత్రిగ్ం
శచ్చ మే షట్త్రిగ్ంశచ్చ మే చత్వారిగ్ంశచ్చ మే చతుశ్చత్వా
రిగ్ంశచ్చ మేఽష్టాచత్వారిగ్ంశచ్చ మే వాజశ్చ ప్రసవశ్చాపి
జశ్చ క్రతుశ్చ సువశ్చ మూర్ధా చ వ్యశ్నియశ్చాన్త్యాయ
నశ్చాన్త్యశ్చ భౌవనశ్చ భువనశ్చాధిపతిశ్చ. ౧౧

ఇతి శ్రీయజుస్సంహితాయాం - చతుర్థకాణ్డే,
సప్తమప్రపాఠక స్సమాప్తః.

---

ఏకా మొదలగునవిసంఖ్యాపరములు. ఏకా = ఒకటి. తిస్రః=మూఁడు. పఞ్చ=అయిదు. సప్త=ఏడు. నవ=తొమ్మిది. ఏకాదశ=పదునొకండు. త్రయోదశ = పదుమూఁడు. పఞ్చదశ = పదునైదు. సప్తదశ=పదునేడు. నవదశ= పందొమ్మిది, ఏకవింశతిః=ఇరువదియొకటి. త్రయోవింశతిః = ఇరువదిమూఁడు. పఞ్చవింశతిః=ఇరువదియైదు. సప్తవింశతిః=ఇరువదియేడు. నవవింశతిః=ఇరువది తొమ్మిది. ఏకత్రింశత్=ముప్పదియొకటి. త్రయస్త్రింశత్ = ముప్పదిమూఁడు. ఈబేసిసంఖ్యలు నాకుఁ గలుగుఁగాక యని తా. నాకుఁగల పదార్థములన్నియుఁ ఈబేసిసంఖ్యలతోఁ గూడినవిగానే యుండవలయునని భావము. చతస్రః = నాలుగు. అష్టౌ=ఎనిమిది. ద్వాదశ=పండ్రెండు. షోడశ=పదునాఱు. వింశతిః = ఇరువది. చతుర్వింశతిః=ఇరువదినాలుగు. అష్టావింశతిః=ఇరువదియెనిమిది. ద్వాత్రింశత్=ముప్పదిరెండు. షట్త్రింశత్=ముప్పదియాఱు. చత్వారింశత్=

నలువది. చతుశ్చత్వారింశత్ =నలువదినాలుగు. అష్టాచత్వారింశత్ =నలువదియెనిమిది. ఈయుగ్మసంఖ్యలతోఁ గూడినపదార్థములె నాకుఁ గలుగవలెనని భావము. ఇందుచే,ఈసంఖ్యలయందు శుభవిశేషము బోధితమగుచున్నది. వాజః = అన్నము. ప్రసవః=అన్నముయొక్కయుత్పత్తి. అపిజః = ఆయన్నమునకే మాటిమాటికిఉత్పత్తి. క్రతుః=భోగాదివిషయమయినసంకల్పము, లేక,యాగము, సువః = అన్నోత్పత్తికారణమయిన యాదిత్యుఁడు. మూర్ధా = ఆకాశము. వ్యశ్నియః = వ్యశ్న మనఁగా ఆకాశము. అందుఁ బుట్టినవాయువు. ఆన్త్యాయనః = అంతమునందుఁబుట్టునది. అన్త్యః=అంతమున నుండునది. భౌవనః = జగత్తునందుఁబుట్టినచరము అచరము. భువనః = జగదాత్మకుఁడగుదేవుఁడు. అధిపతిః = అధిష్ఠించిపాలించువాఁడు, రాజు అని అహోబల భాష్యమునందుఁ జెప్పఁబడినది. మేసన్తు (అని యధ్యాహృతము) = నాకుఁ గలుగుఁగాక. లేక, ఈవ్యాజాదులు చైత్రాదిమాసములకు నామవిశేషములు. అప్పుడు. తే, సర్వే, ప్రీణన్తు = అవియన్నియు సంతోషించుఁ గాక, యని వాక్యము పూరింపఁ దగును.

ఇది శ్రీమత్కవాటోపనామ సుందరరామ ప్రణీతంబగు

శ్రీరుద్రభాష్యాంధ్రవివరణమునందు

చమకభాష్యవివరణము.

శ్రీ రు ద్ర భా ష్యాం ధ్ర వి వ ర ణ ము

స మా ప్త ము.

చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1937.